www.andhrajyothy.com | పేజీలు: 16 | వెల (Price): Rs. 6.50 | విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 99

బుధవారం | 24-7-2024

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: తదియ ఉ. 7.30, చవితి తె. 4.39 వరకు; నక్షత్రం: శతభిషం సా. 6.14 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: రా. 12.06-1.34; దుర్ముహూర్తం: ఉ. 11.55-12.47; అమృతఘడియలు: ఉ. 11.39-1.06; రాహుకాలం: మ. 12.00-1.40; సూర్యోదయం: 5.55; సూర్యాస్తమయం: 6.47

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





బడ్జెట్ ట్యాబ్‌తో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



'హ్యాపీ'.. ఏపీ!

మాదే బాధ్యత!

రాజధాని నిర్మాణానికి కేంద్రం కట్టుబడి ఉంది.. ప్రపంచ బ్యాంకు రుణం తీసుకుంటాం

ఏపీ ఎంత వాటా భరించగలదో చూస్తాం.. దానినీ గ్రాంటుగా ఇవ్వడంపై నిర్ణయం

పోలవరం ప్రాజెక్టు ఖర్చంతా మాదే.. ఆర్థిక మంత్రి నిర్మల స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అమరావతికి రూ.15వేల కోట్లు ఇస్తామన్నారు సరే! అది అప్పుగా ఇప్పిస్తారా? గ్రాంటుగా ఇస్తారా? పోలవరం ప్రాజెక్టు పూర్తికి సహకరిస్తామన్నారు సరే! ఏం చేస్తారు? ఎలా చేస్తారు? బడ్జెట్‌లో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన అనంతరం ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు, సందేహాలు! వీటికి స్వయంగా ఆమే సమాధానాలు ఇచ్చారు. మంగళవారం బడ్జెట్ సమర్పణ అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. అమరావతి, పోలవరానికి సహాయంపై స్పష్టత కోరుతూ అడిగిన ప్రశ్నలకు తెలుగులోనే

మిగతా 14వ పేజీలో...

కేంద్ర బడ్జెట్ సమగ్ర కథనాలు 10, 11, 12, 13లో

ఐదేళ్ల తర్వాత తొలిసారి
వరాల జల్లు

అమరావతికి ప్రత్యేక సాయం

ఈ ఏడాది రూ.15 వేల కోట్లు

రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు

సాధ్యమైనంత త్వరగా పోలవరం పూర్తి

నిర్మాణానికి పూర్తిస్థాయిలో సొమ్ములు

వెనుకబడిన సీమ, ఉత్తరాంధ్రతోపాటు ప్రకాశం జిల్లా అభివృద్ధికి గ్రాంట్లు

కేంద్ర బడ్జెట్‌లో ఆపన్న హస్తం

పారిశ్రామికాభివృద్ధికి తోడ్పాటు

కొప్పర్తి, ఓర్వకల్లు నోడ్స్ అభివృద్ధి

విశాఖ ఉక్కుకు రూ.620 కోట్లు

తూర్పు తీరాన్ని కలుపుతూ 'పూర్వోదయ్'

రాష్ట్రంలోని పలు కేంద్ర సంస్థలకూ నిధులు


కేంద్ర పన్నుల్లో వాటా 50,474 కోట్లు

కేంద్ర బడ్జెట్‌లో నిర్మలమ్మ ప్రకటన

13

ఐదేళ్లుగా కేంద్ర బడ్జెట్‌లో 'ఆంధ్రప్రదేశ్' అన్న మాటే గట్టిగా వినిపించలేదు! నాడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్ సర్కారూ పట్టించుకోలేదు. ఇప్పుడు... ఇన్నాళ్లకు, ఇన్నేళ్లకు తొలిసారిగా కేంద్ర బడ్జెట్‌లో 'ఆంధ్రప్రదేశ్' మాట పలుమార్లు మార్మోగింది. ఎప్పుడో అటకెక్కించిన 'రాష్ట్ర పునర్విభజన చట్టం'... రాష్ట్ర విభజన జరిగిన పదేళ్లకు మళ్లీ లోక్‌సభలో తెరపైకి వచ్చింది. నవ్యాంధ్రకు రెండు కళ్లలాంటి రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి ఆర్థిక అభయం లభించింది. విభజన చట్టంలో ప్రస్తావించినట్లుగా... వెనుకబడిన జిల్లాలకు ఆపన్న హస్తం అందిస్తామని కేంద్రం ప్రకటించింది. పారిశ్రామిక అభివృద్ధికీ చేదోడుగా నిలుస్తామని తెలిపింది. మొత్తంగా చూస్తే... ఐదేళ్లలో తొలిసారిగా కేంద్ర బడ్జెట్ రాష్ట్ర ప్రజలకు ఆనందాన్ని పంచింది.

కష్టకాలంలో కేంద్ర నిధులొస్తున్నాయి



వాటిని ఏ రూపంలో ఇచ్చినా ఫర్వాలేదు

ఆర్థిక కార్యకలాపాల వేగానికి పనికొస్తాయి

వెనుకబడిన ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ

మా ప్రతిపాదనల్లో చాలావరకూ ఆమోదించారు: చంద్రబాబు

స్వప్రయోజనాలకే ఢిల్లీకి జగన్!

సీఎంగా రెండుసార్లు ఢిల్లీకి బాబు

తొలి బడ్జెట్‌లోనే ఫలితాలు

యువ మిత్ర

యువత నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగాలు లక్ష్యంగా బడ్జెట్

బీజేపీ మిత్రపక్షాల రాష్ట్రాలకు నిధుల్లో పెద్దపీట



ఏపీకి వరాలు ప్రకటిస్తున్న సమయంలో మంత్రి రామ్మోహన్, ఎంపీ సీఎం రమేశ్ సంతోషం

మొత్తం బడ్జెట్
48,20,512 కోట్లు
అందులో అప్పులు 14 లక్షల కోట్లు

బిహార్‌కు రూ.26 వేల కోట్లతో రోడ్లు, వంతెనలు

విద్యుత్తు ప్లాంటు, ఎయిర్‌పోర్టులు, వైద్య కాలేజీలూ

యువతకు రూ.2 లక్షల కోట్లతో పీఎం ప్యాకేజీ

ఐదేళ్లలో 5 పథకాల కింద 4.1 కోట్ల మందికి లబ్ధి

20 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణ,

కోటి మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

ముద్రా రుణాల పరిమితి రూ.20 లక్షలకు పెంపు

మహిళలకు స్టాంపు డ్యూటీ తగ్గించే వెసులుబాటు

వర్కింగ్ విమెన్‌కు హాస్టల్స్.. కార్మికులకు డార్మిటరీలు

గ్రామాల్లో మరో 3 కోట్లు, పట్టణాల్లో కోటి ఇళ్లు

ఎంఎస్ఎంఈలకు వరాలు.. పారిశ్రామిక కారిడార్లు

రైల్వేలు, పెట్టుబడుల ఉపసంహరణపై లేని ప్రస్తావన

పార్లమెంటులో పూర్తి బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మల

పసిడి పతనం



బంగారంపై కస్టమ్స్ డ్యూటీ 6 శాతానికి తగ్గింపు

రూ.4,000 మేర పడిపోయిన బంగారం ధర

మొబైల్ ఫోన్లు, చార్జర్లపైనా సుంకం తగ్గింపు

ఉరుముతున్న నిరుద్యోగ భూతం! పన్నులు కడుతున్నా మాకేమీ లేదంటూ వేతన జీవుల్లో తీవ్ర అసంతృప్తి! సంక్షోభంలో చిక్కుకున్న ఎంఎస్ఎంఈల యాజమాన్యాల్లో ఆందోళన! కేంద్రంలో సంకీర్ణ సర్కారును నడపాల్సిన రాజకీయ అనివార్యత! ఇందులో భాగంగానే బిహార్ నుంచి ఒకదాని తర్వాత మరొకటిగా డిమాండ్లు! లోక్‌సభ ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలిన నేపథ్యంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు కొత్త ఓటర్లను ఆకర్షించాల్సిన పరిస్థితి! వీటన్నిటినీ బ్యాలెన్స్ చేస్తూనే సంస్కరణలను ముందుకు తీసుకెళ్లాల్సిన సంకట స్థితి! అందుకే.. 'మోదీ ఎవరి మాటా వినరనే గత వైఖరికి భిన్నంగా'.. ఈసారి బడ్జెట్లో సంకీర్ణ అనివార్యతకు రాజీ పడుతూనే సంస్కరణ పథాన్ని కొనసాగించారు! సంకీర్ణ మిత్రులను సంతృప్తిపరుస్తూనే 'యూత్ మంత్రా'ం పఠించారు! ఎప్పట్లాగే మౌలిక వసతులకు పెద్దపీట వేశారు. జనాకర్షణ జోలికి వెళ్లలేదు.



ప్రస్తుత బడ్జెట్ నూతన మధ్యతరగతికి మరింత సాధికారత అందిస్తుంది. యువతకు అపార అవకాశాలు కల్పిస్తుంది. ఉద్యోగ ఆధారిత ప్రోత్సాహక పథకం దేశంలో మరిన్ని ఉద్యోగ అవకాశాల కల్పనకు దోహద పడుతుంది.

- ప్రధాని నరేంద్ర మోదీ



ఇది బుజ్జగింపుల బడ్జెట్. అధికారాన్ని కాపాడుకునే బడ్జెట్. కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోను కాపీ కొట్టి ఈ బడ్జెట్‌ను రూపొందించారు. సంపన్న వర్గాలకు మేళ్లు చేస్తూ.. సాధారణ పౌరుల సంక్షేమాన్ని పణంగా పెట్టారు.

- ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ

ఊరట కాసింతే..



వేతన జీవులకు నిరాశ మిగిల్చిన నిర్మల

కొత్త పన్ను విధానంలోకి మారితేనే ఉపశమనం

5, 10 శాతం పన్ను శ్లాబులు కొద్దిగా సవరింపు

ప్రామాణిక తగ్గింపు రూ.75 వేలకు పెంపు

ఫ్యామిలీ పెన్షనర్లకు స్టాండర్డ్ డిడక్షన్ రూ.25 వేలకు!

పాత విధానంలో రిటర్నులు దాఖలు చేసేవారికి నిరాశే

ఆరు నెలల్లోగా ఆదాయపన్ను చట్టంపై సమగ్ర సమీక్ష



పెద్దిరెడ్డి అనుచరుడు రైస్‌మిల్లు మాధవరెడ్డి

14

పోలీసుల అదుపులో
పెద్దిరెడ్డి
అనుచరుడు

మాధవరెడ్డిని విచారిస్తున్న అధికారులు

మదనపల్లె సబ్ కలెక్టర్ ఆఫీస్ 'అగ్గి' ఘటనలో కీలక పరిణామం

2 బస్తాల డాక్యుమెంట్లు స్వాధీనం

సబ్‌కలెక్టరేట్ ఉద్యోగుల విచారణ

ఏఎస్పీ ఆధ్వర్యంలో 10 బృందాలు

డీఆర్వో ఆధ్వర్యంలో ఐదు బృందాలు

11 మండలాల రికార్డులు సీజ్


రంగంలోకి రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ

అన్నీ తేలుస్తాం: సిసోడియా

గౌతమ్ తేజ్ పక్కా ప్లాన్!

ముందే ఇంజన్ ఆయిల్ తెచ్చి బీరువాలో

నీట్ రద్దు అక్కర్లేదు



ఒకట్రెండు కేంద్రాల్లోనే ప్రశ్నపత్రం లీకైంది

వ్యవస్థ విఫలమైందని నిర్ధారించలేం

మళ్లీ పరీక్ష అనడం సరికాదు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

పిటిషన్ల కొట్టివేత

2 రోజుల్లోగా నీట్ తుది ఫలితాలు

కేంద్రం వెల్లడి

2

వై నాట్ ప్రతిపక్ష నేత హోదా?

సంప్రదాయానికి భిన్నంగా జగన్ పాట్లు.. ప్రతిపక్ష నేత హోదా కోసం ఆరాటం

ఇప్పటికే స్పీకర్‌కు లేఖ, తాజాగా హైకోర్టుకు.. హోదాపై ఆదేశాల కోసం పిటిషన్

ఎన్నికల్లో ఏ 'హోదా' ఇవ్వని ప్రజలు.. అయినా సొంత ప్రయోజనాల కోసం పట్టు

జగన్ అక్రమాస్తుల కేసులపై
రోజువారీ విచారణ
మరోసారి టీ-హైకోర్టు ఆదేశాలు



2


దీప్తి శర్మ (3/13)

షఫాలీ అదుర్స్

ఆసియా కప్ సెమీస్‌లో భారత్


షఫాలీ వర్మ (48 బంతుల్లో 81)

దంబుల్లా: యువ ఓపెనర్ షఫాలీ వర్మ తుఫాన్ ఇన్నింగ్స్ (48 బంతుల్లో 81)తో, ఆఫ్ స్పిన్నర్ దీప్తి శర్మ (3/13) బంతితో చెలరేగడంతో భారత్ మహిళల ఆసియా టీ20కప్ సెమీస్‌కు దూసుకెళ్లింది. ఇదే గ్రూపులో యూఏఈపై నెగ్గిన పాకిస్థాన్ కూడా నాకౌట్‌కు చేరుకుంది. గ్రూప్-ఎలో మంగళవారం నేపాల్‌తో జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 82 పరుగులతో గెలుపొందింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇది హ్యాట్రిక్ విజయం కావడం విశేషం. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు విశ్రాంతినివ్వడంతో వైస్ కెప్టెన్ స్మృతి మంధాన సారథ్యంలో భారత్ బరిలోకి దిగింది. టాస్ గెలిచి, తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 178 పరుగులు సాధించింది. ఓపెనర్లు షఫాలీ, హేమలత (47) కలిసి తొలి వికెట్‌కు 122 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఛేదనలో నేపాల్ 20 ఓవర్లు ఆడి, 9 వికెట్లు కోల్పోయి 96 పరుగులే చేసి, పరాజయం పాలైంది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3, రాధా యాదవ్, అరుంధతి రెడ్డి చెరో రెండు వికెట్లు తీశారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు షఫాలీ వర్మకి దక్కింది. భారత్ (6 పాయింట్లు), పాకిస్థాన్ (4) జట్లు ఈనెల 26న జరగనున్న రెండు సెమీఫైనల్స్‌లో గ్రూప్-బి ప్రత్యర్థులతో తలపడనున్నాయి.

సంక్షిప్త స్కోర్లు: భారత్ : 178/3 (షఫాలీ 81, హేమలత 47, మగార్ 2/25), **నేపాల్:** 96/9 (మగార్ 18, రుబీనా 15, దీప్తి 3/13).

పాక్ సునాయాసంగా...

అంతకుముందు జరిగిన మరో మ్యాచ్‌లో యూఏఈపై పాకిస్థాన్ మరో 35 బంతులు విగిలుండగానే 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడిన యూఏఈ తొలుత బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసింది. ఛేదనలో పాక్ 14.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 107 పరుగులు చేసి నెగ్గింది.

ఐదులోనే మంధాన

దుబాయ్: ఐసీసీ మహిళల తాజా టీ20 ర్యాంకింగ్స్‌లో టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన 731 పాయింట్లతో నిలకడగా ఐదో స్థానంలో కొనసాగుతోంది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఒక స్థానం మెరుగవగా, ఓపెనర్ షఫాలీ వర్మ నాలుగు స్థానాలు ఎగబాకింది. ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్లు బెత్ మూనీ, తహిలా మెక్‌గ్రాత్ తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. బౌలర్ల జాబితాలో భారత్ నుంచి టాప్-10లో ఆఫ్ స్పిన్నర్ దీప్తి శర్మ మూడో ర్యాంక్‌లో కొనసాగుతుండగా, పేసర్ రేణుక సింగ్ ఒక స్థానం ఎగబాకి 9వ ర్యాంక్‌కి చేరుకుంది. ఇంగ్లండ్ బౌలర్ సోఫీ ఎకెల్‌స్టోన్ తన అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది.

చాను చూపు.. పసిడి వైపు!

భారత్ నుంచి ఏకైక లిఫ్టర్ మీరాపై ఆశలు



(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

వెయిట్‌లిఫ్టింగ్ అనగానే ఠక్కున గుర్తొచ్చే పేరు కరణం మల్లీశ్వరి. ఈ తెలుగు మహిళ 24 ఏళ్ల క్రితం సిడ్నీ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచి లిఫ్టింగ్‌లో భారత్ 'పవర్' ఏంటో చూపించింది. ఆ తర్వాత కొన్నేళ్లపాటు ఎందరో లిఫ్టర్లు భారత్ తరపున అంతర్జాతీయ ఈవెంట్లలో సత్తాచాటినా, విశ్వక్రీడల్లో మాత్రం మెరవలేకపోయారు. కానీ, నాటి మల్లీశ్వరిని మరిపిస్తూ మణిపూర్ మహిళ మీరాబాయి చాను మూడేళ్ల క్రితం టోక్యో క్రీడల్లో రజత పతకం సాధించి శెభాష్ అనిపించుకుంది ఈసారి భారత్‌నుంచి బరిలో ఉన్న ఏకైక లిఫ్టర్ మీరాబాయ్ మాత్రమే. టోక్యోలో ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన మీరా 49 కిలోల విభాగంలో అద్భుత ప్రదర్శన కనబరచి తన సత్తాను ప్రపంచానికి తెలియజేసింది. ఈసారి మాత్రం కచ్చితంగా పతక ఆశలతోనే పారిస్‌కు పయనమైంది మీరా. భారత్ నుంచి పారిస్ క్రీడలకు ఎంపికైన ఏకైక లిఫ్టర్‌గా నిలిచిన 29 ఏళ్ల మీరా.. టోక్యోలో చేజారిన స్వర్ణాన్ని ఇక్కడ పట్టేయాలన్న లక్ష్యంతో పోటీపడుతోంది.

గాయంతో దూరమైనా...:

టోక్యో ఒలింపిక్స్ తర్వాత మీరాబాయి ఒకే ఒక్క టోర్నమెంట్‌లో పతకం గెలిచింది. 2022లో బర్మింగ్‌హామ్ వేదికగా జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో ఓవరాల్‌గా 201 కిలోలు ఎత్తి చాంపియన్‌గా నిలిచింది. ఇది టోక్యో క్రీడల్లో ఎత్తిన బరువు (203 కిలోలు) కంటే కాస్త తక్కువ. ఆ మరుసటి ఏడాది 2022లో హాంగ్జౌ ఆతిథ్యమిచ్చిన ఆసియా క్రీడల బరిలోకి దిగిన మీరాబాయి.. అనూహ్యంగా పోటీ మధ్యలోనే తప్పుకొంది. బరువు ఎత్తే క్రమంలో తుంటిగాయానికి గురైన ఆమె టోర్నీ నుంచి వైదొలగింది. పెద్దగాయం కావడంతో ఆ తర్వాత ఏకంగా ఐదు నెలలు ఆటకు దూరమైంది. ఈ క్రమంలో పారిస్ క్రీడల సన్నద్ధతపై ప్రభావం పడింది. గాయం నుంచి కోలుకొని సుదీర్ఘ విరామం తర్వాత ఈ ఏడాది థాయ్‌లాండ్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న మీరా.. అక్కడ 200 కిలోల బరువును ఎత్తడంలో విఫలమైంది. కేవలం 184 కిలోలతో 12వ స్థానానికి పరిమితమైంది. అయినా మీరాను తక్కువ అంచనా వేయలేం. ప్రపంచ చాంపియన్‌షిప్ వైఫల్యంతో ఏమాత్రం నిరాశపడకుండా ఒలింపిక్స్‌లో రెండో పతక వేటకు పయనమైంది. తన కోచ్‌తో కలిసి ఇప్పటికే విశ్వక్రీడల వేదిక పారిస్‌లో శిక్షణ మొదలుపెట్టింది. తనకు పోటీగా భావిస్తున్న జపాన్, చైనా లిఫ్టర్లకు దీటుగా రాణించేందుకు పక్కా ప్రణాళికలతో సిద్ధమవుతోంది.

బడ్జెట్‌లో ఖేలో ఇండియాకు భారీగా నిధులు

న్యూఢిల్లీ: కేంద్ర క్రీడా బడ్జెట్‌లో ఖేలో ఇండియా పథకానికి మరోసారి భారీగా నిధులు కేటాయించారు. మొత్తం క్రీడా పద్దు రూ.3,442.32 కోట్లు కాగా, అందులో రూ.900 కోట్లు ఖేలో ఇండియా పథకానికి సమకూర్చారు. గతేడాది క్రీడా బడ్జెట్ కంటే ఈసారి రూ.45.36 కోట్లు అధికంగా కేటాయించగా, ఖేలో ఇండియాకు రూ.20 కోట్లు పెంచారు. 2022లో ఖేలో ఇండియాకు రూ.596.39 కోట్లు కేటాయించగా, గత రెండేళ్లలో ఇది రూ.300 కోట్లకు పెరగడం విశేషం. ఖేలో ఇండియా గేమ్స్, యూత్ గేమ్స్, యూనివర్సిటీ గేమ్స్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ఖేలో ఇండియా ఎక్స్‌లెన్స్ సెంటర్ల నిర్వహణకు ఈ పథకం నుంచి నిధులు వెచ్చించనున్నారు. జాతీయ క్రీడా సంఘాలకు ప్రత్యేక గ్రాంట్లు ఇచ్చేందుకు రూ.340 కోట్లు, టాప్స్ పథకానికి రూ.822.60 కోట్లు కేటాయించారు.


గోల్ఫ్

అదితి.. ఈసారైనా!

పారిస్ ఒలింపిక్స్ 2 రోజుల్లో

ఒలింపిక్స్‌లో గోల్ఫ్‌కు స్వల్ప చరిత్రే ఉంది. 112 ఏళ్ల విరామం తర్వాత 2016 రియో గేమ్స్‌లో ఈ క్రీడను ప్రవేశపెట్టారు. ఇక మన దేశంలో గోల్ఫ్‌కు పెద్దగా ఆదరణ లేకపోయినా.. వరుసగా మూడోసారి ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించబోతున్నారు. పారిస్ బరిలో మన దేశం నుంచి నలుగురు గోల్ఫర్లు బరిలో ఉన్నారు. శుభాంకర్ శర్మ, గగన్‌జీత్ భుల్లార్, అదితి అశోక్, దీక్షా దాగర్ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. అయితే రియో ఒలింపిక్స్‌లో పాల్గొన్న అనిర్బన్ లాహిరి (57వ స్థానం), ఎఎస్‌పీ చౌరాసియా (50), అదితి అశోక్ (41) తీవ్రంగా నిరాశపరిచారు. ఇక టోక్యోలో నలుగురు గోల్ఫర్లు పాల్గొనగా.. అదితి మాత్రమే అద్భుతంగా రాణించి పతకంపై ఆశలు పెంచింది. మూడు రౌండ్లపాటు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడంతో మెడల్ ఖాయమనిపించింది. కానీ కీలక నాలుగో రౌండ్‌లో నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో అవకాశం చేజార్చుకుంది. అయితే ఈ సారి ఒలింపిక్‌లో మెడల్ సాధించిన తొలి భారత గోల్ఫర్‌గా రికార్డులకెక్కేందుకు అదితి ఆత్రుతగా ఎదురుచూస్తోంది. అయితే ఈ ఏడాది ఆమె ప్రదర్శన ఆశాజనకంగా లేకపోవడం ఆందోళనపరిచే విషయం. మరోవైపు ర్యాంకింగ్స్ ఆధారంగా ఈసారి భారత్ నుంచి ఎంపికైన అదితితో పాటు దీక్ష, శుభాంకర్, భుల్లార్ తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు.


నేత్ర
విష్ణు

సెయిలర్లు ఏం చేస్తారో?

పారిస్ ఒలింపిక్స్‌కు భారత్ నుంచి సెయిలింగ్‌లో విష్ణు శరవణన్, నేత్రా కుమనన్ పోటీపడుతున్నారు. వీరిద్దరూ పురుషులు, మహిళల డింగీ ఈవెంట్లలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వీళ్లకిది రెండో ఒలింపిక్స్. గత టోక్యో క్రీడల్లోనూ బరిలోకి దిగినా, పతకాలకు చేరువ కాలేకపోయారు. అయితే, గతేడాది ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించిన విష్ణు.. ఈ ఏడాది అడిలైడ్‌లో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్‌లో మెరుగైన ప్రదర్శన కనబరచాడు. ఆరురోజుల పాటు జరిగిన తన ఈవెంట్‌లో 125 నెట్ పాయింట్లు సాధించిన విష్ణు.. ఓవరాల్‌గా 26వ స్థానంలో నిలిచి పారిస్ క్రీడల కోటా దక్కించుకున్నాడు. ఇక, గత టోక్యో క్రీడలతో ఒలింపిక్స్‌లో పోటీపడ్డ తొలి భారత మహిళా సెయిలర్‌గా రికార్డుకెక్కిన నేత్ర.. ఇటీవల పలు ఈవెంట్లలో నిలకడగా రాణించి పారిస్ క్రీడలకు అర్హత సాధించింది. మరి.. గత క్రీడల వైఫల్యాన్ని మరిపిస్తూ ఈసారి ఇద్దరు సెయిలర్లు ఒలింపిక్స్‌లో భారత్‌కు పతకాన్ని అందిస్తారేమో చూడాలి.


ఒలింపిక్స్‌కు 'యుద్ధ'స్థాయి భద్రత

రాఫెల్ ఫైటర్లు, రీపర్ డ్రోన్లు

పారిస్: ఒలింపిక్స్‌కు కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సైబర్ దాడులు కూడా జరగవచ్చని అనుమానిస్తున్న నిర్వాహకులు కృత్రిమ మేధ ఆధారిత రక్షణ చర్యలు కూడా చేపడుతున్నారు. రెండు వారాల ఈ క్రీడల్లో 10,500 మంది అథ్లెట్లు పాల్గొంటున్నారు. 45 వేల మంది పోలీసులు, పారా మిలటరీ బలగాలతోపాటు 10 వేలమంది సైన్యాన్ని రంగంలోకి దింపుతున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత పారిస్‌లో ఇంత భారీ స్థాయిలో మిలటరీని దించడం ఇదే తొలిసారి. పారిస్‌లోని ఏ వేదిక వద్దకైనా 30 నిమిషాలల్లోగా ఈ భద్రతా సిబ్బంది చేరుకొనేలా ఏర్పాట్లు చేశారు. ఇక ఈనెల 26న జరిగే ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని 150 కి.మీ. మేర గగన తలాన్ని 'నో ఫ్లై జోన్'గా ప్రకటించారు. ఈ సందర్భంగా రాఫెల్ ఫైటర్ జెట్లు, అవాక్స్ నిఘా విమానాలు, రీపర్ డ్రోన్లు, షార్ప్ షూటర్లతో కూడిన హెలికాప్టర్లు గగన తలంపై పహారా కాయనున్నాయి. ఇవి గాక..40 దేశాలనుంచి 1900 మంది పోలీసు బలగాలు పారిస్ చేరుకున్నాయి.

లంక టీ20 కెప్టెన్‌గా అసలంక

పల్లెకలె: స్వదేశంలో ఈ నెల 27 నుంచి భారత్‌తో జరిగే మూడు టీ20ల సిరీస్‌కు శ్రీలంక కెప్టెన్‌గా చరిత్ అసలంక ఎంపికయ్యాడు. టీ20 వరల్డ్‌కప్‌లో పేలవ ప్రదర్శనతో హసరంగ కెప్టెన్సీనుంచి తప్పుకొన్న సంగతి తెలిసిందే. అసలంక సారథ్యంలో 16 మంది సభ్యుల జట్టును లంక బోర్డు మంగళవారం ప్రకటించింది. 34 ఏళ్ల దినేష్ చాందిమల్‌కు రెండేళ్ల తర్వాత జట్టులో చోటుదక్కడం విశేషం. ఏంజెలో మాథ్యూస్, ధనంజయ డిసిల్వా, సదీర సమరవిక్రమ, పేసర్ దిల్షాన్ మధుశంకలకు సెలెక్టర్లు మొండిచేయి చూపారు.

లంక జట్టు: అసలంక (కెప్టెన్), పథుం నిస్సంక, కుశాల్ జనిత్ పెరీరా (వికెట్ కీపర్), అవిష్క ఫెర్నాండో, కుశాల్ మెండిస్ (వికెట్ కీపర్), చాందిమల్, కవిందు మెండిస్, దసున్ షనక, హసరంగ, దునిత్ వెల్లలాగే, మహీష్ తీక్షణ, చవిందు విక్రమసింఘే, పథిరన, నువాన్ తుషార, చమీర, బినుర ఫెర్నాండో.

జగన్‌కు మెదడు లేదని జనానికి అర్థమైంది

- వినుకొండలో వ్యక్తిగత కక్షలతోనే హత్య
- అది రాజకీయ హత్య కానే కాదు
- అయినా ఢిల్లీలో ధర్నా అవసరం ఏముంది?
- హోదా, కడప స్టీల్ ప్లాంట్ కోసం చేయలేదేం?
- టైట్లింగ్ యాక్టు రద్దుపై ఎందుకు మాట్లాడలేదు?
- బీజేపీ మేనిఫెస్టోలా కేంద్ర బడ్జెట్: షర్మిల



అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు మెదడు లేదని రాష్ట్ర ప్రజలకు అర్థమైపోయిందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తేల్చిచెప్పారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో మంగళవారం షర్మిల మీడియాతో మాట్లాడారు. వినుకొండలో జరిగిన హత్య ముమ్మాటికీ వ్యక్తిగత కక్షలతోనే జరిగిందని, అది రాజకీయ హత్య కానేకాదని ఆమె మరోసారి స్పష్టం చేశారు. వినుకొండ హత్యపై విచారణ చేశానని తాను చెప్పలేదని, న్యూట్రల్ మీడియాను అడిగానని మాత్రమే చెప్పానని వివరించారు. హత్య చేసిన వ్యక్తి, హత్యకు గురైన వ్యక్తి ఇద్దరూ గతంలో వైసీపీలోనే ఉన్నారని వెల్లడించారు. వారిద్దరి మధ్య గతంలోనే విబేధాలు ఉన్నాయని, అప్పుడే పరస్పరం కేసులు పెట్టుకుని జైలుకు వెళ్లారని తెలిపారు. ఇళ్లపైకి గొడవలకూ వెళ్లారని, వారిద్దరి మధ్య వైసీపీ నేతలు పంచాయతీ కూడా చేశారని షర్మిల గుర్తుచేశారు. అందుకే అది వ్యక్తిగత కక్షతో జరిగిన హత్యేనని చెప్పానని షర్మిల వివరణ ఇచ్చారు. 'పొలిటికల్ మర్డర్ కానప్పుడు ఈ వ్యవహారంపై జగన్ ఢిల్లీలో ధర్నా చేయాల్సిన అవసరం ఏముంది? రాష్ట్రానికి ప్రత్యేక హోదాను సాధించేందుకు, కడపలో స్టీల్‌ప్లాంట్ స్థాపించాలని డిమాండ్ చేస్తూ జగన్ ఏరోజైనా ఢిల్లీలో ధర్నా చేశారా? రాష్ట్రంలో అసెంబ్లీ జరుగుతుంటే, ప్రజా సమస్యలపై గళమెత్తాల్సిన జగన్ ఢిల్లీకి వెళ్లి ధర్నాలు చేయడమేంటి? వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుపై అసెంబ్లీలో చర్చ జరుగుతుంటే జగన్ తన అభిప్రాయాన్ని ఎందుకు వెల్లడించలేదు?' అని షర్మిల నిలదీశారు. అధికారం కోల్పోయిన నాటినుంచి ఇలా వ్యవహరిస్తున్నందునే జగన్‌కు మెదడు లేదని ప్రజలు భావిస్తున్నారని షర్మిల అన్నారు. కాగా, కేంద్ర బడ్జెట్ బీజేపీ మేనిఫెస్టోలా ఉందని ఆమె వ్యాఖ్యానించారు. 'పోలవరానికి రూ.12,000 కోట్లు ఇస్తే పండుగ చేసుకోవాలా? రాజధాని కోసం సీఎం చంద్రబాబు రూ.లక్ష కోట్లు అడిగితే రూ.15,000 కోట్లు ఇస్తే సంబరపడిపోవాలా?' అని షర్మిల నిలదీశారు.

రేపు కేబినెట్

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలో గురువారం మంత్రివర్గ సమావేశం జరుగనుంది. అసెంబ్లీ అనంతరం మధ్యాహ్నం 2.30కు కేబినెట్ భేటీ కానుంది. అసెంబ్లీలో జరిగిన చర్చలతో పాటు వివిధ బిల్లులు, శ్వేతపత్రాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఓటాన్ అకౌంట్‌పైనా చర్చ జరిగే అవకాశం ఉంది. ఈ మేరకు సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వై నాట్ ప్రతిపక్ష నేత హోదా..!

- సంప్రదాయానికి భిన్నంగా జగన్ పాట్లు
- ప్రతిపక్ష నేత హోదా కోసం ఆరాటం
- ఇప్పటికే స్పీకర్‌కు లేఖ, తాజాగా హైకోర్టుకు
- ఎన్నికల్లో ఏ 'హోదా' ఇవ్వని ప్రజలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ముందు 'వై నాట్ 175' అంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన జగన్.. ఇప్పుడు 'వై నాట్ ప్రతిపక్ష నేత హోదా' అంటూ దేబిరిస్తున్నారు. సంప్రదాయానికి భిన్నంగా జగన్ పడుతున్న పాట్లు చూసి రాజకీయ వర్గాలు విస్తుపోతున్నాయి. ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే అసెంబ్లీలో ప్రజా సమస్యలపై గళమెత్తగలుగుతానని ఇదివరకే బెదిరింపు ధోరణితో స్పీకర్‌కు ఆయన లేఖ రాశారు. జగన్‌కు ఏ 'హోదా' ఇవ్వాలో ఇప్పటికే ప్రజలు నిర్ణయించేశారు. ఇటీవలి ఎన్నికల్లో ప్రతిపక్ష నేత హోదా కూడా ఇవ్వకుండా చిత్తుచిత్తుగా ఓడించి 11 సీట్లకు పరిమితం చేశారు. అయినా జగన్ మారడం లేదు.

రూల్స్ ఏం చెబుతున్నాయి?

పార్లమెంటు, అసెంబ్లీ సంప్రదాయం ప్రకారం రాజకీయ పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే ఎన్నికల్లో పది శాతం సీట్లు రావాలి. దీనిపై నిర్దిష్టంగా రూల్ లేనప్పటికీ.. కౌల్ అండ్ షక్దర్ రూల్స్ పుస్తకంలో ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలంటే ఆ పార్టీకి పది శాతం మంది సభ్యులు ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. సహజంగా శాసనసభా వ్యవహారాలన్నీ కౌల్ అండ్ షక్దర్ పుస్తకంలోని నిబంధనల మేరకు నడుస్తుంటాయి. ఇప్పుడు రాష్ట్రంలో వైసీపీకి పది శాతం సీట్లు అంటే.. 18మంది ఎమ్మెల్యేల బలం లేదు. జగన్‌తో సహా11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. దీంతో ఆయనకు ప్రతిపక్ష నేత హోదా దక్కే అవకాశం లేదు.



సొంత లాభం కోసమే..

జగన్ తన స్వప్రయోజనాల కోసమే శాసనసభలో ప్రతిపక్ష నేత హోదా కావాలని కోరుతున్నారని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. సభలో ప్రజా సమస్యలు లేవనెత్తాలంటే ప్రతిపక్ష నేత హోదానే కాదు ఎమ్మెల్యే అయినా చాలు. 2014-19, 2019-24 లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా లేకపోయినా హుందా గా వ్యవహరించింది. కానీ జగన్ తన స్వార్థం కోసం, మంత్రి పదవికి సమానమైన పదవి కోసం, వ్యక్తిగత భద్రత కోసం ప్రతిపక్షనేత హోదాను కోరుకుంటున్నారని విమర్శిస్తున్నాయి. జగన్ మాజీ సీఎం అయినా ఇప్పుడు సాధారణ ఎమ్మెల్యే మాత్రమేనని, అదే ప్రతిపక్ష నేత హోదా వస్తే కేబినెట్ మంత్రి హోదా వస్తుందని, అందుకే ఆయన పాకులాడుతున్నారని చెబుతున్నాయి.

నేటి ధర్నా కోసం ఢిల్లీకి జగన్

గన్నవరం, జూలై 23: అసెంబ్లీ సమావేశాలకు డుమ్మాకొట్టి.. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయంటూ బుధవారం ఢిల్లీలో ధర్నా చేసేందుకు జగన్ మంగళవారం అక్కడకు చేరుకున్నారు. ఆయన వెంట ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పేర్ని నాని, అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, కొట్టు సత్యనారాయణ, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, కల్యాణి, జయమంగళం వెంకటరమణ, మాజీ ఎంపీలు మార్గాని భరత్, నందిగం సురేశ్ తదితరులు ఉన్నారు.

ప్రతిపక్షనేత హోదా కల్పించండి

- అసెంబ్లీ, స్పీకర్ కార్యదర్శులను ఆదేశించండి
- హైకోర్టులో జగన్ పిటిషన్

అమరావతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తనకు ప్రతిపక్ష నేత హోదా కల్పించేలా అసెంబ్లీ కార్యదర్శి, స్పీకర్ కార్యదర్శిని ఆదేశించాలని కోరుతూ వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అసెంబ్లీ కార్యదర్శి, లా అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ ముఖ్యకార్యదర్శి, స్పీకర్ కార్యదర్శితో పాటు వ్యక్తిగత హోదాలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు. శాసనసభ సంప్రదాయం ప్రకారం అధికార పార్టీ శాసనసభా పక్షనేత ప్రమాణం పూర్తి అయిన తరువాత ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన శాసనసభాపక్ష నేతతో ప్రమాణం చేయించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. అందుకు విరుద్ధంగా అధికార పార్టీ శాసనసభా పక్షనేత తరువాత మంత్రుల చేత ప్రమాణం చేయించారని, వారి తరువాత తనకు ప్రమాణం చేసే అవకాశం ఇచ్చారన్నారు. ఇది గమనించిన తరువాత వైసీపీఎల్‌పీకి ప్రధాన ప్రతిపక్షపార్టీ హోదా, తనకు ప్రతిపక్షనేత హోదాను ఇవ్వకూడదని ముందుగానే నిర్ణయించుకున్నట్లు అర్థమైందని తెలిపారు. 'టీడీపీ-జనసేన-బీజేపీ పార్టీలు కూటమిగా ఎన్నికల్లో పోటీ చేయడమే కాకుండా, మూడు పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. వైసీపీ మాత్రమే ప్రతిపక్ష పార్టీగా ఉందని చెప్పేందుకు ఎలాంటి సందేహం లేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొంతు ఎత్తకుండా చేసేందుకే వైసీపీఎల్‌పీకి ప్రధాన ప్రతిపక్ష పార్టీ హోదా ఇవ్వకూడదని నిర్ణయం తీసుకున్నారు. ఇంకా పలు అంశాలను పరిగణనలోకి తీసుకొని శాసనసభలో నాకు ప్రతిపక్షనేత హోదా కల్పించేలా ఆదేశాలు ఇవ్వండి' అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

నీట్ రద్దు అక్కర్లేదు

- పరీక్ష పవిత్రత దెబ్బతిన్నదనేందుకు ఆధారాల్లేవ్
- మళ్లీ పరీక్ష నిర్వహించాలనడం సరికాదు
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ.. పిటిషన్ల కొట్టివేత
- రెండు రోజుల్లోగా నీట్ తుది ఫలితాలు
- కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, జూలై 23: నీట్‌ను రద్దు చేయాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నీట్-యూజీ 2024లో అవకతవకల నేపథ్యంలో పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలంటూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. పరీక్ష పవిత్రత దెబ్బతిన్నదనేందుకు ఎలాంటి ఆధారాలూ లేవని.. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవస్థ మొత్తం విఫలమైందన్న నిర్ధారణకు రాలేమని తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం మంగళవారం తీర్పు ఇచ్చింది. ఈ పిటిషన్లపై నాలుగు రోజులుగా విచారణ జరుపుతున్న ధర్మాసనం.. కేంద్ర ప్రభుత్వం, ఎన్టీయే తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాతో పాటు పిటిషనర్ల తరపున పలువురు న్యాయవాదుల వాదనలను నమోదు చేసుకుంది. తీర్పును రిజర్వ్ చేయాల్సి ఉన్నప్పటికీ ధర్మాసనం సాయంత్రం 4.50 గంటలకు మళ్లీ సమావేశమై మధ్యంతర తీర్పును ప్రకటించింది. ఇలాంటి అంశంలో ప్రస్తుత దశలోనే కోర్టు తుది తీర్పును రికార్డు చేయడం సాధ్యం కాదని.. అయితే 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయం కావడంతో అత్యవసరంగా తీర్పు ఇవ్వాల్సి వచ్చిందని తెలిపింది. హజారీబాఘ్, పట్నా కేంద్రాల్లో మాత్రమే ప్రశ్నపత్రం లీకైందని, అక్కడ 155 మంది విద్యార్థులు లబ్ధిపొందినట్లు సీబీఐ విచారణలో తేలిందని ధర్మాసనం గుర్తుచేసింది. కొద్దిమంది కళంకిత విద్యార్థుల కోసం కష్టపడి చదివి పరీక్ష రాసిన లక్షలాది మందికి అన్యాయం చేయలేమని.. పరీక్ష రద్దు ఒక్కటే పరిష్కారమన్న పిటిషనర్ల వాదన సరికాదని స్పష్టం చేసింది. ఒకవేళ సీబీఐ విచారణలో గనక ప్రశ్నపత్రం లీకవడం వల్ల లబ్ధి పొందిన వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తేలితే.. అలాంటి విద్యార్థులపై తగు చర్యలు తీసుకోవచ్చని తెలిపింది. ఇక ఫిజిక్స్ ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఇచ్చి, దానికి సంబంధించి కొందరికి గ్రేస్ మార్కులు ఇవ్వడం అన్యాయమంటూ కొందరు అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేశారు. ఒక ప్రశ్నకు రెండు సరైన జవాబులు లేవని, ఒక్కటే ఉందని నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను ఆమోదిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. కాగా, సుప్రీంకోర్టు తీర్పును కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్వాగతించారు. 'సత్యమేవ జయతే.. నిజం గెలిచింది' అని చెప్పారు. నీట్ అంశంపై ప్రతిపక్షాలు అరాచకంగా ప్రవర్తించాయని, ప్రజల్లో గందరగోళం సృష్టించాయని ధ్వజమెత్తారు. ఎన్టీయే రెండు రోజుల్లోగా నీట్ తుది ఫలితాలను వెల్లడిస్తుందని మంత్రి చెప్పారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు మెరిట్ జాబితాను సవరిస్తామన్నారు. కాగా, విచారణ సందర్భంగా న్యాయవాది నరేంద్ర హుడా వాదనలు వినిపిస్తుండగా మరో సీనియర్ లాయర్ మాథ్యూస్ నెడుంపర బెదిరింపు ధోరణిలో మాట్లాడడంపై జస్టిస్‌చంద్రచూడ్ మండిపడ్డారు.

జగన్ అక్రమాస్తుల కేసులపై రోజువారీ విచారణ

- నాంపల్లి సీబీఐ కోర్టుకు మరోసారి.. తెలంగాణ హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల వ్యవహారంలో సీబీఐ, ఈడీ కేసులకు సంబంధించి దాఖలైన డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ చేపట్టాలని నాంపల్లి సీబీఐ కోర్టును తెలంగాణ హైకోర్టు మరోసారి ఆదేశించింది. గత విచారణ సందర్భంగా ఈ నెల 3న జారీచేసిన ఆదేశాలనే పునరుద్ఘాటించింది. ప్రజాప్రతినిధుల కేసుల్లో విచారణ వేగవంతం చేయాలనే సుప్రీంకోర్టు ఆదేశాలతోపాటు జగన్ కేసుల్లో వేగవంతంగా విచారణ చేపట్టాలని కోరుతూ మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య వేసిన పిటిషన్‌పై మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ టి.వినోద్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. తెలంగాణవ్యాప్తంగా ప్రజాప్రతినిధుల కేసులకు సంబంధించి.. గుర్తింపు పొందిన కోర్టుల్లో విచారణలో ఎంతో కొంత పురోగతి కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. సీబీఐ ప్రత్యేక కోర్టు విషయానికి వస్తే.. జగన్‌పై ఉన్న కేసుల్లో రోజువారీ విచారణ చేపట్టాలని ఇప్పటికే ఆదేశించామని తెలిపింది. ఆయా కేసుల్లో మరోసారి పురోగతి తెలియజేయాలని రిజిస్ట్రీని, సీబీఐ కోర్టును ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 20కి వాయిదా వేసింది.

సజ్జల, ఆళ్లను నిందితులుగా చేర్చలేదు!

- హైకోర్టుకు నివేదించిన పోలీసుల తరపు న్యాయవాదులు
- వైసీపీ నేతల ముందస్తు బెయిల్ విచారణ 2కు వాయిదా

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై మూకదాడి కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ పలువురు వైసీపీ నేతలు వేసిన పిటిషన్లు మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చాయి. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ వైసీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రాఘురాం, వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, వైసీపీ నేత దేవినేని అవినాష్, మాజీ ఎంపీ నందిగం సురేశ్, వైసీపీ కార్యకర్తలు జి.రమేష్, షేక్ రబ్బానీ బాషా, చిన్నాబత్తిన వినోద్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ సజ్జల, ఆళ్లను ప్రస్తుతం కేసులో నిందితులుగా చేర్చలేదని, అరెస్ట్ చేస్తామనే ఆందోళన వారికి అవసరం లేదని చెప్పారు. వారు అపరిపక్వ దశలో హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. వ్యాజ్యాలపై విచారణను మూసివేయాలని కోరారు. అలాగే, ఈ కేసులో ఇతర నిందితుల ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణను వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. తొందరపాటు చర్యలు వద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను తాజాగా కోర్టును ఆశ్రయించిన ఇతర నిందితులకు వర్తింపజేయవద్దని అభ్యర్థించారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ వ్యాజ్యాలను డిస్పోజ్ చేస్తే తక్షణం వారిద్దరినీ నిందితులుగా చేర్చి అరెస్ట్ చేసే ప్రమాదం ఉందని చెప్పారు. దీంతో సజ్జల, ఆళ్లను నిందితులుగా చేరిస్తే, వారి అరెస్ట్‌కు ముందు న్యాయసహాయం పొందేందుకు వీలుగా సహేతుకమైన సమయం(5 రోజులు) ఇవ్వాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. విచారణను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రాఘురాం, వైసీపీ నేత దేవినేని అవినాష్ విషయంలో ఎలాంటి తొందరపాటు/కఠిన చర్యలూ తీసుకోవద్దని పోలీసులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను తదుపరి విచారణ వరకు పొడిగించారు. విచారణను ఆగస్టు 2వ తేదీకి వాయిదా వేశారు. మరోవైపు సీఎం చంద్రబాబు నివాసంపై మూకదాడి కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మాజీమంత్రి జోగిరమేశ్ దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణను న్యాయమూర్తి ఈ నెల 26కు వాయిదా వేశారు. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు.

టీటీడీ బోర్డు రద్దు.. 24మంది సభ్యుల రాజీనామా

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) బోర్డు రద్దయింది. మొత్తం 24 మంది సభ్యులతో కూడిన బోర్డును గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీరు కాకుండా నలుగు ఎక్స్ ఆఫీషియో మెంబర్లు కూడా ఉన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీటీడీ చైర్మన్ ఇప్పటికే రాజీనామా చేయగా, ఇప్పుడు 24 మంది సభ్యులు కూడా రాజీనామా చేశారు. వారందరి రాజీనామాలను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. వీరి రాజీనామాల ఆమోదంతో టీటీడీకి కొత్త చైర్మన్‌ను, బోర్డు సభ్యులను ప్రభుత్వం నియమించుకోవాల్సి ఉంటుంది.



కుప్పం నియోజకవర్గంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న నారా భువనేశ్వరి

ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతా

- కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి ప్రకటన
- కంచిబందార్లపల్లె, పైపాళ్యం గ్రామాల దత్తత
- నియోజకవర్గానికి మూడు పెద్ద పరిశ్రమలు తెస్తానని హామీ

కుప్పం, జూలై 23: దత్తత తీసుకున్న గ్రామాలను రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి అవసరమైన చర్యలు చేపడతానని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి హామీ ఇచ్చారు. చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో రెండు గ్రామాలను ఆమె దత్తత తీసుకున్నారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం కుప్పం వచ్చిన ఆమె మొదటి రోజున గుడుపల్లె మండలంలోని నాలుగు గ్రామాల్లో పర్యటించి మహిళలతో సమావేశమయ్యారు. వారి ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబుకు అత్యధిక మెజారిటీ ఇచ్చిన ఆ మండలంలోని కంచిబందార్లపల్లె గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అలాగే రెండవ అత్యధిక మెజారిటీ ఇచ్చిన కుప్పం మండలంలోని పైపాళ్యం గ్రామాన్ని కూడా దత్తత తీసుకుంటానని చెప్పారు. దత్తత తీసుకున్న ఈ రెండు గ్రామాలతోనే అభివృద్ధి ఆగిపోదని, నియోజకవర్గంలోని గ్రామాలన్నీ చంద్రబాబు ఆధ్వర్యంలో కచ్చితంగా అభివృద్ధి చెందుతాయని ఆమె తెలిపారు. యువతకు ఉపాధి కోసం చంద్రబాబుతో మాట్లాడి నియోజకవర్గానికి మూడు పెద్ద పరిశ్రమలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. కుప్పం ప్రజలు చంద్రబాబును 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించడంవల్లే, నాలుగుసార్లు ముఖ్యమంత్రి కాగలిగారని, తమ కుటుంబం మొత్తం కుప్పం ప్రజలకు రుణపడి ఉంటుందని తెలిపారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

21 మార్కెట్ కమిటీల నిలుపుదల ఉత్తర్వులు జారీ

అమరావతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 162 మార్కెట్ కమిటీలకు అధికారిక పర్సన్ ఇన్‌చార్జిలను నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు అనుగుణంగా పలు కమిటీల కార్యవర్గాలు రాజీనామా చేయగా, 21 కమిటీల పాలకవర్గాలు రాజీనామా చేయలేదు. ఇందులో పలువురు తమకు ఇంకా గడువు ఉందని కోర్టుకు వెళ్లారు. రాజీనామా చేయని ఆ 21 కమిటీల కార్యకలాపాలను నిలుపుదల చేస్తూ, ప్రభుత్వం తాజాగా జారీ చేసిన సవరణ ఉత్తర్వులకు మంగళవారం గజిట్ విడుదలైంది.



లంకలను ముంచెత్తిన వరద

భద్రాచలంలో తగ్గుముఖం.. తూర్పున ఇంకా ఉధృతి

ధవళేశ్వరం బ్యారేజి వద్ద రెండో ప్రమాద హెచ్చరిక

- పునరావాస కేంద్రాలకు వరద బాధితులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఎడతెరపి లేని వానలు, ఎగువన కురిసిన వర్షాలతో ఉగ్రరూపం దాల్చిన గోదావరి భద్రాచలం వద్ద కాస్త తగ్గుముఖం పట్టింది. కానీ.. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఇంకా ఉధృతంగానే ఉంది. బ్యారేజీ వద్ద మంగళవారం తెల్లవారుజామున 2 గంటలకు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సాయంత్రం 6 గంటలకు బ్యారేజీ నీటి మట్టం 14.60 అడుగులకు చేరింది. పాండ్ లెవెల్ 15.12 మీటర్లుగా ఉంది. బ్యారేజి నుంచి సముద్రంలోకి 14,09,718 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి పోతోంది. అయితే.. భద్రాచలం ఎగువ భాగంలో భారీ వర్షాలు పడి, వెంటనే అక్కడ నీటిమట్టం పెరిగితే తప్ప ధవళేశ్వరం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీచేసే స్థాయికి వరద వచ్చే అవకాశం కనిపించడంలేదు. ప్రస్తుతం భద్రాచలం వద్ద వరద తగ్గినా.. రాజమహేంద్రవరం అఖండ గోదావరి, బ్యారేజీ దిగువ కోనసీమ జిల్లాలోనూ ఒకటి రెండు రోజుల పాటు వరద ప్రభావం ఉంటుందని చెబుతున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు భద్రాచలం వద్ద నీటిమట్టం 50.60 అడుగులు ఉండగా.. సాయంత్రానికి అది 50.30 అడుగులకు తగ్గింది. గోదావరి వరద ప్రభావంతో రాజమహేంద్రవరం పరిధిలోని లంకలన్నీ మునిగిపోతున్నాయి. ఇప్పటికే బ్రిడ్జిలంక, కేతావారిలంక, ఎదుర్లమ్మలంక వంటివి మునగడంతో 248 మందిని రాజమహేంద్రవరంలోని పునరావాస కేంద్రాలకు తరలించారు. సీతానగరం మండలం ముల్లకలంకలో సుమారు 1000 మంది వరకూ ఉన్నారు. పాల వ్యాపారులే ఎక్కువ. లంకలు వదిలి బయటకు రావడం లేదు. వారికోసం గోదావరిలో ఏర్పాటుచేసిన రెండు పడవల్లో వచ్చి పనులు చూసుకుని వెళుతున్నారు. ఇక ఎర్రకాలువ వరద వల్ల నల్లజర్ల, నిడదవోలు మండలాల్లో పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి.

కోనసీమ లంకలకు పోటెత్తిన వరద

అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో గోదావరి నదీపాయలను ఆనుకుని ఉన్న లంక గ్రామాల్లోకి వరద నీరు పోటెత్తింది. ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ మహేశ్ కుమార్ మంగళవారం పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ఉభయ గోదావరి జిల్లాలను కలిపే చాకలిపాలెం, కనకాయలంక, తొగరపాయ, అప్పనపల్లి కాజ్‌వేలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ధవళేశ్వరం నుంచి వరద నీటిని దిగువకు వదలడంతో కోనసీమలోని గౌతమి, వృద్ధ గౌతమి, వశిష్ఠ, వైనతేయ నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. కాట్రేనికోన మండలం కుండలేశ్వరం ఏటిగట్టు కుంగిపోవడంతో ఆ ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. తక్షణం గ్రావెల్‌తో పూడ్చే పనులు ప్రారంభించారు. జిల్లాలో 25 బోట్లను సిద్ధం చేశారు. 75 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేశారు. వరద ఉధృతి కారణంగా అన్ని రేవుల్లో పడవ, పంటు ప్రయాణాలను నిలిపివేశారు. వేలాది ఎకరాల్లో పంట పొలాలు ముంపులో చిక్కుకున్నాయి.

జలదిగ్బంధంలో 177 గ్రామాలు

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు వద్ద మంగళవారం సాయంత్రానికి శబరి నీటి మట్టం 41 అడుగులకు చేరుకుంది. చింతూరు డివిజన్‌లో 177 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. పలు గ్రామాల్లోని ఇళ్లు నీటమునిగాయి. 30వ, 326వ నంబరు జాతీయ రహదారులు జలమయమయ్యాయి. దీంతో చింతూరు మండలం, చట్టి వద్ద వాహనాలు బారులు తీరాయి. డొంకరాయి జల విద్యుత్ కేంద్ర జలాశయం ఎఫ్ఆర్ఎల్ 1,037 అడుగులు కాగా, మంగళవారం సాయంత్రానికి 1032.90 అడుగులకు చేరుకుంది. ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 10 గ్రామాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రహదారులు పూర్తిగా ఛిద్రమయ్యాయి. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 5 వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించి భోజన, వసతి సౌకర్యాలు కల్పించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఎర్రకాల్వ ఉధృతి కాస్త తగ్గింది. అయినా పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి.



మంగళవారం సాయంత్రానికి సంగమేశ్వర ఆలయాన్ని చుట్టుముట్టిన వరద

జలాధివాసమైన సంగమేశ్వరుడు

- గంటగంటకూ క్షేత్రాన్ని ముంచెత్తిన వరద

ఆత్మకూరు, శ్రీశైలం, జూలై 23: నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలో సప్తనదుల సంగమ ప్రదేశంలో వెలసిన లలితాసంగమేశ్వరుడు జలాధివాసమయ్యారు. ఎగువ రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల నుంచి శ్రీశైలానికి భారీగా వరద వచ్చిచేరడంతో మంగళవారం మధ్యాహ్నానికి ఆలయంలోకి నదీజలాలు ప్రవేశించి సంగమేశ్వరుడిని చేరాయి. గంటగంటకూ పెరిగిన వరద ఆ తర్వాత సంగమేశ్వరాలయాన్ని ముంచెత్తింది. మంగళవారం సాయంత్రం 6గంటల సమయానికి జూరాల నుంచి 1,51,790 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైల జలాశయానికి చేరుతోంది. దీంతో సంగమేశ్వరుడు పూర్తిగా జలాధివాసం కాగా, సంగమేశ్వరాలయానికి చేరుకునే మార్గం కూడా నీటమునిగింది. అదేక్రమంలో ఎగువ పుష్కరఘాట్ల వద్ద నీటిమట్టం పెరుగుతోంది.

శ్రీశైలానికి పెరిగిన ఇన్‌ఫ్లో

ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయంలో మంగళవారం భారీగా ఇన్‌ఫ్లో నమోదైంది. జూరాల జలాశయం నుంచి 1,51,790 క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేశారు. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి 1,55,323 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 842.40 అడుగులు, జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నిల్వ 65.5945 టీఎంసీలుగా నమోదైంది. జలాశయం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో ఎలాంటి విద్యుత్ ఉత్పత్తి జరగడంలేదు.

చెదురుమదురు వర్షాలు

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ఒక మోస్తరుగా కదులుతున్నాయి. మరోవైపు సముద్రం మీదుగా రుతుపవన గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో మంగళవారం కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో ఉత్తర కోస్తాలో పలుచోట్ల, దక్షిణ కోస్తాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఉత్తర కోస్తా తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.



చింతూరు మండలంలో ఎత్తైన ప్రదేశాల్లో పాకల్లో తలదాచుకున్న వరద బాధితులు

బస్సుతో తొక్కించి.. కిలోమీటరు ఈడ్చుకెళ్లి..!

- ట్రావెల్స్ బస్సు డ్రైవర్ల మధ్య ఘర్షణ
- ఓ డ్రైవర్‌ను బస్సుతో తొక్కించిన మరో డ్రైవర్
- బస్సు కింద ఇరుక్కుని దుర్మరణం
- చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో దారుణం



బస్సుతో ఢీకొట్టి ఈడ్చుకెళ్లడంతో దుర్మరణం చెందిన సుధాకర రాజు

బంగారుపాళ్యం, జూలై 23: ఇద్దరు ప్రైవేటు ట్రావెల్ బస్సు డ్రైవర్ల మధ్య చెలరేగిన మాటల యుద్ధం ఒకరి హత్యకు దారి తీసింది. సాటి డ్రైవర్ అని కూడా చూడకుండా మరో డ్రైవర్ బస్సుతో తొక్కించి మరీ చంపేశాడు. సుమారు కిలోమీటరు దూరం ఈడ్చుకెళ్లడంతో ఆ డ్రైవర్ శరీరమంతా ఛిద్రమై అత్యంత దారుణమైన స్థితిలో దుర్మరణం చెందాడు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండల పరిధిలో ఈ దారుణం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు నుంచి విజయవాడకు వెళ్లేందుకు మార్నింగ్ స్టార్, శ్రీకృష్ణ ట్రావెల్స్‌కు చెందిన రెండు బస్సులు సోమవారం రాత్రి బెంగళూరులో బయల్దేరాయి. సోమవారం రాత్రి 1.30 గంటలకు చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలోని మహాసముద్రం టోల్‌గేట్ వద్ద రెండు బస్సులు ఒరుసుకుంటూ వెళ్లాయి. ఓ బస్సు అద్దం మరో బస్సుకు తగిలింది. దీంతో రెండు బస్సుల డ్రైవర్లు టోల్‌గేట్ ఎదుట ఘర్షణ పడ్డారు. టోల్‌గేట్ పాయింట్ వద్దకెళ్లాక మరోసారి రెండు బస్సుల్ని ఆపి గొడవ పడ్డారు. మాటా మాటా పెరిగింది. మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ సుధాకర రాజు బస్సు దిగి.. శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సు ఎదుట నిలబడి మాట్లాడుతుండగా.. శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ శ్రీనివాసరావు కోపంతో అతడిపైనుంచి బస్సును పోనిచ్చాడు. దీంతో సుధాకర రాజు శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సు కింద చిక్కుకోగా.. ఆ బస్సు సుమారు కిలోమీటరు మేర ఈడ్చుకెళ్లింది. దీంతో సుధాకరరాజు దుర్మరణం పాలయ్యారు. గుర్తుపట్టలేనంతగా ఆయన మృతదేహం ఛిద్రమైపోయింది. టోల్‌గేటు వద్దనున్న సీసీ కెమెరాలో శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సు సుధాకరరాజును తొక్కుకుంటూ వెళ్లడం రికార్డయింది. సీసీ టీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకున్న బంగారుపాళ్యం పోలీసులు శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ శ్రీనివాసరావు మీద 302 సెక్షన్ కింద హత్య కేసు నమోదు చేశారు. మృతుడు సుధాకరరాజుది గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని పాతరెడ్డిపాలెం కాగా.. ఆయన పొన్నూరులో స్థిరపడ్డారు. వారం రోజుల నుంచే ఆయన మార్నింగ్ స్టార్ బస్సు డ్యూటీకి వెళ్తున్నారు. ఆయనకు భార్య అరుణ, ఇద్దరు కుమారులున్నారు. నిందితుడు శ్రీనివాసరావు విజయవాడ అయ్యప్పనగర్ యనమలకుదురు రోడ్డుకు చెందిన వాడు కాగా.. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. శ్రీకృష్ణ ట్రావెల్స్ యాజమాన్యాన్నీ పోలీసులు పిలిపించి విచారిస్తున్నారు.

టెట్ దరఖాస్తులో సవరణకు అవకాశం

అమరావతి: టెట్ దరఖాస్తుల్లో పొరపాట్లు ఉంటే సవరించుకునేందుకు అవకాశం కల్పించినట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఓ ప్రకటనలో తెలిపారు. టెట్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయిన తర్వాత 'అప్లికేషన్ డిలీట్' ఆప్షన్ మీద క్లిక్ చేసి ఓటీపీ ద్వారా ఎంపిక చేసుకున్న పేపర్‌ను మార్చుకోవచ్చని వివరించారు.

ప్రత్యేక హోదా ఊసే లేదు: రఘువీరా

మడకశిర, జూలై 23: కేంద్రం బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం చేసిందని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యుడు రఘువీరారెడ్డి విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా నీలకంఠాపురంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్‌లో ప్రత్యేక హోదా ఊసే లేదని, పోలవరం గురించి పైపై మాటలు మాట్లాడారని, రాజధాని అమరావతికి ఇచ్చిన రూ.15 వేల కోట్లు అప్పా? లేక గ్రాంటా? అనే స్పష్టత లేదని వ్యాఖ్యానించారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేయబోమని బడ్జెట్‌లో ఎక్కడా చెప్పలేదన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న మూడు పార్టీలతోపాటు జగన్ పార్టీ కూడా హక్కుల సాధనకు బాధ్యత తీసుకోవాలని సూచించారు.

ఎంపీడీఓ మృతదేహం లభ్యం

విజయవాడలో ఏలూరు కాల్వలో గుర్తింపు



వెంకట రమణారావు

విజయవాడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో ఎం.వెంకటరమణారావు అదృశ్యం విషాదాంతం అయింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆయన మరణ వాంగ్మూలం రాసినట్టుగానే ఆత్మహత్య చేసుకున్న వైనం వెలుగుచూసింది. విజయవాడ మధురానగర్ సాయిబాబా ఆలయానికి ఎదురుగా ఉన్న ఏలూరు కాల్వలో గుర్రపుడెక్కల్లో చిక్కుకుని ఉన్న వెంకట రమణారావు మృతదేహాన్ని ఎస్డీఆర్ఎఫ్ బృందాలు మంగళవారం గుర్తించాయి. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరు మహదేవపురం కాలనీలో ఉంటున్న వెంకటరమణారావు ఈ నెల 15న మచిలీపట్నంలో పని ఉందని ఇంటి నుంచి స్కూటీపై బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. అదే రోజు రాత్రి 12 గంటలకు డిప్యూటీ సీఎం పేరిట మరణ వాంగ్మూలం రాసి, చిన్న కుమారుడు మహీధర్‌కు వాట్సాప్‌లో పంపారు. కుటుంబ సభ్యులు 16వ తేదీ తెల్లవారుజామున పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. ఆయన సెల్‌ఫోన్ నంబర్‌ను ట్రాక్ చేశారు. మచిలీపట్నం రైల్వేస్టేషన్ పార్కింగ్‌లో బైక్‌ను పార్క్ చేసిన తర్వాత విజయవాడకు వచ్చే రైలులో ప్రయాణించినట్టు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. ఆయన సెల్‌ఫోన్ సిగ్నల్ విజయవాడ మధురానగర్ రైల్వేట్రాక్ వద్ద చూపించాయి. మధురానగర్ రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఏలూరు కాల్వ ప్రవహిస్తుండడంతో ఇందులోకి దూకి ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు అనుమానించారు. రెండు ఎన్డీఆర్ఎఫ్, మూడు ఎస్డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు కొనసాగించాయి. మధురానగర్ ఫ్లైఓవర్ పక్కనే ఉన్న చిన్న వంతెన కింద గుర్రపుడెక్కల్లో మృతదేహాన్ని గుర్తించారు.



ఏలూరు కాలువ నుంచి వెలికితీసిన మృతదేహం, విలపిస్తున్న కుమారుడు, బావమరిది

ఆత్మహత్యకు కారణమిదే!

ఎంపీడీఓ వెంకటరమణారావు ఈ నెల 15నే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేరిట సూసైడ్ నోట్ రాశారు. ఆ నోట్‌లో నరసాపురం వైసీపీ మాజీ ఎమ్మెల్యే మాజీ చీఫ్ విప్ ప్రసాదరాజుపై ఆరోపణలు చేశారు. గత మూడున్నరేళ్లుగా నరసాపురం ఫెర్రీకి చెందిన బోట్లకు కాంట్రాక్టర్ రూ.55 లక్షలు చెల్లించవలసి ఉందని, ప్రసాదరాజు అండదండలతో కాంట్రాక్టరు సొమ్ము చెల్లించకుండా బెదిరింపులకు పాల్పడుతున్నాడని తెలిపారు. ప్రసాదరాజు ఒత్తిళ్లు తట్టుకోలేక పోతున్నానని, 33ఏళ్లు నిజాయితీగా పనిచేసిన తనకు.. ఇందులో నుంచి బయటపడే పరిస్థితి కనిపించడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే చనిపోవాలనుకుంటున్నానని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. తన కుటుంబానికి న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఇ-కామర్స్ ద్వారా రైతు ఉత్పత్తుల విక్రయం?

- కళాకారులు, నేత కార్మికులు, చిన్నదుకాణదారులకూ ఆ అవకాశం
- ఓఎన్‌డీసీ ప్రతినిధులతో చంద్రబాబు భేటీ

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) ప్రతినిధులతో సమావేశమయ్యారు. డిజిటల్ కామర్స్ మార్కెట్ ద్వారా రాష్ట్ర ప్రజలు వేగంగా వృద్ధి సాధించే అంశంపై చర్చించారు. రైతులు, నేత కార్మికులు, కళాకారులు, డ్రైవర్లు, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈ యూనిట్లు, చిన్నదుకాణదారులతో సహా వివిధ వర్గాల జీవితాలను మెరుగుపరచడానికి ఓఎన్‌డీసీ ప్లాట్‌ఫారమ్‌ను ఉపయోగించుకోవడం, ఆయా ఉత్పత్తులకు డిజిటల్ కామర్స్ మార్కెట్ అవకాశాలు కల్పించడంపై ప్రధానంగా చర్చించారు. ఓఎన్‌డీసీ ప్లాట్‌ఫారమ్ ఇ-కామర్స్ ద్వారా కొనుగోలుదారులు, విక్రేతలు సులువుగా అనుసంధానమయ్యేలా చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. హార్టీకల్చర్, ఆక్వా తదితర రంగాల ఉత్పత్తులను ఇ-కామర్స్ ద్వారా విక్రయించే అంశంపై కూడా చర్చించారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు కొరియా బృందం సంసిద్ధత!

- ప్రతినిధులతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చర్చలు

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన దక్షిణ కొరియా ప్రతినిధి బృందంతో రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చర్చలు జరిపారు. మంగళవారం ఏపీఐఐసీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఇండస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిషోర్ కూడా పాల్గొన్నారు. రాష్ట్రంలో అగ్రి-టెక్, అగ్రి మెషినరీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటోమొబైల్స్, బయోటెక్, ఎలక్ట్రానిక్స్ రంగాలలో పెట్టుబడులు పెట్టడానికి దక్షిణ కొరియా ప్రతినిధులు సంసిద్ధత తెలిపినట్లు మంత్రి వెల్లడించారు.

ఆర్ఎస్ఎస్ చీఫ్‌తో శేఖర్ భేటీ



మోహన్ భాగవత్‌కు స్వామివారి ప్రసాదాలు అందిస్తున్న ఏజే శేఖర్

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) స్థానిక సలహామండలి (తమిళనాడు, పుదుచ్చేరి) అధ్యక్షుడు ఏజే శేఖర్ ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్‌తో సోమవారం భేటీ అయ్యారు. చెన్నై వచ్చిన మోహన్ భాగవత్‌ను కలుసుకుని స్వామివారి ప్రసాదాలు అందించారు. అనంతరం తమిళనాట టీటీడీ చేపట్టిన పలు కార్యక్రమాలను విజయవంతంగా పూర్తిచేసిన విషయాన్ని ఈ సందర్భంగా శేఖర్ వివరించారు. 2016లో తాను టీటీడీ బోర్డు సభ్యునిగా ఉన్నప్పుడు దేశంలోనే ప్రప్రథమంగా అలిపిరిలో 'గోమందిరం' నిర్మించినట్టు వివరించారు. ఐదెకరాల విస్తీర్ణంలో నిర్మితమైన ఈ గోమందిరంలో వేలాదిమంది భక్తులు గోపూజ సేవ, గోప్రదక్షిణం, గో తులాభారం వంటి కార్యక్రమాలను నిర్వహించిన తరువాతే శ్రీవారిని దర్శించుకుంటున్నారని వివరించారు. ఈ గోమందిరంలో సదుపాయాల కోసం రూ.15 కోట్లు విరాళంగా ఇచ్చినట్టు పేర్కొన్నారు. గోమందిర ప్రాంగణంలో ప్రతిరోజూ 'శ్రీనివాస దివ్య అనుగ్రహ హోమం' జరుగుతోందని, వందలాదిమంది భక్తులు ఈ హోమంలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఇక్కడ హోమం కోసం తన సొంత ఖర్చుతో మండపం నిర్మించనున్నామని, భూమి పూజ కోసం ఏర్పాట్లు సిద్ధమయ్యాయన్నారు. అదేవిధంగా చెన్నైలో నిర్మితమైన పద్మావతి అమ్మవారి ఆలయం, కన్నియాకుమారి, వేలూరు, ఉళుందూర్‌పేటలోని ఆలయాల నిర్మాణంలో తన సహకారం గురించి కూడా వివరించారు. అంతేగాక తమిళనాడు నుంచి తిరుమలకు వెళ్లే పాదయాత్రికుల కోసం విశ్రాంతి కేంద్రాలను నిర్మించాలనే తన కలల ప్రాజెక్టును నెరవేర్చాలని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. పురటాసి మాసంలో తమిళనాడు నుంచి వేలాదిమంది భక్తులు చెన్నై నుంచి తిరుపతికి, ఇతర జిల్లాల నుంచి చిత్తూరు మీదుగా తిరుమలకు పాదయాత్రగా వెళ్లేటప్పుడు అనేక ఇబ్బందులు పడుతున్నందున, ఈ మార్గాల్లో ప్రతి 25 కి.మీటర్లకు ఒకటి చొప్పున విశ్రాంతి కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిఉందన్నారు. ఇందుకోసం ఒక్కో కేంద్రానికి ఒక్కో ఎకరా చొప్పున భూమిని కూడా గుర్తించామని పేర్కొన్నారు. ఈ వివరాలను ఆసక్తిగా ఆలకించిన మోహన్ భగవత్.. శేఖర్‌ను అభినందించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'సంకీర్ణ' బడ్జెట్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024–25 సంవత్సరానికి ప్రతిపాదించిన బడ్జెట్ ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేసింది. అలాగే, బీజేపీ నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వ మనుగడ, ప్రయోజనాలకు అనుగుణంగా తమ భాగస్వామ్య పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు అధిక నిధులు ఇచ్చే ప్రయత్నమూ జరిగింది. మెరుగైన కేటాయింపుల ద్వారా తెలుగుదేశం, జనసేన, జనతాదళ్ (యునైటెడ్) పార్టీలను ఆర్థికమంత్రి బుజ్జగించే ప్రయత్నం చేశారు. కొత్తగా గెలుచుకున్న ఒడిశాలో నిలదొక్కుకోవడానికి ఆ రాష్ట్రానికి ప్రత్యేకంగా చేసిన కేటాయింపులు ఉపకరిస్తాయి.

గత ఐదేళ్ళ అస్తవ్యస్త పాలన కారణంగా రాజధాని అంటూ లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మిగిలిపోయింది. ఆ లోటును తీర్చడానికి కేంద్ర బడ్జెట్లో రూ.15 వేల కోట్ల ఆర్థిక సహాయం ఉపకరిస్తుంది. భవిష్యత్తులో రాజధానికి మరిన్ని నిధులు అందించే ప్రయత్నం సాగుతుందని కూడా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ నిర్లిప్త వైఖరి కారణంగా అసంపూర్తిగా ఉండిపోయిన పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసే బాధ్యత కేంద్రం తీసుకుంటుందని ప్రకటించడం, విశాఖ పట్టణం–చెన్నై, హైదరాబాద్–బెంగళూరు కారిడార్‌లలో పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టులకు నిధులు ఇవ్వడం బాగుంది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో హామీలకు అనుగుణంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కూడా కొన్ని కేటాయింపులు జరిగాయి. ఇదేరీతిలో ఎన్‌డీఏలో భాగస్వామి అయిన మరో కీలక రాష్ట్రం బిహార్‌కు కూడా భారీ కేటాయింపులు, భారీ ప్రాజెక్టులతో బడ్జెట్లో మంచి వాటా దక్కింది. బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సర్వతోముఖాభివృద్ధి కోసం 'పూర్వోదయ' ప్రణాళిక రూపొందించనున్నట్టు కూడా ఆర్థికమంత్రి ప్రకటించారు. ఎనిమిదిమంది బీజేపీ ఎంపీలను ఇచ్చిన తెలంగాణకు ఈ బడ్జెట్‌లో ఏమాత్రం చోటు దక్కకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. సంకీర్ణధర్మాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకున్న కేంద్రప్రభుత్వం విభజనచట్టంలో తెలంగాణకు ఉన్న హామీలను విస్మరించింది. పాలమూరు–రంగారెడ్డి సహా ఏ ఒక్క అంశంలోనూ కేంద్రంనుంచి సహకారం దక్కని, తెలంగాణ ఊసేలేని బడ్జెట్ ఇది. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దని పక్షంలో బీజేపీ రాజకీయంగా నష్టపోతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన హెచ్చరికను అర్థం చేసుకోవచ్చు.

తొలి పదేళ్ళకు భిన్నంగా ఈ మూడోవిడత పాలనలో మోదీ ప్రభుత్వం తనను నిలబెడుతున్న రెండు పార్టీల డిమాండ్లకు తలొగ్గి ఆ రాష్ట్రాలకు కేటాయింపులు చేయడంతో విపక్షాలు దీనిని సర్కార్ బచావో, కుర్సీ బచావో బడ్జెట్‌గా వ్యాఖ్యానిస్తున్నాయి. బిహార్ సంగతి అటుంచితే, ఆంధ్రప్రదేశ్ మాత్రం ఈ ప్రత్యేక సహాయానికి యోగ్యమైనదే. ఆర్థిక కష్టాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని, పోలవరం ఎంతముఖ్యమో, వాటికి కేంద్రం చేయూతనివ్వడం ఎంత అవసరమో విపక్షనేతలకు తెలియనిదేమీ కాదు. ఇక, యువత, ఉపాధి, నైపుణ్యాలకు సంబంధించి బడ్జెట్‌లో ప్రకటించిన పథకాలు అనేకం తన మానిఫెస్టోనుంచి తీసుకున్నారని కాంగ్రెస్ గుర్తుచేస్తోంది. రాహుల్ న్యాయ్‌యాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలు కూడా ఈ బడ్జెట్‌లో ప్రతిఫలించాయని అంటోంది.

దేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దే క్రమంలో తొమ్మిది కీలక ప్రాధాన్యతలను ఆర్థికమంత్రి ప్రకటించారు. వ్యవసాయ ఉత్పాదకతల పెంపునకు పెద్దపీట వేశారు. కోటి మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సహించడం, కూరగాయల ఉత్పత్తిని పెంచడానికి క్లస్టర్ల ఏర్పాటు వంటి ప్రతిపాదనలు వ్యవసాయరంగాన్ని ఉత్తేజితం చేస్తాయి. ఉపాధి కల్పనను కూడా ప్రభుత్వం ప్రాధాన్యతాంశంగా చెబుతోంది. కొత్తగా ఉపాధి అవకాశాలు కల్పించే యాజమాన్యాలకు ప్రోత్సాహకాలు ప్రకటించడం బాగుంది. దీర్ఘకాలంగా ఆదాయపు పన్ను విభాగంలో ఎలాంటి మార్పులు జరగనందున, కొత్త ఐటీ అసెస్మెంట్ విధానం ఎంచుకునే వారికి కొన్ని ప్రయోజనాలు దక్కాయి. స్టాండర్డ్ డిడక్షన్ మొత్తాన్ని, వివిధ ఐటీ శ్లాబ్‌లలోకి వచ్చే ఆదాయ పరిమితిని పెంచడం వల్ల ఒక్కో ఐటీ అసెసీకి ఏడాదికి రూ.17,500 మేరకు పన్ను భారం తగ్గుతుందని అంచనా. మూడు కేన్సర్ ఔషధాలపై కస్టమ్స్ సుంకం జీరో స్థాయికి తగ్గించడం పరోక్ష పన్నుల విభాగంలో తీసుకున్న పెద్ద చర్య. దీని వల్ల కేన్సర్ రోగులకు ప్రాణాధార ఔషధాలు తక్కువ ధరకు అందుబాటులోకి వస్తాయి. మహిళా ఆధారిత అభివృద్ధిని ఉత్తేజితం చేయడానికి మహిళలు, బాలికలకు ప్రయోజనం చేకూర్చే పథకాలకు రూ.3 లక్షల కోట్లు కేటాయించడం సముచితం. ప్రభుత్వం ప్రాధాన్యతా విభాగాలుగా ప్రకటించిన పేదలు, యువత, అన్నదాత, మహిళలకు ప్రయోజనం చేకూర్చే ప్రతిపాదనలు బడ్జెట్లో ఉన్నప్పటికీ ఆరోగ్య రంగానికి చెప్పుకోదగ్గ ప్రాధాన్యం లభించకపోవడం నిరాశ కలిగిస్తుంది.

మార్వాడీల వ్యాపార విస్తరణపై అసహనం వ్యక్తం చేసే వారు, ఆ వ్యాపారదక్షుల విజయ రహస్యాలను తెలుసుకోవడం మంచిది. ఒకప్పుడు తిరుపతిలోని చిన్న బజారు లేదా హైదరాబాద్‌లోని బేగంబజారు లేదా గుల్జార్ హౌజ్‌కు మాత్రమే పరిమితమైన మార్వాడీలు నేడు మదనపల్లె, జగిత్యాల తరహా పట్టణాలకు విస్తరిస్తున్నారు. అసూయపడితే ఎవరికి నష్టం? మార్వాడీలు అలా ముందంజ వేయడానికి దోహదం చేస్తున్నవేమిటో ఆకళించుకోవాలి.

వ్యాపార విజయాలు మార్వాడీల సొంతం

రాజస్థాన్. సారవంతమైన సేద్యపు భూములు లేవు, విశాల బాహ్య ప్రపంచానికి వెళ్లే నౌకాయాన మార్గాలు అంతకన్నా లేవు. అరబ్బు దేశాలలో వలే అత్యధిక ప్రాంతం ఎడారిగా ఉన్న భారతీయ సీమ రాజస్థాన్. ఒంటెలు ఒక ప్రధాన అంతర్భాగంగా ఉన్న రాజస్థానీయుల జీవన విధానం విలక్షణమైనది. తలవంచని వీరులు వారు. అలనాటి హల్దిఘాట్ యుద్ధం మొదలు నేడు తెలుగునాట పానీపూరి విక్రయాల వరకు అధిపత్య ఆరాటం ఆ భూమి పుత్రులలో ఉంది.

వాణిజ్య రంగంలో మార్వాడీల పాత్ర విశిష్టమైనది, అద్వితీయమైనది, చరిత్రాత్మకమైనది. పహేలే షా బాద్ మే బాద్ షా (మొదట షావుకారు ఆ తర్వాత రాజు) అనేది మార్వాడీల నానుడి. ఏ రాజ్యంలో మార్వాడీ వ్యాపారులు ఎక్కువ సంఖ్యలో ఉంటే ఆ రాజ్య ఆదాయం సమృద్ధమని కూడ అలనాటి కాలంలో రాజుల అభిప్రాయంగా ఉండేది. కాలం నాటి రాచరికం నుంచి ఈ నాటికీ వలస వ్యాపారులకు పర్యాయపదం మార్వాడీలు. అఫ్గానిస్తాన్ సుల్తాన్‌లు, హైదరాబాద్ నిజాం నవాబుల నుండి పిఠాపురం సంస్థానాధీశుల దాకా చిన్న, పెద్ద పాలకులు అందరూ మార్వాడీలకు స్వాగతం పలికారు, ఆదరించారు, రాజ్య ఆదాయాన్ని పెంపొందించుకున్నారు. వర్తమాన భారతదేశంలో రాజస్థానీలు ప్రత్యేకించి మార్వాడీల జైత్రయాత్ర ఆసేతు హిమాచలం, మరీ ముఖ్యంగా తెలుగునాట వ్యాపార సమీకరణాలను పూర్తిగా మార్చివేస్తోంది.

గల్ఫ్ లేఖ

వర్తక శ్రేష్ఠులు అయిన మార్వాడీలు గతంలో నగరాలలో ఆటోమొబైల్, హార్డ్‌వేర్, బంగారం, మిఠాయి ఇత్యాది వ్యాపారాలకు మాత్రమే పరిమితమయ్యారు. కాలంతో పాటు వారూ మారారు. గత కొన్నాళ్ళుగా గోదావరి నదీ తీరంలోని నిర్మల్ జిల్లా మొదలు పెన్నా నదీ తీరంలోని నెల్లూరు దాకా మార్వాడీల ఉనికి అనూహ్యంగా పెరిగిపోతోంది. ఈ సమూహాల వ్యాపార దక్షతను ఎదుర్కోలేక స్థానిక సంప్రదాయక వ్యాపారవర్గాలు వెనుకంజ వేస్తున్నాయి. వ్యాపార రంగం నుంచి నిష్క్రమిస్తున్నాయనడం సత్య దూరం కాదు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా నూతన, వినూత్న వ్యాపార పద్ధతులతో మార్వాడీలు తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటున్నారు. స్వేచ్ఛా విపణిలో తామెందుకు వెనుకబడిపోతున్నామనేది తెలుగు వ్యాపారవేత్తలు ఒకసారి సమీక్షించుకోవల్సిన సందర్భమిది.



ఒక వైపు ఈ-కామర్స్ విజృంభణ, మరో వైపు యువతరం నిరాసక్తికి తోడుగా మార్వాడీల విస్తరణ ఫలితంగా తెలుగునాట సామాజిక జీవనంలో ఒక భాగమైన సంప్రదాయ షావుకారు దుకాణాలు సన్నగిల్లుతున్నాయి. సారవంతమైన సాగు భూములు, పుష్కల వ్యాపారవకాశాలు ఉన్నా తెలుగు ప్రాంతాలకు చెందిన అసంఖ్యాక యువజనులు విదేశీ కొలువుబాట పడుతున్నది. వాణిజ్యమే వృత్తిగా ఇప్పటి వరకు రాణించిన వైశ్య యువత కూడ పెద్ద సంఖ్యలో దేశ సరిహద్దులు దాటుతోంది. వ్యాపారంలో అడుగు పెట్టడానికి ఇతర సామాజిక వర్గాల యువత సాహసించలేక పోతుంది. స్వంత గడ్డపై స్థానికులు నిస్సహాయ స్థితిలో సతమతమవుతుండగా ఎక్కడి నుంచో గంపెడంత ఆశతో తెలుగునాటకు వచ్చిన మార్వాడీలు వ్యాపార విజయాలతో పురోగమిస్తున్నారు.

రాజస్థానీ వ్యాపారులతో పాటు వారి గద్దీలు (గుమాస్తగిరి)లలో పని చేస్తున్న రాజస్థానీ యువకుల సంఖ్య కూడ అనూహ్యంగా పెరిగిపోతోంది. తమ సేట్‌ల దుకాణాలలో గద్దీలపై గుమాస్తాలుగా పని చేస్తున్న ఆ యువకులు అనతికాలంలో సేట్‌లుగా ఎదుగుతూ స్వంత వ్యాపారాలను ప్రారంభిస్తున్నారు. తమ సేట్‌ల గద్దీలలో యాజమానుల పట్ల నిబద్ధత, విధేయతతో పని చేసే ఈ యువకుల నుంచి తెలుగు యువకులు నేర్చుకోవల్సింది చాలా ఉంది.

గల్ఫ్ దేశాలలో కోట్లకు పడగలెత్తిన విదేశీ వాణిజ్యవేత్తలలో కేరళలోని మలబార్ ప్రాంతీయులు, యుద్ధ పీడిత యమన్‌లోని హద్రమౌత్ ప్రాంతీయులు అగ్రగాములు. రిటైల్ రంగంలో వీరి పాత్ర ప్రముఖం. ప్రస్తుతం తెలుగునాట మార్వాడీల జయప్రద వ్యాపార సరళి కూడ సరిగ్గా అదే. సుదీర్ఘ కాలంగా ప్రజాజీవితంలో ఉన్నప్పటికీ ఇంత వరకు మజ్లిస్ నాయకులు ఎవరూ కూడ తెలుగు భాషను నేర్చుకోలేదు. అయితే రాజస్థానీ వ్యాపారస్తులు, వారి గద్దీ గుమాస్తాలు అందరూ తెలుగు భాషను అనర్గళంగా మాట్లాడగలగడం విశేషం. గల్ఫ్‌లో మలయాళీల విజయం వెనుక అరబ్బీ భాషా కౌశలాలు ఉన్నట్లుగా తెలుగునాట రాజస్థానీలు ముందడుగు వేయడానికి వారు తెలుగు భాష నేర్చుకోవడం కూడా ఒక కారణమని చెప్పవచ్చు. మార్వాడీల వ్యాపార విస్తరణపై అసహనం వ్యక్తం చేసే వారు, ఆ వ్యాపార దక్షుల విజయ రహస్యాలను తెలుసుకోవడం మంచిది. ఒకప్పుడు తిరుపతిలోని చిన్న బజారు లేదా హైదరాబాద్‌లోని బేగం బజారు లేదా గుల్జార్ హౌజ్‌కు మాత్రమే పరిమితమైన మార్వాడీలు నేడు మదనపల్లె, జగిత్యాల తరహా పట్టణాలకు విస్తరిస్తున్నారు మరి. అసూయపడితే ఎవరికి నష్టం? స్థానికేతరులు అయిన మార్వాడీలు అలా ముందంజ వేయడానికి దోహదం చేస్తున్నవేమిటో ఆకళించుకోవాలి.

ఆర్థిక వ్యవస్థల ప్రపంచీకరణ ఫలితంగా మాతృభాషా సంస్కృతులు ఉపేక్షింపబడుతున్న ప్రస్తుత తరుణంలో మార్వాడీలు ఎక్కడ స్థిరపడినా తమ భాషా, సంస్కృతులను సంరక్షించుకుంటున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా మార్వాడీ మహిళలు పాటించే ఆధ్యాత్మిక చింతనా ప్రపత్తులు, సంప్రదాయాలు అందరికీ ఆదర్శప్రాయం కావాలి. వ్యాపార రంగంలో మార్వాడీలను విమర్శిస్తున్న వారు భవన నిర్మాణ రంగంలో ప్రబలుతోన్న ఉత్తరప్రదేశ్ వృత్తి నిపుణుల గురించి ఏమంటారు? రాజస్థానీ మార్వాడీల, లేదా కేరళ మలబారీల సాఫల్య బాటను అనుసరించి తెలుగు యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి, వీలయితే సృష్టించుకోవాలి. విదేశీ వలసలలో తెలుగువారు ఉపాధి రంగంలో రాణించినట్లుగా మార్వాడీలు వ్యాపారాన్ని ఎంచుకుని అందులో రాణిస్తున్నారు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

రెండు భారత్‌లు, రెండు మిత్రపక్షాలు



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో 2024–25 సంవత్సర వార్షిక బడ్జెట్ ప్రవేశ పెడుతూ ఆంధ్రప్రదేశ్, బిహార్ పేర్లను పదే పదే ప్రస్తావించినప్పుడు ఎంతో వీనుల విందుగా అనిపించింది. గత పది సంవత్సరాలుగా బడ్జెట్‌లో రాష్ట్రాల పేర్లను కేవలం ఆయా రాష్ట్రాల్లో ఎన్నికలు సమీపించినప్పుడే ప్రస్తావించడం జరిగింది. ఏ రాష్ట్రానికి వెళితే ఆ రాష్ట్రానికి తన మనసులో సమున్నత స్థానం ఉన్నదంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పేవారు. అయితే ఇప్పుడు అందుకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్, బిహార్‌ల గురించి ఆర్థికమంత్రి సభలో ప్రకటనలు చేస్తున్నప్పుడు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా బల్లలు చరిచి హర్షం ప్రకటిస్తున్న దృశ్యం అపురూపం అని చెప్పక తప్పదు. ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయడానికి కేంద్రమే ముందుకు వస్తుందని, విభజన చట్టం ప్రకారం తాము అందుకు కట్టుబడి ఉన్నామని నిర్మలా సీతారామన్ చెప్పారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు కనుక ఎంత ఖర్చయినా భరిస్తామని ఆమె చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని ఇంత కాలం లేకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేసిన ఆర్థికమంత్రి ప్రపంచ బ్యాంకు నుంచి రుణం తీసుకుని మరీ రాజధాని నిర్మాణానికి మద్దతునిస్తామని, రాష్ట్రం అందులో కొంత మొత్తం భరించలేకపోయినా, గ్రాంట్‌గా ఇచ్చే విషయంపై చర్చిస్తామని తెలిపారు. ఇక బిహార్‌కైతే విమానాశ్రయాలు, వైద్య కళాశాలలు, హైవేలు, వంతెనలు, విద్యుత్ ప్లాంట్లు, కారిడార్ల నిర్మాణానికి ఆమె భారీ మొత్తాన్ని ప్రకటించారు. నిర్మలా సీతారామన్ ఏపీ, బిహార్‌ల గురించి పదే పదే ప్రస్తావిస్తున్నప్పుడు సభలో తెలుగుదేశం, బిహార్ ఎంపీలు మాటిమాటికీ ఆనందాతిరేకంతో హర్షధ్వానాలు చేయడం కనిపించింది. నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాత ఏపీ, బిహార్ పట్ల ఆమె పక్షపాతం చూపించారని, ఇక ఈ రెండు రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందితే ఇతర రాష్ట్రాలు బిహార్, ఏపీలుగా మారిపోతాయని సోషల్ మీడియాలో పలు వ్యాఖ్యలు చెలరేగాయి.

దాదాపు పది సంవత్సరాల తర్వాత ఏపీ, బిహార్‌లకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించడం, ఆ రాష్ట్రాల అవసరాలను గుర్తించడం చెప్పుకోదగిన విషయమే. ఈ కాలంలో అమరావతి, ఆంధ్రప్రదేశ్, బిహార్ అన్న పదాలు ఢిల్లీలో వినపడేవి కావు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడి కొన్ని పార్టీల మద్దతుపై ఆధారపడవలసివస్తే ఏం జరుగుతుందో మంగళవారం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగాన్ని బట్టి అర్థమవుతుంది. 'ఇది కుర్చీని కాపాడుకునేందుకు ప్రవేశపెట్టిన బడ్జెట్' అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, రాజకీయ ఒత్తిళ్లతోనే ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ అన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్, బిహార్‌లకు కేంద్రం మద్దతు ప్రకటించడాన్ని వారెవరూ వ్యతిరేకించలేదు. పదేళ్ల క్రితం విభజనకు గురై తీవ్ర ఆర్థిక లోటుకు గురైన ఆంధ్రప్రదేశ్‌కు అత్యంత ముఖ్యమైన రాజధాని, పోలవరం నిర్మాణం ఎంత ముఖ్యమో అందరికీ తెలుసు. అదే విధంగా ఇవాళ కేంద్రం బిహార్‌కు ప్రకటించినన్ని ప్రాజెక్టులు గతంలోనే దశల వారీగా ప్రకటించి అమలు చేసినట్లయితే ఆ రాష్ట్రం రూపురేఖలు మారి ఉండేవని కూడా అందరికీ తెలుసు. ప్రతిపక్షాలు అన్నట్లు ఒకవేళ రాజకీయ ఒత్తిళ్లకు గురై మోదీ ప్రభుత్వం బిహార్, ఆంధ్రప్రదేశ్‌లకు పెద్ద ఎత్తున చేయూతనివ్వాలని అనుకున్నప్పటికీ అది మంచి పరిణామమే. ఈ రెండు రాష్ట్రాల్లో ఎన్డీఏ సాధించిన సీట్ల వల్లనే ఇవాళ కేంద్రంలో మెజారిటీ ప్రభుత్వం ఏర్పాటు కాగలిగిందన్నది సర్వ విదితం.

తమ మద్దతు ఆధారంగా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నితీశ్ కుమార్, చంద్రబాబు నాయుడు ఎంతో వ్యూహాత్మకంగా వ్యవహరించి తమ రాష్ట్రాలకు కావల్సిందేమిటో మోదీకి స్పష్టంగా చెప్పారని అర్థమవుతోంది. వారు కేంద్రంలో కేబినెట్ పదవులు కానీ, ఇతర రాజకీయ ప్రయోజనాలు కానీ ఆశించకుండా తమ రాష్ట్రాల నిర్దిష్ట సమస్యలను పరిష్కరించుకోవడం పైనే దృష్టి సారించారు. ఒక రకంగా కేంద్ర విధానాలపై ఈ ఇద్దరు నేతల ప్రభావం గణనీయంగా ఉందని ఈ బడ్జెట్ ద్వారా అర్థమవుతోంది. గత పది సంవత్సరాల్లో చూడని నరేంద్రమోదీని ఈ బడ్జెట్‌లో తమకు కనిపించారని, తన వైఖరికి భిన్నంగా పట్టువిడుపులు ప్రదర్శించి, నిధుల కేటాయింపు విషయంలో ఉదారంగా వ్యవహరించారని బీజేపీ నేత ఒకరు వ్యాఖ్యానించారు. ఇది కూడా ఒకరకంగా ఆహ్వానించదగిన విషయమే.

గతంలో సంకీర్ణ ప్రభుత్వాధినేతలు కూడా ఇలాంటి పట్టువిడుపులతో వ్యవహరించేవారు. పి.వి. నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు జార్ఖండ్ ముక్తి మోర్చాను సంతోష పెట్టేందుకు అటానమస్ హిల్ కౌన్సిల్‌ను ప్రకటించారు. అటల్ బిహారీ వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు, నితీశ్ కుమార్, మమతా బెనర్జీ తదితరులతో ఎంతో సత్సంబంధాలు ఏర్పర్చుకున్నారు. కోల్‌కతాలో మమతా బెనర్జీ నివాసానికి వెళ్లిన వాజపేయి ఆమె తల్లి గాయత్రీ బెనర్జీని చూసి పాదాలకు నమస్కరించిన దృశ్యం చరిత్రపుటల్లో నిలిచిపోయింది. 'చంద్రబాబునాయుడు ఎప్పుడు ఫోన్ చేసినా స్పందించండి. ఆయన తన రాష్ట్రం గురించే కాని తన స్వంత సమస్యల్ని ప్రస్తావించరు' అని వాజపేయి తనకు ఆదేశాలిచ్చారని అప్పుడు పీఎంఓలో ఓఎస్‌డీగా ఉన్న ఎన్‌కే సింగ్ ఒక సందర్భంలో చెప్పారు. సంకీర్ణ ధర్మాన్ని వాజపేయిలాగా ఎవరూ అద్భుతంగా నిర్వహించలేరని ఎన్‌కే సింగ్ చెప్పారు. తనతో విభేదించిన వారితో కూడా వాజపేయి మాట్లాడగలిగేవారని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఉద్భవించిన నేత కనుక ఆయన ఏకాభిప్రాయానికి విలువనిచ్చేవారని బీజేపీ నేత అరుణ్ జైట్లీ సైతం ప్రశంసించారు. ఒకప్పుడు పూర్తిగా అంటరాని పార్టీగా ఉన్న బీజేపీ, ఇతర పార్టీల్లో కూడా ఆమోద యోగ్యత సాధించేందుకు వాజపేయి ప్రధాన కారణమని ఆయన మరణానంతరం రచించిన ఒక వ్యాసంలో జైట్లీ తెలిపారు. సంకీర్ణ ప్రభుత్వమంటూ నిర్వహించిన తర్వాత కొన్ని పట్టువిడుపులు తప్పవని యూపీఏ ప్రభుత్వంలో ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్ సైతం అన్నారు.

సంకీర్ణ ధర్మం మూలంగా ఇవాళ ఏపీ, బిహార్‌లకు ఎంతో కొంత ఊరట కలిగించే నిర్ణయాలు కేంద్రం తీసుకుంటోంది కాని ఇవాళ ఒక రాష్ట్రానికి చేయూతనిచ్చేందుకు కేంద్రం ప్యాకేజీనివ్వాల్సిన అవసరం ఎందుకు ఏర్పడుతోంది? భారత దేశంలో అన్ని రాష్ట్రాలు, ప్రాంతాలు సమానంగా ఎందుకు అభివృద్ధి చెందడం లేదు? ఇవాళ మన దేశంలోనే రెండు భారత్‌లు ఎందుకు ఉన్నాయి? ప్రముఖ రచయిత ఛార్లెస్ డికెన్స్ తన 'రెండు మహానగరాలు' నవలలో అభివర్ణించినట్లు వైభవోజ్వలంగా వెలిగే ప్రాంతాలు, వల్లకాడుగా కనిపించే ప్రాంతాలు ఒకేసారి మనకు ఎందుకు కనిపిస్తున్నాయి? కేంద్ర బడ్జెట్‌లో నిర్మలా సీతారామన్ వర్గీకరించిన నాలుగు కులాల్లో పేదలు ఎప్పుడూ ఒక కులంగా ఎందుకు ఉండాల్సి వస్తోంది? ఆ పేదల్లో దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు ఎక్కువగా ఎందుకు ఉన్నారు? వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు ఇంకా ఎందుకు ప్రకటించాల్సి వస్తోంది? 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాల సరఫరా ఎందుకు చేయాల్సి వస్తోంది? వేల కోట్లు ఖర్చు పెట్టి కుమారుడి వివాహం చేసిన అంబానీ ఉన్న దేశంలోనే, పెళ్లికోసం అప్పుల పాలైన అభాగ్యులు, ఇంకా వరకట్న మరణాలకు గురయ్యే యువతులు ఎందుకు కనపడతారు? భారతదేశం ప్రపంచంలో ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కావచ్చు కాని మానవాభివృద్ధి సూచికల్లోనూ, ఆరోగ్య సంరక్షణలోనూ, విద్యారంగంలోనూ భారతదేశం ఎంతో వెనుకబడి ఉన్నది. భారతదేశంలో 90 శాతం అట్టడుగున ఉంటే పది శాతం కనివినీ ఎరుగని స్థాయిలో సంపన్నులయ్యారని, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలో ఉన్న జాతీయ పబ్లిక్ ఫైనాన్స్ పాలసీ సంస్థ డైరెక్టర్ రతిన్‌రాయ్ ఒక వ్యాసంలో రాశారు. ఇద్దరు సంపన్న భారతీయులు దేశ సంపదలో 1.4 శాతం హస్తగతం చేసుకుంటే ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం 60 శాతం జనాభా రోజుకు 3.10 డాలర్ల కంటే తక్కువ మొత్తంపై జీవిస్తున్నారనడంలో అవాస్తవం లేదు. చదువుకున్న ప్రతి కుటుంబంలోనూ ఒకరు విదేశాలకు పొట్ట కూటికోసం వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఫైవ్ స్టార్ హోటళ్లను మించిన ఆసుపత్రుల్లో లక్షలాది రూపాయలు వెచ్చించే సంపన్నులు ఒకవైపు, ఎయిమ్స్ వంటి ప్రభుత్వ ఆసుపత్రుల్లో సైతం ఓపీడీ కోసం పడిగాపులు కాచే కోట్లాది పేదలు మనకు కనపడతారు.

కేంద్ర బడ్జెట్‌కు ఒక రోజు ముందు ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే చదివిన వారికి భారతదేశంలో జరుగుతున్న అభివృద్ధి ఎంతో అద్భుతంగా కనిపిస్తుంది. భారతదేశంలో మౌలిక సదుపాయాలపై భారీ ఎత్తున పెట్టుబడులు పెడుతున్నారని, రేవులు, విమానాశ్రయాలు, రహదారులు, వంతెనల నిర్మాణం వేగంగా జరుగుతోందని, సిమెంట్, స్టీలు, బొగ్గు, ఫార్మస్యూటికల్స్, టెక్స్‌టైల్స్, ఎలెక్ట్రానిక్స్, ఆటోమోటివ్, ఆహారోత్పత్తులు, వినియోగ వస్తువుల రంగాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎకనమిక్ సర్వే తెలిపింది. రక్షణ రంగం ఎగుమతులు రూ. లక్ష కోట్లకు దాటిపోయాయని చెప్పుకుంది. అదే సమయంలో దేశంలో విపరీతంగా పెరిగిపోతున్న నిరుద్యోగ సమస్యకు ఆర్థిక సర్వేలో ఎలాంటి జవాబు లేదు. నిరుద్యోగాన్ని నివారించడం అధికంగా ప్రైవేట్ రంగ బాధ్యత అని సర్వే చేతులు దులుపుకుంది. ఇవాళ్టికీ శ్రమజీవుల్లో 80 శాతం మంది అసంఘటితరంగంలో చాలీ చాలని జీతాలతో దుర్భర జీవితం అనుభవిస్తున్నారనడంలో కూడా వాస్తవం లేకపోలేదు. అసమాన అభివృద్ధి, లోటు బడ్జెట్, అప్పులతో సతమతమవుతున్న రాష్ట్రాలు ఉన్నంతకాలం సంకీర్ణ ప్రభుత్వాల్లోనే ప్రజల సమస్యలు ఎంతో కొంత పరిష్కారమవుతాయన్న విషయంలో సందేహం లేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



> దాదాపు పది సంవత్సరాల తర్వాత ఏపీ, బిహార్‌లకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించడం, ఆ రాష్ట్రాల అవసరాలను గుర్తించడం చెప్పుకోదగిన విషయమే. ఈ కాలంలో అమరావతి, ఆంధ్రప్రదేశ్, బిహార్ అన్న పదాలు ఢిల్లీలో వినపడేవి కావు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడి కొన్ని పార్టీల మద్దతుపై ఆధారపడవలసివస్తే ఏం జరుగుతుందో నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగాన్ని బట్టి అర్థమవుతుంది. అసమాన అభివృద్ధి, లోటు బడ్జెట్, అప్పులతో సతమతమవుతున్న రాష్ట్రాలు ఉన్నంతకాలం సంకీర్ణ ప్రభుత్వాల్లోనే ప్రజల సమస్యలు ఎంతో కొంత పరిష్కారమవుతాయన్న విషయంలో సందేహం లేదు.

ఆచార్యుల నియామకాలకు సవాళ్ళు ఎన్నో...!

ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల పోస్టుల భర్తీ కోసం ఇటీవల రాష్ట్ర మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేష్ ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్ని జాతీయ ర్యాంకుల్లో ముందంజలో నిలిపేందుకు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఇటీవలే అన్ని విశ్వవిద్యాలయాలకు ఇన్‌చార్జి ఉపకులపతుల నియామకం జరిగింది. కూటమి ప్రభుత్వం ఉత్సాహంగా విశ్వవిద్యాలయాల తక్షణ ప్రక్షాళనకు నడుం బిగించడం పట్ల వర్సిటీ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

ప్రభుత్వ లక్ష్యాలన్నీ సక్రమంగా అమలు జరగాలంటే తొలి ప్రాధాన్యంగా విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల నియామకాలు జరగాలి. గత పదిహేనేళ్ళుగా విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల కొరత వేధిస్తోంది. తెలుగుదేశం ప్రభుత్వం 2017లో ప్రకటన విడుదల చేసి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించింది. అయితే కొంతమంది అభ్యర్థులు లేవనెత్తిన అభ్యంతరాలతో న్యాయస్థానాలు ఈ ప్రక్రియను నిలుపు చేశాయి. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం మొత్తంగా ఈ ప్రకటనను రద్దు చేసింది. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు కంటితుడుపు చర్యగా నియామకాల ప్రకటన విడుదల చేసింది. ఇది ఎన్నికల్లో లబ్ధి పొందే ప్రయత్నంగా ఉన్నత విద్యావంతులయిన నిరుద్యోగులు గమనించారు. అందుకే వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించారు. కూటమి ప్రభుత్వం వర్సిటీల నియామకాల్ని పారదర్శకంగా చేపడుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు.

గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్నతవిద్యా మండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి ఉన్నత విద్యారంగంలో చేసిన దురాగతాల్ని నిరుద్యోగులు తీవ్రంగా ఎండగట్టారు. విశ్వవిద్యాలయాల్లో చోటుచేసుకున్న అవినీతిని, నియామకాల్లో జరుగుతున్న అవకతవకలను పసిగట్టారు. ఇటువంటి ఆరోపణల మీదనే ఇప్పటికే ప్రభుత్వం ఆయన మీద విచారణకు ఆదేశించింది. తప్పులతడకలతో రూపొందించిన రిజర్వేషన్ రోస్టర్‌ను నిరుద్యోగులు న్యాయస్థానాల్లో సవాలు చేశారు. కొనసాగుతున్న రోస్టర్ విధానాన్ని పక్కనబెట్టి ఉద్యోగ ప్రకటన విడుదల చేయడంతో ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ఆశావహులు ప్రభుత్వం మీద పెద్ద పోరాటమే చేశారు. అనుసరించబోతున్న రోస్టర్ విధానం వివరాలు ముందుగా వెల్లడించకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలతో పాటు అందరూ ఆందోళనకు గురయ్యారు.

ఏపీ విశ్వవిద్యాలయాల చట్టం, యూజీసీ, ఏఐసీటీఈ మార్గదర్శకాల ప్రకారం ఉద్యోగాల భర్తీ ప్రకటన ఇవ్వడానికి ముందే రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా రోస్టర్ పాయింట్లు నిర్ణయించవలసి ఉంటుంది. అలా కాకుండా ఎటువంటి స్పష్టత లేకుండా రోస్టర్‌తో ప్రకటన విడుదల చేశారు. పైగా మూలిగే నక్క మీద తాడిపండు పడినట్టు సరైన ఉపాధిలేని యువత నుంచి ఉద్యోగాల ప్రకటన పేరు మీద కోట్లాది రూపాయల ఫీజులు వసూలు చేశారు. సామాజిక న్యాయానికి మా ప్రభుత్వమే గీటురాయి అని చెప్పుకున్న వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను నిలువు దోపిడి చేసింది. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో కొనసాగించిన జగన్ మోహన్ రెడ్డి అరాచక ముద్రను ఉన్నత విద్యామండలి మరింత బలంగా కొనసాగించింది.

రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల ఖాళీల భర్తీ విషయంలో కొన్ని విభాగాల విలీనం, విభాగాల హేతుబద్ధీకరణ పేరుతో బ్యాక్‌లాగ్ పోస్టులను గల్లంతు చేశారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలో మెటలర్జీ, మెటీరియల్ టెక్నాలజీశాఖలో ఒక బ్యాక్‌లాగ్ పోస్టు ఉండగా హేతుబద్ధీకరణలో ఈ విభాగాన్నే మూసేసి పోస్టును గల్లంతు చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆంత్రోపాలజీ, సోషియాలజీ, సోషల్ వర్క్ శాఖలకు కలిపి ఒక పోస్టు మాత్రమే ప్రకటన చేశారు. ఆచార్య నాగార్జునా విశ్వవిద్యాలయంలో తెలుగు, సంస్కృత విభాగాలను, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు, లింగ్విస్టిక్స్ విభాగాలను విలీనం చేశారు. మెరైన్ బయాలజీ విభాగంలో స్టాటిస్టిక్స్ పోస్టును సృష్టించారు. ఇలాంటి ఉదాహరణలు రాష్ట్రం మొత్తం మీద చాలా ఉన్నాయి.

అంతేగాక దూరవిద్యాకేంద్రాల్నీ ఒక విభాగంగా చూపించడంతో రోస్టర్ మారిపోయింది. దీంతో మొత్తం రిజర్వేషన్ పద్ధతే తారుమారు అయింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయు వంటి పెద్ద విశ్వవిద్యాలయాల్లో గతంలో వర్సిటీల పోస్టుల భర్తీకి ఆర్ట్స్, సైన్సు, ఇంజినీరింగ్, న్యాయ కళాశాలలను యూనిట్‌గా రిజర్వేషన్ రోస్టర్ అమలు చేశారు. జిల్లాల వారీగా వచ్చిన కొత్త విశ్వవిద్యాలయాల్లో యూనివర్శిటీని యూనిట్‌గా తీసుకొని ఉద్యోగాలు భర్తీ చేశారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం సవరించి తయారు చేసిన ఏపీ రాష్ట్ర విద్యాసంస్థల రిజర్వేషన్ టీచర్ల కేడర్ చట్టం–2021 ప్రకారం వర్సిటీల్లో అన్ని విభాగాలను ఒకే యూనిట్‌గా పరిగణించారు. భర్తీ యూనిట్ మారుతున్నందున 1978 జనవరి 2న సాధారణ పరిపాలన శాఖ ఇచ్చిన మొదటి ఉత్తర్వులో నిబంధన 22లో పేర్కొన్నట్టు రొటేషన్ రోస్టర్ పాయింట్లను 1975 అక్టోబరు 18 నుంచి మళ్లీ ఒకటి నుంచే ప్రారంభించాలి. ఇప్పటి వరకు జరిగిన అధ్యాపకుల నియామకాలకు ఒకటి నుంచి రోస్టర్ పాయింట్లు కేటాయించాలి. ఇక్కడ నుంచే కొత్త నియామకాలు జరగాలి. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులను ఆ రోస్టర్ పాయింట్లలో ఉంచిన తర్వాతే కొత్త నియామకాలు చేపట్టాలి. కాని గత ప్రభుత్వం ఈ విధానం పాటించకుండా కొత్త రోస్టర్ పాయింట్లు ప్రారంభించే దిశగా ప్రకటన విడుదల చేసింది.


ఇదే జరిగివుంటే ఇప్పటికే రిజర్వేషను అనుభవించిన వర్గాలకే మళ్లీ రిజర్వేషన్ వర్తిస్తుంది. రిజర్వేషన్ ఫలాలు అనుభవించవలసిన మిగతా సామాజిక వర్గాల అభ్యర్థులు పూర్తిగా నష్టపోతారు. ఈ విషయాన్ని గ్రహించిన కొందరు అభ్యర్థులు న్యాయపోరాటానికి నడుంబిగించారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో విశ్వవిద్యాలయాల్లోను, విశ్వవిద్యాలయాల నుంచి ఉన్నత విద్యామండలిలో అధికారులుగా పనిచేసిన వారి నుంచి సలహా తీసుకొని న్యాయస్థానాలను ఆశ్రయించారు. రోస్టర్ విధానాన్ని ముందుగా బహిర్గతం చేయాలని కోరారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు గురించి కేంద్రప్రభుత్వ అధికారిక మెమొరాండం 1997 ప్రకారం పాటించాలని యూజీసీ సూచించింది. దీని ప్రకారం ప్రస్తుతం ఉన్న ఖాళీల ఆధారిత రిజర్వేషన్ కాకుండా, పోస్టు ఆధారిత రిజర్వేషన్‌ను పాటించాలని గుర్తుచేసింది. ఇలా విశ్వవిద్యాలయాలు భర్తీ చేసిన కొత్త ఉద్యోగాలకు మొదటి ఐదేళ్ళ జీతాలకు ఒకేసారి ఏకమొత్తంగా నిధులు సమకూరుస్తుంది.

వైసీపీ ప్రభుత్వంలో ఉన్నతవిద్యా మంత్రిత్వ శాఖను నామమాత్రంగా మార్చేసి ఉన్నత విద్యామండలి ఆధిపత్యంలో పక్షపాతంగా చాలా నిర్ణయాలు జరిగాయి. వీటిలో ప్రధానంగా యూజీసీ మార్గదర్శకాల ప్రకారం అకడమిక్ పెర్ఫార్మెన్స్‌కు 80 శాతం మార్కులు, ఇంటర్వ్యూ, డెమో క్లాస్‌కి కలిపి 20 శాతం మార్కులు ఇచ్చి, నియామకాలు చేయాలి. కాని ఈ నియమాన్ని ఉల్లంఘించి, అకడమిక్ ప్రతిభ ఆధారిత మార్కులను పక్కన పెట్టి ఒక్క ఇంటర్వ్యూకే వంద మార్కులుగా నిర్ణయించి, ఎంపిక విధానాన్ని రూపొందించారు. ఈ పద్ధతి ఇప్పటివరకు వున్న యూజీసీ మార్గదర్శకాలకు పూర్తి విరుద్ధం. వీటన్నింటినీ సరిచేసి నియామకాలు చేపట్టవలసిన బాధ్యత ఇప్పుడు కూటమి ప్రభుత్వం మీద వుంది. విశ్వవిద్యాలయాల్లో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ప్రత్యేకశ్రద్ధ వహించాల్సిన అవసరం కూడా వుంది.

2014–19 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వివిధ విశ్వవిద్యాలయాల్లో బీసీ బ్యాక్‌లాగ్‌కు ప్రకటన విడుదల చేసి, ఎంపిక ప్రక్రియ జరిగింది. తర్వాత వైసీపీ ప్రభుత్వం వచ్చి ఫలితాలు విడుదల చేయకుండా రద్దు చేసింది. ఆ తర్వాత ప్రకటనలో ఈ మొత్తం పోస్టులు ఏమయ్యాయో అంతుచిక్కని ప్రశ్నగా మిగిలిపోయింది. ఖాళీ అయిన పోస్టులకు ఆ రిజర్వేషన్ రోస్టర్ పాయింట్‌నే భర్తీ చేయాలని 2023 జూన్ 12న యూజీసీ స్పష్టంగా చెప్పింది. వీటన్నింటినీ పక్కనపెట్టి రిక్రూట్‌మెంట్ 2023 ప్రకటన విడుదల చేశారు. అన్ని స్థాయిల్లో హేతుబద్ధతలేని ఈ ప్రకటనను న్యాయస్థానాలు తప్పుపట్టి నిలిపివేశాయి. చివరికి వైసీపీ ప్రభుత్వమే తాను ఇచ్చిన ప్రకటనలోనే దోషాలున్నాయని ఉన్నత న్యాయస్థానంలో అంగీకరించి మళ్లీ సవరణ చేసి ప్రకటన ఇస్తామని చెప్పింది. ఇన్ని అడ్డంకుల్లో చిక్కుకుపోయిన విశ్వవిద్యాలయాల నియామకాలు కూటమి ప్రభుత్వంలోనైనా పారదర్శకంగా జరుగుతాయని నిరుద్యోగులు, విద్యావేత్తలు ఆశిస్తున్నారు.

■ డాక్టర్ జీకేడీ ప్రసాద్


> యూజీసీ మార్గదర్శకాల ప్రకారం అకడమిక్ పెర్ఫార్మెన్స్‌కు 80 శాతం మార్కులు, ఇంటర్వ్యూ, డెమో క్లాస్‌కి కలిపి 20 శాతం మార్కులు ఇచ్చి, నియామకాలు చేయాలి. కాని ఈ నియమాన్ని ఉల్లంఘించి, అకడమిక్ ప్రతిభ ఆధారిత మార్కులను పక్కనపెట్టి ఒక్క ఇంటర్వ్యూకే వంద మార్కులుగా నిర్ణయించి, వైసీపీ ప్రభుత్వం ఎంపిక విధానాన్ని రూపొందించింది. ఈ పద్ధతి ఇప్పటివరకు వున్న యూజీసీ మార్గదర్శకాలకు పూర్తి విరుద్ధం. వీటన్నింటినీ సరిచేసి నియామకాలు చేపట్టవలసిన బాధ్యత ఇప్పుడు కూటమి ప్రభుత్వం మీద ఉంది.



ఆరోగ్య కార్డులు ఇవ్వాలి

మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య కార్డులను వైద్య సేవ ట్రస్ట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ రెగ్యులర్ టీచింగ్ సిబ్బందికి అందజేసేందుకు అవసరమైన సాంకేతిక ప్రక్రియ పూర్తి చేయాలని సిబ్బంది కోరుతున్నారు. జూలై 2024 జీతాలతో హెల్త్ స్కీమ్ సబ్‌స్క్రిప్షన్ మొదలుపెట్టి హెల్త్ కార్డులు జనరేట్ చేయాలి. అనేకమంది ఉపాధ్యాయులు, వారి కుటుంబాలు అత్యవసర ఆరోగ్య సంబంధిత అంశాలకు చికిత్స కోసం హెల్త్ కార్డులకై ఎదురుచూస్తున్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ స్కీమ్ పథకాన్ని కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అక్షరాస్యతా పరంగా వెనుకబడిన 164 మండలాల్లో మోడల్ స్కూల్స్ ఉన్నాయి. వీటిని ప్రతి మండలంలోనూ ప్రారంభించి అందరికీ సమానమైన విద్యా అవకాశాల్ని కల్పించాలి. మోడల్ స్కూల్ వ్యవస్థపైన, సిబ్బంది పట్ల నూతన ప్రభుత్వం తగు నిర్ణయాలు తీసుకొని వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– బి. సురేష్
మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచర్స్ కమిటీ



ఐదేళ్లుగా దిక్కూమొక్కూ లేకుండా.. అసంపూర్తి నిర్మాణాలతో చిల్లచెట్ల మధ్య కునారిల్లుతున్న అమరావతికి పూర్వవైభవం రానుంది. సీఎం చంద్రబాబు అభ్యర్థన మేరకు కేంద్ర బడ్జెట్‌లో రాజధానికి ఊతం అందింది. అమరావతి అభివృద్ధి కోసం రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయాన్ని బడ్జెట్ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రకటించారు. దీంతో అమరావతి పునర్నిర్మాణానికి అడుగులు పడ్డాయి. పునర్నిర్మాణానికి రూ.50వేల కోట్లకుపైగా అవసరం. అయితే ప్రస్తుత కేటాయింపులతో తొలి అడుగు పడినట్టే. కేంద్రం సహకారం ఇలాగే ఉంటే ప్రాధాన్యతా క్రమంలో అమరావతి అద్భుత రాజధానిగా రూపొందుతుంది.

కేంద్ర బడ్జెట్‌లో అమరావతికి భారీ కేటాయింపులు

అమరావతికి జోష్

ఎన్నాళ్లకెన్నాళ్లకో!



పదేళ్ల నిరీక్షణకు దక్కిన ఫలితం

- రాజధాని ప్రాంతవాసుల్లో వెల్లువెత్తిన హర్షం
- విశాఖ- చెన్నై పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి నిధులు
- గన్నవరం - కంకిపాడు, మచిలీపట్నం నోడ్‌లు ఇందులో భాగమే
- తాజా ప్రకటనతో ఈ ప్రాంత అభివృద్ధిపై ఆశలు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) ఈ బడ్జెట్ కాకపోతే వచ్చే బడ్జెట్.. ఈ ఏడాది కాకపోతే వచ్చే ఏడాది అంటూ ఎప్పటికప్పుడు కళ్లు కాయలుకాసేలా ఎదురుచూసిన రాజధాని ప్రాంతవాసుల సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. పదేళ్ల తర్వాత కేంద్ర ప్రభుత్వం ఆంధ్రుల రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయిస్తూ నిధుల వర్షం కురిపించింది. దీంతోపాటు విశాఖపట్నం - చెన్నై పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని ప్రకటించడం కూడా ఉమ్మడి కృష్ణాజిల్లా వాసులకు ఎంతో ప్రయోజనం. ఈ పారిశ్రామిక కారిడార్‌లో గన్నవరం-కంకిపాడు నోడ్, మచిలీపట్నం నోడ్ ఉన్నాయి. సుమారు 800 కిలోమీటర్ల మేర సాగే ఈ కారిడార్ ఈస్ట్‌కోస్ట్ ఎకనామిక్ కారిడార్‌లో భాగం. ఈ ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఎక్కువ లబ్ధి పొందే ప్రాంతాల్లో గన్నవరం- కంకిపాడు, మచిలీపట్నం ఉన్నాయి. కేంద్రం ప్రకటించినట్టు ఈ ఇండస్ట్రియల్ కారిడార్‌కు ఊతమిస్తే ఈ ప్రాంతాల్లో అభివృద్ధి పరుగులు తీస్తుంది. ఇప్పటికే మచిలీపట్నం పోర్టు నిర్మాణం సాగుతోంది. దీంతోపాటు బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటుకు సంబంధించిన సాధ్యాసాధ్యాల నివేదిక తయారీ శరవేగంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌పై కేంద్రం ప్రకటన ఈ ప్రాంతవాసుల్లో మరిన్ని ఆశలు రేకెత్తిస్తోంది.

చంద్రబాబు సమర్థతకు నిదర్శనం

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అత్యధికంగా నిధులు కేటాయింపు చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమర్థతకు నిదర్శనం. కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కేంద్రం నుంచి భారీగా నిధులను రాబట్టగలిగింది. భవిష్యత్‌లో కూడా కేంద్రం నుంచి ఇటువంటి సహకారం అందాలి. కేంద్రప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కృతజ్ఞతలు.

- గద్దె రామ్మోహన్, ఎమ్మెల్యే, విజయవాడ తూర్పు





రాజధాని పనులు ఇక పరుగులు

ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రధాన మంత్రి నిలబెట్టుకున్నారు. గత ఐదేళ్ల కేంద్ర బడ్జెట్‌లో ఏపీపై ఇంత ఎక్కువగా ఎన్నడూ మాట్లాడలేదు. సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలు ఫలించాయి. రాష్ట్ర విభజన తర్వాత గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కేంద్ర సాయంతో పుంజుకుంటుంది. ప్రపంచస్థాయిలో నిర్మించాలనుకునే అమరావతి రాజధాని నిర్మాణం దిశగా అడుగులు పడటానికి కేంద్ర బడ్జెట్ ఉపకరిస్తుంది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కేంద్ర పథకాలు ఊతమిస్తాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో కేంద్రం మరోసారి స్పష్టంగా హామీ ఇచ్చింది. విభజన చట్టం ప్రకారం పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక సహకారం అందిస్తానని చెప్పటంతో రాష్ట్రంలో పారిశ్రామిక రంగం పరుగులు పెడుతుంది.

- కేశినేని శివనాథ్ (చిన్ని), విజయవాడ ఎంపీ



అభివృద్ధికి సూచిక ఈ బడ్జెట్

కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అభివృద్ధికి సూచికగా ఉంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ వల్లే కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రముఖ స్థానం దక్కింది. కేంద్ర ప్రభుత్వం ఏపీ పునర్విభజన చట్టానికి కట్టుబడి ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధి కోసం రూ.15వేల కోట్లు కేటాయించడమే కాకుండా అవసరాన్ని బట్టి భవిష్యత్తులో మరిన్ని అదనపు నిధులు ఇస్తామని చెప్పడం శుభపరిణామం. పోలవరం ప్రాజెక్టుకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తామని చెప్పడం చాలా మంచి పరిణామం. హైదరాబాద్ - బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి నిధులు, పూర్వోదయ పథకం ద్వారా ఏపీకి ప్రత్యేక ప్రాజెక్టులు, విశాఖ - చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని నోడ్‌లకు ప్రత్యేక సాయం ప్రకటించడం ద్వారా రాష్ట్రానికి ఎంతో ప్రయోజనం కలిగించారన్నారు.

- బాలశౌరి, మచిలీపట్నం ఎంపీ

పునర్నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో ఊతం



బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం ప్రకటన

- అమరావతి ప్రాజెక్టులన్నింటికీ రూ.51 వేల కోట్లు కావాలి
- కేంద్రం నుంచి ఇదే సహకారం మున్ముందూ కావాలి
- తక్షణ సాయంతో ప్రాధాన్యతా పనులు చేపట్టేందుకు అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ హయాంలో ఐదేళ్ల నిండు నిర్లక్ష్యం కారణంగా అమరావతి పిచ్చిచెట్లు, కంపచెట్లతో వనంగా మారిపోయింది. ఈ వనాన్ని తొలగించటానికి కూటమి ప్రభుత్వానికి నెల రోజులకుపైగా సమయం పట్టే అవకాశం ఉంది. ఈ ముళ్లకంపను తొలగించటానికి టెండర్లు పిలవటం ద్వారా సీఆర్‌డీఏ అధికారులు రాజధానిలో పనులకు శ్రీకారం చుట్టారు. ఒక పక్క రాష్ట్ర ఆర్థికంగా సమస్యలను ఎదుర్కొంటున్న తరుణంలో అమరావతి రాజధాని పనులను ఏ విధంగా ముందుకు తీసుకు వెళ్లాలి? ప్రాధాన్యతలు ఏమిటి? అన్నదానిపై ప్రభుత్వం ఆలోచనలు చేస్తోంది. సీఆర్‌డీఏ అధికారులు కూడా అధ్యయనం చేస్తున్నారు.

చేపట్టాల్సిన పనులు అనేకం

రాజధానిలో టీడీపీ ప్రభుత్వ హయాంలో తలపెట్టిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవనాలతో పాటు ఎన్‌జీవో భవనాలు 80 శాతంపైగా పురోగతిలో ఉన్నాయి. వీటితో పాటు ప్రభుత్వ టైప్-1, టైప్-2 భవనాలతో పాటు ప్రధాన కార్యదర్శుల భవనాలు, జడ్జీల భవనాలను పూర్తి చేయాల్సి ఉంది. శాశ్వత సచివాలయంగా తలపెట్టిన ఐదు బిగ్ టవర్లు నేడు నీటిలో నానుతున్నాయి. వీటి సామర్థ్యాన్ని పరీక్షించటంతో పాటు వీటి పునర్నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. ఇవి కాకుండా అత్యంత ప్రధానమైన ట్రంక్ ఇన్‌ఫ్రా, ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా పనులు ముందుకు తీసుకువెళ్లాల్సి ఉంది. అమరావతి మాస్టర్ ప్లాన్ ప్రకారం చేపట్టాల్సిన మౌలిక సదుపాయాలు, ముందుకు తీసుకువెళ్లాల్సిన ప్రాజెక్టులు అదనంగా ఉన్నాయి. ఇవన్నీ చేపట్టడానికి ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆర్థిక సమస్యలు ఇబ్బంది పెడుతున్నాయి.

పనుల ప్రాధాన్యతలేమిటి?

తక్షణం చేపట్టాల్సిన పనులు, అమరావతి రాజధానికి ఒక లుక్ తీసుకువచ్చే పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలన్న నిర్ణయాత్మకమైన అడుగులు వేస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని మన్నించి కేంద్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయాన్ని అమరావతి రాజధాని కోసం ప్రకటించడంతో చాలా పెద్ద ఊరట లభించినట్టు అయింది. ఈ ఆర్థిక సాయంతో అమరావతి రాజధాని పనులకు సంబంధించి వేగంగా పనులు చేపట్టడానికి అవకాశం ఉంది. అమరావతి క్యాపిటల్ సిటీ ఏరియా 217.23 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు అవకాశం ఏర్పడుతోంది.

ఏ ప్రాజెక్టుకు ఎంత కావాలంటే..

అమరావతి రాజధానిలో తలపెట్టిన ప్రాజెక్టులన్నీ కలిపితే రూ.51,687 కోట్ల ఖర్చు అవుతుంది.

- టైర్ - 1 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కేటగిరిలో సిటీ లెవల్ రోడ్లు, ఇతర అవసరాలు, గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు వంటి వాటి కోసం రూ.19,769 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది.
- టైర్ - 2 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో భాగంగా రాజధాని చివరి ప్రాంతం వరకు మౌలిక సదుపాయాలు, ఎల్‌పీఎస్ లే అవుట్ల అభివృద్ధికి రూ.17,910 కోట్లు కావాల్సి ఉంది.
- అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ ఇతర అనుసంధాన పనులకు సంబంధించి రూ.14,008 కోట్లు కావాల్సి ఉంది.
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అమరావతి రాజధాని నిర్మాణ పనులు తలపెట్టేందుకు హడ్కో, షెడ్యూల్డ్ బ్యాంకుల దగ్గర రుణాల ద్వారా రూ.5,106.59 కోట్లను సమీకరించింది. వీటితో పాటు ఏపీసీఆర్‌డీఏ బాండ్స్ పేరిట రూ.2 వేల కోట్లను సమీకరించింది. మొత్తంగా అమరావతి రాజధానిలో భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయల పరంగా 17 ప్రాజెక్టులను రూ.9,617.21 కోట్ల వ్యయంతో శ్రీకారం చుట్టారు. ఇవన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. వీటిని ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాల్సి ఉంది.

అమరావతి రైల్వేలైన్‌పై ఆశలు..

- పింక్ బుక్‌లోనే స్పష్టత



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధాని అభివృద్ధికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సహాయం ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం అమరావతి రైల్వేలైన్‌కు కూడా పచ్చజెండా ఊపుతుందన్న ఆశలు నెలకొన్నాయి. కేంద్ర బడ్జెట్‌లో రైల్వే కేటాయింపులు కూడా ఉన్నాయి. ఈ రైల్వే కేటాయింపులు ఏవిటన్నది పింక్ బుక్ వస్తే తప్ప తెలియదు. రైల్వే బోర్డు ఈ పింక్‌బుక్‌ను విడుదల చేస్తుంది. జోన్ల వారీగా, డివిజన్ల వారీగా కేటాయింపుల వివరాలు ఆ తర్వాత తెలుస్తాయి. బుధ, గురువారాల్లో ఈ వివరాలు తెలిసే అవకాశం ఉంది. అమరావతి రైల్వేలైన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల కిందట గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదన మేరకు బడ్జెట్‌లో పెట్టింది. 2016 - 17 ఆర్థిక సంవత్సరంలో అమరావతి నూతన రైల్వేలైన్‌కు సర్వే చేయించింది. ఆ తర్వాత బడ్జెట్ అంటే 2017 - 18 ఆర్థిక సంవత్సరంలో రూ.2800 కోట్ల వ్యయంతో అమరావతికి సింగిల్ లైన్ ప్రాజెక్టును ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి చూస్తే అమరావతి నూతన రైల్వే మార్గంతో పాటు మరో మూడు మార్గాలను చూపించింది. ప్రధానంగా అమరావతి రైల్వే లైను ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు 28 కిలోమీటర్ల సింగిల్‌లైన్‌ను ప్రతిపాదించారు. దీనికి అనుసంధానంగా అమరావతి నుంచి పెదకూరపాడు వరకు 25 కిలోమీటర్ల వరకు, సత్తెనపల్లి నుంచి నరసరావుపేట 25 కిలోమీటర్ల మేర, కృష్ణానదిపై 3 కిలోమీటర్ల మేర బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. ఆఖరికి రైల్వే ఈ ప్రాజెక్టును తన ప్రాధాన్యతల జాబితా నుంచి తొలగించే పరిస్థితి వరకు వచ్చింది. ఈ క్రమంలో మళ్లీ టీడీపీ అధికారంలోకి రావటంతో అమరావతి రైల్వేలైన్‌ను ఎంపీలు కేంద్రం దృష్టికి తీసుకువచ్చారు. కేంద్రం కూడా ఈ అంశంపై దృష్టి సారించింది. దీంతో ఈ బడ్జెట్‌లో తప్పనిసరిగా కేటాయింపులు ఉంటాయని భావిస్తున్నారు. పింక్ బుక్ వస్తే కానీ స్పష్టత రాదు.

ఎంపీడీవో అదృశ్యం విషాదాంతం

- ఏలూరు కాల్వలో మృతదేహం లభ్యం

నరసాపురం రూరల్, జూలై 23 : ఎంపీడీవో వెంకటరమణారావు అదృశ్య ఘటన విషాదాంతమైంది. ఆయన మృతదేహం విజయవాడలోని ఏలూరు కాల్వలో లభ్యమైంది. మంగళవారం ఈ సమాచారం తీర ప్రాంత వాసుల్ని కలిచివేసింది. వారం రోజులుగా ఆయన ఆచూకీ కోసం అధికారులు వెతకని చోటులేదు. అయితే ఆయన ఆత్మహత్యకు పాల్పడటంతో అంతా డీలాపడ్డారు. పట్టణ, మండలంలో ఎక్కడ చూసినా... ఆయన ఆత్మహత్యపైనే చర్చ సాగింది. ఎన్నికల సమయంలో వచ్చిన వెంకటరమణ ఇక్కడ పని చేసింది కేవలం ఐదు నెలలు మాత్రమే. అయినప్పటికీ ఆయన మంచితనంలో అందరికి దగ్గరయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ, సచివాలయ సిబ్బందితోపాటు మండల పరిషత్ ఉద్యోగులతో కలివిడిగా ఉంటూ అందరికి దగ్గరయ్యారు. మరో ఆరు నెలల్లో ఆయన పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కోడ్ తర్వాత సొంత జిల్లా కృష్ణాకు వెళ్లిపోతానని చెబుతుండేవారు. అయితే ఆయన సెలవుపై వెళ్లి ఆత్మహత్య చేసుకోవడం అందరినీ కలిచివేసింది.

రెండు నెలలు మానసిక ఒత్తిడి

చివరి రెండు నెలల్లో ఆయన ఎంతో మానసిక ఒత్తిడికి గురయ్యారని మండల పరిషత్ సిబ్బంది చెప్పారు. రేవు నిర్వహణదారుడు రోజువారి సొమ్మును చెల్లించకపోవడంతో ఆయన ఎక్కువగా టెన్షన్ పడేవారు. ఎప్పుడు ఫోన్ చేసినా... నిర్వహణదారుడు సమాధానం ఇచ్చేవాడు కాదు. రెండు, మూడుసార్లు ఆయన ఇంటికి వెళ్లి ఎంపీడీవో బాకీ కట్టాలని వేడుకున్నారు. పలుమార్లు నోటీసులు ఇచ్చారు. జేపీసీ కమిటీ సమక్షంలో ఫోన్‌లు చేశారు. ప్రతిసారి ఇదిగో.. అదిగో అంటూ దాట వేశాడే తప్ప నిర్వహణదారుడు ధవేచీ బకాయి రూ.54 లక్షలు చెల్లించలేదు. దీంతో మానసిక ఒత్తిడికి గురై ఆయన సెలవుపై వెళ్లారని మండల పరిషత్ ఉద్యోగులు వాపోతున్నారు.



ఎంపీడీవో వెంకటరమణారావు మృతదేశం వద్ద విలపిస్తున్న ఆయన కుమారుడు

చర్యలు తీసుకోవాలి.. మాజీ ఎమ్మెల్యే బండారు

ఎంపీడీవో మృతికి కారకులైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు డిమాండ్ చేశారు. రేవు నిర్వహణదారుడు ధేవేచీ, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజులు ఆయన్ను తీవ్ర మానసిక ఒత్తిడికి గురి చేశారని, ఈ కారణంగానే ఎంపీడీవో ఆత్మహత్యకు పాల్పడ్డారని బండారు ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు రాసిన లేఖలో కూడా ఈ అంశాన్ని ప్రస్తావిస్తారన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఈ కేసును అన్ని కోణాల్లో విచారిస్తుందన్నారు. ఆయన మృతికి కారకులైన వార్ని ఎట్టిపరిస్థితుల్లో విడిచిపెట్టబోమన్నారు.



పోలంపల్లి ఆనకట్ట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మునేరు

మునేరుకు వరద

ఎగువన కురుస్తున్న వర్షాలకు మునేరుకు వరద పోటెత్తుతోంది. పోలంపల్లి ఆనకట్ట వద్ద 8 అడుగుల నీరు చేరింది. వరద క్రమంగా పెరుగుతుందని మరో నాలుగు అడుగులు ఆనకట్ట వద్ద పెరిగితే లింగాల కాజ్‌వేపైకి నీరు చేరే అవకాశం ఉందని ఏఈ రామనరసింహ తెలిపారు. ఆనకట్ట వద్ద ఇన్‌ఫ్లో 2,402 క్యూసెక్యులు... అవుట్ ఫ్లో 2,090 క్యూసెక్యులు ఉందని పేర్కొన్నారు.

- వత్సవాయి

సమగ్రాభివృద్ధికి కృషి చేస్తా

- నూతన జేసీ నిధి మీనా



6లో..



కేంద్ర బడ్జెట్‌పై.. సర్వత్రా హర్షం

కేంద్రానికి కృతజ్ఞతలు : నెట్టెం రఘురాం



జగ్గయ్యపేట, జూలై 23 : ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతి, జీవనాడి పోలవరం ప్రాజెక్టుల పూర్తి కోసం సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. గత ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అమరావతి రాజధానిని చేసిన విధ్వంసం నుంచి త్వరగా కోలుకునేందుకు కేంద్రం ఇచ్చే సహకారం మంచి లేపనంగా పనిచేస్తుంది.

ఏపీకి ప్రాధాన్యంతో దశ తిరుగుతుంది : శ్రీరాం తాతయ్య



ఏపీ ప్రజల అభీష్టాన్ని గుర్తించి కేంద్రం బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వటం హర్షణీయం. సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలకు కేంద్ర సహకారం ఊతమిచ్చేలా ఉంది. ప్రధాని మోదికి తెలుగు ప్రజలు అందరి తరఫున కృతజ్ఞతలు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలు పుంజుకుంటాయి : వర్ల కుమార్‌రాజా



పామర్రు : బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేకసాయం ప్రకటించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలు పుంజుకోవడంతోపాటు, స్వర్ణాంధ్ర సాధనకు ఎంతగానో ఉపకరిస్తుంది. అమరావతికి నిధులివ్వడంతో రాజధాని పనులు వేగవంతం చేయవచ్చు. ఆంధ్రుల జీవనాడి పోలవరం విషయంలో కేంద్రం స్పష్టమైన హామీ ఇవ్వడం శుభపరిణామం. ఆర్థిక సాయం అందించడం వల్ల పారిశ్రామికాభివృద్ధి సాధ్యపడుతుంది.

శరవేగంగా రాష్ట్ర అభివృద్ధి : సౌమ్య



నందిగామ : కూటమి పాలనలో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందడం ఖాయం. అమరావతి నిర్మాణానికి కేంద్రం సాయం హర్షణీయం. చంద్రబాబు, మోదీ, పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో రాష్ట్రం ముందడుగు వేస్తుంది. కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. రానున్న ఐదేళ్లల్లో రాష్ట్ర రూపు రేఖలు మారిపోనున్నాయి.

అమరావతికి నిధులు ముదావహం : కొనకళ్ల



మచిలీపట్నం టౌన్ : కేంద్ర బడ్జెట్‌లో అమరావతికి రూ. 15 వేల కోట్లు కేటాయించడం ముదావహం. అమరావతి అభివృద్ధి చెందితే కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. మచిలీపట్నానికి మహర్దశ వస్తుంది. రాష్ట్ర ప్రజల ఆశలు నెరవేరతాయి.

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం వరాల జల్లు : వేదవ్యాస్



రాజధాని అమరావతికి కేంద్రం రూ. 15వేల కోట్లు కేటాయించి వరాల జల్లు కురిపించింది. తెలుగు ప్రజల గుండెచప్పుడు పోలవరం ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడం ముదావహం. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం కూటమి విజయం.

కూటమి విజయం : బండి రామకృష్ణ

ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో తగిన విధంగా నిధులు కేటాయించడం కూటమి విజయానికి నిదర్శనం. వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేశారు. మహిళలకు, యువతకు కేంద్ర బడ్జెట్ ఎంతో అనుకూలంగా ఉంది. ఉద్యోగులతో సహా అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేతన జీవులను నిరాశపర్చిన బడ్జెట్ : యూటీఎఫ్

గవర్నర్‌పేట : పాత పన్నుల విధానంలో ఎలాంటి మార్పు చేయకుండా, కొత్త పన్నుల విధానంలో మాత్రమే మార్పులు చేయడం వల్ల వేతన జీవులకు ఎలాంటి ఊరట కలగలేదని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్‌లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీపీఎస్ విధానంలో మార్పులు తెస్తామని చెబుతూనే పాత పెన్షన్ విధానంపై మాట్లాడకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరాశకు గురిచేసిందన్నారు. ప్రభుత్వం తక్షణం పాత పెన్షన్ పునరుద్ధరించే దానిపై ఒక స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని తెలిపారు. పన్నుల స్లాబ్ విధానాన్ని సవరించాలని, కనీసం రూ.లక్ష స్టాండర్డ్ డిడెక్షన్‌గా మినహాయింపులు ఉండాలని కోరారు.

బడ్జెట్‌లో ఏపీకి జరిగిన మేలు శూన్యం

గవర్నర్‌పేట : కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీవ్ర నిరాశ మిగిల్చిందని, మాటలు ఘనంగా ఉన్నాయని, చేతల్లో ఏపీకి చేసింది శూన్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పుడైనా ఏపీకి న్యాయం జరుగుతుందని, భారీగా నిధులు వస్తాయని, విభజన చట్టంలోని అన్ని అంశాల అమలుకు నిధులు కేటాయిస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి అనేక సార్లు ఏపీ పేరు ప్రస్తావించారని, నిధులు కేటాయింపు నిరాశ కలిగించిందని తెలిపారు. రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు పలు ఆర్థిక సంస్థల ద్వారా ఇప్పిస్తామని చెప్పడం వల్ల ప్రయోజనం లేదని, రూ.15 వేల కోట్లు గ్రాంటుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి

ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, జూలై 23 : రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌నిధులు దారి మళ్లించి ఐదేళ్ల పాలన సాగించిన వైసీపీ పాలకులను ప్రజాస్వామ్యంలో చరిత్రహీనులుగా, దళిత ద్రోహులుగా ప్రజలు ఎన్నికల్లో తీర్పునిచ్చారని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. మంగళవారం అసెంబ్లీ సమావేశంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల దారిమళ్లింపుపై అసెంబ్లీలో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలకు నిధులు మళ్లించి వాటిని సబ్‌ప్లాన్ ఖర్చుల్లో చూపించే హక్కు జగన్‌కు ఎక్కడిదని కుమార్‌రాజా ప్రశ్నించారు. లండన్‌లో ఉన్న కుటుంబసభ్యుల్ని చూసివచ్చేందుకు రూ.43 కోట్ల ప్రజాధనం వెచ్చించడంలో ఉన్న శ్రద్ధ దళిత బిడ్డల విద్యోన్నతికి చూపకపోవడం ఆక్షేపణీయమన్నారు. ప్రజలు స్వేచ్ఛగా మెలగే విధంగా నేడు టీడీపీ పాలన ఉంటుందన్నారు.

నేడు టెన్త్ గణిత ఉపాధ్యాయులకు శిక్షణ

వన్‌టౌన్, జూలై 23 : ఎన్టీఆర్ జిల్లాలోని పదోతరగతి గణిత ఉపాధ్యాయులు ఆన్‌డ్యూటీపై గణిత పాఠ్యాంశాలలో బుధవారం జరిగే శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలని జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతికి సంబంధించి సీబీఎస్ఈ విధానాన్ని అనుసరిస్తూ పాఠ్యపుస్తకాలు కొత్తవి రావడంతో 2024-2025కు పరీక్షలకుగాను ప్రశ్నాపత్రాలను రూపొందించడం వంటి వాటిపై బుధవారం ఏపీ గణిత ఫోరం, ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డీఈవో తెలిపారు. భవానీపురం బైపాస్‌రోడ్డులోని శ్రీరస్తుపంక్షన్ హాలులో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే శిక్షణ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయా ఉన్నత పాఠశాలల యాజమాన్యాలు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ వద్ద పనిచేసే పదోతరగతి గణిత ఉపాధ్యాయులకు ఆన్‌డ్యూటీగా పరిగణించాలని సూచించారు. వివరాలకు 8801133933 ఫోన్ చేయాలన్నారు.

27న ఉమ్మడి కృష్ణా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు

విజయవాడస్పోర్ట్సు, జూలై 23 : ఉమ్మడి కృష్ణా జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27న గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ క్రీడామైదానంలో సీనియర్ పురుషుల, మహిళా, జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్టు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గమిడి సాంబశివరావు, గరికపాటి మారుతిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ బాలబాలికలు 2007 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారులు సీనియర్ విభాగంలో గుంటూరు జిల్లా వినుకొండలో ఆగస్టు 10 నుంచి 12 వరకు, జూనియర్ విభాగంలో శ్రీకాకుళం జిల్లాలో ఆగస్టు 17 నుంచి 19 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో బరిలో దిగుతారన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆ రోజున ఒరిజినల్ అర్హతా పత్రాలతో రావాలన్నారు. వివరాలకు 9848850769, 9666397717 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

26న బీచ్ కబడ్డీ ఉమ్మడి కృష్ణా జిల్లా జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు : కృష్ణా జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న మధ్యాహ్నం 2 గంటలకు గూడూరు మండలం మల్లవోలు జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో బీచ్ కబడ్డీ ఉమ్మడి కృష్ణాజిల్లా పురుషుల, మహిళల జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్టు జిల్లా సంఘ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్‌కార్డుతో రావాలని, మహిళలు బరువు 75 కేజీల్లోపు, పురుషులు 85 కేజీల్లోపు ఉండాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు నెల్లూరులో జరిగే 11వ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు 970406355, 7981813244 నెంబర్లలో సంప్రదించాలన్నారు.



యోగాసనాలువేస్తున్న కలెక్టర్ బాలాజీ, అధికారులు

ఆరోగ్య యోగం

అధికారులు, ఉద్యోగులకు యోగ శిక్షణ

ప్రారంభించిన్న కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్ , జూలై 23 : సంపూర్ణ ఆరోగ్యానికి యోగ సాధన ఎంతో దోహద పడుతుందని, ఉద్యోగులు ప్రతిఒక్కరూ యోగ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో కలెక్టరు జిల్లా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత యోగ శిక్షణా తరగతులు ప్రారంభించారు. కలెక్టరు జ్యోతి ప్రకాశనం చేసి శిక్షణా తరగతులు ప్రారంభించారు. అనంతరం స్వయంగా యోగసాధన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణం కలుషితమవుతోందని, ఇందుకు తగిన విధంగా జీవనశైలిలో మార్పులు వస్తున్నాయన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అందరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉద్యోగులు ఎన్నో ఒత్తిళ్లకు గురవుతారని, యోగాభ్యాసనం వల్ల మానసిక ప్రశాంతత లభించి పనులు చేసుకోగలుగుతారన్నారు. ఏపనైనా 21 రోజులు చేస్తే అలవాటుగా మారిపోతుందన్నారు. యోగా గురువులు మద్దాల చింతయ్య, శీలం రమేశ్, రేఖలు ఉద్యోగులకు ఆసనాలు, కపాలభాతి, నాడీశోధన వంటి ప్రాణాయామాలు, ధ్యానంపై శిక్షణా తరతులు నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, విద్యుత్ శాఖ ఈఈ భాస్కరరావు, సమాచార పౌరసంబంధాల శాఖ డీడీ వెంకటేశ్వరప్రసాద్, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య, క్రీడల చీఫ్ కోచ్ ఝాన్సీ, ఆర్డీ ప్రసాద్, బీకే మల్లిఖార్జునుడు, శ్యామ్, నారాయణ, గౌతం తదితరులు పాల్గొన్నారు.

పోర్టు పనులు వేగవంతం చేయండి

కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పోర్టు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని విసీ సమావేశపుహాలులో మంగళవారం పోర్ట్, ఏపీ మేరీటైమ్‌బోర్డ్, రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్టు పనులు జరుగుతున్న తీరుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోర్టు వరకు రోడ్‌కంరైలు మార్గాలకు భూసేకరణ, రైతులకు పరిహారం చెల్లింపు, భూసేకరణకు నోటిఫికేషన్‌ల జారీ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. భూసేకరణలో, రైతులకు పరిహారం చెల్లింపులో న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, పోర్టు ఎండీ ప్రతాప్‌రెడ్డి, ఏపీమేరీటైమ్‌బోర్డు డెప్యూటీ కలెక్టర్ వెంకట్రావు, మెరైన్ విభాగం డీఈ శివయ్య, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, రైట్స్ సంస్థ ప్రతినిధులు విశ్వనాథన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ఇంటిపన్నులపై దృష్టిసారించాలి

జిల్లాలోని పంచాయతీలు, పురపాలకసంఘాలలో నూతనంగా నిర్మాణం చేసిన గృహాలకు ఇంటిపన్నుల అంశంపై దృష్టిసారించాలని కలెక్టర్ బాలాజీ అధికారులకు సూచించారు. మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో మంగళవారం ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. జిల్లాలో నూతనంగా నిర్మాణం చేసిన గృహాలకు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, అపార్ట్‌మెంట్లకు టాక్స్‌అసెస్‌మెంట్ ప్రకియను బుధవారం నుంచి జిల్లాలో ప్రారంభించి వారంరోజుల్లో పూర్తిచేయాలన్నారు. ఇంటిపన్నులు సక్రమంగా వసూలైతేనే స్థానిక సంస్థలకు ఆదాయం సమకూరుతుందన్నారు. నూతన భవనాలకు ఇంటిపన్ను విధింపు సక్రమంగా ఉందా లేదా అనే అంశాలను పరిశీలన చేయాలన్నారు. ఇంటిపన్నుల విధింపులో సక్రమంగా పనిచేసిన వారిని గుర్తించివారికి ప్రశంసాపత్రాలను అందజేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీపీవో నాగేశ్వరనాయక్ పాల్గొన్నారు.



జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తా

నూతన జేసీ నిధి మీనా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎంతో చారిత్రక, సాంస్కృతిక నేపథ్యం కలిగిన ఎన్టీఆర్ జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా రావటం ఆనందంగా ఉందని, కలెక్టర్ నేతృత్వంలో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని ఎన్టీఆర్ జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ నిధి మీనా అన్నారు. మంగళవారం నూతన జేసీగా ఆమె క్యాంపు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నిధి మీనా మీడియాతో మాట్లాడారు. ఎంతో కీలకమైన ఎన్టీఆర్ జిల్లాలో విధులు నిర్వర్తించే అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. జిల్లా అధికార యంత్రాంగంతో పటిష్ట సమన్వయంతో పనిచేసి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల అమలులో జిల్లాను ముందు వరసలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. నిధి మీనా 2019 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి. గతంలో ఆమె తెనాలి సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. ఆ తర్వాత మధ్యాహ్న భోజనం, పాఠశాలల శానిటేషన్ డైరెకర్టర్‌గా, వయోజన విద్య డైరెక్టర్‌గా పనిచేశారు. నూతన జేసీగా బాధ్యతలు స్వీకరించిన నిధి మీనాను డీఆర్ఓ వీ శ్రీనివాసరావు, విజయవాడ ఆర్‌డీఓ బీహెచ్ భవానీ శంకర్, జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం జీ వెంకటేశ్వర్లు, డీఎస్ఓ జీ మోహన్ బాబు, కలెక్టరేట్ ఏఓ సీహెచ్ నాగలక్ష్మి, డీఐపీఆర్ఓయు సురేంద్రనాద్, డీపీఆర్ఓ ఎస్‌వీ మోహనరావు, అడిషనల్ పీఆర్ఓ కే రవి, ఏపీ సూపర్ వైజర్ వీవీ ప్రసాద్ తదితరులు జాయింట్ కలెక్టర్ మీనాకు శుభాకాంక్షలు తెలిపారు. జేసీగా బాధ్యతలు స్వీకరించిన నిధి మీనా ఆ తర్వాత కలెక్టర్ సృజనను మర్యాదపూర్వకంగా కలిశారు.

నదీజలాల పంపిణీపై సంప్రదింపులు జరపాలి

రైతు సంఘాల ప్రతినిధుల సమావేశం తీర్మానం

గవర్నర్‌పేట, జూలై 23 : నదీ జలాల పంపిణీ విషయంపై సమగ్ర అవగాహన కోసం రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి వివిధ వర్గాలతో సమావేశం నిర్వహించాలని రైతు సంఘాల ప్రతినిధుల సమావేశం డిమాండ్ చేసింది. మంగళవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో రైతు నాయకుడు అక్కినేని భవానీప్రసాద్ అధ్యక్షతన రైతు సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. సమావేశంలో ప్రముఖ ఇంజనీర్ కె.పాపారావు మాట్లాడుతూ, గత ఏడాది అక్టోబరు 6న కేంద్ర ప్రభుత్వంలోని జలశక్తి శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. దీని ప్రకారం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు కృష్ణా, గోదావరి నదీజలాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల మధ్య పంపిణీ చేయాల్సిన బాధ్యత అప్పగించడం జరిగిందని వివరించారు. ఏపీ ప్రభుత్వం ట్రిబ్యునల్ ముందు నదీజలాలను పునఃపంపిణీ చేసేందుకు తగిన ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉందన్నారు. ట్రిబ్యునల్ ముందు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రతిపాదనలు ఉంచేందుకు అన్నివర్గాలతో సమావేశం నిర్వహించి సూచనలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖామంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతు సంఘాల ప్రతినిధులు వై.కేశవరావు, శ్రీకృష్ణయ్య, కెవీవీ ప్రసాద్, బొజ్జా దశరథరామిరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని తగు సూచనలు చేశారు. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు మార్పు చేయడానికి వీలులేకుండా చర్యలు చేపట్టాలని, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌లో ప్రతిపాదించిన కేటాయింపులను, తదుపరి రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న ప్రాజెక్టులను మాత్రమే పరిగణలోనికి తీసుకోవాలని రైతు సంఘం సమావేశం రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేసింది. గోదావరి జలాల మళ్ళింపులను ఈ ట్రిబ్యునల్ పరిగణలోకి తీసుకోవడానికి వీలులేదని సమావేశంలో వక్తలు ఉద్ఘాటించారు. వేరొక ప్రత్యేక ట్రిబ్యునల్ ద్వారా గోదావరి జలాల పంపిణీ చేపట్టాలని సమావేశం సూచించింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో విద్యుత్ ఉత్పత్తిని దిగువ సాగునీటి అవసరాల మేరకు మాత్రమే వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సమావేశం డిమాండ్ చేసింది. నదీజలాల విషయాలపై ఆగస్టు మొదటి వారంలో రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహించి విషయాలను ప్రజలకు అవగాహన కలిగించేలా చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్న భవానీప్రసాద్ తెలిపారు.



నదీ జలాల పంపిణీపై రైతు సంఘాల ప్రతినిధుల సమావేశం

చినుకు పడితే చిత్తడే!

బురద కయ్యలుగా రహదారులు.. ప్రజలకు తప్పని పాట్లు

కూచిపూడి : మొవ్వ మండలంలోని ప్రధాన రహదారుల్లోని గోతులు ఇటీవల కురిసిన వర్షాలకు ప్రమాదభరితంగా మారాయి. కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళాపీఠం రహదారి, బార్లపూడి రహదారుల్లోని గోతుల్లో ఇటీవల చేరిన వర్షపు నీరు చెరువవులను తలపిస్తూ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షం కారణంగా రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. సంబంధిత అధికారులు గోతుల్లోని నీళ్ల మళ్లించకపోవటం, గోతులను తాత్కాలికంగానైనా పూడ్చకపోవటంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తుంది. మండలంలోని పెదపూడి, పెడసనగల్లు, అయ్యంకి తదితర గ్రామాల్లోని రహదారులన్నీ దాదాపుగా ఇదే స్థితిలో ఉన్నాయి.




ప్రమాదభరితంగా కూచిపూడి ప్రధాన రహదారి

పెదపారుపూడి : మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలోని జగనన్న కాలనీకి వెళ్లే రహదారి బురదకయ్యగా మారి నడవటానికి కూడా వీలు లేని పరిస్థితి నెలకొందని జగనన్న కాలనీ వాసులు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు జగనన్న కాలనీకి వెళ్లే రహదారి బురదమయంగా మారిందని కాలనీలో నుండి బయటకు రావటానికి కూడ వీల్లేని పరిస్థితి ఉందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇంటిలో నుంచి బయటకు వచ్చి నిత్యావసర వస్తువులు కొనుక్కోవటానికి కూడా వీలులేని పరిస్థితి ఉందని అంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారికి కనీస మరమ్మతలు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



వెంట్రప్రగడ గ్రామంలో జగనన్న కాలనీకి వెళ్లే రహదారి దుస్థితి

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు



వన్‌టౌన్, జూలై 23 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో సూపరింటెండెంట్లు సిబ్బందికి అంతర్గత బదిలీలు జరిగాయి. ఈ మేరకు మంగళవారం ఈవో రామారావు ఉత్తర్వులు జారీచేశారు. టి.రవి ప్రసాద్‌ను ఎండోమెంట్ కమిషనర్ సీసీగా బదిలీ చేశారు. కేవీ దుర్గాప్రసాద్‌ను గణాంక విభాగం, ఐటీ రిటర్నులు, స్క్రూటినీ, కొండదిగువన కౌటర్ల పర్యవేక్షణ, స్టేషనరీ, ఎంవీ ఫారాలు, ఆర్టీఐ యాక్ట్, ఎ.అమృతరావును శివాలయం, సబ్ టెంపుల్స్, ల్యాండ్స్, లీజులు, నాన్ సర్వీస్, లీగల్ మ్యాటర్లు, కె.హరికృష్ణను కనకదుర్గ ప్రభకు, కె.శ్రీనివాసరావు (చందు)ను ప్రసాదాల తయారీ, శానిటేషన్ అకామడేషన్, కొండదిగువన కౌంటర్ల పర్యవేక్షణ, పి.భాగ్యజ్యోతిని మెయిన్‌స్టోర్స్, శారీస్, ఆడిట్, జనరల్ విభాగాలు, తాడిగుర్రాజు ప్రొటోకాల్ కొండపైన కౌంటర్ల పర్యవేక్షణ, దాతల విభాగం, బి.ఎస్.జగదీష్ ప్రసాద్‌కు రెలిజియస్ నాన్ రెలిజయస్ పరిపాలన విభాగాలు మెయిన్ టెంపుల్, ఐటీ వింగ్ తదితరాలు, వి.నగేష్‌కు కేశఖండనశాల, దుర్గాఘాట్, కృష్ణమ్మ హారతులు, టోల్‌గేట్, దత్తత దేవాలయాలు, కూరెళ్ల శ్రీనివాసరావుకు ప్రోటోకాల్, కొండపైన కౌంటర్ల పర్యవేక్షణ, దాతల విభాగం, సీహెచ్‌వీ నరసింహరాజుకు మెయిన్ టెంపుల్, సర్వీస్ లీగల్ వ్యవహారాలు, వై.హేమ దుర్గాంబకు అన్నదానం, డీవీవీ సత్యనారాయణకు పీఆర్‌వో తదితర విభాగాలు పి.సునీతకు పూజలు, ఉత్సవాలు, ధర్మపథం, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర విభాగాలను అప్పగించారు.

ఆన్‌లైన్ లోన్ యాప్‌కు వివాహిత బలి



పేటేటి స్రవంతి

మంటాడ(పమిడిముక్కల), జూలై 23 : ఆన్‌లైన్ మోసానికి పమిడిముక్కల మండలం మంటాడకు చెందిన వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జరిగింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒకటికి నాలుగురెట్లు చెల్లిస్తామని టెలిగ్రామ్ యాప్‌లో ప్రకటనకు ఆకర్షితురాలైన పేటేటి స్రవంతి(28) రూ.100 యాప్ ఖాతాలో వేయగా వారి నుంచి రూ. 400 వచ్చాయి. పదివేలు వేస్తే రూ.20వేలు ఇస్తామని యాప్ నిర్వాహకులు ప్రలోభ పెట్టారు. దీంతో పలుదఫాలుగా యాప్ ఖాతాలో ఆమె నగదు జమచేసింది. రూ. 20వేలు, రూ.60వేలు, రూ.80వేలు దొరికిన చోట అప్పులుచేసి వారి ఖాతాలో జమచేసింది. తరువాత రూ.1.20 లక్షలు వేస్తే రూ.5లక్షలు రుణం ఇస్తామని తిరిగి మెసేజ్ వచ్చింది. దీంతో తాను మోసపోయానని గ్రహించి, తనముఖం చూపించలేక భర్త శ్రీకాంత్‌కు సెల్ఫీ వీడియో తీసి జరిగింది వివరించింది. 'నీకు తెలియకుండా తప్పుచేశాను.. మన కుటుంబం కోసమే ఈ పనిచేశాను.. నీకు నా ముఖం చూపించ లేక ఆత్మహత్య చేసుకుంటున్నా..' అంటూ సెల్ఫీ వీడియో తీసి ఇంటిలో ఉరి వేసుకుంది. కుటుంబసభ్యులు వెంటనే ఆమెను మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. భర్త శ్రీకాంత్ తాపీ మేస్త్రీ కాగా.. వీరికి కుమార్తె(6), కుమారుడు(4) ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పమిడిముక్కల పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల వ్యవధిలో తండ్రి, కొడుకు దుర్మరణం

చిన్ననందిగామలో విషాదచాయలు





జి.కొండూరు, జూలై 23 : కేవలం 38 రోజుల వ్యవధిలో కుటుంబానికి ఆధారమైన తండ్రి, కొడుకు మృత్యువాత పడ్డారు. నెల క్రితం రోడ్డు ప్రమాదంలో కొడుకు మృతి చెందగా.. మంగళవారం భర్త జలసమాధి అయ్యాడు. ఇరువురిని కోల్పోయిన కుటుంబం రోదన స్థానికులను కలచివేసింది. వివరాల్లోకి వెళితే.. జి.కొండూరు మండలం చిన్న నందిగామ గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ బలుసు స్వామి (59) జాలరి వృత్తితో జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం శోభనాపురం గ్రామంలోని చెరువులో చేపల వేటకు 14 మందితో కలిసి వెళ్లాడు. చేపలు పడుతుండగా చెరువులో లోతు ఉన్న చోట ఈదలేక నీటిలో మునిగి ప్రమాదవశాత్తు మృత్యువాత పడ్డాడు. చిన్ననందిగామ పంచాయతీ ఉపసర్పంచ్‌గా ఇటీవలే ఆయన్ను ఏకగ్రీవం ఎన్నుకున్నారు. ఇదిలా ఉంటే స్వామికి భార్య అవ్వమ్మ, నలుగురు సంతానం ఉన్నారు. ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు. వారిలో ముగ్గురికి వివాహం జరిగింది. ఈఏడాది జూన్ 15న స్వామి పెద్ద కుమారుడు మురళీ (30) మైలవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆ విషాదం నుంచి ఇంకా వారు తేరుకోకుండానే కుటుంబ యజమాని స్వామి మృతితో మిగిలిన వారిని ఓదార్చడం బంధువుల తరం కాలేదు. మృతదేహాన్ని ఏఎంసీ మాజీ చైర్మన్ ధనేకుల సాంబశివరావు (బుల్లిబాబు), మన్నం వెంకట్రావ్, టీడీపీ నాయకులు సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎన్టీటీపీఎస్ బూడిద కాలువలో పడి..

ఇబ్రహీంపట్నం, జూలై 23 : ఎన్టీటీపీఎస్ బూడిద కాలువలో పడి బాలుడు మృతి చెందిన ఘటన ఖిల్లా రోడ్డులో మంగళవారం చోటు చేసుకుంది. ఖిల్లా రోడ్డులో నివాసం ఉంటున్న బూక్యా కుమార్ - లక్ష్మి దంపతుల ఇంటి ముందు బూడిద కాలువ ఉంది. వారి కొడుకు సిద్ధార్థ్ నాయక్ (3) ఇంటి ముందు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు బూడిద కాలువలో పడి గల్లంతయ్యాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గాలించి బాలుడి మృతదేహాన్ని మధ్యాహ్నానికి బయటకు తీశారు. బాలుడి మృతితో తల్లిదండ్రులు బోరుమన్నారు. ఖిల్లారోడ్డులో విషాదచాయలు అలుముకున్నాయి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	113, 122, 133
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.00

మర్యాదపూర్వక కలయిక



గవర్నర్‌పేట, జూలై 23: నగర పోలీసు కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర్ బాబును మంగళవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు నేతృత్వంలో ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. శాలువాతో సత్కరించారు. సంఘ నేత, ఎంఏఎం ట్రస్ట్ చైర్మన్ మహంతి వాసుదేవరావు, సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, నేతలు మట్లపూడి పూర్ణచంద్రావు, గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత

చిట్టినగర్, జూలై 23: రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ డా. ఎస్వీరావు పుట్టినరోజును పురస్కరించుకొని, రాకేష్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం కేఎల్ రావు నగర్ రాకేష్ పబ్లిక్ స్కూల్లో పలువురు పేద విద్యార్థులకు రూ.40వేలు స్కాలర్ షిప్‌లు అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు పొత్తూరి రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా బోనాల వేడుకలు

చిట్టినగర్, జూలై 23: ముత్యాలమ్మ, కనకదుర్గమ్మ వార్ల దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పాలఫ్యాక్టరీ ఎదురుగా ఎస్ఏఎస్ కళాశాల వెనుక వైపు అమ్మవారి గుడి వద్ద బోనాలు పండుగ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ కె.నాగుల్‌మీరా, బీజేపీ నాయకులు అడ్డూరి శ్రీరామ్, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, రాష్ట్ర బీసీ నాయకులు గుర్రం కొండాలు పాల్గొని పూజలు చేశారు.

డివిజన్ అధ్యక్షులు డి.ప్రభుదాస్, రామారావు, ఖాజా, క్లస్టర్ ఇన్‌చార్జిలు లోకేష్, నాయకులు ధనాల శ్రీనివాస్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● సయ్యద్ అప్పలస్వామి కళాశాల పక్కనే జరిగిన బోనాలు వేడుకల్లో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావులు పాల్గొని పూజలు చేశారు. దేవాత్ మురళి నాయక్, రవీంద్రనాయక్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బోనాల పూజలో పాల్గొన్న నాగుల్‌మీరా, అడ్డూరి శ్రీరామ్, గుర్రం కొండ తదితరులు

నగరంలో ఇన్‌చార్జి కమిషనర్ పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమిషనర్ మహేష్

భారతీనగర్, జూలై 23: నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ ఎ. మహేష్ మంగళవారం లయోలా కళాశాల రోడ్డు, ఎన్టీఆర్ నగర్ కాలనీ, భాను నగర్, కేదారేశ్వర్ పేట ప్రాంతాల్లో పర్యటించారు. ఈ పర్యటనలో తొలుత నాలుగో డివిజన్ లయోలా రోడ్లోని సెల్ఫ్(డంపర్ బిన్) పరిశీలించారు. రోడ్లోని మేజర్ డ్రెయిన్, సైడ్ డ్రెయిన్‌లో ఉన్న వ్యర్థాలను తొలగించాలని తెలిపారు. 28వ డివిజన్ భానునగర్‌లో ఉన్న జీవీఎస్ శాస్త్రి పార్క్‌ను పరిశీలించారు. పార్కులో ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్న చెట్టును వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

34వ డివిజన్ కేదారేశ్వరపేట ఫ్రూట్ మార్కెట్‌లో పర్యటించారు. పబ్లిక్ టాయిలెట్స్ డ్రెయిన్లు, శానిటేషన్‌ను మెరుగుపరచాలని, అక్కడున్న ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. శానిటర్ అధికారులు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పటమటలంక సమస్యల పరిష్కారానికి నిధులు తెస్తాం

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జూలై 23 : పటమటలంకలోని అన్ని సమస్యలను తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు తెచ్చి పరిష్కరిస్తామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 9వ డివిజన్‌లోని పటమటలంక, బెంజిసర్కిల్ ఏరియాల్లో మంగళవారం ఆయన పర్యటించి సైడు కాల్వలు, డ్రెయిన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ గతంలో 2014-19లో కేంద్ర నుంచి స్ట్రామ్ వాటర్ డ్రెయిన్స్ నిధులను తెచ్చినట్లుగానే పటమటలంకలోని సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేకంగా నిధులు తెచ్చి పరిష్కరిస్తానన్నారు. ఈ ప్రాంతంలో కొద్దిపాట వర్షానికే రహదారులపై నీరు నిల్వ ఉంటున్నాయని తెలిపారు. ఈ ప్రాంతం సమస్యల గురించి కార్పొరేటర్లు, ఎంపీతో చర్చించడం జరిగిందన్నారు. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తానని వివరించారు. మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ , కార్పొరేటర్లు చెన్నుపాటి కాంతి శ్రీ, ముమ్మనేని ప్రసాద్, యలమంచి దేవేంద్ర, వీఎంసీ ఈఈ సామ్రాజ్యం, అన్నాబత్తిన బాబీ, సీహెచ్ లక్ష్మి నరసింహారావు, ఏ. శ్రీదేవి, ఏ. రమేష్, యల్లబాబు, కె. రమేష్‌లు పాల్గొన్నారు.



సైడ్ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న గద్దె రామ్మోహన్, చెన్నుపాటి గాంధీ



అసెంబ్లీ సమావేశాలను వీక్షించిన ఎస్ఆర్ఆర్, సీవీఆర్ విద్యార్థుల బృందం

అసెంబ్లీ సమావేశాలను వీక్షించిన ఎస్ఆర్ఆర్, సీవీఆర్ విద్యార్థులు

వన్‌టౌన్, జూలై 23: మాచవరంలోని ఎస్ఆర్ఆర్, సీవీఆర్ ప్రభుత్వ కళాశాలకు చెందిన వందమంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించారు. విద్యార్థులకు అసెంబ్లీ సమావేశాలు వీక్షించే ందుకు అవకాశమిచ్చిన సీఎం చంద్రబాబుకు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌లకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఎన్ఎస్ఎస్ జిల్లా కో- ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ డి.యుగంధర్, మహిళా సాధికారిత సెల్ కన్వీనర్ డాక్టర్ కే.అరుణ, సిబ్బంది ప్రశాంతి, ఉమామహేశ్వరి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మధురానగర్, జూలై 23: మధురానగర్ సెక్షన్ పరిధిలో 11కేవీ గులాబీ తోట ఫీడర్ లైన మరమ్మతుల్లో భాగంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు గులాబీతోట, గణపతి వీధి, సాంబమూర్తి రోడ్డు, సాయిప్రసన్న వీధి, సాయిబాబా వీధి, మొహన్‌గాంధీ వీధి, కాకర్లమూడి వారివీధి, గులాబీతోట రోడ్డు, బీఆర్టీఎస్ రోడ్డు, భానునగర్, పన్నె కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

రామలింగేశ్వరనగర్: విద్యుత్ లైన్ల మరమ్మతు, మెయింటెనెన్స్ నిమిత్తం బుధవారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు న్యూ బ్రిడ్జి సెక్షన్, రామలింగేశ్వరనగర్ విద్యుత్ ఉపకేంద్రం 11కేవీ పుట్ట రోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ తెలిపారు. ఈనాడు కాలనీ, ఎస్‌టీపీ హెచ్‌టీ పాయింట్, శ్మశానం వీధి నుంచి రామలింగేశ్వరనగర్ కొండ వరకు, కొల్లిపర వారి వీధి, నిమ్మల వారి వీధి, టాగూర్ వీధి, శివగంగ భవానీ వీధి, కొమ్మా పూర్ణచంద్రరావు వీధి, రాయపాటి రమణమ్మ వీధి, రాయపాటి సత్యయ్య వీధి, సాయిబాబా వీధి, పుట్ట రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె

వన్‌టౌన్, జూలై 23 : 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు దంపతులు మంగళవారం కనకదుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించారు. బ్రాహ్మణవీధి, సన్యాసి వీధులకు చెందిన పలువురు మహిళల బృందంతో పాటే ఊరేగింపుగా కార్పొరేటర్ దంపతులు కలిసి వెళ్లి అమ్మవారికి సారె సమర్పించారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

వైసీపీ మహిళా నాయకురాలిపై కేసు నమోదు

పాయకాపురం, జూలై 23 : ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని మోసం చేసిన వైసీపీ నాయకురాలుపై నున్నరూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. న్యూ రాజీవ్ నగర్‌కు చెందిన ఉప్పల ధనమ్మకు వడ్డేపల్లి సామ్రాజ్యంతో పరిచయం ఉంది. గత ప్రభుత్వంలో వీఎంసీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి ధనమ్మతో పాటు మరో 12మంది వద్ద రూ.5,80,000 తీసుకుంది. అప్పటి నుంచి అదిగో ఇదిగో అంటూ సాకులు చెబుతూ వచ్చింది. దీంతో బాధితులు మోసపోయామని గ్రహించి నున్నరూరల్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ఉండాలి

కార్పొరేటర్ బోయి సత్యబాబు



మాట్లాడుతున్న కార్పొరేటర్ బోయి సత్యబాబు

చిట్టినగర్, జూలై 23: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండటంతోపాటు తమ చుట్టు పక్కలవారిని చైతన్యం చేయాలని కార్పొరేటర్ బోయి సత్యబాబు అన్నారు. మంగళవారం గొల్లపాలెంగట్టు ఆర్‌సీఎం స్కూల్‌లో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు చెత్త వ్యర్థాలను తడి-పొడి- ఇతర వ్యర్థాలను విడదీసి ఇవ్వడం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు చుట్టు పక్కలవారిని చైతన్యం చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలన్నారు. శానిటరీ అధికారులు సిబ్బంది, స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నందమూరి రామకృష్ణ మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలి

బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేరేపి ఈశ్వర్



పటమట, జూలై 23 : టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు తనయుడు నందమూరి రామకృష్ణను బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేరేపి ఈశ్వర్ హైదరాబాద్‌లో ఆయన నివాసంలో మంగళవారం కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలను తెలిపారు. టీడీపీ కష్ట, నష్టాల్లో తన వంతు పాత్ర పోషించిన నందమూరి రామకృష్ణ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరిన్ని జరుపుకోవాలని పేరేపి ఈశ్వర్ ఆకాంక్షించారు.

ఉద్యోగుల అలవెన్సులను జమ చేయండి



ట్రెజరీస్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందచేస్తున్న పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ప్రతినిధులు

బస్‌స్టేషన్, జూలై 23: రాష్ట్రంలోని చాలా డిపోలలో ఉద్యోగులకు నిలిపివేసిన అలవెన్సులను జీతంతో కలిపి జమ చేయాలని ప్రజారవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి రాజేష్‌కుమార్, సీసీఎస్ పాలకవర్గ సభ్యుడు అనంతరాములు మంగళవారం ట్రెజరీస్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులున్నప్పటికీ ఆయా డిపోలలో ఉద్యోగులకు నిలిపివేసిన అలవెన్సుల వివరాలను ఆయనకు అందచేశారు.

దీనిపై ట్రెజరీస్ డైరెక్టర్ స్పందిస్తూ సంబంధిత విభాగ అధికారులను పిలిపించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఇదే అంశాన్ని రాష్ట్ర ఆర్థిక మంత్రి దృష్టికి కూడా తీసుకువచ్చినట్లు తెలిపారు.

అడ్వాన్స్‌డ్ మెకానికల్ ఇంజనీరింగ్ అండ్ అప్లికేషన్స్‌పై సదస్సు

భారతీనగర్, జూలై 23: ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మెకానికల్ విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో మంగళవారం అడ్వాన్స్‌డ్ మెకానికల్ ఇంజనీరింగ్ అండ్ అప్లికేషన్స్ అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో గన్నవరం ఎన్‌టీటీఎఫ్ విభాగాధిపతి కృష్ణకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెకానికల్ విద్యార్థులకు ఆధునిక మెకానికల్ పద్ధతులపై అవగాహన కల్పించారు. కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజి రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఒ.మహేష్, అసిస్టెంట్ డెరెక్టర్ ఫాదర్ బాలస్వామి, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ గీతారాణి, కో-ఆర్డినేటర్ డాక్టర్ సుబ్బారెడ్డి, ఐక్యూఏఆర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సిస్టర్ క్యాండీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వివరిస్తున్న కృష్ణకాంత్

పారిస్‌లో ప్రాక్టీస్ మొదలెట్టిన ఆర్చర్ ధీరజ్

విజయవాడ స్పోర్ట్సు, జూలై 23 : పారిస్ ఒలింపిక్స్ ఆర్చరీలో బరిలో ఉన్న నగరానికి చెందిన యువ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ తన సహచర ఆర్చర్లతో మంగళవారం అక్కడ ప్రాక్టీస్‌ను మొదలెట్టాడు. నగరంలోని చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీలో చీఫ్ కోచ్ సత్యనారాయణ వద్ద శిక్షణ చేపట్టిన బొమ్మదేవర ధీరజ్ ద్వారా పతకం వస్తుందన్న ఆశలున్నాయి. ఈ నెల 25న మెన్ ర్యాంకింగ్ 70+70 పోటీల్లో 72 బాణాలతో 720 పాయింట్లకు ధీరజ్ తన జట్టు సభ్యులైన తరుణదీప్‌రాయ్, ప్రవీణ్ జాదవ్‌లతో కలిసి తలపడతాడని కోచ్ సత్యనారాయణ తెలిపారు. ధీరజ్ ద్వారా ఆర్చరీలో భారత్‌కు పతకం వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వ్యక్తిగత, టీమ్ ఈవెంట్, మిక్స్‌డ్‌ల్లో ధీరజ్ ఒలింపిక్స్ బరిలో దిగుతున్న విషయం తెల్సిందే.



సహచర ఆర్చర్లతో ప్రాక్టీసులో పాల్గొన్న బొమ్మదేవర ధీరజ్, మధ్యలోని క్రీడాకారుడు

యువకుడు ఆత్మహత్య

పాయకాపురం, జూలై 23 : ఉరివేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై నున్నరూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం కండ్రిక కాలనీకి చెందిన షేక్ బాజీ (23) సోదరుడు పుట్టినరోజు పురస్కరించుకుని సోమవారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఇంటికి వెళ్లాడు. తెల్లవారుజామున చూడగా బాత్రూంలో సీలింగ్ రాడ్‌కు కర్టన్‌తో ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న నున్నరూరల్ పోలీసులు ఘటన స్థలంకు చేరుకుని అనుమానస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి రామానాయుడుకు ఘనస్వాగతం



గన్నవరం, జూలై 23 : రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుకు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పోలవరం ప్రాజెక్టును త్వరగా పూర్తి అవడానికి కేంద్ర ప్రభుత్వంతో చర్చించి నిధులకు హామీ పొంది మంగళవారం రాత్రి ఎయిరిండియా విమానంలో గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన మంత్రి రామానాయుడుకు అపెక్స్ కమిటీ మాజీ సభ్యుడు ఆళ్ల గోపాలకృష్ణ టీడీపీ నీరు, చెట్టు కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు కవులూరు రాజా చంద్రమౌళి, చెన్నుపాటి శ్రీధర్ తదితరులు పూలబొకే అంద జేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆళ్ల మాట్లాడుతూ, వైసీపీ పాలనలో పోలవరం నిర్మాణం కుంటుపడిందని, కూటమి పాలనలో

మంత్రికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న ఆళ్ల గోపాలకృష్ణ

గజపతి నగరం ఎమ్మెల్యే అతిథికి సత్కారం



వన్‌టౌన్, జూలై 23: గజపతినగరం ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్‌గజపతి కుమార్తె అతిథి మంగళవారం వన్‌టౌన్‌లోని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వెంకన్న ఆమెకు పూలమొక్క అందచేసి దుశ్శాలువా కప్పి సత్కరించారు.

నగరంలో కాలుష్యంపై అధ్యయనం

చిట్టినగర్, జూలై 23: నగరాన్ని కాలుష్య రహితంగా తయారు చేయడానికి వీఎంసీ అధికారులు కసరత్తు ప్రారంభించారు. విజయవాడలో ఎక్కడెక్కడ కాలుష్య ప్రభావం ఉందన్న విషయాలను అధ్యయనం చేయించడానికి సిద్ధమయ్యారు. ముంబయికి చెందిన అర్థ గ్లోబల్, న్యూఢిల్లీకి చెందిన ఎనర్జీ రీసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ (టీఈఆర్ఐ) సంస్థలు ఈ అధ్యయనం చేయనున్నాయి. ఈ సంస్థల ప్రతినిధులతో అదనపు కమిషనర్ సత్యవతి వీఎంసీలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సంస్థలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వాయు కాలుష్యం వల్ల ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను గుర్తిస్తారు. సమావేశంలో టెరీ సంస్థకు చెందిన వివేక్, సునంద, డాక్టర్ అంజు గోయలర్, శివాణి శర్మ, జాకోబ్, శశి తివారీ పాల్గొన్నారు.

రైతుల ఖాతాలకు పంటల బీమా జమ చేయాలి : రైతు సంఘం

మునుకుళ్ల(తిరువూరు), జూలై 23: గత ఏడాది తుఫాన్ వల్ల ఖరీఫ్ పంటనష్టపోయిన రైతులు, కౌలు రైతుల ఖాతాలకు నగదు జమ చేయాలని రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందించారు. మునుకుళ్లతో పాటుగా, పలు గ్రామ సచివాలయాల్లో మంగళవారం సంఘాల నాయకులు తమతమ సమస్యల పరిష్కారానికి అర్జీలు అందించారు. కౌలురైతులకు గుర్తింపు కార్డులు అందించాలని, ప్రభుత్వం ప్రకటించిన రూ20 వేల పంట పెట్టుబడి సహాయం తక్షణం విడుదల చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీల బకాయి వెంటనే చెల్లించాలని వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకుడు సాంబారు వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

వాగ్దేవిలో అడ్వాన్స్ డిగ్రీ కోర్సులు

జగ్గయ్యపేట, జూలై 23: వాగ్దేవి కళాశాలలో ఈ ఏడాది బీఎస్సీలో అడ్వాన్స్ ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్న కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు ప్రిన్సిపాల్ బి.సురేష్ తెలిపారు. బీఎస్సీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సు, బీఎస్సీ ఫుడ్ టెక్నాలజీ, నర్సింగ్, బయో మైక్రో బయాలజీ కోర్సులు నూతనంగా ప్రారంభించామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఎలాంటి అదనపు ఖర్చులు, సుదూరప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా స్థానికంగానే ఉండి చదువుకునే అవకాశం ఉందన్నారు.

రహదారిపై వరి నాట్లు

గంపలగూడెం, జూలై 23: కొణిజర్ల పంచాయతీ రోడ్డు అధ్వానంగా ఉండడంతో స్థానికులు రహదారిపై మంగళ వారం వరినాట్లు వేసి నిరసన తెలిపారు. దళితవాడ రోడ్డు దశాబ్దకాలంలో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టాలని దళితులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన లేదు. వర్షాకాలం వస్తే బురదమయంగా మారి రాకపోకలు సాగించే పరిస్థితి లేదు.. దీంతో దళిత మహిళలు నాట్లు వేసి నిరసన తెలిపారు.

తెలుగులో సభా వ్యవహారాలు

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): శాసనసభలో కొత్త ఒరవడి మొదలైంది. సభలో వీలైనంత మేర తెలుగులో మాట్లాడే సంస్కృతికి సభాపతి అయ్యన్నపాత్రుడు శ్రీకారం చుట్టారు. మంగళవారం సభలో ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు బిల్లు, వైద్య విశ్వవిద్యాలయం పేరు మార్పు బిల్లులను ప్రవేశపెట్టారు. ఆయా శాఖల మంత్రులను బిల్లులు ప్రవేశపెట్టాలని సభాపతి తెలుగులో కోరారు. వారు బిల్లును ప్రవేశపెట్టే ప్రతిపాదన చేయగా, అందుకు సభ్యులను 'అవును' అనేవారు అవును అనాలని కోరారు. ఆ తర్వాత 'కాదు' అనే వారుంటే కాదని చెప్పాలని అడిగారు. గతంలో ఈ వ్యవహారాలన్నీ ఇంగ్లీష్‌లో జరిగేవి. తొలిసారి ఈ వ్యవహారాలను తెలుగులోకి మార్చడంతో సభలో నవ్వులు పూశాయి.

వైసీపీకి 8 నిమిషాలే.. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో ఎవరికి ఎంత సమయం వస్తుందనే విషయాన్ని స్పీకర్ ప్రకటించారు. 2గంటల పాటు చర్చ జరుగుతుందని, అందులో సభ్యుల సంఖ్యా బలం ప్రకారం కూటమికి 1.52 గంటలు, వైసీపీకి 8 నిమిషాల సమయం కేటాయిస్తున్నట్లు తెలిపారు.

కేంద్ర నిధులు ఆగిపోయాయి

రాష్ట్ర వాటా ఇవ్వకపోవడమే ప్రధాన కారణం

- ఆర్థిక విధ్వంసంపై నెలాఖరుకు శ్వేతపత్రం: పయ్యావుల

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఆర్థిక విధ్వంసంతో కేంద్రం నుంచి వివిధ పథకాలకు రావాల్సిన నిధులు ఆగిపోయాయని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. కేంద్ర పథకాలకు నిధుల విడుదలపై ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. కొన్ని పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వలేదని, మరికొన్నింటిని గత ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు. దాదాపు 200 పథకాలకు సంబంధించిన నిధులు మళ్లించారని తెలిపారు. కేంద్రం 70శాతం నిధులు ఇచ్చే పథకాలకు కూడా మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వలేదని, చిన్నపిల్లలు, మహిళలకు ఉపయోగపడే పథకాలను పట్టించుకోలేదని ఆరోపించారు. గత ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక విధ్వంసంపై ఈ నెలాఖరుకు శ్వేతపత్రం విడుదల చేస్తామని మంత్రి చెప్పారు.

30 నిమిషాల పాటు జీరో అవర్

గత ప్రభుత్వం జీరో అవర్‌కు అవకాశం లేకుండా అసెంబ్లీని నిడిపించింది. కానీ కొత్త ప్రభుత్వం మాత్రం దాదాపు 30 నిమిషాల పాటు జీరో అవర్‌ను నిర్వహించింది. ఎమ్మెల్యేలు రాధాకృష్ణ, పులవర్తి అంజనేయులు, అరవింద్ బాబు, అదిరెడ్డి వాసు, ఎమ్మెల్యే బొండా ఉమా తమ నియోజకవర్గాల్లోని సమస్యలను సభ ముందుంచారు. డయాలసిస్ సెంటర్లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు కోరారు.

ఏపీపీఎస్సీ అవకతవకలపై విచారణ

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ పరీక్షల్లో అవకతవకలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. దీనిపై కోర్టులో కేసు ఉన్నందున ఏవిధంగా ముందుకు వెళ్లాలనేది పరిశీలిస్తున్నామని చెప్పారు. 2022లో వైసీపీ ప్రభుత్వం ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలు, ఇంటర్వ్యూలలో జరిగిన అవకతవకలపై ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శాసనసభలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. గ్రూప్-1 పరీక్ష పేపర్ల మాన్యువల్ మూల్యాంకనం హేపీ రిసార్ట్‌లో జరిగినట్లు ప్రాథమిక ఆధారాలున్నాయని చెప్పారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే నియమించిన కమిటీ విచారణ చేస్తోందని, ఆగస్టు 31లోగా రిపోర్టు ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. ఆ నివేదిక అందిన వెంటనే సీఎంతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. విశాఖలో యూజీడీ వ్యవస్థపై జనసేన ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ సమాధానమివ్వగా.. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల మళ్లింపు వ్యవహారంపై ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, సొంగా రోషన్‌కుమార్, తంగిరాల సౌమ్య, వర్ల కుమార్‌రాజా అడిగిన ప్రశ్నలకు మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి సమాధానమిచ్చారు.

రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తాం

- గాడిన పెట్టేవరకూ సమష్టిగా పనిచేస్తాం
- తప్పులు చేసేవారిని ఉక్కుపాదంతో అణిచేస్తాం
- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రసంగం


అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): "వైసీపీ పాలనలో రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కి వెళ్లింది. అలాగని భయపడి వెనక్కి తగ్గం. రాష్ట్రాన్ని తిరిగి నిలబెడతాం. పునర్నిర్మాణం చేస్తాం. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేవరకూ కూటమిలోని పార్టీలన్నీ సమష్టిగా పనిచేస్తాయి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఒకేసారి అన్నీ చేసేస్తామని చెప్పలేమని, అలాగని రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడపడం అసాధ్యమేమీ కాదని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చలో భాగంగా మంగళవారం శాసనసభలో ఆయన ప్రసంగించారు. "రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు గడిచినా ఇప్పటికీ రాజధాని ఏదో చెప్పుకోలేని పరిస్థితి. మొదటి ఐదేళ్లు అమరావతి రాజధానిగా ఉంది. గత ఐదేళ్లూ మూడు రాజధానుల ముచ్చటతో కాలం గడిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో విధ్వంసం చేశారు. చివరికి బడ్జెట్ కూడా పెట్టుకోలేని దుస్థితి వచ్చింది. అందరం కలిసి ఏపీని అగ్రస్థానానికి చేర్చాలి" అని చంద్రబాబు ఆకాంక్షించారు.

నా జీవితంలో చూడని విజయం

"ఈ ఎన్నికల్లో సాధించిన విజయం నా జీవితంలో చూడలేదు. 93శాతం సీట్లు సాధించి సునామీ లాంటి విజయం సాధించాం. ప్రజలు కసిగా ఓట్లేశారు. విదేశాల నుంచి లక్షలు ఖర్చు పెట్టుకుని వచ్చి మరీ ఓట్లేసి వెళ్లారు. ఇంత పెద్ద విజయాన్ని అందించిన ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నా. గత ఐదేళ్లు ప్రజలు చీకటి రోజులు చూశారు. వారి మెడపై కత్తి పెట్టి ఆస్తులు లాక్కున్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయింది. మా పార్టీ నాయకులను మానసికంగా, ఆర్థికంగా, శారీరకంగా వేధించారు. చివరికి మీపై(సభాపతిని ఉద్దేశించి) కూడా అత్యాచార యత్నం కేసు పెట్టారు. చాలా మంది జైళ్లకు వెళ్లారు. రఘురామకృష్ణరాజును ఎంత వేధించారో అందరం చూశాం. వ్యవస్థలను ఎంతలా విధ్వంసం చేశారనే దానికి ఇదొక నిదర్శనం."

పెట్టుబడులు పెట్టేవారిని తరిమేశారు

"ప్రభుత్వ టెర్రరిజంతో పెట్టుబడులు పెట్టేవారు పారిపోయేలా చేశారు. అమరరాజా వారిని వేధించి పక్క రాష్ట్రం వెళ్లేలా చేశారు. అమరావతిని చంపేశారు. ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీశారు. కొత్త పెట్టుబడులు సాధించకపోగా, ఉన్నవాటిని తరిమేశారు. అమరావతి పూర్తయి ఉంటే 2 నుంచి 3లక్షల కోట్ల సంపద వచ్చేది. అప్పుడు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండేది కాదు. టీడీపీ హయాంలో 72శాతం పోలవరం పూర్తి చేశాం. అంతే వేగంగా పనులు చేసి ఉంటే 2021 నాటికి ప్రాజెక్టు పూర్తయ్యేది. కానీ కావాలని కాంట్రాక్టరును మార్చారు. రివర్స్ టెండరింగ్ అన్నారు. ఇప్పుడు మళ్లీ డయాఫ్రం వాల్ కట్టాలని నివేదిక వచ్చింది. రాష్ట్రంలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తిచేయలేదు. చివరికి గేట్లు కొట్టుకుపోతే కొత్తవి పెట్టలేకపోయారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో క్రైం రేటు భారీగా పెరిగింది. దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన వ్యక్తి నిన్న జగన్ పక్కన నిలబడి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ప్లకార్డు ప్రదర్శిస్తున్నాడంటే ఇంకేం చెప్పాలి? గత ప్రభుత్వంలో నన్నూ అసెంబ్లీలో అవమానించారు. నా జీవితంలో బాధపడిన రోజు అదే. ఆ కౌరవ సభను గౌరవ సభగా మార్చి ఇక్కడకు వస్తానన్నా. పవన్‌ను వ్యక్తిగతంగా లెక్కలేనన్ని సార్లు విమర్శించారు."



నా చేతిలో కత్తి పెట్టారు

"హూ కిల్డ్ బాబాయ్?.. అనే ప్రశ్నకు త్వరలోనే సమాధానం వస్తుంది. వివేకానందరెడ్డి చనిపోయినప్పుడు బాధపడ్డా. మొదట గుండెపోటు అన్నారు. ఆ తర్వాత హత్య అన్నారు. తర్వాత రోజు జగన్ మీడియాలో నా చేతిలో కత్తిపెట్టిన ఫొటో వేశారు. సీబీఐ విచారణాధికారిపై కేసు పెట్టారు. విచారణాధికారి బెయిల్ తెచ్చుకోవడం ప్రపంచంలో ఎక్కడా జరగలేదు. చివరికి సీబీఐ అధికారులు అరెస్టు చేయలేని పరిస్థితి సృష్టించారు. నేరస్థుడే సీఎం అయితే పోలీసులూ వంతపాడతారు."

రిషికొండపై హౌస్ కమిటీ

"రిషికొండను కొట్టి రూ.500కోట్ల పర్యాటక శాఖ నిధులతో విలాసవంతమైన ప్యాలెస్‌లు కట్టుకున్నారు. దీనిపై హౌస్ కమిటీ వేస్తాం. ఎమ్మెల్యేలందరినీ అక్కడికి తీసుకెళ్తాం. వాటిని ఏంచేస్తే బాగుంటుందో ఎమ్మెల్యేలు సలహాలు ఇవ్వాలి. గత ప్రభుత్వంలో అడుగడుగునా అవినీతి జరిగింది. ఇసుక, మద్యం, గనులు, భూములు ప్రతిదాంట్లో దోపిడీ చేశారు. రోడ్లకు 85శాతం నిధులు కోత పెట్టారు. దీంతో రోడ్లు బాగుచేయడం ఇప్పుడు సవాలుగా మారింది. ఒక్క గనుల్లోనే రూ.20 వేల కోట్లు తినేశారు. పేదల ఇంటిస్థలాల్లోనూ భారీ అవినీతి జరిగింది. ఢిల్లీకి మించిన లిక్కర్ స్కాం ఏపీలో జరిగింది. గత ప్రభుత్వంలో తప్పులు చేసిన వారినెవరినీ వదిలే ప్రసక్తి లేదు. చట్ట ప్రకారం అందరినీ శిక్షిస్తాం. కక్షలు పెంచుకుంటే, రాష్ట్రం రావణకాష్టం అవుతుంది. మదనపల్లి ఆర్డీవో ఆఫీసులో ఉద్దేశపూర్వకంగా ఫైళ్లు తగలబెట్టారు. తప్పులు చేసేవారిని ఉక్కుపాదంతో అణచివేస్తాం."

పులివెందులలా మార్చాలనుకున్నారు

"పులివెందుల నియోజకవర్గంలో స్వేచ్ఛగా ఓట్లేసే పరిస్థితి లేదు. వేరే పార్టీకి ఓట్లేస్తే అక్కడ బతకనివ్వరు. రాష్ట్రం మొత్తాన్ని అలాగే మార్చాలనుకున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఏకగ్రీవం చేయాలని ప్రయత్నించారు. కుప్పం, పిఠాపురం, మంగళగిరి నియోజకవర్గాల్లో భారీగా డబ్బులు పంపిణీ చేసి మమ్మల్ని ఓడించాలనుకున్నారు. మాచర్ల లాంటి నియోజకవర్గంలోనే మా పార్టీ అభ్యర్థి బ్రహ్మారెడ్డి భారీ మెజారిటీతో గెలిచారు. ఉమ్మడి కడపలో ఏడు స్థానాలు కూటమి గెలిచింది. గత ప్రభుత్వంలో ఐదేళ్లు నేను మాచర్ల నియోజకవర్గానికి వెళ్లలేకపోయా. కానీ ఇప్పుడు జగన్ వినుకొండ వెళ్తానంటే ఎవరూ అడ్డుకోలేదు. అదీ మీకు మాకు తేడా. 36మందిని చంపేశారు అంటున్నారు. పేర్లు ఇవ్వమంటే మాత్రం మాట్లాడరు."

పరదాలు కట్టొద్దు

"అదేం పైశాచిక ఆనందమో తెలియదు. గత ప్రభుత్వంలో సీఎం హెలికాప్టర్‌లో వెళ్తుంటే కింద రోడ్డుపై ట్రాఫిక్ ఆపడం, చెట్లు నరికేయడం చూశాం. నాకోసం పరదాలు కట్టడం, చెట్లు నరికేయడం, స్కూళ్లు మూసేయడం, రాజకీయ నాయకుల్ని నిర్బంధించడం లాంటివి చేయొద్దు. ట్రాఫిక్ కూడా ఒకట్రెండు నిమిషాలే ఆపండి. నాపై రాళ్లు వేసినా భరించడానికి సిద్ధంగా ఉన్నా. ఇప్పటివరకూ రాష్ట్రంలో ఏడు ఉమ్మడి జిల్లాలు వెనుకబడిన జిల్లాలుగా ఉన్నాయి. ఇప్పుడు ప్రకాశంను కూడా ఆ జబితాలో చేర్చారు. అమరావతికి రూ.15వేల కోట్లు కేటాయించారు. పోలవరం నిర్మాణానికి సహకారం అందిస్తామన్నారు. రాష్ట్రానికి గతంలో ఎప్పుడూ ఈ స్థాయిలో కేటాయింపులు చూడలేదు. శాసనసభ తరపున కేంద్రానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం" అని చంద్రబాబు అన్నారు. త్వరలోనే పూర్తిస్థాయి బడ్జెట్ పెడతామని, సూపర్ సిక్స్ హామీలు అమలుచేస్తామని తెలిపారు. ఆగస్టు 15న అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తామని సీఎం ప్రకటించారు. అనంతరం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.



పంచాయతీల్లో నిధుల దారిమళ్లింపు నిజం..

- కమిషన్ వేసి అక్రమాల గుట్టు తేలుస్తాం
- జగన్ నిర్వాకంతో 11 కోట్ల జరిమానా
- శాసనమండలిలో వెల్లడించిన పవన్ కల్యాణ్

అమరావతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పంచాయతీలకు 14, 15వ ఆర్థిక సంఘం విడుదల చేసిన రూ.9వేల కోట్ల గ్రాంటును గత ప్రభుత్వం దారి మళ్లించిన మాట వాస్తవమేనని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో టీడీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు. పంచాయతీ నిధుల దారి మళ్లింపు అంశంపై మంగళవారం సభలో సుదీర్ఘ చర్చ జరిగింది. పవన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ అధికారులు పంచాయతీల్లో పర్యటించి గత ప్రభుత్వం హయాంలో జరిగిన అవకతవకలను గుర్తించారన్నారు. ఎన్ని నిధులు దారిమళ్లించారన్న విషయంపై ప్రస్తుతం విచారణ కొనసాగుతుందని, దీనిపై కమిషన్‌ను నియమించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. కేంద్రం నుంచి నిధులు వస్తున్నా.. గత ప్రభుత్వంలో అవి పంచాయతీలకు సకాలంలో వెళ్లలేదన్నారు. రూ.998కోట్ల ఆర్థిక సంఘం నిధులు ఇంకా విడుదల కావాల్సి ఉందన్నారు. గత మూడు సంవత్సరాల్లో ఆర్థికసంఘం 8విడతల్లో రూ.7,518 కోట్లు పంచాయతీ రాజ్ సంస్థలకు విడుదల చేసిందని, ఆ సొమ్ముకు తన వాటాను రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడంతో దాదాపు రూ. 11 కోట్ల పెనాల్టీని కేంద్రానికి కట్టాల్సి వచ్చిందని వివరించారు. కేంద్రం నుంచి పంచాయతీలకు వచ్చిన నిధులు ఎప్పుడూ ఆలస్యంగానే వెళ్లేవని, గత ప్రభుత్వంలో సర్పంచ్‌ల అనుమతి లేకుండానే రూ.2,165 కోట్లు డిస్కమ్‌లకు కట్టారని పవన్ తెలిపారు. గ్రామ సచివాలయాల్లో సర్పంచ్‌లకు సముచిత స్థానం లేదని తమ దృష్టికి వచ్చిందని, వారికి గౌరవ, మర్యాదలు దక్కేలా చూస్తామని చెప్పారు. అంతకుముందు టీడీపీ ఎమ్మెల్సీలు పంచుమర్తి అనురాధ, దువ్వారపు రామారావు, బీటీ నాయుడు, రాంగోపాల్‌రెడ్డి ప్రశ్నలు అడిగారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ.. పంచాయతీలకు కేంద్రం నుంచి వచ్చిన నిధులు దారిమళ్లకుండా రాష్ట్ర స్థాయిలో చట్టం చేయాలని కోరారు. మరో పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్లా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. పంచాయతీల్లో చిన్న చిన్న మొత్తాలను దారి మళ్లించడంతో పంచాయతీల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

నేను తప్పు చేసినా శిక్షించండి!

- రాష్ట్ర పునర్నిర్మాణానికి అహర్నిశలు కృషిచేస్తాం: పవన్
- చంద్రబాబు అనుభవం అవసరం
- రాష్ట్రాన్ని గాడిలో పెట్టేదాకా ఆయన కనుసన్నల్లో పనిచేస్తాం
- మన రాజధాని అమరావతే
- 15 వేల కోట్లు ప్రకటించిన మోదీకి ధన్యవాదాలు
- ధన్యవాద తీర్మానంపై చర్చలో డిప్యూటీ సీఎం

అమరావతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వంలో ఎవరు తప్పు నిస్సందేహంగా శిక్షించాలి. నా ద్వారా తప్పులు, అవకతవకలు జరిగినా.. నాపైనా చర్యలు తీసుకోవాలి. మీ అపారమైన అనుభవం రాష్ట్రానికి చాలా అవసరం. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం, మీ కోసం ఆహర్నిశలు పని చేస్తాం. రాష్ట్రాన్ని గాడిలో పెట్టే వరకూ మీ కనుసన్నల్లోనే పని చేస్తాం' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు హామీ ఇచ్చారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. గవర్నర్ ప్రసంగంలో తాను మూడు అంశాలను పరిశీలించానన్నారు. వారసత్వంగా ఏం చేయబోతున్నాం, కూటమి ద్వారా ఎలా ముందుకు వెళ్తున్నామన్న విషయం స్పష్టంగా చెప్పారని తెలిపారు. చంద్రబాబు గురించి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. 'ఆయన ప్రత్యర్థులను కూడా గౌరవించే వ్యక్తి. వైఎస్ తన ప్రత్యర్థి అయినప్పటికీ ఆయన గురించి మంచి మాటలు చెప్పేవారు. చేసిన మంచి పనుల గురించీ చెబుతుంటారు. నాలాంటి యువకులు, కొత్తగా సభలోకి వచ్చినవారు ఆయన్ను చూసి నేర్చుకోవాలి' అని సూచించారు. నవ్యాంధ్ర రాజధాని నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తే.. జగన్ వచ్చి మూడు రాజధానులంటూ గందరగోళం చేశారని.. దశాబ్దాల తర్వాత కూడా రాష్ట్రానికి స్థిరమైన రాజధాని లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అమరావతే రాజధానిగా ఉండాలన్నారు. పొట్టి శ్రీరాములు, పింగళి వెంకయ్య దగ్గర నుంచి మనకు మంచి వస్తే.. గత ప్రభుత్వం చెడును పరిచయం చేసిందన్నారు. 'జగన్ పోలవరం పూర్తి చేయలేదు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేకపోవడం, అన్ని శాఖల నుంచి నిధులు మళ్లించడం, వ్యవస్థల నిర్వీర్యం, సహజవనరులు, ఎర్రచందనం దోపిడీ వంటివి చేశారు. పెట్టుబడుదారులను పారిపోయేలా చేశారు. దేశంలో ఏ రాష్ట్రానికీ రాని పరిస్థితి మన రాష్ట్రానికి వచ్చింది. దీనిని అధిగమించడానికి నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుభవం ఉన్న సీఎం చంద్రబాబు వద్ద నేర్చుకుని, ఆయన కింద పని చేయడానికి, రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పయనింపజేసేందుకు కట్టుబడి ఉన్నాం' అని తెలిపారు.

రఘురామ స్ఫూర్తి..

రఘురామకృష్ణంరాజును కేసులతో ఇబ్బంది పెట్టినా ఆయన మాత్రం పెద్ద మనసుతో జగన్‌తో మనసువిప్పి మాట్లాడడం చాలా ఆనందం కలిగించిందని పవన్ అన్నారు. 'మీపై దాడి చేసినా, హాని చేసినా మీరు మంచి మనసుతో పలకరించారు. సభా ముఖంగా ప్రత్యేకించి మీకు ధన్యవాదాలు చెబుతున్నా. మీ నుంచి ఈ స్ఫూర్తిని తీసుకుంటా. సీఎం చంద్రబాబు కూడా ఇదే చెప్పారు. మనకు 164 మంది ఎమ్మెల్యేలు, 21 మంది ఎంపీలున్నారని ఆవేశపడడం కరెక్టు కాదని, సిస్టమ్ ప్రకారం ముందుకు వెళ్లాలని చెప్పారు. మేమంతా ఒళ్లు దగ్గర పెట్టుకుని ఉంటాం. గత ప్రభుత్వం చేసింది.. మేమూ చేస్తామని అంటే.. జనసేన నుంచి నియంత్రించే బాధ్యత మేం తీసుకుంటాం. రాష్ట్ర భవిష్యత్, పునర్నిర్మాణం కోసం సర్వం త్యాగం చేయడానికి సిద్ధం ఉన్నాం' అని చెప్పారు. కేంద్రం అమరావతికి 15 వేల కోట్లు ప్రకటించడం ఆనందంగా ఉందని ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు.

3 పార్టీల కార్యకర్తలపై కేసులు: కాలవ

అంతకుముందు ధన్యవాదాల తీర్మానంపై చర్చను టీడీపీ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రారంభించారు. జగన్ హయాంలో 72 మంది టీడీపీ నేతలు, కార్యకర్తలను బలి తీసుకున్నారని తెలిపారు. '2,500 మంది టీడీపీ శ్రేణులపైన, 2,014 మంది జనసేన శ్రేణులు, 69 మంది బీజేపీ నాయకులపై కేసులు పెట్టారు. అరాచక పాలనను తప్పించి ప్రజలు కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు' అని గుర్తుచేశారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ.. 2019-24 నడుమ వనరులను దోచేశారని, పనికిమాలిన రంగుల కోసం కోట్లు డబ్బులు వృథా చేశారని ఆక్షేపించారు. కేంద్రం అమరావతికి 15 వేల కోట్లు ప్రకటించడం ఆనందంగా ఉందని బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. జగన్‌ను సభకు పిలిపించాలని, అవసరమైతే ఫోన్ చేసి రప్పించాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి... స్పీకర్ అయ్యన్నపాత్రుడిని కోరారు. ఎవరు నోరు విప్పినా, చివరికి ఫ్లెక్సీలు కట్టినా గత ప్రభుత్వం కేసులు పెట్టిందని.. తనపై 14 కేసులు పెట్టారని, స్పీకర్‌పై దాదాపు 15, 16 కేసులు ఉన్నాయని.. లోకేశ్‌పైనా పెట్టారని రఘురామరాజు వ్యాఖ్యానించారు.

వైసీపీ శాసనసభ పక్ష నేతగా జగన్...

వైసీపీ శాసనసభాపక్ష నేతగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేరును స్పీకర్ ప్రకటించారు. పార్టీలు తమ శాసనసభాపక్షాల కార్యవర్గ సభ్యుల పేర్లను ఆయనకు అందించడంతో ఆయన వారి పేర్లను సభలో చదివారు. జనసేన ఉపనేతగా నాదెండ్ల మనోహర్(తెనాలి), ఆ పార్టీ విప్‌గా లోకం మాధవి (నెల్లిమర్ల), కోశాధికారిగా పులపర్తి రామాంజనేయులు (భీమవరం), కార్యదర్శులుగా వంశీకృష్ణ శ్రీనివాస్ (విశాఖ దక్షిణ), దేవర వరప్రసాద్ (రాజోలు)ను పవన్ కల్యాణ్ నియమించారు.

టీటీడీలో అక్రమాలు వాస్తవమే

- తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వైసీపీ
- విజిలెన్స్ విచారణ తర్వాత చర్యలు: మంత్రి ఆనం

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో టీటీడీలో అనేక అక్రమాలు, అవకతవకలు జరిగాయని, తిరుమల పవిత్రతను దెబ్బతీశారని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆరోపించారు. టీటీడీ నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు చేశారని మండిపడ్డారు. మంగళవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో టీడీపీ ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పంచుమర్తి అనురాధ, బీటీ నాయుడు, రామారావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. ఎన్నికలకు ముందు రూ.1,600 కోట్లతో రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలిచారని, ఈ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, గత ప్రభుత్వంలో టీటీడీలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించామని చెప్పారు. పరకామణిలో పనిచేసే రవికుమార్ సుమారు రూ.100 కోట్లకు సమానమైన అమెరికా డాలర్లను దారిమళ్లించడంతో టీటీడీకి నష్టం వాటిల్లిందని, అతనిపై నమోదైన కేసు విషయంలో గత ప్రభుత్వం వ్యవహరించిన తీరు అనుమానాలకు అవకాశం ఇచ్చిందని చెప్పారు. ఈ వ్యవహారంలో అప్పటి ఈవో, బోర్డు చైర్మన్, సీఐ ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. వైసీపీ పాలనలో తిరుమల కొండపై జరిగిన అక్రమాల నిగ్గు తేలుస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రాథమిక విచారణ పూర్తయిందని పూర్తిస్థాయి నివేదిక వచ్చాక చర్యలు ఉంటాయని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం తిరుమల క్యూలైన్లలో భక్తులకు, పిల్లలకు పాలు, అల్పాహారం ఇవ్వలేదని ఆనం ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చాక ఇసున్నట్లు తెలిపారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా భక్తుల నుంచి రూ.1,300కోట్లు వసూలు చేయగా, అందులో రూ.1,000కోట్లే బ్యాంకులో డిపాజిట్ చేశారని చెప్పారు. మిగతా రూ.300కోట్లు గోవిందరాజుల సత్రం పునర్నిర్మాణానికి ఖర్చుచేయాలని గత బోర్డు నిర్ణయించిందని, అయితే ఏకంగా రూ.600 కోట్లతో టెండర్లు పిలిచారని పేర్కొన్నారు. ఈ టెండర్లలో కూడా చాలా లోపాలు ఉన్నాయని చెప్పారు. శ్రీవాణి ట్రస్ట్ నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. టీటీడీలో రూ.వందలు, వేల కోట్ల దుర్వినియోగం జరిగిందన్నారు. దేవుడి సొత్తు వైసీపీ దొంగలపాలైందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీవారి దర్శనానికి ప్రజాప్రతినిధులకు ఇచ్చే సిఫారసు లేఖల విషయంలోనూ గత ప్రభుత్వం తీవ్ర వివక్ష ప్రదర్శించిందని చెప్పారు.

సిఫారసు లేఖలపై ఆసక్తికర చర్చ

టీటీడీ సిఫారసు లేఖలపై శాసనమండలిలో ఆసక్తికర చర్చ జరిగింది. ఎమ్మెల్సీలను ఎమ్మెల్యేలతో సమానంగా చూడాలని, వీఐపీ బ్రేక్ దర్శనాల కోటా కల్పించాలని పీడీఎఫ్, టీడీపీ, వైసీపీ ఎమ్మెల్సీలు కోరారు. వారంలో ఆరు రోజులు ఒక లేఖకు 10మందికి దర్శనానికి అనుమతి ఇవ్వాలని కోరారు. గతంలో టీటీడీ ఈవో ధర్మారెడ్డి తమ పట్ల అధర్మంగా వ్యవహరించారని వైసీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు ఆరోపించారు.

సభ్యులు హుందాగా వ్యవహరించాలి

- శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు
- గవర్నర్ ప్రసంగానికి మండలి ధన్యవాదాలు

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): శాసనమండలి సమావేశాలు మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యాయి. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న శాసనమండలి తొలి సమావేశానికి సభ్యులకు చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు స్వాగతం పలికారు. శాసనమండలి అనేది పెద్దల సభ కాబట్టి సభ్యులు హుందాగా వ్యవహరించాలని కోరారు. అనంతరం అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను చర్చించేందుకు ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, ఐ. వెంకటేశ్వరరావు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ తిరస్కరించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్థిక సంఘం గ్రాంట్ల మళ్లింపు, ఎస్సీలు, బీసీలు, అల్పసంఖ్యాక వర్గాలు, రాష్ట్ర, జాతీయ రహదారుల పనుల్లో అవకతవకలు, టీటీడీలో అక్రమాలు, రాష్ట్రంలో గనుల అక్రమ తవ్వకాలు సహా పలు అంశాలపై చర్చ జరిగింది. ఉభయ సభలను ఉద్దేశిస్తూ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగంపై టీడీపీ సభ్యులు బీటీ నాయుడు, రామచంద్రయ్య, పంచుమర్తి అనురాధ, పీడీఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు ధన్యవాదాలు తెలిపారు. కాగా, గవర్నర్ ప్రసంగాన్ని వైసీపీ సభ్యులు వి.రవీంద్ర, తూమాటి మాధవరావు విమర్శించారు. ఇది హాస్యాస్పదంగా ఉందన్నారు.

మండలిలో ప్రశ్నోత్తరాలు-మంత్రుల సమాధానాలు

రహదారుల నిర్మాణంలో అవకతవకలు: జనార్దన్‌రెడ్డి

గత ప్రభుత్వ హయాంలో జరిగిన జాతీయ, రాష్ట్ర రహదారుల పనుల్లో అనేక అవకతవకల విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని రహదారులు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. ప్రభుత్వానికి అందిన ఫిర్యాదులను ఏపీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు, కేంద్ర విజిలెన్స్ కార్యదర్శికి పంపామని చెప్పారు. అవకతవకలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దెబ్బతిన్న రోడ్ల బాగుకు త్వరలో చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

అప్పుల పాలైన పౌరసరఫరాల కార్పొరేషన్: మనోహర్

గత ప్రభుత్వం పౌరసరఫరాల కార్పొరేషన్‌ను అప్పుల పాలు చేసిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బ్యాంకుల నుంచి అప్పులు తీసుకున్నా రైతులకు ధాన్యం బకాయిలు రూ.1,650 కోట్లు చెల్లించకుండా వదిలేసిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చాక రూ.వెయ్యి కోట్లు రైతులకు చెల్లించిందని చెప్పారు. గత ప్రభుత్వంలో కాకినాడ కేంద్రంగా వేల టన్నుల పీడీఎఫ్ బియ్యం ఇతర దేశాలకు అక్రమంగా తరలించారని, వైసీపీ నేత ద్వారంపూడి నేతృత్వంలో మాఫియా దోచుకుందని మండిపడ్డారు. అక్రమాలపై సమగ్ర విచారణ చేస్తామన్నారు.

నిధుల్లేక ఆగిన వైద్య కళాశాలల నిర్మాణం: సత్యకుమార్

కేంద్రం మంజూరు చేసిన మెడికల్ కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించని కారణంగానే వాటి నిర్మాణం ఆగిపోయిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆగస్టు 15 నుంచి సామాజిక స్థాయిలో మూడు సాధారణ కేన్సర్ల కోసం సమగ్ర వార్షిక స్క్రీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

గత ప్రభుత్వంలో మైనింగ్ అక్రమాలు: కొల్లు

వైసీపీ ప్రభుత్వంలో గనుల శాఖలో రూ.20వేల కోట్ల మేర అక్రమ కార్యకలాపాలు జరిగాయని, ఇది రూ.లక్ష కోట్లు దాటే అవకాశం కూడా ఉందని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఇందుకు సంబంధించి 1,766 కేసులు నమోదు చేసి, రూ.4,037 కోట్లు జరిమానా విధించినట్లు తెలిపారు.

'నాడు-నేడు' అక్రమాలపై విచారణ

- కేజీ టు పీజీ వరకు విద్యావ్యవస్థను ప్రక్షాళన చేస్తాం
- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులు: మంత్రి లోకేశ్



అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): 'నాడు-నేడు' పేరుతో వైసీపీ ప్రభుత్వం నాసిరకంగా చేసిన పనుల్లో అవినీతి, అక్రమాలపై తమ ప్రభుత్వం సమగ్ర విచారణ చేపడుతుందని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. అసెంబ్లీ రెండోరోజు సమావేశాల్లో భాగంగా మంగళవారం ఉదయం సభ ప్రారంభం కాగానే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలు చేపట్టారు. 'నాడు-నేడు' పనులపై సభ్యులు లేవనెత్తిన అంశాలపై మంత్రి సమాధానమిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన 'నాడు-నేడు' పనుల అగ్రిమెంట్లు, ఎవరికి పనులు అప్పగించారు? నాసిరకంగా చేసిన పనులపై సమగ్ర విచారణ చేయిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం మూడు దశలుగా 'నాడు-నేడు' చేపట్టినప్పటికీ ఏ దశలోనూ పనులు పూర్తిచేయలేదని వివరించారు. ఈ పనులకు సంబంధించి సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ మెటీరియల్ టెండరు ప్రక్రియలో అవకతవకలపై అడ్వొకేట్ వెంకటరామిరెడ్డి గతేడాది నవంబరు 27న పిటిషన్ దాఖలు చేశారని తెలిపారు. ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎండీ నుంచి ప్రాథమిక నివేదిక అందిందని, తుది నివేదిక అందిన తర్వాత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యారంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేస్తుందని చెప్పారు. పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి, ఉత్తమ విద్యాబోధనలో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామన్నారు. క్రీడా మైదానాలు అభివృద్ధి చేసి అంతర్ పాఠశాలల పోటీలు నిర్వహిస్తామని, ఆర్ట్స్, క్రాఫ్ట్ కోర్సులు నేర్పించేలా చర్యలు తీసుకుంటామని లోకేశ్ వివరించారు.

కుటుంబం యూనిట్‌గా స్కిల్ సెన్సెస్

విద్యావంతులైన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కుటుంబం యూనిట్‌గా స్కిల్ సెన్సెస్ కార్యక్రమాన్ని చేపట్టామని లోకేశ్ తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఐటీఐ, పాలిటెక్నిక్‌లను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా రాష్ట్రంలో సాంకేతిక విద్యాసంస్థల పనితీరును మెరుగుపరచాల్సిన అవసరం ఉందని, దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని లోకేశ్ వివరించారు.

'మహీంద్రా' బ్లాక్‌లిస్ట్‌లో పోలీసు శాఖ

- ఇది సిగ్గుచేటు: హోంమంత్రి అనిత



అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): పోలీసు వాహనాలు కొనుగోలు చేసిన గత వైసీపీ ప్రభుత్వం... వాటికి బిల్లులు చెల్లించనందుకు ఏపీ పోలీసుశాఖను మహీంద్రా కంపెనీ బ్లాక్‌లిస్టులో పెట్టిందని, ఇది చాలా సిగ్గుచేటని హోంమంత్రి వంగలపూడి అనిత శాసనసభలో ప్రకటించారు. మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో బీజేపీ ఎమ్మెల్యే పెన్మత్స విష్ణుకుమార్ రాజు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. వాహనాల మరమ్మతులు, నూతన వాహనాల కొనుగోలుకు బడ్జెట్ కేటాయింపుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం పోలీసు వ్యవస్థను శాంతి భద్రతల పరిరక్షణకు కాకుండా ప్రతిపక్ష నేతల ఇళ్ల వద్ద కాపలా పెట్టడం, సీఎం పర్యటనలకు పరదాలు కట్టడం వంటి అవసరాలకు వాడుకుని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కులం ప్రాతిపదికన, తమ మాట వినని పోలీసు అధికారులను వీఆర్‌లో పెట్టి వేధింపులకు గురిచేసిందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు దాచుకున్న జీపీఎస్ సొమ్మును మళ్లించిన జగన్... ఇప్పుడు పోలీసుల విధులు, రాజ్యాంగం గురించి మాట్లాడుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లాల్లో పోస్టులు ఖాళీ అయిన వెంటనే వీఆర్‌లో ఉన్న ఇన్‌స్పెక్టర్లను నియమిస్తామని, లేదా అనువైన ఆప్షన్లు ఇచ్చి డిప్యుటేషన్‌పై నియమిస్తామని చెప్పారు. రాష్ట్రంలో 19,999 పోలీసు పోస్టులు ఖాళీ ఉన్నాయని హోంమంత్రి తెలిపారు.



రూ.11.11 లక్షల కోట్ల మూలధన వ్యయం

ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.11,11,111 కోట్లు మూలధన వ్యయంగా నిర్ణయించింది. మౌలిక వసతుల్లో ప్రైవేటు పెట్టుబడులను పెంచేందుకు వయబులిటీ గ్యాప్ ఫండింగ్‌ను ప్రవేశపెట్టనున్నట్టు ఆర్థిక మంత్రి ప్రకటించారు. రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో మౌలిక వసతులకు బలమైన ఆర్థిక మద్దతు ఇవ్వనున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అదే తరహాలో ఆర్థిక మద్దతు ఇచ్చేలా ప్రోత్సహించనున్నామన్నారు. మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఆర్థిక అవసరాల కోసం మార్కెట్ ఆధారిత ఆర్థిక సహాయ విధానం ఒకటి ప్రారంభించనున్నామని ఆమె చెప్పారు.



ఎంఎస్ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ పథకం

సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి సంస్థల (ఎంఎస్ఎంఈ) కోసం క్రెడిట్ గ్యారెంటీ పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ఈసారి బడ్జెట్లో ప్రభుత్వం ప్రకటించింది. ఈ స్కీమ్ ద్వారా ఎంఎస్ఎంఈలు యంత్రాలు, పరికరాల కొనుగోలు కోసం ఎలాంటి తనఖా లేదా థర్డ్ పార్టీ గ్యారెంటీ అవసరం లేకుండా టర్మ్ లోన్ తీసుకునే అవకాశం కల్పించనున్నట్లు కేంద్రం తెలిపింది. "ఎంఎస్ఎంఈలు, తయారీ యూనిట్లు, ముఖ్యంగా అధికంగా కార్మికులు అవసరమయ్యే పరిశ్రమలపై బడ్జెట్ ప్రత్యేక దృష్టి సారించింది. వారి కోసం ఓ ప్యాకేజీని రూపొందించాం. తాత్కాలిక బడ్జెట్లో ప్రస్తావించిన విధంగా ఈ ప్యాకేజీ ద్వారా ఫైనాన్సింగ్‌తో పాటు నిబంధనల సడలింపు, ఎంఎస్ఎంఈల వ్యాపార వృద్ధి, అంతర్జాతీయంగా పోటీపడేటట్లుగా చర్యలు చేపట్టనున్నామ"ని సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెల్ఫ్ ఫైనాన్సింగ్ ఫండ్ ప్రతి దరఖాస్తుదారుకు తీసుకునే రుణ విలువలో రూ.100 కోట్ల వరకు ప్రభుత్వం గ్యారెంటీ కల్పించనుందన్నారు.

ఈ-కామర్స్ హబ్‌ల ఏర్పాటు

తొలుత 10-15 కేంద్రాల స్థాపన ▸▸ ఎగుమతులకు మరింత ప్రోత్సాహం

దేశంలో ఎగుమతులను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య(పీపీపీ) పద్ధతిన ఈ-కామర్స్ హబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. తొలుత 10-15 హబ్‌లను స్థాపించనున్నారు. "సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి కంపెనీలు(ఎంఎస్ఎంఈ), హస్త కళాకారులు తమ ఉత్పత్తులను అంతర్జాతీయ విపణిలో విక్రయించేందుకు వీలుగా పీపీపీ పద్ధతిన ఈ-కామర్స్ ఎక్స్‌పోర్ట్ హబ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు" బడ్జెట్ ప్రసంగంలో సీతారమన్ పేర్కొన్నారు. నిరంతరాయ నియంత్రణ, రవాణా వ్యవస్థగా ఏర్పాటు కానున్న ఈ హబ్‌లు వాణిజ్యంతోపాటు ఎగుమతి సంబంధిత సేవలందించనున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ హబ్‌లు త్వరితగతి కస్టమ్స్ అనుమతులు వంటి వసతులను కలిగి ఉండనున్నాయని, భారీ సరుకు రవాణా కేంద్రాలకు దగ్గర్లో ఉండనున్నాయని కేంద్ర వాణిజ్య పరిశ్రమ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. తొలుత పది నుంచి పదిహేను హబ్‌లను ఏర్పాటు చేస్తామని, మంచి స్పందన లభిస్తే భవిష్యత్‌లో వీటి సంఖ్యను మరింత పెంచుతామన్నారు. ఇండస్ట్రీతో సంప్రదింపులతో వీటిని గుర్తించడం జరుగుతుందని, వీటి ఏర్పాటుకు వారే ముందుకు రావాలన్నారు. ఈ హబ్‌లకు నియంత్రణ నియమావళి రూపకల్పనపై వాణిజ్య మంత్రిత్వ శాఖ కసరత్తు జరుపుతోంది. సెప్టెంబరు నాటికల్లా సిద్ధం కావచ్చని అంచనా.

ఆయిల్ కంపెనీలకు రిక్తహస్తం

ఈ బడ్జెట్ ప్రభుత్వ రంగంలోని బీపీసీఎల్, ఐఓసీ, హెచ్‌పీసీఎల్ కంపెనీలను నిరాశ పరిచింది. రైట్స్ ఇష్యూల ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఈ కంపెనీలకు రూ.15,000 కోట్లు సమకూరుస్తామని ఫిబ్రవరిలో ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ప్రకటించారు. మంగళవారం నాటి బడ్జెట్‌లో అసలు ఆ ఊసే లేదు. గత ఆర్థిక సంవత్సరమూ ప్రభుత్వం ఇలానే రూ.30,000 కోట్లు ఇస్తామని బడ్జెట్‌లో ప్రకటించి, చివరికి పైసా కూడా విదల్చలేదు. గత ఆర్థిక సంవత్సరం ఈ మూడు ఆయిల్ కంపెనీలు రూ.80,0000 కోట్లకు పైగా లాభాలు ఆర్జించడం ఇందుకు ప్రధాన కారణం.

ఎంఆర్ఓ కార్యకలాపాలకు ఊతం

వైమానిక, నౌకాయానాలకు సంబంధించిన నిర్వహణ, రిపేర్లు, ఓవర్‌హాలింగ్ (ఎంఆర్ఓ) కార్యకలాపాలకు మన దేశాన్ని ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకూ ఈ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి కొన్ని చర్యలు ప్రకటించారు. విమానాలు, నౌకల రిపేర్ల కోసం దిగుమతి చేసుకున్న వస్తువుల ఎగుమతి గడువుని ఆరు నెలల నుంచి ఏడాదికి పెంచారు. అలాగే ఇందుకోసం వారంటీతో తిరిగి దిగుమతి చేసుకునే వస్తువుల కాలపరిమితినీ ప్రస్తుత మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పెంచారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న వైమానిక, నౌకాయానాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక మంత్రి ఈ ప్రోత్సాహకాలు ప్రకటించారు.

ద్రవ్యలోటు అంచనా 4.9 శాతం

ఆదాయ అవకాశాలు మెరుగుపడిన నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) ద్రవ్య లోటును జీడీపీలో 4.9 శాతానికి కట్టడి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో ప్రకటించిన 5.1 శాతం లోటు అంచనాతో పోలిస్తే, మరింత కుదించింది. అయితే, వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26) గాను 4.5 శాతం ద్రవ్య లోటు అంచనాను మాత్రం యథాతథంగా కొనసాగించింది. "ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆదాయం రూ.32.07 లక్షల కోట్లుగా, వ్యయాలు రూ.48.21 లక్షల కోట్లుగా ఉండవచ్చు. ఈ నేపథ్యంలో ద్రవ్య లోటు రూ.16.14 లక్షల కోట్లకు (జీడీపీలో 4.9 శాతం) పరిమితం కావచ్చ"ని బడ్జెట్ ప్రసంగంలో నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 2021లో నేను ప్రకటించిన ద్రవ్య స్థిరీకరణ ప్రణాళిక మన ఆర్థిక వ్యవస్థకు మంచి ఫలితాలందించిందని, 2025-26లో లోటును 4.5 శాతం దిగువకు కట్టడి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి పేర్కొన్నారు. ఆపై ఆర్థిక సంవత్సరం (2026-27) నుంచి రుణ-జీడీపీ నిష్పత్తిని తగ్గించడంపై దృష్టిసారిస్తామని, ఈ నిష్పత్తి తగ్గుముఖం పట్టేలా ప్రతి యేటా ద్రవ్య లోటు నియంత్రణ లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం జరుగుతుందన్నారు.

మరింత పటిష్ఠంగా దివాలా చట్టం

దివాలా చట్టాని (ఐబీసీ)కి మరింత పదును పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మరిన్ని ట్రిబ్యునల్స్, ప్రస్తుతం ఉన్న ఎన్‌సీఎల్‌టీల్లో మరిన్ని బెంచ్‌లు ఏర్పాటు చేయబోతున్నట్టు ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. దీనికి తోడు దివాలా పరిష్కార ప్రక్రియను మరింత త్వరితం చేసేందుకు స్టేక్‌హోల్డర్లు అందరితో కూడిన ఒక సమగ్ర టెక్నాలజీ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేస్తామన్నారు. అవసరాన్ని బట్టి దివాలా చట్టంలో మరిన్ని మార్పులకూ సిద్ధమన్నారు. 2016లో అమల్లోకి వచ్చిన ఐబీసీతో ఇప్పటి వరకు వెయ్యికి పైగా కంపెనీల దివాలా ప్రక్రియను పరిష్కరించినట్టు తెలిపారు. దీంతో ఈ కంపెనీలకు రుణాలు ఇచ్చిన రుణదాతలకు రూ.3.3 లక్షల కోట్ల రుణాలు వసూలైనట్టు వెల్లడించారు. ఇవిగాక రూ.10 లక్షల కోట్లకుపైగా రుణాలతో ముడిపడిన 28,000 దివాలా కేసులు, పరిష్కార ప్రక్రియకు రాకుండానే పరిష్కారమైనట్టు తెలిపారు. దివాలా కేసులను మరింత వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు.

రుణ సమీకరణ లక్ష్యం కుదింపు

దేశంలో పన్ను వసూళ్లు పెరగడంతో ఈ ఏడాదికి రుణ సమీకరణ లక్ష్యాన్ని రూ.14.01 లక్షల కోట్లకి కుదించినట్టు ఆర్థిక మంత్రి తెలిపారు. మధ్యంతర బడ్జెట్లో ఈ లక్ష్యం రూ.14.13 లక్షల కోట్లుగా ప్రకటించారు. విత్తలోటు లక్ష్యాల సాధన కోసం ప్రభుత్వం నిర్దిష్ట కాలపరిమితితో కూడిన సెక్యూరిటీలు జారీ చేస్తుంది. అదే విధంగా నికర రుణ సమీకరణ లక్ష్యాన్ని కూడా రూ.11.63 లక్షల కోట్లకు కుదించారు.

పెట్టుబడుల ఉపసంహరణ @ రూ.50 వేల కోట్లు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తుల నగదీకరణ ద్వారా రూ.50 వేల కోట్లు సమీకరించుకోవాలనుకుంటున్నట్టు దీపమ్ కార్యదర్శి తుహిన్ కాంత పాండే తెలిపారు. ఈ ఏడాది ఆర్‌బీఐ, బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రూ.2,32,874 కోట్లు డివిడెండ్‌గా వస్తుందని బడ్జెట్ అంచనా వేసింది. తాత్కాలిక బడ్జెట్ అంచనా రూ.1.02 లక్షల కోట్ల కన్నా ఇది రెట్టింపు అధికం.

క్యాపిటల్ మార్కెట్‌పై పన్ను పోటు

హేతుబద్ధీకరణ పేరుతో వడ్డించిన ఆర్థిక మంత్రి.. మూలధన లాభాలపై బాదుడు

- ఎల్‌టీసీజీటీ 10 నుంచి 12.5 శాతానికి పెంపు
- రూ.15,000 కోట్ల అదనపు ఆదాయం
- డెరివేటివ్స్ ట్రేడింగ్‌పై ఎస్‌టీటీ పెంపు
- వాటాదారులపైనే ఇక 'బై బ్యాక్'ల భారం



న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన తాజా బడ్జెట్‌లో క్యాపిటల్ మార్కెట్‌పై పెద్ద భారమే మోపారు. ఏడాదికిపైగా ఉంచుకుని అమ్మే లిస్టెడ్ కంపెనీల షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల వంటి ఫైనాన్షియల్ అసెట్స్ అమ్మకాలపై వచ్చే లాభాలపై విధించే దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ)ని ప్రస్తుత 10 శాతం నుంచి 12.5 శాతానికి పెంచారు. అలాగే అన్‌లిస్టెడ్ ఫైనాన్షియల్ అసెట్స్, నాన్ ఫైనాన్షియల్ అసెట్స్‌ను రెండేళ్ల పాటు ఉంచుకుని అమ్మితే వచ్చే దీర్ఘకాలిక మూలధన లాభాలపైన 12.5 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే అన్‌లిస్టెడ్ బాండ్స్, డిబెంచర్లకు ఈ నిబంధన వర్తించదు. వీటి అమ్మకాలపై వచ్చే లాభాలపై ఆయా వ్యక్తుల ఆదాయ శ్లాబులను బట్టి పన్ను విధిస్తారు.

స్వల్పకాలిక లాభాల పన్ను: ఇదే సమయంలో ఏడాది కంటే తక్కువ సమయం ఉంచుకుని అమ్మే లిస్టెడ్ కంపెనీల షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లు, బిజినెస్ ట్రస్టుల యూనిట్లపై వచ్చే లాభాలపై విధించే స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను (ఎస్‌టీసీజీ)ని ప్రస్తుత 15 శాతం నుంచి 20 శాతానికి పెంచారు. బడ్జెట్ అనంతరం జరిగిన సమావేశంలో ఆర్థిక మంత్రి సీతారామన్ ఈ మార్పులను మూలధన లాభాల పన్ను హేతుబద్ధీకరణగా అభివర్ణించారు. ఈ మార్పులతో క్యాపిటల్ మార్కెట్లో పెట్టుబడులు మరింత పెరుగుతాయని తెలిపారు.

ఖజానాకు భారీగా రాబడి: మూలధన లాభాల పన్ను రేట్ల మార్పుతో కేంద్ర ప్రభుత్వ ఖజానాకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అదనంగా రూ.15,000 కోట్ల ఆదాయం సమకూరనుంది. బడ్జెట్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా ఈ విషయం వెల్లడించారు. ఇదే సమావేశంలో పాల్గొన్న ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్ మాత్రం 'మూలధన పన్నుల విధానాన్ని సులభతరం చేశాం' అని అన్నారు.

'డెరివేటివ్స్' ట్రేడింగ్ మరింత భారం

ఈ ఏడాది అక్టోబరు 1 నుంచి ఎఫ్ అండ్ ఓ (డెరివేటివ్స్) ట్రేడింగ్ ఒకింత భారం కానుంది. ఆప్షన్ అమ్మకాలపై విధించే సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ)ని 0.0625 శాతం నుంచి 0.1 శాతానికి పెంచారు. ఆప్షన్ ప్రీమియంపై ఈ పన్ను విధిస్తారు. అలాగే ఫ్యూచర్స్ మార్కెట్లో సెక్యూరిటీల అమ్మకాలపై విధించే ఎస్‌టీటీని 0.0125 శాతం నుంచి 0.02 శాతానికి పెంచారు. ఇటీవల డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో అనేక మంది రిటైల్ ఇన్వెస్టర్లు చేతులు కాల్చుకుంటున్నారు. అత్యంత రిస్క్‌తో కూడిన ఈ మార్కెట్లో రిటైల్ మదుపరుల ప్రవేశాన్ని నిరుత్సాహపరిచేందుకు ఆర్థిక మంత్రి ఈ చర్య తీసుకున్నారని భావిస్తున్నారు. అయితే మార్కెట్‌పై దీని ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని మార్కెట్ వర్గాల అంచనా.

'బైబ్యాక్'లపైనా వడ్డింపు

లిస్టెడ్ కంపెనీలు చేసే షేర్ల బై బ్యాక్.. వాటాదారులకు ఇక పెద్ద భారం కానుంది. ఈ బై బ్యాక్‌లను డివిడెండ్లుగా పరిగణించి వాటాదారులపైనే పన్ను విధిస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. పుష్కలంగా మిగులు నిధులు ఉన్న లిస్టెడ్ కంపెనీలు, మార్కెట్ ధర కంటే అధిక ధరకు తమ షేర్లను వాటాదారుల నుంచి బై బ్యాక్ చేస్తుంటాయి. ఇప్పటి వరకు ఈ బై బ్యాక్‌ల పన్ను భారం వాటాదారులపై పడేది కాదు. కంపెనీలే ఆ భారం భరించేవి. అక్టోబరు 1 నుంచి ఈ భారం వాటాదారులపై పడనుంది. దీంతో షేర్ల బై బ్యాక్‌ల బాగా తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు.

'స్టార్టప్స్'కు ఊరట..

ఏంజిల్ ట్యాక్స్‌కు గుడ్‌బై

స్టార్టప్ కంపెనీలకు ఆర్థిక మంత్రి సీతారామన్ ఈ బడ్జెట్‌లో పెద్ద శుభ వార్త చెప్పారు. ఈ సంస్థల్లోకి వచ్చే పెట్టుబడులపై విధిస్తున్న ఏంజిల్ ట్యాక్స్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. అన్ని తరగతుల పెట్టుబడులకు ఈ నిర్ణయం వర్తిస్తుందన్నారు. ఈ నిర్ణయంపై స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. స్టార్టప్‌ల నిధుల సేకరణకు ఈ నిర్ణయం ఎంతగానో తోడ్పడటమే కాకుండా దేశంలో స్టార్టప్‌ల అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు.

మార్కెట్‌కు బడ్జెట్ కుదుపు

▸▸ **ఎస్‌టీటీ, ఎల్‌టీసీజీ పెంపుతో**

సెన్సెక్స్ ఒకదశలో 1278 పాయింట్లు పతనం

▸▸ **చివరికి 73 పాయింట్ల నష్టంతో సరి**

గత ఐదు బడ్జెట్‌లు ప్రవేశ పెట్టిన రోజు సూచీల స్పందన

	సెన్సెక్స్		నిఫ్టీ	
	లాభం/(నష్టం)	ముగింపు	లాభం/(నష్టం)	ముగింపు
2023	158.18	59,708.08	(45.85)	17,616.30
2022	848.40	58,862.57	237	17,576.85
2021	2,314.84	48,600.61	646.60	14,281.20
2020	(987.96)	39,735.53	(300.25)	11,661.85
2019	212.74	36,469.43	62.70	10,893.65

ముంబై: బడ్జెట్ నిర్ణయాలు స్టాక్ మార్కెట్‌ను కుదిపేశాయి. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌పై సెక్యూరిటీ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ)తో పాటు ఈక్విటీలపై క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ పెంపుతో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మార్కెట్ వర్గాలకు గట్టి షాక్ ఇచ్చింది. దాంతో ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటంతో సెన్సెక్స్ ఒక దశలో 1,278 పాయింట్ల వరకు క్షీణించి.. 79,224 వద్దకు జారుకుంది. మళ్లీ క్రమంగా తేరుకున్న సూచీ చివరికి 73.04 పాయింట్ల నష్టంతో 80,429.04 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 435 పాయింట్ల వరకు పతనమై 24,074 స్థాయికి దిగివచ్చింది. మధ్యాహ్నం మళ్లీ కాస్త తేరుకుని 30.20 పాయింట్ల నష్టంతో 24,479.05 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 16 నేలచూపులు చూశాయి.

లాభ నష్టాల మధ్య ఊగిసలాట: బడ్జెట్ నేపథ్యంలో సూచీలు ఆద్యంతం తీవ్ర ఒడుదుడుకులకు లోనయ్యాయి. రోజంతా లాభ, నష్టాల మధ్య ఊగిసలాడాయి. ఆరంభంలో స్వల్ప లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్, నిఫ్టీ.. పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రసంగం ప్రారంభయ్యే సమయానికి స్వల్ప నష్టాల్లో ట్రేడయ్యాయి. ఎస్‌టీటీ, ఎల్‌టీసీజీ పెంపు ప్రకటనపై తీవ్రంగా స్పందించిన ఇన్వెస్టర్లు అమ్మకాలను పోటెత్తించారు. ఒకదశలో భారీ నష్టాల్లోకి జారుకున్న సూచీలు.. ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలో కొనుగోళ్లతో మళ్లీ తేరుకున్నాయి. ద్రవ్యలోటు తగ్గింపు, మౌలిక ప్రాజెక్టులపై భారీగా వెచ్చించనుండటంతో పాటు గ్రామీణ మార్కెట్‌లో కొనుగోలు శక్తి పెంచడంపై ప్రభుత్వం దృష్టిసారించడం వంటి అంశాలు మార్కెట్ రికవరీకి దోహదపడ్డాయని మెహతా ఈక్విటీస్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సే అన్నారు.

జువెలరీ షేర్లు జిగేల్: బంగారం, వెండిపై కస్టమ్స్ సుంకం తగ్గింపు ప్రకటనతో స్వర్ణాభరణ విక్రయ కంపెనీల షేర్లు భారీగా పుంజుకున్నాయి. బీఎస్ఈలో త్రిభువన్‌దాస్ భీమ్‌జీ జవేరీ షేరు ఏకంగా 13.86 శాతం ఎగబాకి రూ.155.30 వద్ద ముగిసింది. టైటాన్ 6.63 శాతం పెరిగింది. రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ 6.32 శాతం, పీసీ జువెలర్స్ 5 శాతం, సెన్‌కో గోల్డ్ 4.75 శాతం, కల్యాణ్ జువెలర్స్ 4.53 శాతం లాభపడ్డాయి.

రొయ్యల షేర్లు జూమ్: రొయ్యల పెంపకం, మార్కెటింగ్‌కు ప్రభుత్వం రుణం సమకూర్చటంతో పాటు రొయ్య పిల్లలపై కస్టమ్స్ డ్యూటీని సైతం 5 శాతానికి తగ్గించడంతో ఈ రంగ షేర్లలో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. బీఎస్ఈలో జీల్ ఆక్వా షేరు 9.75 శాతం ఎగబాకగా.. అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ 3.07 శాతం, వాటర్‌బేస్ 2.33 శాతం, కోస్టల్ కార్ప్ 2.28 శాతం, అవంతీ ఫీడ్స్ 4.60 శాతం లాభపడ్డాయి.

హెరిటేజ్ లాభంలో 249 శాతం వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెరిటేజ్ ఫుడ్స్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి (క్యూ1)గాను కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం ఏకంగా 249 శాతం వృద్ధి చెంది రూ.58.4 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో నికర లాభం 16.73 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ రెవెన్యూ 11.8 శాతం వృద్ధితో రూ.923.68 కోట్ల నుంచి రూ.1,032.70 కోట్లకు చేరుకుంది. తొలిసారిగా ఒక త్రైమాసిక కాలంలో కంపెనీ రెవెన్యూ రూ.1,000 కోట్ల మార్కును అధిగమించిందని హెరిటేజ్ ఫుడ్స్ వెల్లడించింది. కాగా ఈ కాలంలో వాల్యూ యాడెడ్ ఉత్పత్తుల రెవెన్యూ 19.9 శాతం వృద్ధితో రూ.422.80 కోట్లకు చేరుకుందని పేర్కొంది.

హెచ్125 హెలికాప్టర్ల తయారీకి ఎయిర్‌బస్,టీఏఎస్ఎల్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత్‌లో సింగిల్ ఇంజన్ హెచ్125 హెలికాప్టర్ల తయారీకి సంబంధించి తుది అసెంబ్లింగ్ లైన్ (ఎఫ్ఏఎల్)ను ఏర్పాటు చేసేందుకు టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్), ఎయిర్‌బస్ హెలికాప్టర్స్ అధికారికంగా ఒప్పందం కుదుర్చుకున్నాయి.టీఏఎస్ఎల్ ఇప్పటికే ఎయిర్‌బోర్న్ ప్లాట్‌ఫామ్స్‌లో కీలకంగా ఉందని, ఎయిర్‌బస్ గ్రూప్‌తో ప్రస్తుత భాగస్వామ్యం దీన్ని మరింత పటిష్ఠం చేయనుందని టీఏఎస్ఎల్ సీఈఓ, ఎండీ సుకరన్ సింగ్ తెలిపారు. మేడిన్ ఇండియా హెచ్125 హెలికాప్టర్ల డెలివరీలను 2026 నుంచి ప్రారంభించాలని కంపెనీ భావిస్తోంది. కాగా టీఏఎస్ఎల్.. హైదరాబాద్ సమీపంలోని ఆదిభట్లలో ప్లాంట్‌ను నిర్వహిస్తోంది. దీంతో హైదరాబాద్‌లోనే హెచ్ 125 హెలికాప్టర్ల పూర్తి అసెంబ్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	70,860 ▼	64,950 ▼	92,500 ▼
ముంబై	69,602 ▼	63,755 ▼	84,919 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

24వ తేదీ

హైదరాబాద్	490	విజయవాడ	500
వరంగల్	492	గోదావరి	485
చిత్తూరు	573	విశాఖపట్నం	500

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	112	విజయవాడ	112
వరంగల్	112	గుంటూరు	115
కరీంనగర్	112	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	129
కర్నూలు	112	నెల్లూరు	129
విశాఖపట్నం	101	అనంతపురం	112
గోదావరి	112		

కొండంత ఆశల బడ్జెట్

మోదీ 3.0 హయాంలో ప్రతిపాదించిన ఈ తొలి బడ్జెట్ వికసిత్ భారత్ ఆశలన్నీ ఒకేసారి తీర్చాలన్న ఆతృతలో రూపొందించినట్టుగా కనిపిస్తోంది. బడ్జెట్ 9 ప్రాధాన్యతాంశాలపై దృష్టి కేంద్రీకరించింది. వాటిలో అత్యంత ప్రధానమైనది వ్యవసాయం. ఈ రంగంలో దిగుబడులు నిరాశావహంగా ఉండడం వల్ల ద్రవ్యోల్బణం పెరిగిపోతోంది. ఈ రంగాన్ని పటిష్ఠం చేయడానికి బడ్జెట్ పెద్దపీట వేసింది. ఆత్మనిర్భర్ భారత్ కింద నూనె గింజలు, పప్పు దినుసులపై పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు పెంచాలని నిర్ణయించారు. అలాగే దేశవ్యాప్తంగా కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయంలోకి ఆకర్షించడానికి ఒక ప్రత్యేక పథకం అమలు చేయనున్నారు. రెండో కీలక ప్రాధాన్యతా విభాగం నైపుణ్యాలు, ఉపాధి కల్పన. గత పదేళ్ల కాలంలో 12 కోట్ల ఉద్యోగాల కల్పన జరిగి, నిరుద్యోగిత శాతం 3.2 శాతానికే పరిమితమైంది. అయినప్పటికీ నిరుద్యోగం అధికంగా ఉందనే భావన ప్రజల్లో ఉంది. 90 శాతం ఉద్యోగాలు అవ్యవస్థీకృత రంగంలో ఏర్పడడమే ఇందుకు కారణం. అవ్యవస్థీకృత రంగంలోని ఉద్యోగాలను వ్యవస్థీకృతం చేయడం లక్ష్యంగా తొలిసారిగా ఉద్యోగాలు పొందిన వారికి, ఉద్యోగాలు ఇచ్చిన యాజమాన్యాలకు ఈపీఎఫ్ఓలో నమోదు ఆధారంగా కొన్ని ప్రోత్సాహకాలు ప్రకటించారు. దేశంలో జీడీపీ వృద్ధి రేటు 8 శాతం స్థాయిలో ఉన్నప్పటికీ నికర వినియోగం రేటు 5 శాతం, నికర పొదుపు రేటు కూడా 5-5.5 శాతానికి పరిమితం అయ్యాయి. ప్రజలకి ఆదాయాలు వస్తున్నప్పటికీ ఆ సొమ్ము అంతా ఖర్చయిపోవడమే ఇందుకు కారణం. ఆహార ద్రవ్యోల్బణం 7.5 శాతం స్థాయిలో కదలాడుతున్నందు వల్ల ప్రజలు సంపాదించిన దాంట్లో అధిక శాతం ఖర్చు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయ రంగాన్ని ఉత్తేజితం చేసేందుకు తీసుకున్న చర్యలు ఈ లోపాన్ని సరిదిద్దుతాయి. ఇక ఎంఎస్ఎంఈ రుణాల విషయంలో ఒక కీలకమైన నిర్ణయం ప్రకటించారు. ఇప్పటివరకు ఎంఎస్ఎంఈలకు ఆస్తి ఆధారంగా రుణాలిచ్చేవారు. ఇప్పుడు ఎంఎస్ఎంఈలకు అందుతున్న డిజిటల్ చెల్లింపుల ఆదాయం ఆధారంగా రుణాలందించే విధానం అనుసరించనున్నట్టు ప్రకటించారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం ఈ బడ్జెట్లో మరో విశేషాంశం. స్థూలంగా ఇది వ్యవసాయ, ఉపాధి కల్పన, సంస్కరణలపై ఫోకస్ పెట్టిన బడ్జెట్‌గా కనిపిస్తోంది.



-కె.నరసింహమూర్తి
రచయిత ఆర్థిక నిపుణుడు



85 నిమిషాల్లో ముగిసిన బడ్జెట్ ప్రసంగం

వరుసగా ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారు నిర్మలాసీతారామన్. ఈసారి బడ్జెట్ ప్రసంగాన్ని ఆమె 85 నిమిషాల్లో ముగించారు. పూర్తిస్థాయి బడ్జెట్ సందర్భంగా ఆమె ఇచ్చిన అతి చిన్న బడ్జెట్ ప్రసంగం ఇదే. ఈ ఏడాది ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్ ప్రసంగం 56 నిమిషాల్లో ముగిసింది. 2023లో 87నిమిషాలు, 2022లో 90, 2021లో 100, 2020లో 162, 2019లో 135 నిమిషాల పాటు నిర్మల బడ్జెట్ ప్రసంగాలు సాగాయి.



ఎన్‌పీఎస్‌లో మార్పులపై త్వరలో నిర్ణయం

కొత్త పింఛను పథకం(ఎన్‌పీఎస్)లో వివాదాస్పద అంశాలకు పరిష్కారం కనుగొంటామని, త్వరలోనే ఒక నిర్ణయానికి వస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ పథకాన్ని సమీక్షించేందుకు ఆర్థిక శాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ ఎంతో పురోగతి సాధించిందని చెప్పారు. బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న పలు రాష్ట్రాలు పాత పింఛను పథకానికి (ఓపీఎస్) మళ్లిన నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లోనూ ఉద్యోగ సంఘాలు ఆ డిమాండ్‌ను లేవనెత్తుతున్నాయి.



పింఛను లెక్క (రూ.కోట్లలో)

2021-22	2023-24
1,98,962	2,38,049
2022-23	2024-25
2,41,599	2,43,296

యువ మిత్ర!

యువతను, మిత్ర పక్షాలను సంతృప్తిపరిచేలా బడ్జెట్

యువతకు ఉపాధి, శిక్షణ.. కొంతమంది ఉద్యోగులకు ఊరట.. మిత్రులకు నిధులు లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తన పూర్తిస్థాయి బడ్జెట్‌ను మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరిలో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పుడు రూ.48.21 లక్షల కోట్లతో పూర్తిస్థాయి పద్దును సమర్పించారు. తొమ్మిది రంగాలు, నాలుగు అంశాలపై ప్రధానంగా దృష్టిసారించారు. గతానికి భిన్నంగా ఎటువంటి సూక్తులు, సుత్తి లేకుండా నేరుగా బడ్జెట్ ప్రసంగం కొనసాగించారు. భారత్‌లో నిరుద్యోగం 9.2 శాతానికి చేరిందని, వికసిత భారత్‌కు, ఆర్థిక వృద్ధికి ఇది ప్రధాన అవరోధంగా మారిందన్న ఆందోళనల నేపథ్యంలో యువతకు ఉపాధి కల్పన, నైపుణ్య శిక్షణపై ప్రత్యేక దృష్టిసారించారు. 'పీఎం ప్యాకేజీ' కింద రాబోయే ఐదేళ్లలో 4.1కోట్ల యువతకు లబ్ధి చేకూరేలా రూ.2లక్షల కోట్లతో ఐదు పథకాలను ప్రకటించారు. కొత్తగా ఉద్యోగంలో చేరే వారికి ఒక నెల వేతనాన్ని (గరిష్ఠంగా రూ.15 వేలు) బోనస్‌గా ఇవ్వడం.. ఈపీఎఫ్‌వో చెల్లింపుల ఆధారంగా ఉద్యోగికి, యజమాన్యానికి ప్రోత్సాహకాలు ఇవ్వడం.. అదనపు ఉద్యోగాలు కల్పించే సంస్థలకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించడం ఇందులో భాగంగా ఉన్నాయి. అంటే, కొత్త ఉద్యోగులకు సంస్థలు చెల్లించే ఈపీఎఫ్‌వో వాటాను నెలకు రూ.3000 చొప్పున రెండేళ్లపాటు తిరిగి రీయింబర్స్ చేయనుంది. ఈ మూడు పథకాలకు దాదాపు లక్ష కోట్లను ఖర్చు చేయనుంది. యువతలో సగం మందికి మాత్రమే ఉద్యోగ నైపుణ్యాలు ఉన్నాయని ఆర్థిక సర్వే కూడా ఘోషించిన నేపథ్యంలో రాబోయే ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. దేశంలోని 500 అగ్రశ్రేణి కంపెనీల్లో కోటి మందికి ఇంటెర్న్‌షిప్‌ను కల్పించనుంది. యువతకు ఉపాధి పెంచేందుకు ముద్రా రుణాల పరిమితిని రూ.10లక్షల నుంచి రూ.20లక్షలకు పెంచింది. విద్యార్థులకు రూ.10లక్షల వరకూ విద్యా రుణాలు ఇవ్వాలని సంకల్పించింది. వాటిపై 3 శాతం వడ్డీ రాయితీ ఇస్తామని ప్రకటించింది. మహిళలపైనా కొన్ని వరాలను కురిపించింది. మహిళల పేరిట ఆస్తుల రిజిస్ట్రేషన్‌పై స్టాంపు డ్యూటీని తగ్గించాలని ప్రతిపాదించింది.మహిళలు, బాలికల అభివృద్ధికి రూ.3లక్షల కోట్లను కేటాయించింది. ఉద్యోగాలు చేసే మహిళల కోసం ప్రత్యేకంగా హాస్టళ్లను నిర్మించనుంది.

...మిత్రో!

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పూర్తిస్థాయి మెజారిటీ రాకపోవడంతో ఎన్డీయే మిత్రులపై ఆధారపడాల్సిన పరిస్థితి. ఇప్పటికే బిహార్ సీఎం నితీశ్ కుమార్ తమకు ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీ కావాలని డిమాండ్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే, బడ్జెట్లో మిత్రులకు పెద్దపీట వేశారు. సర్కారు ఏర్పాటులో కీలకంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్‌పై వరాలు కురిపించారు. ఏపీ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు.. ఏపీ రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు ఇస్తామని చెబుతూనే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని సంకల్పం చెప్పుకొన్నారు. విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని కొప్పర్తి నోడ్, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లోని ఓర్వకల్లు నోడ్‌కు నిధులిస్తామని ప్రకటించింది. వెనకబడిన జిల్లాలకు గ్రాంట్లు ఇస్తామని తెలిపింది. బిహార్‌కు రూ.26వేల కోట్లతో రోడ్లు, వంతెనలు;రూ.21వేల కోట్లతో అణు విద్యుత్తు ప్లాంట్, విమానాశ్రయాలు, మెడికల్ కాలేజీలు తదితర వరాలు ప్రకటించింది. బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధికి 'పూర్వోదయ' పథకాన్ని ప్రకటించింది. బిహార్ సహా 5 వరద బాధిత రాష్ట్రాలకు ప్రత్యేక నిధులు ఇస్తామని తెలిపింది. ఏకంగా ఎనిమిది మంది ఎంపీలను గెలిపించినా తెలంగాణకు మొండిచెయ్యే


బడ్జెట్ ప్రసంగానికి ముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన ఆర్థిక మంత్రి నిర్మల

లోని హామీలను అమలు చేయాలని అడిగినా పట్టించుకోలేదు. కొత్తగా ఎటువంటి వరాలూ ప్రకటించలేదు.

ఈసారి వాటి ఊసేదీ..!?

బడ్జెట్‌లో రైల్వేకు కేటాయింపులు తప్పనిసరి. అలాగే, ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ (డిజిన్వెస్ట్‌మెంట్) ఉంటూ ఉంటుంది. కానీ, మధ్యంతర బడ్జెట్‌లో కేటాయింపులు తప్పితే ఈసారి బడ్జెట్లో రైల్వే, డిజిన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించి ఎటువంటి ప్రకటనా లేదు. నదుల అనుసంధానాన్ని మాట మాత్రంగా కూడా ప్రస్తావించలేదు. అదే సమయంలో, ఎప్పట్లాగే, మౌలిక సదుపాయాలు(ఇన్ఫ్రా), ఇండస్ట్రియల్ పార్కులు, కారిడార్లకు నిధులు కేటాయించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్రాలకు 1.5 లక్షల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇస్తామని ప్రకటించారు. మధ్యంతర బడ్జెట్లో ప్రకటించిన రూ.11.11లక్షల కోట్లనే మూలధన వ్యయం (క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్)గా చూపారు. కాకపోతే, సంక్షోభంలో ఉన్న ఎంఎస్‌ఎంఈలను ఆదుకోవడానికి బడ్జెట్లో కొన్ని పథకాలను ప్రకటించారు. వాటికి క్రెడిట్ గ్యారెంటీ పథకాలతోపాటు త్వరలో రూ.100కోట్ల రుణాలు ఇచ్చే పథకాన్ని ప్రకటిస్తామని వెల్లడించారు. తనఖాలు, గ్యారెంటీలు లేకుండా యంత్ర పరికరాల కొనుగోలుకు టర్మ్ రుణాలు ఇస్తామని తెలిపారు. ఎంఎస్‌ఎంఈ క్లస్టర్లు, సిడ్బీ బ్రాంచిలు ఏర్పాటు చేస్తామని, వంద నగరాల్లో పారిశ్రామిక పార్కులు, 12పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రూ.లక్ష కోట్లతో ప్రైవేటు రంగంలో ఇన్నోవేషన్, పరిశోధన సంస్థలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్మికుల కోసం డార్మిటరీ తరహాలో ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఇక,వ్యవసాయ రంగానికి రూ.1.52లక్షల కోట్లను కేటాయించింది. ప్రకృతి వ్యవసాయంలోకి మరో కోటి మంది రైతులను తీసుకొస్తామని, కూరగాయల ఉత్పత్తికి క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. 5కోట్ల మంది గిరిజనులకు లబ్ధి చేకూర్చేందుకు జన తాంత్రియ యోజన అమలు చేస్తామని వెల్లడించింది. ఈ బడ్జెట్లో ధనిక, పేద తారతమ్యాన్ని తగ్గించేందుకు ఎటువంటి చర్యలూ ప్రకటించలేదు. మధ్యంతర బడ్జెట్లో ప్రాధాన్యంగా తీసుకున్న 'నిరుపేదలు' అనే అంశం.. ఈసారి లేకపోవడం గమనార్హం!!

- సెంట్రల్ డెస్క్

రాష్ట్రాలకు ఏమిచ్చారు (రూ.లక్షల కోట్లలో)

2022-23	18.64
2023-24	20.98
2024-25	23.48

రాయితీలకు మంగళం

ఎప్పట్నుంచో అమల్లో ఉన్న ఆదాయ పన్ను విధానంలో ఇంటి నిర్మాణం, పిల్లల ఫీజులు, పొదుపు తదితరాలకు రాయితీలు ఉంటాయి. బీజేపీ సర్కారు గతంలో తెరపైకి తెచ్చిన కొత్త విధానంలో వీటికి మంగళం పలికింది. ఈ నేపథ్యంలోనే తమకు మరిన్ని రాయితీలు ఇవ్వాలని వేతనజీవులు పదే పదే కోరుతున్నారు. కానీ, ఎప్పట్లాగే, ఈసారి కూడా బడ్జెట్లో కొత్త విధానానికే కేంద్రం పెద్దపీట వేసింది. స్టాండర్డ్ డిడక్షన్‌తోపాటు శ్లాబులను కూడా కొత్త విధానంలోనే మార్చింది. తద్వారా, పాత విధానానికి పూర్తిస్థాయిలో పాతర వేసింది. అంతేనా.. వచ్చే ఏడాది నుంచి పాత విధానానికి పూర్తిస్థాయిలో మంగళం పాడతారన్న ఊహాగానాలూ వెలువడుతున్నాయి. ఇక, బడ్జెట్లో బంగారం, వెండితోపాటు సెల్‌ఫోన్లు, లెదర్ ఉత్పత్తులు, ఎక్స్‌రే మిషన్లు, సోలార్ ఉత్పత్తులు, మూడు క్యాన్సర్ మందులపై కస్టమ్ డ్యూటీని తగ్గించారు. ఫలితంగా, వాటి ధరలు తగ్గనున్నాయి. ఈ ప్రకటనతో ఒక్క మంగళవారంనాడే బంగారం గ్రాముకు రూ.4000 వరకూ తగ్గడం గమనార్హం. ఎప్పట్లాగే, ప్రధాన మంత్రి ఆవాస్ యోజనకు పెద్దపీట వేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 కోట్ల ఇళ్లు నిర్మించనున్నారు. పట్టణ పేదలకు రూ.10లక్షల కోట్ల పెట్టుబడితో కోటి ఇళ్లను నిర్మించాలని ఈ బడ్జెట్లో పెట్టారు. ఇందులో రూ.2.2 లక్షల కోట్లను కేంద్ర ప్రభుత్వమే ఖర్చు చేయనుంది.

సమయం మారింది

తొలిరోజుల్లో సాయంత్రం 5గంటలకు బడ్జెట్ సమర్పించడం ఆనవాయితీగా ఉండేది. బ్రిటిషర్ల పాలనలో భారత్, లండన్ కాలమానాలు కలిసొచ్చే విధంగా ఈ సమయాన్ని ఎంచుకున్నారు. అయితే 1999లో యశ్వంత్ సిన్హా కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో బడ్జెట్ సమర్పించే సమయాన్ని ఉదయం 11 గంటలకు మార్చారు. అప్పటినుంచి అదే సమయం కొనసాగుతోంది.

'చివరి తేదీ'కి స్వస్తి

సాధారణంగా ఫిబ్రవరి చివరి రోజున కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టేవారు. దీనివల్ల కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం (ఏప్రిల్ 1) నాటికి నిధులు అందుబాటులోకి రావడంలో జాప్యం చోటుచేసుకునేది. 2017లో ఈ సంప్రదాయానికి స్వస్తి చెబుతూ నాటి కేంద్ర మంత్రి జైట్లీ ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టడం ప్రారంభించారు.

భద్రంగా బడ్జెట్ పత్రాలు

1950లో ఆర్థిక మంత్రి జాన్ మత్తాయ్ హయాంలో బడ్జెట్ పత్రాలు లీక్ అయిన తర్వాత వీటి ముద్రణను రాష్ట్రపతి భవన్ నుంచి మింటో రోడ్‌కు మార్చారు. 1980లో ఆర్థిక శాఖ కేంద్రంగా ఉన్న నార్త్ బ్లాక్‌లో ప్రభుత్వ ప్రెస్‌ను ఏర్పాటు చేసి, అక్కడే బడ్జెట్‌ను ముద్రిస్తున్నారు. లీకేజీలను నిరోధించడానికి ఫోన్ ట్యాపింగ్, నిఘా, ఎలక్ట్రానిక్ స్వీప్ వంటి పటిష్ఠమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారు.

18,650 పదాలతో బడ్జెట్

1991లో పీవీ నరసింహారావు ప్రభుత్వంలో నాటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ 18,650 పదాలతో బడ్జెట్ ప్రసంగం చేశారు. పదాల పరంగా ఇదే అతి సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం. ఎక్కువగా ఆర్థిక సరళీకరణ విధానాలను ఈ బడ్జెట్‌లో ప్రస్తావించారు. 2018లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చేసిన ప్రసంగం 18,604 పదాలతో రెండో స్థానంలో నిలిచింది. అప్పట్లో జైట్లీ 1 గంట 49 నిమిషాలపాటు మాట్లాడారు. ఇక 1977లో అప్పటి ఆర్థిక మంత్రి హీరూభాయ్ ముల్జీభాయ్ పటేల్ కేవలం 800 పదాలతో బడ్జెట్ ప్రసంగాన్ని ముగించారు. ఇప్పటి వరకూ ఇదే అతి చిన్న బడ్జెట్ ప్రసంగంగా నిలిచింది.



కీలక శాఖలు.. కేటాయింపులు (రూ. కోట్లలో)


ఆరోగ్యం
90,958


మహిళ,శిశు సంక్షేమం
26,092


రోడ్డు రవాణా
2,78,000


ఎరువుల శాఖ
1,68,500


కమ్యూనికేషన్స్
1,37,293


వ్యవసాయం
1,32,470


విద్య
1,20,628


హోంశాఖ
2,19,643

నిర్మల గారి బడ్జెట్

వివరం రూ. కోట్లలో	2022-23 (వా. గ.)	2023-24 (బ.అం.)	2023-24 (వా. గ.) ప్రాథమికంగా	2024-25 (బ.అం.)
1) రెవెన్యూ వసూళ్లు	23,83,206	26,32,281	27,28,412	31,29,200
ఎ)పన్ను ఆదాయం	20,97,786	23,30,631	23,26,524	25,83,499
బి) పన్నేతర ఆదాయం	2,85,421	3,01,650	4,01,888	5,45,701
2) మూలధన వసూళ్లు	18,09,951	18,70,816	17,14,130	16,91,312
ఎ) రుణ వసూళ్లు	26,161	23,000	27,338	28,000
బి) ఇతర వసూళ్లు	46,035	61,000	33,122	50,000
సి) రుణాలు	17,37,755	17,86,816	16,53,670	16,13,312
3) మొత్తం వసూళ్లు	41,93,157	45,03,097	44,42,542	48,20,512
4) పథకాలకు వ్యయం	34,53,132	35,02,136	34,94,036	37,09,401
5) పథకేతర వ్యయం	7,40,025	10,00,961	9,48,506	11,11,111
6) మొత్తం వ్యయం	41,93,157	45,03,097	44,42,542	48,20,512
7) రెవెన్యూ లోటు	10,69,926	8,69,855	7,65,624	5,80,201

బ.అం. - బడ్జెట్ అంచనా స.అం - సవరించిన అంచనా

అన్ని వర్గాల శ్రేయస్సుకు అండ!

- పేదల నుంచి రైతుల వరకు అందరినీ బలోపేతం చేసే బడ్జెట్
- కేంద్ర బడ్జెట్‌పై ప్రధాని మోదీ హర్షం



న్యూఢిల్లీ, జూలై 23: కేంద్రంలోని ఎన్డీయే కూటమి 3.0 ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తాజా బడ్జెట్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు గుప్పించారు. అన్ని వర్గాల శ్రేయస్సుకు ఈ బడ్జెట్ గొడుగు పడుతుందన్నారు. దేశంలోని పేదలు, దిగువ మధ్యతరగతి, గ్రామీణులు, రైతులు.. ఇలా అన్ని వర్గాల వారినీ బలోపేతం చేసే దిశగా బడ్జెట్ ఉందన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం ప్రధాని ఓ వీడియో సందేశం ఇచ్చారు. గడిచిన పదేళ్ల కాలంలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. ప్రస్తుత బడ్జెట్ నూతన మధ్యతరగతికి మరింత సాధికారతను అందిస్తుందన్నారు. అదేవిధంగా యువతకు అపార అవకాశాలను కల్పిస్తుందని పేర్కొన్నారు. విద్య, నైపుణ్యం వంటివి సరికొత్తస్థాయిలో చేరువ అవుతాయన్నారు. ఎంఎస్‌ఎంఈల ద్వారా సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఈ బడ్జెట్ పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. మహిళలకు మరింత వెన్నుదన్నుగా నిలుస్తుందని తెలిపారు. దళితులు, బీసీలు, గిరిజనులను బలోపేతం చేయడమే లక్ష్యంగా బలమైన పథకాలను ఈ బడ్జెట్ అందించిందన్నారు. ముఖ్యంగా నూతన మధ్యతరగతి వర్గాన్ని అన్ని విధాలా ఈ బడ్జెట్ బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. ఆర్థిక భాగస్వామ్య సహకారానికి ఈ బడ్జెట్ హామీ ఇస్తోందన్నారు. బడ్జెట్‌లో ప్రకటించిన ఉద్యోగ ఆధారిత ప్రోత్సాహక పథకం(ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్‌సెంటివ్ స్కీం) దేశంలో మరిన్ని ఉద్యోగ అవకాశాల కల్పనకు దోహద పడుతుందని వివరించారు. "భారత రక్షణరంగాన్ని ఆత్మనిర్భర్‌గా మార్చేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి. అదేవిధంగా పర్యాటక రంగానికి భారీ ఊతమిచ్చింది. స్టార్టప్‌లు, సృజనాత్మక రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా నూతన అవకాశాలను బడ్జెట్ పెంపొందించింది" అని పేర్కొన్నారు.

ప్రజానుకూల.. అభివృద్ధి బడ్జెట్: అమిత్‌షా

కేంద్రబడ్జెట్.. ప్రజానుకూల, అభివృద్ధి బడ్జెట్ అని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో ఆశావహ, నూతన అవకాశాలతో భారత్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని తెలిపారు. యువత, మహిళలు, రైతులకు బడ్జెట్ పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పనకు సరికొత్త అవకాశాలు కల్పించిందన్నారు.



కీలకం.. 9 రంగాలు

- మధ్యంతర బడ్జెట్‌లో చెప్పాం.. ఇప్పుడు ప్రణాళిక తీసుకొచ్చాం
- 'అభివృద్ధి కేంద్రాలు'గా నగరాలను తీర్చిదిద్దుతాం
- బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, జూలై 23: తొమ్మిది రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ బడ్జెట్‌ను రూపొందించామని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. మంగళవారం పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా నిర్మల ఈ వివరాలు వెల్లడించారు. 'వికసిత్ భారత్ కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని మధ్యంతర బడ్జెట్ సందర్భంగా మేం హామీ ఇచ్చాం. ఈ మేరకు అందరికీ అవకాశాలు కల్పన లక్ష్యంగా 9 రంగాలను ప్రాధాన్య రంగాలుగా గుర్తిస్తూ బడ్జెట్‌ను రూపొందించాం' అని తెలిపారు. తదుపరి బడ్జెట్లన్నీ ఈ ప్రాధాన్య రంగాల ఆధారంగానే ఉంటాయన్నారు. ఉద్యోగావకాశాలను శీఘ్రగతిన పెంపొందించటానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని, విధానపరమైన లక్ష్యాల్లో ఇది కూడా ఒక ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు.

నిర్మల చెప్పిన 9 రంగాలివే..

- సాగురంగంలో ఉత్పాదకత
- ఉద్యోగాలు-నైపుణ్య శిక్షణ
- మానవ వనరుల అభివృద్ధి-సామాజిక న్యాయం
- తయారీరంగం-సేవలు
- పట్టాణాభివృద్ధి
- ఇంధన భద్రత
- మౌలిక సదుపాయాలు
- ఆవిష్కరణలు
- సంస్కరణలు

మోదీ సారథ్యంపై ప్రజల నమ్మకం

ప్రపంచ ఆర్థిక రంగం విధానపరమైన అనిశ్చితి నుంచి ఇప్పటికీ బయటపడలేకపోతోందని నిర్మల పేర్కొన్నారు. భారత్‌లో మాత్రం ప్రజలు మోదీ సారథ్యంలోని ప్రభుత్వంపై తమ నమ్మకాన్ని మరోమారు చాటిచెప్పారని, వరుసగా మూడోసారి అధికారం అప్పగించారన్నారు. దేశంలో ద్రవ్యోల్బణం స్థిరంగా ఉందని, నిర్ధారిత లక్ష్యమైన 4 శాతం వైపు వెళ్తోందని తెలిపారు. ఉద్యోగ వర్గాలకు బడ్జెట్‌లో ఊరట కల్పించామని, ఈ మేరకు నూతన పన్ను విధానంలో తీసుకొచ్చిన మార్పుల వల్ల వారికి సగటున రూ.17,500 వరకు అవుతుందని ఆర్థిక మంత్రి తెలిపారు. పింఛనర్లకు కూడా రాయితీ కల్పించామని గుర్తు చేశారు. ఈ నిర్ణయాల వల్ల నాలుగు కోట్ల మంది ఉద్యోగులు, పింఛనుదార్లకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. వ్యవసాయంలో ఉత్పాదకతను పెంచటానికి ప్రభుత్వం వ్యవసాయ పరిశోధన రంగాన్ని సమగ్రంగా సమీక్షించనుందన్నారు. వాతావరణ పరిస్థితులను తట్టుకొనే వంగడాల అభివృద్ధిపై దృష్టి పెడతామన్నారు. నగరాలు, పట్టణాలను అభివృద్ధి కేంద్రాలుగా మల్చటానికి రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పని చేస్తామని తెలిపారు. కాగా, తాజా బడ్జెట్‌తో కలిపి నిర్మల వరుసగా ఏడుసార్లు కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. తద్వారా, గతంలో ఆరుసార్లు వరుసగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మొరార్జీ దేశాయ్ రికార్డును అధిగమించారు.



హల్వా వేడుక

కేంద్ర బడ్జెట్‌కు ముందు హల్వా వేడుక నిర్వహించడం ఆనవాయితీ. కేంద్ర ఆర్థిక శాఖ కార్యాలయం బేస్‌మెంట్‌లో దీనిని నిర్వహిస్తారు. దీనిలో భాగంగా బడ్జెట్ పత్రాల ముద్రణలో పాలుపంచుకొనే 100 మంది అధికారులు, సిబ్బందికి ఆర్థిక మంత్రి హల్వా వడ్డిస్తారు. వీరందరికీ దాదాపు వారం పాటు నార్త్ బ్లాక్‌లో వసతి కల్పిస్తారు. ఆ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించే అవకాశం కూడా ఉండదు. బడ్జెట్ లీక్ కాకూడదనే ఉద్దేశంతో ఈ జాగ్రత్తలు తీసుకుంటారు.



మొరార్జీ దేశాయ్ @10



అత్యధిక సార్లు బడ్జెట్లు ప్రవేశపెట్టిన రికార్డు మొరార్జీ దేశాయ్ పేరిట ఉంది. ఆయన మొత్తం 10సార్లు బడ్జెట్‌ను సభ ముందు ఉంచారు. ఆ తర్వాత స్థానాల్లో పి. చిదంబరం (9), ప్రణబ్ ముఖర్జీ (8), యశ్వంత్ సిన్హా (8), వైబీ చవాన్ (7), సీడీ దేశ్‌ముఖ్ (7), మన్మోహన్‌సింగ్ (6) ఉన్నారు.

తొలి మహిళ ఇందిర



1971లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఆర్థిక శాఖను కూడా నిర్వహించారు. దేశంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తొలి మహిళగా ఆమె గుర్తింపు పొందారు. 2019లో బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండో మహిళగా నిర్మల రికార్డు సృష్టించారు.

ఊరట కాస్తంతే..

వేతన జీవులను అంతగా కరుణించని నిర్మలమ్మ



- కొత్త పన్ను విధానంలోకి మారినవారికి మాత్రమే స్వల్ప ఊరటనిచ్చేలా 5, 10 శాతం పన్ను శ్లాబుల సవరింపు
- కొత్త పన్ను విధానంలో రిటర్నులు దాఖలు చేసేవారికి మాత్రమే ప్రామాణిక తగ్గింపు రూ.75 వేలకు పెంపు

ఆదాయ పన్ను పరిమితిని ఈసారైనా పెంచకపోతారా అని వేయికళ్లతో వేచిచూస్తున్న వేతనజీవులకు, సగటు మధ్యతరగతి వర్గానికి స్వల్ప ఊరటే దక్కింది. కొత్త పన్ను విధానంలో రిటర్నులు సమర్పించేవారికి మాత్రమే.. అది కూడా వార్షికంగా రూ.10 లక్షలు, అంతకు మించి స్థూల ఆదాయం ఉన్నవారికి మాత్రమే పిసరంత ఊరట కల్పించేలా.. ఆర్థిక మంత్రి నిర్మల రెండు శ్లాబులను సవరించారు. కొత్త విధానంలోని 5, 10 శాతం శ్లాబుల్లో చేసిన సవరణల కారణంగా పన్నుచెల్లింపుదారులకు రూ.17,500 దాకా ఊరట కలుగుతుందని ఆమె తెలిపారు. ఈ సవరణల వల్ల.. స్థూల ఆదాయం రూ.10 లక్షలు ఉన్నవారు కట్టాల్సిన పన్ను రూ.10 వేల మేర, రూ.20 లక్షలు ఉన్నవారు కట్టాల్సిన పన్ను రూ.17,500 మేర మాత్రం తగ్గుతుంది. అలాగే.. ఇప్పటిదాకా రూ.50 వేలుగా ఉన్న ప్రామాణిక తగ్గింపు (స్టాండర్డ్ డిడక్షన్)ను కొత్తపన్ను విధానంలో రిటర్నులు దాఖలు చేసేవారికి మాత్రం రూ.75 వేలకు పెంచుతున్నట్టు నిర్మల ప్రకటించారు. కుటుంబ పింఛనుదారులకు ప్రస్తుతం రూ.15 వేలుగా ఉన్న స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.25 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇక.. ఇప్పటికీ పాత విధానంలో రిటర్నులు దాఖలు చేస్తున్నవారు బడ్జెట్‌లో తమకు ఎలాంటి ఊరటా లభించకపోవడంపై నిరాశ వ్యక్తం చేస్తున్నారు. నానాటికీ పెరిగిపోతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పాత విధానం శ్లాబులను ఈసారైనా సవరిస్తారని వారంతా భావించారు. కానీ.. 'ఈ ఆర్థిక సంవత్సరంలో మూడింట రెండొంతుల మంది పన్నుచెల్లింపుదారులు కొత్త పన్ను విధానం ఎంచుకున్నారు' అని బడ్జెట్ ప్రసంగంలో తెలిపిన ఆర్థికమంత్రి.. పాత పన్ను విధానంలో ఉన్నవారిని పట్టించుకోకపోవడంతో వారు ఉసూరుమన్నారు. కాగా.. ఆదాయపన్ను చట్టాన్ని మరింత సంక్షిప్తంగా, సులభగ్రాహ్యంగా చేసేందుకు.. ఆర్నెల్లలోగా సమగ్రంగా సమీక్షించనున్నట్టు నిర్మల వెల్లడించారు. దీనివల్ల పన్ను తగాదాలు, వ్యాజ్యాలు తగ్గుతాయని ఆమె అభిప్రాయపడ్డారు. అలాగే.. రూ.50 లక్షలు అంతకు మించి విలువ కలిగిన స్థిరాస్తుల అమ్మకంపై.. కొనుగోలుదారులకు 1% టీడీఎస్ (మూలం వద్దే పన్నుకోత) వర్తిస్తుందని.. ఒక లావాదేవీలో ఒకరికి మించి అమ్మకందారులు, కొనుగోలుదారులు ఉన్నా కూడా ఈ పన్ను వర్తిస్తుందని నిర్మల తెలిపారు. అదేవిధంగా.. ఆస్తుల అమ్మకంపై ఇన్నాళ్లుగా ఉన్న ఇండెక్సేషన్ లబ్ధిని ఎత్తివేసినట్టు ప్రకటించిన ఆర్థిక మంత్రి.. 12.5% దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను వేయనున్నట్టు తెలిపారు. జాతీయ పింఛను పథకం కింద యజమాని వాటా పరిమితిని ప్రస్తుతం ఉన్న 10 శాతం నుంచి 14 శాతానికి పెంచుకోవడానికి అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. దీనివల్ల ఉద్యోగుల పెన్షన్ నిధి పెరుగుతుందని, ఆమేరకు పన్ను రాయితీ పెరుగుతుందని ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. అయితే, ఇది కూడా కొత్త పన్ను విధానాన్ని ఎంచుకున్నవారికి మాత్రమే వర్తిస్తుంది.

కొత్త పన్ను విధానంలో సవరించిన శ్లాబులు ఇలా..

ప్రస్తుత శ్లాబు	పన్ను రేటు	సవరించిన శ్లాబు	పన్ను రేటు
రూ.3 లక్షల వరకూ	0	రూ.3 లక్షల వరకూ	0
రూ.3 లక్షల నుంచి రూ.6 లక్షల వరకూ	5%	రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షల వరకూ	5%
రూ.6 లక్షల నుంచి రూ.9 లక్షల వరకూ	10%	రూ.7లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ	10%
రూ.9 లక్షల నుంచి రూ.12 లక్షల వరకూ	15%	రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకూ	15%
రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ	20%	రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ	20%
రూ.15 లక్షలకు పైగా	30%	రూ.15 లక్షలకు పైగా	30%

పాత పన్ను విధానాన్ని తీసేస్తారా

బడ్జెట్ ప్రసంగం అనంతరం ఆర్థికమంత్రి మీడియాతో మాట్లాడినప్పుడు.. 'పాత పన్ను విధానాన్ని తీసేస్తారా?' అని విలేకరులు ఆమెను ప్రశ్నించారు. దీనికి ఆమె.. ఇప్పటికైతే అలాంటి నిర్ణయమేదీ తీసుకోలేదని చెప్పారు. పన్ను విధానాన్ని సులభతరం చేయాలన్నదే తమ ఉద్దేశమని ఆమె స్పష్టం చేశారు.

పాత పన్ను విధానం శ్లాబులు

రూ. 2.5 లక్షల దాకా	0%
రూ. 2.5 లక్షల నుంచి రూ. 5 లక్షల దాకా	5%
రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా	20%
రూ. 10 లక్షలకు పైగా	30%

రూ.17,500 ఊరట ఎవరికి?

కొత్త పన్ను విధానంలో శ్లాబుల సవరింపు కారణంగా రూ.17,500 దాకా పన్ను ఊరట లభిస్తుందని నిర్మల తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. కానీ, అది అందరికీ కాదు. ఎంత ఆదాయం ఉన్నవారికి ఎంతమేర ఊరట కలుగుతుందో పరిశీలిస్తే..

స్థూల ఆదాయం రూ.5,50,000

	ఇప్పటిదాకా	ఇకపై
స్టాండర్డ్ డిడక్షన్	-50,000	-75,000
స్థూల ఆదాయం	5,00,000	4,75,000
పన్ను వేయదగ్గ ఆదాయం	5,00,000	4,75,000
పన్ను	10,000	8,750
రిబేటు	-10,000	-8,750

అంటే, వీరు అసలు పన్ను కట్టక్కర్లేదు

స్థూల ఆదాయం రూ.10 లక్షలు

	ఇప్పటిదాకా	ఇకపై
స్టాండర్డ్ డిడక్షన్	-50,000	-75,000
స్థూల ఆదాయం	9,50,000	9,25,000
పన్ను వేయదగ్గ ఆదాయం	9,50,000	9,25,000
పన్ను	52,500	42,500
సుంకం	2,100	1,700
మొత్తం పన్ను	54,600	44,200

అంటే.. శ్లాబులో మార్పు వల్ల రూ.10 లక్షల స్థూల ఆదాయం ఉన్నవారికి సుంకాన్ని కలుపుకోకుంటే రూ.10 వేల దాకా ఊరట లభిస్తుంది. సుంకాన్ని కూడా కలుపుకొంటే.. రూ.10,400 మేర ఊరట లభిస్తుంది.

స్థూల ఆదాయం రూ.20 లక్షలు

	ఇప్పటిదాకా	ఇకపై
స్టాండర్డ్ డిడక్షన్	-50,000	-75,000
స్థూల ఆదాయం	19,50,000	19,25,000
పన్ను వేయదగ్గ ఆదాయం	19,50,000	19,25,000
పన్ను	2,85,000	2,67,500
సుంకం	11,400	10,700
మొత్తం పన్ను	2,96,000	2,78,200

అంటే.. శ్లాబులో మార్పు వల్ల రూ.20 లక్షల స్థూల ఆదాయం ఉన్నవారికి సుంకాలు లేకుండా రూ.17,500 మేర, సుంకాలను కలుపుకొంటే రూ.18,200 మేర ఊరట లభిస్తుంది.



గ్రామీణాభివృద్ధికి 2.66 లక్షల కోట్లు

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి కోసం కేంద్రం బడ్జెట్‌లో రూ.2.66 లక్షల కోట్లు కేటాయించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పీఎం ఆవాస్ యోజన కింద అదనంగా మూడు కోట్ల ఇళ్లు నిర్మించనున్నట్టు ప్రకటించింది. గ్రామాల్లో రహదారుల నిర్మాణం కోసం పీఎం గ్రామ సడక్ యోజన నాలుగో దశను ప్రారంభించనున్నట్టు వెల్లడించింది. ఈ పథకం ద్వారా దాదాపు 25 వేల ఆవాసాలు లబ్ధి పొందుతాయని పేర్కొంది. ఆయా గ్రామాల్లో జనాభా పెరిగినందున అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారులను నిర్మించనున్నట్టు కేంద్ర సర్కారు తెలిపింది.



వరద నివారణ, నీటిపారుదలకు 11,500 కోట్లు

పలు రాష్ట్రాల్లో వరద నివారణ చర్యలు, నీటిపారుదల ప్రాజెక్టులకు కేంద్ర బడ్జెట్‌లో రూ.11,500 కోట్ల సహాయం ప్రకటించారు. వీటిలో కోసి-మేచి అనుసంధాన ప్రాజెక్టుతోపాటు మరో 20 నిర్మాణంలో ఉన్న బ్యారేజీలు, నదీ కాలుష్య నివారణ ప్రాజెక్టులు, నీటిపారుదల ప్రాజెక్టులు ఉన్నాయి. ఏటా బ్రహ్మపుత్ర, దాని ఉపనదుల కారణంగా వరదలతో సతమతమవుతోన్న అసోం రాష్ట్రానికి వరద నివారణ సంబంధిత ప్రాజెక్టులకు సహాయం అందుతుంది. అలాగే వరదలు, భారీ వర్షాలతో సతమతమయిన హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాల్లో పునర్నిర్మాణ, పునరావాస కార్యక్రమాలకు సహాయం చేయనున్నట్టు ఆర్థిక మంత్రి చెప్పారు.



కోటి ఇళ్లకు సౌర విద్యుత్ వెలుగులు

పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ పథకం కింద ఒక కోటి ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం కింద రూఫ్ టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేసుకునే వారికి ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. మరోపక్క, అణువిద్యుత్ రంగంలో తొలిసారి ప్రైవేటు పెట్టుబడులకు ఆహ్వానం పలికింది. చిన్నపాటి అణు విద్యుత్ రియాక్టర్ల(ఎస్ఎంఆర్) ఏర్పాటు, అభివృద్ధి అంశంలో ప్రైవేటు సంస్థలతో భాగస్వామ్యం కానుంది. పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక విధానాన్ని తీసుకువస్తామని ప్రకటించింది.



పరిశోధన, ఆవిష్కరణల్లో మరింత ప్రైవేటు భాగస్వామ్యం

న్యూఢిల్లీ, జూలై 23: పరిశోధన, ఆవిష్కరణల రంగాల్లో ప్రైవేటు భాగస్వామ్యాన్ని మరింతగా ఆహ్వానిస్తున్నట్టు నిర్మల పేర్కొన్నారు. ప్రాథమిక పరిశోధన, నమూనా అభివృద్ధికు అనుసంధాన్ జాతీయ పరిశోధన నిధి ద్వారా కార్యాచరణ రూపొందిస్తామని మంత్రి పేర్కొన్నారు. దీనికిగాను రూ.లక్ష కోట్లతో ఆర్థిక సాయం అందించేందుకు ప్రత్యేక విధానాన్ని ప్రకటిస్తామని తెలిపారు. మధ్యంతర బడ్జెట్‌లోనే దీనికి సంబంధించిన ప్రకటన చేశామని వివరించారు. రానున్న పదేళ్లలో భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను ఐదు రెట్లు విస్తరించాలనే లక్ష్యంతో ఉన్నామని, దీనికిగాను వెంచర్ క్యాపిటల్ ఫండ్ కింద రూ.1000 కోట్లతో నిధిని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

వరాలు.. కోతలు

విద్యారంగానికి 1.20 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కొన్ని వరాలు ప్రకటించడంతో పాటు కోతలు కూడా పెట్టారు. గత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనా కంటే ఈ ఏడాది దాదాపు రూ.9,000 కోట్లు కోత పెట్టారు. 2024-25కు విద్యా రంగానికి మొత్తం రూ.1.20 లక్షల కోట్లు కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాలో 1.29 లక్షల కోట్లు ఉండటం గమనార్హం. ఈ ఏడాది పాఠశాల విద్యకు రూ.535 కోట్ల నిధులు ఎక్కువగా కేటాయించగా, ఉన్నత విద్య గ్రాంట్‌లో రూ.9,600 కోట్లు తగ్గించారు. దేశీయ విద్యా సంస్థల్లో ఉన్నత విద్య చదివేందుకు విద్యార్థులకు రూ.10 లక్షల వరకు రుణాలు అందించనున్నట్టు ప్రకటించారు. కాగా ఉన్నత విద్య నియంత్రణ మండలి యూజీసీకి 60 శాతానికి పైగా నిధులు తగ్గించారు. దేశంలో ప్రతిష్ఠాత్మక బిజినెస్ స్కూల్స్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లకు వరుసగా రెండో ఏడాది బడ్జెట్‌లోనూ కేటాయింపులు తగ్గించారు. పాఠశాల విద్యతో పాటు కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, ఎన్‌సీఈఆర్‌టీ, పీఎం శ్రీ స్కూళ్లు, రాష్ట్రాలు-కేంద్ర పాలిత ప్రాంతాలకు గ్రాంట్ల కేటాయింపులు పెంచారు. దేశీయ విద్యా సంస్థల్లో ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు ఆర్థిక సాయం చేయనున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వ పథకాలు, పాలసీల కింద ఎలాంటి లబ్ధి పొందని యువతకు రుణాలు అందజేయనున్నట్టు తెలిపారు.




కేటాయింపులు ఇలా...

- గత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాతో పోలిస్తే... ప్రపంచ స్థాయి సంస్థలకు నిధులు రూ.1300 కోట్ల నుంచి రూ.1800 కోట్లకు పెంపు
- విద్యా సంస్థల్లో పరిశోధనలు, ఆవిష్కరణల కోసం రూ.161 కోట్లు పెంపు
- యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)కు 6,409 కోట్ల నుంచి రూ.2,500 కోట్లకు నిధుల తగ్గింపు
- ఐఐటీలకు రూ.10,384 కోట్ల నుంచి రూ.10,324 కోట్లకు స్వల్పంగా తగ్గింపు
- ఐఐఎంలకు రూ.331 కోట్ల నుంచి రూ.212 కోట్లకు కేటాయింపులు తగ్గింపు
- కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు 28 శాతం నిధుల పెరుగుదల. రూ.12,000 కోట్ల నుంచి 15,472 కోట్లకు పెంపు

1000 ఐటీఐల అప్‌గ్రేడ్

స్కిల్ డెవలప్‌మెంట్ రంగంలో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు 1000 పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐ)ను అప్‌గ్రేడ్ చేయనున్నట్టు ప్రకటించారు. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా కొత్త కోర్సులు ప్రవేశ పెట్టనున్నారు. గత ఐదేళ్లలో 20 లక్షల మంది యువత స్కిల్ డెవలప్‌మెంట్ పథకంలో శిక్షణ పొందినట్టు తెలిపారు. మోడల్ స్కిల్ లోన్ పథకం కింద ప్రభుత్వ గ్యారెంటీతో రుణాలను రూ.7.5 లక్షలకు పెంచామని, ఈ పథకం వల్ల ఏటా 25 వేలమంది లబ్ధిపొందుతారని ప్రకటించారు.



కాపీకొట్టినందుకు చాలా సంతోషం



"కాంగ్రెస్ మేనిఫెస్టోలోని 30వ పేజీలో పేర్కొన్న ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్‌సెంటివ్ కార్యక్రమాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఒంటబట్టించుకుని బడ్జెట్‌లో చేర్చారు. అలాగే పేజీ 11లో పేర్కొన్న అప్రెంటిస్‌షిప్ పథకాన్ని కూడా మక్కీకి మక్కీ దించేశారు. అలాగే 31వ పేజీలో పేర్కొన్న 'ఏంజిల్ ట్యాక్స్ రద్దు'ను కూడా కాపీ కొట్టారు. చాలా సంతోషం"

- కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం

"ఈ బడ్జెట్ దేశాభివృద్ధికి సంబంధించింది కాదు. మోదీ ప్రభుత్వాన్ని పరిరక్షించుకునే బడ్జెట్. ఇది కాపీ బడ్జెట్. మా న్యాయపత్రను కాపీ కొట్టారు. అది కూడా సరిగా కాపీ కొట్టలేకపోయారనిపిస్తోంది"

- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎద్దేవా




మహిళలకు మరింత ప్రోత్సాహం

న్యూఢిల్లీ, జూలై 23: దేశ ఆర్థిక అభివృద్ధిలో మహిళల పాత్రను మరింతగా పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ దిశగా మహిళలు, బాలికలను ప్రోత్సహించేందుకు 2024-25 బడ్జెట్‌లో వివిధ మంత్రిత్వ శాఖల ద్వారా రూ.3 లక్షల కోట్లకు పైగా కేటాయించింది. ఇందులో.. మహిళా, శిశు అభివృద్ధి (డబ్ల్యూసీడీ) మంత్రిత్వ శాఖకు రూ.26,092 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌లో ఈ శాఖకు రూ.25,448 కోట్లు కేటాయించింది. ఈ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వర్కింగ్ ఉమెన్ కోసం ప్రత్యేక హాస్టళ్లను ఏర్పాటు చేసి.. వివిధ కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేసేలా చర్యలు తీసుకోనుంది. దీంతోపాటు మహిళల సంక్షేమం, సాధికారతకు సంబంధించి సక్షమ్ అంగన్వాడీ పోషణ్ 2.0, మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి పథకాలను కొనసాగించాలని నిర్ణయించింది. శిశువులు, కౌమార బాలికలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ఉద్దేశించిన సక్షమ్ అంగన్వాడీ 2.0 పథకానికి బడ్జెట్‌లో కేంద్రం రూ.21,200 కోట్లు కేటాయించింది. ఇక శిశు సంక్షేమం, భద్రతకు సంబంధించి మిషన్ వాత్సల్య పథకం కింద చేపట్టే కార్యక్రమాలకు కోసం రూ.1,472 కోట్లు కోటాయింపులు జరిపింది. కాగా, మహిళా సాధికారత లక్ష్యంగా చేపట్టే 'మిషన్ శక్తి'ని సంబల్, సామర్థ్య పథకాలుగా విభజించి అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకుగాను ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.3,145 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపింది. సంబల్ పథకం కింద.. బేటీ బచావో-బేటీ పఢావో, మహిళల భద్రతకు సంబంధించిన వన్ స్టాప్ సెంటర్ల ఏర్పాటు వంటి కార్యక్రమాలను చేపట్టనున్నారు. వీటికోసం రూ.629 కోట్లను వినియోగించనున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఇక సామర్థ్య పథకం కింద ఉమెన్ హాస్టళ్లతోపాటు స్వధార్ గృహ, ప్రధాన మంత్రి వందన వంటి కార్యక్రమాలు చేపడతారు. ఇందుకు రూ.2,516 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.2,325 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇవే కాకుండా.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ కో ఆపరేషన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ (ఎన్ఐపీసీసీడీ)కి, సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ ఏజెన్సీ (సీఏఆర్ఏ)కి కూడా నిధుల కేటాయింపును పెంచారు. ఇందులో.. శిశు అభివృద్ధికి సంబంధించి పరిశోధన, శిక్షణ కార్యక్రమాలు చేపట్టే ఎన్ఐపీసీసీడీకి రూ.88.87 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కాగా, బాలల దత్తతపై పర్యవేక్షణ, నియంత్రణ బాధ్యతలు నిర్వర్తించే సీఏఆర్ఏకు రూ.11.40 కోట్లు వినియోగించనున్నట్లు పేర్కొంది. ఇక మహిళల భద్రత కోసం తీసుకొచ్చిన నిర్భయ నిధికి రూ.500 కోట్లు కేటాయించింది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో పనిచేసే యునిసెఫ్‌కు భారత్ భాగస్వామ్యంగా రూ.5.60 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపింది.

బడ్జెట్‌లో రూ.3 లక్షల కోట్ల కేటాయింపు





'రక్షణ'కు 6.21 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో రక్షణ రంగానికి రూ.6.21 లక్షల కోట్లు కేటాయించారు. ఇది బడ్జెట్‌లో 12.9 శాతం. గత ఏడాది రూ.5.94 లక్షల కోట్లు కేటాయించారు. బడ్జెట్‌లో రక్షణ రంగానికి అత్యధిక కేటాయింపులు... సైనిక దళాల సామర్థ్యం పెంపుదలకు దోహదపడుతుందని ఆ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. సరిహద్దుల్లో రోడ్ల నిర్మాణానికి గత ఏడాది కంటే 30 శాతం అదనంగా కేటాయించారని తెలిపారు. కేంద్ర హోం శాఖకు రూ.2.19 లక్షల కోట్లు కేటాయించారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కేంద్రం చేతుల్లో ఉన్న జమ్మూ కశ్మీర్‌కు రూ.42,277 కోట్లు కేటాయించారు.

జవానుకు దండం

రూ. కోట్లలో

2024-25	4,54,773
2023-24	4,32,720
2022-23	3,99,123





యుగానికి ఒక్కటే..



సరళీకరణకు నాంది పలుకుతూ పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో నాటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ 1991లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను యుగానికి (ఇపోకల్) ఒక బడ్జెట్‌గా పిలుస్తున్నారు. దేశంలో లైసెన్స్ రాజ్‌కు ఆ బడ్జెట్ ముగింపు పలికింది. దేశ ఆర్థిక వ్యవస్థ పతనావస్థలో ఉన్న సమయంలో ఆ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.



బడ్జెట్‌కు ఎరుపు రంగే ఎందుకు?



కేంద్ర బడ్జెట్ పత్రాలను ఆర్థిక మంత్రి ఎర్ర సూట్‌కేస్‌లో తీసుకురావడం బ్రిటిష్ పాలన కాలం నుంచి సంప్రదాయంగా వస్తోంది. 2019లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆ సంప్రదాయానికి ఆధునికతను జోడించి, సూట్‌కేసు స్థానంలో ఎర్రని పౌచ్ రూపంలో ఉండే 'బహీ-ఖతా'లో బడ్జెట్ పత్రాలను తీసుకురావడం ప్రారంభించారు. సాధారణంగా మతగ్రంథాలు ఎరుపు రంగులో ఉంటాయనే ఉద్దేశంతోనే బడ్జెట్ ప్రకటనలకు సంస్కృతిని జోడించే ఉద్దేశంతో ఎరుపు రంగుకు ప్రాధాన్యం ఇస్తున్నారనే భావన ఉంది.

భవిష్య నిధితో ఉద్యోగ కల్పన

కొత్త కొలువుల సృష్టికి 3 పథకాలు.. ఈపీఎఫ్‌వో ద్వారా అమలు.. రూ.1.07 లక్షల కోట్లు కేటాయింపు

కొత్తగా ఉద్యోగంలో చేరే వారికి ఒక నెల వేతనం బోనస్

» గరిష్ఠంగా రూ.15 వేలు.. 3 వాయిదాల్లో చెల్లింపు

న్యూఢిల్లీ, జూలై 23: ఉద్యోగ కల్పనకు బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ద్వారా మూడు కొత్త పథకాలను అమలు చేస్తామని ప్రకటించింది. దీని కోసం రూ.1.07 లక్షల కోట్లను కేటాయించనుంది. 'ప్రధానమంత్రి ప్యాకేజీ' అనే పేరు కింద ఉద్యోగ కల్పన ప్రోత్సాహకాల రూపంలో ఈ మూడు పథకాలను అమలు చేయనున్నారు. మొదటిది.. సంఘటిత రంగంలోని పరిశ్రమలు, సంస్థల్లో కొత్తగా ఉద్యోగాల్లో చేరే వారికి ఒక నెల వేతనాన్ని (గరిష్ఠంగా రూ.15 వేలు) మూడు వాయిదాల్లో చెల్లిస్తారు. ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో వారి ఖాతాల్లో ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. దీనివల్ల 2.10 కోట్ల మంది యువత లబ్ధి పొందనుందని ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించారు. ఇక రెండో పథకం కింద, తయారీ రంగంలో ఉద్యోగ కల్పనకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందించనుంది. ఉద్యోగంలో చేరిన తొలి నాలుగేళ్లలో సదరు ఉద్యోగి, సంస్థ యాజమాన్యం ఈపీఎఫ్ఓలో చేసే చెల్లింపులను బట్టి.. ఉద్యోగికి, సంస్థకు ప్రోత్సాహకాలు అందజేస్తారు. దీనిద్వారా కొత్తగా ఉద్యోగాల్లో చేరే 30 లక్షల మంది యువతీ యువకులకు, వారు పనిచేసే సంస్థలకు ప్రయోజనం చేకూరనుందని ఆర్థికమంత్రి తెలిపారు. మూడో పథకం కింద, అదనంగా ఉద్యోగాలు కల్పించే యాజమాన్యాలకు ఆర్థిక ప్రోత్సాహకాలు కల్పించనున్నారు. అదనంగా తీసుకునే ఒక్కో ఉద్యోగికి ఈపీఎఫ్ఓలో యాజమాన్యం జమ చేసే మొత్తం నుంచి నెలకు గరిష్ఠంగా రూ.3 వేల చొప్పున రెండేళ్లపాటు తిరిగి చెల్లిస్తారు (రీయింబర్స్‌మెంట్). దీని వల్ల 50 లక్షల అదనపు ఉద్యోగాల సృష్టి జరుగుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. కాగా, ఈ మూడు పథకాలూ నెలకు గరిష్ఠంగా రూ.లక్ష లోపు వేతనం ఉన్న వారందరికీ వర్తిస్తాయి. వీటి అమలుకు ప్రభుత్వం విడివిడిగానే బడ్జెట్ కేటాయించింది. తొలి పథకానికి రూ.23,000 కోట్లు, రెండో పథకానికి రూ.52,000 కోట్లు, మూడో పథకానికి రూ.32,000 కోట్లు.. మొత్తంగా 1.07 లక్షల కోట్లను కేటాయించింది.



మేలో రికార్డు స్థాయిలో ఈపీఎఫ్‌లో చేరికలు

ఈ ఏడాది మే నెలలో ఈపీఎఫ్‌వోలో రికార్డు స్థాయిలో 19.50 లక్షల మంది సభ్యులు కొత్తగా చేరారు. 2018 నుంచి ఇదే అత్యధికం. ఏటా సగటున ఈపీఎఫ్‌వోలో 19.62 శాతం వృద్ధి నమోదవుతోంది. ఉద్యోగావకాశాల్లో పెరుగుదల, ఉద్యోగులకు లభిస్తున్న ప్రయోజనాల పట్ల పెరుగుతున్న అవగాహన, ఈపీఎఫ్‌వో ప్రచార కార్యక్రమాలు తదితర కారణాల వల్లే ఈపీఎఫ్‌లో సభ్యుల సంఖ్య వృద్ధి చెందుతున్నట్లుగా విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా, మే నెలలో చేరిన కొత్త సభ్యుల్లో 58.37 శాతం మంది 18-25 ఏళ్లలోపు యువత కావటం విశేషం.

నైపుణ్య శిక్షణ

ఉద్యోగార్థులకు ఉద్యోగావకాశాలు, నైపుణ్య శిక్షణ తదితర అంశాల్లో మార్గనిర్దేశనం చేసేలా ఈ-శ్రమ్ పోర్టల్‌ను ఇతర పోర్టల్లతో అనుసంధానించనున్నారు. ఉద్యోగ మార్కెట్‌లో వేగంగా సంభవిస్తున్న మార్పులు, అవసరమైన నైపుణ్యాలు, అందుబాటులో ఉన్న ఉద్యోగాలు, కంపెనీలను ఉద్యోగార్థులను అనుసంధానించే ప్రక్రియలు, నైపుణ్య శిక్షణ సంస్థలు తదితర సేవలు ఒకే వేదిక నుంచి లభించేలా చర్యలు తీసుకుంటారు. శ్రమ్ సువిధ, సమాధాన్ పోర్టళ్లను మెరుగుపరుస్తామని ఆర్థికమంతి ప్రకటించారు. పరిశ్రమలతో కలిసి మహిళా హాస్టళ్లను, శిశుసంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలకు ప్రత్యేకంగా నైపుణ్య శిక్షణ, స్వయంసహాయక సంఘాలకు మార్కెట్ అవకాశాలను పెంచటం వంటి వాటిపై దృష్టి పెడతామని తెలిపారు.



జల వనరులు, గంగానది సంరక్షణ పథకానికి 55 % నిధుల పెంపు

కేంద్ర బడ్జెట్‌లో నదుల సంరక్షణకు నిధులను పెంచారు. జల వనరుల విభాగానికి, నదుల అభివృద్ధి, గంగానది సంరక్షణ పథకానికి(నమామి గంగే) గత ఏడాదితో పోల్చితే 55 శాతం నిధులు పెంచారు. వీటికి గత ఏడాది రూ.19,516 కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ.30,233.83 కోట్లు కేటాయించారు. వీటిలో నమామి గంగే మిషన్-2 కింద 3,345.70 కోట్లు కేటాయించారు. 2023-24లో ఈ పథకానికి కేటాయించింది రూ.2,400 కోట్లు మాత్రమే. అంతేకాకుండా నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు, అటల్ భూజల్ యోజన పథకాలకు నిధులను పెంచారు. భూగర్భ జలాల వృద్ధికి ఉద్దేశించిన అటల్ భూజల్ యోజనకు రూ.1,778 కోట్లు కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి కేటాయించింది రూ.1000 కోట్లే. నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టుకు రూ.661.20 కోట్లు కేటాయించారు. పలు కేంద్ర ప్రాయోజిత పథకాలకు కూడా నిధులు కేటాయించారు. ప్రధాన్ మంత్రి క్రిషి సించాయ్ యోజనకు రూ.9,339.37 కోట్లు కేటాయించారు. జాతీయ నదుల సంరక్షణ పథకానికి రూ.592.11 కోట్లు కేటాయించారు.

కీలక పథకాలకు కేటాయింపులు

(రూ. కోట్లలో)

గరీబ్ కల్యాణ్ అన్న యోజన	2,05,250
ఉపాధి హామీ పథకం	86,000
ప్రధానమంత్రి ఆవాస్ యోజన	84,671
జల్ జీవన్ మిషన్	70,163
కిసాన్ సమ్మాన్ నిధి	60,000
జాతీయ ఆరోగ్యమిషన్- అర్బన్	28,783
సమగ్ర శిక్ష	37,500
గ్రామ సడక్ యోజన	19,000
పంటల బీమా పథకం	14,600
స్వచ్ఛ భారత్	12,192
ఆయుష్మాన్ భారత్	7,300
నదుల అనుసంధానం	4,000



క్యాన్సర్ రోగులకు ఊరట

న్యూఢిల్లీ, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యం దక్కింది. ఆరోగ్య శాఖకు రూ.90,958.63 కోట్ల నిధులు కేటాయించారు. గత ఏడాది కేటాయించిన రూ.80,517.62 కోట్లతో పోలిస్తే ఇది 12.93% అధికం కావడం విశేషం. అలాగే క్యాన్సర్ రోగులకు ఊరటనిచ్చేలా కీలకమైన మూడు ఔషధాల (ట్రాస్టుజుమాబ్ డెరక్స్‌టికాన్, ఒసిమెర్టినిబ్, డర్వాలుమాబ్)పై కస్టమ్స్ డ్యూటీని 10% నుంచి సున్నాకు తగ్గించారు. 'క్యాన్సర్ రోగులకు ఉపశమనం కలిగించేందుకు వీలుగా మూడు రకాల క్యాన్సర్ ఔషధాలపై కస్టమ్స్ సుంకాన్ని పూర్తిగా మినహాయిస్తున్నాం. అలాగే ఎక్స్‌రే యంత్రాల్లో వినియోగించే ఎక్స్‌రే ట్యూబ్‌లు, ఫ్లాట్ ప్యానెల్ డిటెక్టర్లపై కస్టమ్స్ డ్యూటీలో కూడా మార్పులను ప్రతిపాదిస్తున్నాం' అని నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. ఆరోగ్య రంగానికి కేటాయించిన రూ.90,958.63 కోట్లలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు రూ.87,656.90 కోట్లు, ఆరోగ్య పరిశోధనలకు రూ.3,301.73 కోట్లు కేటాయించినట్టు ఆమె పేర్కొన్నారు. ఇంకా ఏ ఏ శాఖలకు ఎంతెంత నిధులు కేటాయించారంటే..

- ఆయుష్ మంత్రిత్వ శాఖకు రూ.3,712.49 కోట్లను కేటాయించారు.
- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని పథకాలకు గతంలో ఉన్న రూ.77,624.79 కోట్లను.. ఈ సారి రూ.87,656.90 కోట్లకు పెంచారు.
- కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల్లో నేషనల్ హెల్త్ మిషన్‌కు రూ.31,550.87 కోట్లను ఈ ఏడాది రూ.36,000 కోట్లకు పెంచారు.
- ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన పథకానికి కూడా కేటాయింపులు రూ.6,800 కోట్ల నుంచి రూ.7,300 కోట్లకు పెంచారు.
- నేషనల్ టెలీ మెంటల్ హెల్త్ కార్యక్రమానికి రూ.65 కోట్ల నుంచి రూ.90 కోట్లకు పెంచారు.
- నేషనల్ డిజిటల్ హెల్త్ మిషన్ కార్యక్రమానికి రూ.200 కోట్లు.
- స్వయం ప్రతిపత్తి సంస్థలకు గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.17,250.90 కోట్లను రూ.18,013.62 కోట్లకు పెంచారు. ఇందులో ఢిల్లీలోని ఎయిమ్స్‌కు రూ.4,523 కోట్లు కేటాయించారు.

పట్టణాలకు మహర్దశ!



పట్టణవాసులపై వరాలవర్షం

- బడ్జెట్ 9 ప్రాధామ్యాల్లో పట్టణానికీ చోటు
- అదనంగా మూడు కోట్ల ఇళ్లు మంజూరు
- ఐదేళ్లలో రూ.10లక్షల కోట్లతో నిర్మాణం
- అందుబాటు అద్దెతో బాడుగ ఇళ్లు

న్యూఢిల్లీ, జూలై 23: పట్టణాలకు బడ్జెట్‌లో కేంద్రం మహర్దశ పట్టించింది. 2014-25 బడ్జెట్ తొమ్మిది ప్రాధామ్యాల్లో ఒకటిగా పట్టణాభివృద్ధిని కేంద్రం ప్రకటించింది. అందుకు తగినట్టే.. పట్టణ గృహస్థులపై వరాల వర్షం కురిపించింది. అధిక జనాభా నివసించే రద్దీ నగరాలకు రవాణా అనేది పెద్ద సంకటం. దీంతో అతి పెద్ద నగరాలను రవాణాపరంగా పరుగులు పెట్టించాలని కేంద్రం నిర్ణయించింది. 30 లక్షలకు పైగా జనాభా కలిగిన నగరాలను దీని కోసం ఎంపిక చేస్తారు. వాటిలోంచి 14 సిటీలను ఎంపిక చేసుకుని వాటికి రవాణా హంగులు అద్దుతారు. గ్రోత్ హబ్‌లుగానూ ఈ నగరాలను తీర్చిదిద్దుతారు. టౌన్ ప్లానింగ్ పథకాలను పట్టణ పొలిమేర ప్రాంతాల అభివృద్ధికి సద్వినియోగం చేసుకుంటామని కూడా కేంద్రం పేర్కొంది. అలాగే, అదనంగా మూడుకోట్ల పట్టణ గృహాలను వచ్చే ఐదేళ్లలో నిర్మిస్తామని తెలిపింది. దీనికోసం బడ్జెట్‌లో రూ.10 లక్షల కోట్లను ప్రతిపాదించింది. పట్టణాల్లో గృహ నిర్మాణం కోసం ప్రజలు వడ్డీ రాయితీపై తీసుకునే రుణాల రేటు హేతుబద్ధంగా ఉండేలా చూస్తామని తెలిపింది. అందరికీ అద్దె నివాసాలు సమకూరేలా, వాటిపై వసూలు చేస్తున్న బాడుగను ఖరారు చేస్తామని బడ్జెట్‌లో తెలిపారు. పారిశ్రామిక కూలీలు తలదాచుకునే డార్మెటరీలను పీపీపీ (పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం) పద్ధతిలో మరిన్ని నిర్మిస్తామని పేర్కొన్నారు. అలాగే, వారాంతాల్లో ప్రజల అల్పాహార అవసరాలను తీర్చేలా ఒక వంద వీక్లీ స్ట్రీట్ ఫుడ్ హబ్‌లను ఎంపిక చేసిన నగరాల్లో నెలకొల్పుతామని వెల్లడించారు. పట్టణాలకు నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణకు బడ్జెట్‌లో నిర్దిష్ట కార్యాచరణను ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వాలు, బహుళ అభివృద్ధి బ్యాంకుల సాయంతో దీనిపై బృహత్తర ప్రాజెక్టులను చేపడతామని హామీ ఇచ్చారు. బ్యాంకులు కేంద్రంగా వంద పెద్ద నగరాల్లో వీటిని నెలకొల్పుతామని తెలిపారు.

మహిళలు కొనే ఆస్తులపై అత్యల్ప స్టాంప్ డ్యూటీ

కొన్ని రాష్ట్రాలు ఆస్తుల కొనుగోలుపై భారీ స్టాంప్ డ్యూటీ వేస్తున్నాయని కేంద్రం తెలిపింది. ఆ డ్యూటీని రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో సవరిస్తామని పేర్కొంది. ముఖ్యంగా, మహిళలు కొనుగోలు చేసే ఆస్తులపై అతి తక్కువ స్టాంప్ డ్యూటీ ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపింది. పట్టణ అభివృద్ధి స్కీమ్‌ల్లో ఈ ప్రతిపాదనకు పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చింది. దీనివల్ల పట్టణాల్లో ఆస్తుల కొనుగోలు ధర పడిపోతుందని 'కొలియర్స్ ఇండియా' అనే గృహ సేవలు అందించే సంస్థ ఎండీ రవిశంకర్ సింగ్ అభిప్రాయపడ్డారు. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో 'భూ ఆధార్' ప్రక్రియకు విశిష్ట సంఖ్యను కేటాయించే ప్రతిపాదన ఉన్నదని కేంద్రం తెలిపింది.

భూరికార్డుల డిజిటలైజేషన్‌కు ఊపు

బడ్జెట్‌లో నిర్దేశించిన 9 ప్రాధామ్యాల్లో పట్టణాభివృద్ధి ఒకటి అని కేంద్రం స్పష్టం చేసింది. పట్టణ ప్రజల సొంతింటి కలకు ప్రభుత్వం మద్దతు ఇస్తుందని భరోసా ఇచ్చింది. ఈ క్రమంలో ఎదురయ్యే అన్ని సవాళ్లను అధిమిస్తామని పేర్కొంది. భూసంబంధ సంస్కరణల్లో భాగంగా పట్టణ భూరికార్డులకు జీఐఎస్ మ్యాపింగ్ విధానంలో డిజిటలైజేషన్ చేపడతామని తెలిపింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద అదనంగా మూడు కోట్ల గృహాలను రూ.10 లక్షల కోట్ల అంచనాతో నిర్మిస్తామని తెలిపింది. బ్యాంకులకు తలనొప్పిగా మారిన రుణాల ఎగవేత సమస్యను నియంత్రించడానికి దేశవ్యాప్తంగా కొత్తగా మరికొన్ని ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో కేంద్రం ప్రతిపాదించింది.

బడ్జెట్‌లో కేంద్రం సబ్సిడీల కోసం రూ. మొత్తంగా 3,81,175 కోట్ల కేటాయింపులు చేసింది. పెట్రో ఉత్పత్తులకు 2023-24 బడ్జెట్‌లో రూ. 12,240 కోట్లు కేటాయించగా తాజాగా రూ. 11,925 కోట్లను కేటాయించారు. ఆహారానికి గతేడాది బడ్జెట్‌లో రూ. 2,12,332 కోట్లు కేటాయించగా ఈ ఏడాది 2,05,250 కోట్లు కేటాయించారు. ఎరువులకు పోయిన బడ్జెట్‌లో 1,88,894 కోట్లు కేటాయించగా తాజాగా 1,64,000 కోట్లు కేటాయించారు.

సబ్సిడీలు ఇలా

(రూ. కోట్లలో)



	పెట్రో ఉత్పత్తులు	ఆహారం	ఎరువులు
2022-23	6,817	2,72,802	2,51,339
2023-24	12,240	2,12,332	1,88,894
2024-25	11,925	2,05,250	1,64,000

1.52 లక్షల కోట్లతో.. వ్యవసాయానికి భారీ ఊతం



కూరగాయల సాగుకు క్లస్టర్లు

వ్యవసాయానికి కేంద్రం ఊతమందించే చర్యలను ప్రకటించింది. మధ్యంతర బడ్జెట్‌లో చెప్పిన పథకాలను కొనసాగిస్తూనే.. కొత్త విధానాలను ప్రకటించింది. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లను కేటాయించింది. ముఖ్యంగా.. కూరగాయల సాగుకు భారీ క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. కూరగాయల సేకరణ, నిల్వ, మార్కెటింగ్‌కు సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు స్టార్టప్‌లు, సహకార సంఘాలు, రైతు సంఘాలను ప్రోత్సహించనున్నట్లు వెల్లడించింది. వాతావరణ మార్పులను తట్టుకునేలా 32 వ్యవసాయ, ఉద్యాన కేటగిరీలకు చెందిన 109 రకాల అధిక దిగుబడి వంగడాలను విడుదల చేయనున్నట్లు స్పష్టం చేసింది. 100 రోజుల కార్యక్రమంలో భాగంగా అధిక దిగుబడి వంగడాలను అందజేస్తామని పేర్కొంది. ప్రతికూల వాతావరణాన్ని కూడా తట్టుకుని, అధిక దిగుబడి ఇచ్చే కొత్త వంగడాల దిశగా పరిశోధనలను ప్రోత్సహించనున్నట్లు తెలిపింది. రానున్న రెండేళ్లలో కోటి మంది రైతులు ప్రకృతి వ్యవసాయంలోకి వచ్చేలా ప్రోత్సహించి, వారి ఉత్పత్తులకు బ్రాండింగ్, సర్టిఫికేషన్ ఇస్తామని పేర్కొంది. ఈ విధానాన్ని శాస్త్రసాంకేతిక సంస్థలు, గ్రామ పంచాయతీల ద్వారా అమలు చేస్తామని, 10 వేల బయో-ఇన్‌పుట్ రిసోర్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. పప్పు ధాన్యాలు, నూనెగింజల సాగులో స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా.. ప్రత్యేక వ్యూహంతో వాటి ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్‌ను బలోపేతం చేయనున్నట్లు వివరించింది. రొయ్యల సాగు కేంద్రాల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి, నాబార్డ్ ద్వారా ప్రత్యేక ఆర్థిక సాయం అందజేస్తామని స్పష్టం చేసింది. ఐదు రాష్ట్రాల్లోని రైతులకు జన్ సమర్థ్ ఆధారిత కిసాన్ క్రెడిట్ కార్డులను అందజేస్తామని వెల్లడించింది. వ్యవసాయంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాను ప్రోత్సహిస్తామని, ఖరీఫ్ సీజన్‌లో 400 జిల్లాల్లో డిజిటల్ క్రాప్ సర్వేను నిర్వహిస్తామని ప్రకటించింది.

రైల్వేజోన్ ప్రస్తావనే లేదు: మజ్దూర్ యూనియన్

విజయవాడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రైల్వేజోన్‌పై కనీస ప్రస్తావన కూడా లేకపోవటం విచారకరమని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్(ఎస్‌సీఆర్ఎంయూ) జోన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వే జోన్ విషయంలో కేంద్రం కపట ప్రేమ చూపుతోందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి పూర్తి నిరాశాజనకంగా ఉందని, అమరావతి రాజధానికి రూ.15 వేలకోట్ల ఆర్థిక సహాయం చేస్తామని చెప్పినా, కేటాయింపుల్లో చూపలేదని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదురుచూస్తున్న ఎన్‌పీఎస్ రద్దుపై స్పష్టత లేదని, ఓపీఎస్ పునరుద్ధరణకు ప్రకటన చేయలేదని తెలిపారు. రైల్వే ఉద్యోగులకు కరోనా సమయంలో 18 నెలల డీఏ బకాయిలు, బోనస్ వంటి అపరిష్కృత అంశాలపైనా స్పష్టత లేదని వాపోయారు.

రైల్వేకు రూ.2.62 లక్షల కోట్లు

కవచ్ ఏర్పాటుకు ప్రాధాన్యం

న్యూఢిల్లీ, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో రైల్వే శాఖకు రూ.2.62 లక్షల కోట్లు కేటాయించారు. నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో కేవలం ఒక్కసారి మాత్రమే రైల్వే అనే మాటను పలికారు. కీలక ప్రకటనలు లేవు. కొత్త రైళ్ల ఊసు లేదు. తర్వాత ఈ కేటాయింపులపై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులతో మాట్లాడారు. రూ.1.09 లక్షల కోట్లను భద్రతా చర్యల కోసం వెచ్చిస్తామని చెప్పారు. వీటిలో రైలు ప్రమాదాల నివారణకు 'కవచ్' వ్యవస్థ ఏర్పాటుకు అత్యధిక ప్రాధాన్యమిస్తామని తెలిపారు. పాత ట్రాక్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు, సిగ్నలింగ్ వ్యవస్థ మెరుగు, ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేపడతామన్నారు. 2014కు ముందు రైల్వేకు కేటాయింపులు రూ.35 వేల కోట్లు మాత్రమేనని, మోదీ హయాంలో అది రూ.2.62 లక్షల కోట్లకు చేరిందని తెలిపారు. మొత్తం 12,500 జనరల్ కోచ్‌లను తయారుచేస్తామని, వీటికి బడ్జెట్‌లో కేటాయింపులు చేశామని ఆయన చెప్పారు.





ఏ రాష్ట్రంపై వివక్ష లేదు

మేము ఏ రాష్ట్రంపై వివక్ష చూపలేదు. ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించారన్న విమర్శలు సరికాదు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు వడ్డీ లేకుండా 50 ఏళ్ల కాలంలో చెల్లించేటట్లు రూ. 1.5లక్షల కోట్లు కేటాయించాం. బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావన లేనంత మాత్రాన బెంగాల్‌కు అన్యాయం చేసినట్లు కాదు. పూర్వోదయ పథకంలో పశ్చిమ బెంగాల్, బిహార్, ఝార్ఖండ్, ఒడిసా, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని ప్రకటించాం.

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్



ఆంధ్రా, బిహార్ ప్రత్యేక బడ్జెట్‌లా ఉంది


ఇది కేంద్ర బడ్జెట్‌లా లేదు. ఆంధ్రప్రదేశ్, బిహార్‌కు సంబంధించిన ప్రత్యేక బడ్జెట్‌లా ఉంది. ఈ వ్యవహారం ఆంధ్రా, బిహార్‌తో కుదుర్చుకున్న ఉమ్మడి ఒప్పందంలా ఉంది. ఈ బడ్జెట్‌లో తమిళనాడుకు మొండిచేయి చూపిన కేంద్రప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 27వ తేదీన జరుగనున్న నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తాం. 'ఇండియా' కూటమిని గెలిపించడం వల్లే తమిళనాడు ప్రజలపై కేంద్రపాలకులు కక్ష కట్టినట్లు అనిపిస్తోంది.

- తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



ప్రతి ఒక్కరిపై రూ.1.18 లక్షల అప్పు!

2024 మార్చి 31 నాటికి దేశం అప్పు 1,68,72, 554 కోట్లుగా ఉంది. అయితే అప్పటికి భారతదేశ జనాభా 142 కోట్లు అనుకుంటే ... ఒక్కో వ్యక్తిపై సుమారు రూ.1.18 లక్షలు అప్పు ఉన్నట్లు ఓ అంచనా



ఏపీ హ్యాపీ..

కేంద్ర బడ్జెట్‌లో ఆపన్న హస్తం

ఐదేళ్ల తర్వాత తొలిసారి వరాల జల్లు.. అమరావతికి ఆర్థిక సాయం

- ఈ ఏడాది రూ.15 వేల కోట్లు.. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు
- సాధ్యమైనంత త్వరగా పోలవరంపూర్తి.. నిర్మాణానికి పూర్తిస్థాయిలో సొమ్ములు
- పారిశ్రామికాభివృద్ధికి తోడ్పాటు.. విశాఖ ఉక్కుకు రూ.620 కోట్లు..
- కేంద్ర పన్నులు, సుంకాల్లో వాటా 50,474 కోట్లు

న్యూఢిల్లీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం మిత్రధర్మాన్ని చాటుకుంది. కేంద్రంలో ప్రభుత్వ మనుగడకు టీడీపీ-జనసేన మద్దతే కీలకం కావడంతో.. తాజా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రంపై వరాల జల్లు కురిపించింది. రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణం, పారిశ్రామికాభివృద్ధి, వెనుకబడిన ప్రాంతా ల అభివృద్ధికి ఇబ్బడిముబ్బడిగా సాయం అందిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ప్రకటించారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే కర్తవ్యంలో భాగంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రధానంగా రాష్ట్రానికి రాజధాని ఉండాల్సిన అవసరాన్ని గుర్తించామన్నారు. అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక సాయం ప్రకటించారు. వివిధ అభివృద్ధి ఏజెన్సీల ద్వారా ఈ ఏడాదే ఈ నిధులు అందిస్తామని చెప్పారు. రానున్న సంవత్సరాల్లో అదనపు నిధులు కూడా సమకూరుస్తామన్నారు.

కేంద్ర సంస్థలకు నిధులు

రాష్ట్రంలో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ), గిరిజన విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ), సొసైటీ ఫర్ అప్లైడ్ మైక్రోవేవ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్-రీసెర్చ్ (సమీర్), ఇండియన్ స్ట్రాటెజిక్ పెట్రోలియం రిజర్వ్ లిమిటెడ్(ఐఎస్‌పీఆర్ఎల్), విశాఖ పోర్టు ట్రస్టు, విశాఖ ఉక్కు కర్మాగారం, హిందూస్థాన్ షిప్ యార్డ్ తదితర కేంద్ర సంస్థలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. గిరిజన విశ్వవిద్యాలయాన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో భాగంగా గుర్తించాలని నిర్ణయించారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ.620 కోట్లు, విశాఖ పోర్టు ట్రస్టుకు రూ.150 కోట్లు, పెట్రోలియం ఎనర్జీ సంస్థకు రూ.168 కోట్లు కేటాయించారు. ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్షా యోజన కింద దేశంలోని అన్ని ఎయిమ్స్‌లకూ కలిపి రూ.2,200 కోట్లు కేటాయించారు. ఇందులో నుంచి మంగళగిరి ఎయిమ్స్‌కు కూడా నిధులు అందుతాయి.

రాష్ట్రానికి పన్నులు, సుంకాల వాటా ఇదీ

2024-25 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర పన్నులు, సుంకాల్లో రూ.50,474.64 కోట్ల వాటా లభిస్తుందని బడ్జెట్‌లో పేర్కొన్నారు. మొత్తం పన్నులు, సుంకాల్లో ఏపీ వాటా 4.047%. కార్పొరేషన్ ట్యాక్స్ రూపేణా రూ.15,156.51 కోట్లు, ఆదాయ పన్ను-రూ.17,455.93 కోట్లు, కేంద్ర జీఎస్టీ-రూ.15,079.39 కోట్లు, కస్టమ్స్-రూ.2,228.46 కోట్లు, ఎక్సైజ్-రూ.469.73 కోట్లు, సర్వీస్ ట్యాక్స్-రూ.1.66 కోట్లు, ఇతర పన్నులు, సుంకాల రూపేణా రూ.82.96 కోట్లు లభిస్తాయి.

మరిన్ని వరాలు

- వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లా అభివృద్ధికీ విభజన చట్టం ప్రకారం గ్రాంట్లు మంజూరు చేస్తాం.
- పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించడానికి విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని కొప్పర్తి నోడ్, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లోని ఓర్వకల్లు నోడ్‌లో నీరు, విద్యుత్, రైల్వే వంటి మౌలిక సదుపాయాలకు నిధులు మంజూరు చేస్తాం. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మూలధన పెట్టుబడుల కోసం ఈ ఏడాది అదనపు కేటాయింపులు చేస్తాం.
- తూర్పున ఉన్న రాష్ట్రాలు బలమైన సంస్కృతీ సంప్రదాయాలు కలిగి ఉన్నాయి. బిహార్, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిసాలను కలుపుతూ తూర్పు ప్రాంతం సర్వతోముఖాభివృద్ధికి 'పూర్వోదయ' ప్రణాళిక రూపొందిస్తాం.

పోలవరానికి వరం

"ఆంధ్రప్రదేశ్‌కు, ఆ రాష్ట్ర రైతులకు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు ఆర్థిక సాయం అందించడానికి.. త్వరగా పూర్తిచేయడానికి కేంద్రం కట్టుబడి ఉంది. ఈ ప్రాజెక్టు దేశ ఆహార భద్రతను పెంచుతుంది" అని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అలాగే.. వనరుల కొరత రాకుండా వివిధ రాష్ట్రాలకు రూ.లక్షన్నర కోట్ల మేర దీర్ఘకాలిక వడ్డీ లేని రుణాలను కల్పిస్తామని ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. రాష్ట్రానికి విదేశీ రుణ సాయం లభిస్తున్న 'ఆంధ్రప్రదేశ్ రోడ్లు-వంతెనల నిర్మాణ ప్రాజెక్టు', గ్రామీణ రహదారుల ప్రాజెక్టు (రూ.150 కోట్లు), నీటిపారుదల, జీవనోపాధి మెరుగుదల ప్రాజెక్టు రెండోదశ (రూ.300 కోట్లు), అభ్యాస్ పరివర్తన్ ప్రాజెక్టు (రూ.300 కోట్లు) గురించి కూడా నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రస్తావించారు.



కష్టకాలంలో కేంద్ర నిధులొస్తున్నాయి

- వాటిని ఏ రూపంలో ఇచ్చినా ఓకే: బాబు


అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థికంగా చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో కేంద్రం నిధులు వస్తున్నాయని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు వేగం పుంజుకోవడానికి ఇవి ఎంతో ఉపకరిస్తాయని చెప్పారు. రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్ల ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్ అన్ని విధాలా రాష్ట్రానికి తోడ్పాటును అందించేదిగా ఉంది. మేం పెట్టిన ప్రతిపాదనల్లో చాలావరకూ ఆమోదించారు. రాజధాని నిర్మాణానికి పెద్ద మొత్తంలో నిధులు ఇవ్వడం వల్ల రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకొంటాయి. దీనివల్ల పన్నుల రూపేణా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పెరుగుతుంది. కేంద్రం తన పూచీకత్తుతో వివిధ ఏజెన్సీల నుంచి నిధులు ఇప్పిస్తోంది. ఇందులో కొంత అప్పుగా ఉన్నా దానిని తీర్చేది 20, 30ఏళ్ల తర్వాతే. రాజధానికి ఇచ్చే నిధుల్లో కొంత గ్రాంటుగా ఉంటుంది. రాష్ట్రం ఇప్పుడున్న పరిస్థితుల్లో అనుకొన్న పనులు చేయాలంటే నిధులు కావాలి. వాటిని కేంద్రం ఏ రూపంలో ఇచ్చినా పర్వాలేదు' అని అన్నారు. పోలవరం ప్రాజెక్టు బాధ్యత తమదని బడ్జెట్‌లో కేంద్రం విస్పష్టంగా చెప్పిందని, అంతకంటే ఏం కావాలని ప్రశ్నించారు. వెనుకబడిన జిల్లాలకు ఇచ్చే సాయం బుందేల్‌ఖండ్ ప్యాకేజీ తరహాలో ఉంటుందని చంద్రబాబు తెలిపారు. వెనుకబడిన ప్రాంతం కింద ఉత్తరాంధ్రలోని 3 ఉమ్మడి జిల్లాలు, రాయలసీమలోని 4 జిల్లాలు ఉన్నాయని, తమ విజ్ఞప్తితో అదనంగా ఇందులో ప్రకాశం జిల్లాను చేర్చారని తెలిపారు.

మైనర్ల కోసం

'ఎన్‌పీఎస్ వాత్సల్య' పథకం

- బడ్జెట్‌లో నూతన జాతీయ పెన్షన్ పథకం ప్రకటన

న్యూఢిల్లీ, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో భాగంగా మైనర్ల కోసం 'ఎన్‌పీఎస్ వాత్సల్య' పేరుతో నూతన జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్)ను ప్రకటించారు. దీని ద్వారా తల్లిదండ్రులు లేదా సంరక్షకులు తమ పిల్లల భవిష్యత్తు భద్రత కోసం పెన్షన్‌ను ముందుగానే ప్లాన్ చేసుకోవచ్చు. ఈ పెన్షన్ కోసం తల్లిదండ్రులు నిధులు సమకూర్చవచ్చు. పిల్లలు మేజర్లయిన తర్వాత అంటే 18 ఏళ్లవయసు రాగానే ఇది సాధారణ ఎన్‌పీఎస్‌గా మారుతుంది. అప్పుడు దాన్ని పిల్లలకు బదిలీ చేస్తారు. సాధారణ ఎన్‌పీఎస్ ప్లాన్లుగా మారాక యుక్తవయసు వారు తమ పొదుపు అలవాటును కొనసాగించే అవకాశం ఏర్పడుతుంది. ఈ పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది. ఇదిలా ఉండగా.. వ్యక్తులు రిటైర్‌మెంట్ తర్వాత తమ అవసరాల కోసం పెన్షన్ రూపంలో ఆదాయాన్ని పొందడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం ఎన్‌పీఎస్‌ను ఇప్పటికే ప్రవేశ పెట్టింది. పీఎఫ్ఆర్‌డీఏ చట్టం 2013 కింద ఎన్‌పీఎస్ నియంత్రణ, నిర్వహణను పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) చూసుకుంటుంది. 18 నుంచి 70 ఏళ్ల వయసున్న వారు ఎన్‌పీఎస్ ఖాతాను ప్రారంభించవచ్చు. కాగా మైనర్ల కోసం పెన్షన్ స్కీమ్‌ను ప్రవేశపెట్టడాన్ని బాలలహక్కుల సంస్థలు స్వాగతించాయి. దీని ద్వారా సుస్థిర భవిష్యత్తు కోసం ముందుగానే ఆర్థిక ప్రణాళికను ఇది ప్రోత్సహిస్తుందని పేర్కొన్నాయి. అలాగే పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, విద్యకు కేటాయింపులను పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



మైనారిటీ వ్యవహారాలకు నిధుల పెంపు

న్యూఢిల్లీ, జూలై 23: మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖకు ఈ ఏడాది రూ. 3,183.24 కోట్ల నిధులను కేటాయించారు. 2023- 24 బడ్జెట్‌లో ఈ శాఖకు రూ. 2,608.93 కోట్లు కేటాయించగా తాజాగా రూ. 574.31 కోట్లు పెంచారు. వీటిలో 1,575.72 కోట్లు మైనారిటీల విద్యాభివృద్ధికి, రూ.326.16 కోట్లు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు, రూ. 1,145.38 కోట్లు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం కేటాయించారు. మొత్తంగా రూ.2,120.72 కోట్ల నిధులను మైనారిటీల కోసం ప్రతిపాదించిన ప్రధాన పథకాల, ప్రాజెక్టుల అమలు కోసం, ప్రధాన మంత్రి జనవికాస్ కార్యక్రమం కోసం రూ. 910.90 కోట్లను కేటాయించారు. జాతీయ మైనారిటీల అభివృద్ధి, ఆర్థిక కార్పొరేషన్‌కు రూ. 800 కోట్లను కేటాయించారు.





బిహార్‌కు బొనాంజా

బడ్జెట్‌లో 26 వేల కోట్ల కేటాయింపు

న్యూఢిల్లీ, జూలై 23: ఎన్డీయేలో కీలక భాగస్వామి జేడీయూ డిమాండ్ చేసినా బిహార్‌కు ప్రత్యేక హోదా ఇచ్చేందుకు నిరాకరించిన మోదీ ప్రభుత్వం.. కేంద్ర బడ్జెట్‌లో ఆ రాష్ట్రానికి భారీ సాయం ప్రకటించింది. రాష్ట్రంలో వివిధ రోడ్డు ప్రాజెక్టులకు రూ.26 వేల కోట్లు కేటాయించింది. పట్నా-పూర్ణియా ఎక్స్‌ప్రెస్‌వే, బక్సర్-భాగల్పూర్ హైవే, బోధ్‌గయ-రాజ్‌గీర్-వైశాలి-దర్భంగా హైవే, బక్సర్ వద్ద గంగానదిపై రెండు వరుసల వంతెన నిర్మాణం వీటిలో ఉన్నాయి. బిహార్, జార్ఖండ్, బెంగాల్, ఒడిసాల సర్వతోముఖాభివృద్ధికి 'పూర్వోదయ' ప్రణాళికకు రూపకల్పన చేయనున్నారు. అమృతసర్-కోల్‌కతా పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా బిహార్‌లోని గయలో పారిశ్రామికవాడ అభివృద్ధికి సహకరిస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. అలాగే ఆ రాష్ట్రంలో విమానాశ్రయాలు, వైద్య కళాశాలలు నెలకొల్పుతుంది. క్రీడల మౌలిక వసతులను అభివృద్ధి చేస్తుంది. ఏటా లక్ష మంది విద్యార్థులకు కేంద్రం నేరుగా 3 శాతం వడ్డీ రాయితీతో ఈ-వోచర్ రూపంలో రుణాలు ఇస్తుంది. రాష్ట్ర పర్యాటక రంగానికి పెద్దఎత్తున ఊతమివ్వనుంది. గయలోని విష్ణుపాద ఆలయ కారిడార్, మహాబోధి ఆలయ కారిడార్‌లను ప్రపంచ యాత్రా-పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దనుంది. ప్రాచీన నగరాలైన రాజగృహ (రాజ్‌గీర్), నలంద పూర్వవైభవానికి ప్రణాళికలు రూపొందిస్తారు. అతిప్రాచీనమైన నలంద విశ్వవిద్యాలయాన్ని పునరుద్ధరిస్తారు. కాగా.. బిహార్ సీఎం, జేడీయూ అధినేత నితీశ్‌కుమార్ ఇటీవల ప్రత్యేక హోదా డిమాండ్‌ను గట్టిగా వినిపించారు. మరో మిత్రపక్షం ఎల్‌జేపీ (రాంవిలాస్) నాయకుడు, కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ కూడా సమర్థించారు. కేంద్రం కుదరదని స్పష్టం చేసింది. 2012లో యూపీఏ ప్రభుత్వ హయాంలో అంతర్‌మంత్రిత్వ బృందం బిహార్‌కు హోదా డిమాండ్‌ను పరిశీలించిందని.. జాతీయాభివృద్ధి మండలి (ఎన్‌డీసీ) నిబంధనల ప్రకారం హోదా ఇవ్వడం కుదరదని సోమవారమే లోక్‌సభలో ప్రకటించింది. దీనిపై నితీశ్ రాజీనామా చేయాలని మాజీ సీఎం, ఆర్‌జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు. అయితే బడ్జెట్‌లో భారీ కేటాయింపులతో నితీశ్, జేడీయూలను మోదీ ప్రభుత్వం సంతృప్తిపరచిందని రాజకీయ వర్గాలు అంటున్నాయి.


మాకు ప్రత్యేక సాయం: నితీశ్

కేంద్ర బడ్జెట్ బిహార్ సమస్యలకు పరిష్కారం చూపిందని సీఎం నితీశ్ అన్నారు. 'మాకున్న సమస్యల వల్లే ప్రత్యేక హోదా డిమాండ్ చేశాం. సాంకేతిక కారణాలతో హోదా ఇవ్వలేకపోతే.. ప్రత్యేక సాయం ఇవ్వాలని కోరాం. బడ్జెట్‌లో ఇప్పుడదే ప్రకటించారు' అని తెలిపారు. బడ్జెట్‌పై సంతృప్తిగా ఉన్నారా అని ప్రశ్నించగా.. అవునని బదులిచ్చారు.



పసిడి పతనం

బంగారం, వెండి కొనాలంటేనే హడలిపోతున్న సామాన్య ప్రజలకు ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. బంగారం, వెండితోపాటు ప్లాటినమ్, పెల్లాడియం, ఇరిడియం, ఒస్మియం వంటి లోహాలపై విధిస్తున్న కస్టమ్స్ డ్యూటీని తగ్గించింది. బంగారం, వెండిపై వసూలు చేస్తున్న కస్టమ్స్ డ్యూటీని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించింది. ఇందులో బేసిక్ కస్టమ్స్ డ్యూటీ(బీసీడీ) 5 శాతం కాగా అగ్రికల్చరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చరల్ డెవలప్‌మెంట్ సెస్ (ఏఐడీసీ) ఒక శాతం ఉంది. ఇక, ప్లాటినమ్‌పై ఉన్న కస్టమ్స్ డ్యూటీని 15.4 శాతం నుంచి 6.4 శాతానికి తగ్గించారు. ప్రభుత్వ నిర్ణయంతో బంగారం, వెండి. ప్లాటినమ్ ధరలు బహిరంగ మార్కెట్‌లో భారీగా తగ్గి డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. అలాగే, విదేశాల నుంచి బంగారం అక్రమ దిగుమతి కూడా తగ్గనుంది. కస్టమ్స్ డ్యూటీని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం ప్రకటించిన కాసేపటికే ఫ్యూచర్స్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పతనమయ్యాయి. క్షణాల్లోనే రూ.4000 మేర ధరలు తగ్గాయి. ఎంసీఎక్స్‌లో మంగళవారం సాయంత్రానికి 10 గ్రాముల బంగారం ధర ఒక దశలో రూ.4,203 పతనమై రూ.68,515కు చేరింది. అలాగే, కిలో వెండి ధర రూ.4,279 మేర పతనమై రూ.84,924కు తగ్గింది. కాగా, బులియన్ మార్కెట్‌లోనూ ధరలు పతనమయ్యాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 2,990 తగ్గి రూ.70,860కి, 22 క్యారెట్ల ధర రూ.2,750 తగ్గుదలతో రూ.64,950కి, కిలో వెండి 3,500 తగ్గి రూ.92,500కు పరిమితమయ్యాయి.





పురందేశ్వరికి స్వీటు తినిపిస్తున్న కేంద్ర మంత్రి వర్మ, పక్కన సీఎం రమేశ్

ఏపీ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

- రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.269 కోట్లు: పురందేశ్వరి

న్యూఢిల్లీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఏపీ అభివృద్ధికి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో అమరావతికి ఈ ఆర్థిక సంవత్సరానికే రూ.15 వేలకోట్ల కేటాయింపు, పోలవరం పూర్తి వంటివి తమ చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ, ఎంపీ సీఎం రమేశ్‌లతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానుల పేరుతో ఏపీకి అసలు రాజధానే లేకుండా చేశారని మండిపడ్డారు. అమరావతి నిర్మాణ బాధ్యతను కేంద్రమే తీసుకుందన్నారు. పోలవరం నిర్మించే బాధ్యత తమదేనని బీజేపీ మొదటి నుంచి చెబుతుందని, దానికి కేంద్రం కట్టుబడి ఉందని నొక్కి చెప్పారు. ఇక, గడచిన ఐదేళ్లుగా రాష్ట్రంలో రోడ్లను ఎలా విస్మరించారో అందరికీ తెలుసన్నారు. విశాఖ పట్నం-చెన్నై కారిడార్‌లో కొప్పర్తి లేదని, కానీ ఇప్పుడు ఆ ప్రాజెక్టులో కొప్పర్తిని కూడా చేర్చారని తెలిపారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌కు కూడా కేంద్రం పూర్తి సహాయం అందిస్తామని ప్రకటించిందని, దీంతో రాయలసీమ అభివృద్ధి చెందుతుందని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. పూర్వోదయ పేరుతో తూర్పు రాష్ట్రాల అభివృద్ధితోపాటు ఏపీ కూడా అభివృద్ధి చేస్తామని ప్రకటించడం గొప్ప విషయమన్నారు. రైల్వేశాఖ మంత్రి వైష్ణవ్‌ను అడిగిన వెంటనే రాజమండ్రి రైల్వే స్టేషన్‌కి రూ.269 కోట్లు కేటాయించారన్నారు.

జగన్.. గుండెమీద చెయ్యేసుకుని నిజాలు మాట్లాడు!

ఏపీలో శాంతిభద్రతలపై మాట్లాడేందుకు ఢిల్లీకి వచ్చిన జగన్ గుండెమీద చెయ్యేసుకుని ధైర్యంగా నిజాలు మాట్లాడాలని పురందేశ్వరి అన్నారు. 'గత ఐదేళ్లలో ఎలాంటి అరాచక పాలన సాగిందో అందరికీ తెలుసు. ఆ మాటను జగన్ గుండెమీద చెయ్యేసుకుని చెప్పాలి. 14 ఏళ్ల పిల్లవాడిని తగలబెట్టడంతోపాటు దళితుడిని హత్య చేసి డోర్‌డెలివరీ చేసేవరకు. దేన్నీ మర్చిపోలేద'ని వ్యాఖ్యానించారు.

అమరావతి ప్రపంచస్థాయి నగరం: కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

ఎన్డీఏ నేతృత్వంలో రాబోయే ఐదేళ్లలో ప్రపంచస్థాయి నగరంగా అమరావతి అభివృద్ధి చెందుతుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ తెలిపారు. బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులతో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష కోట్లకు పైగా ప్రయోజనాలు చేకూరే అవకాశముందని ఎంపీ సీఎం రమేశ్ తెలిపారు.

అంతలో ఎంత తేడా!

- కేంద్ర బడ్జెట్‌లో మార్మోగిన రాష్ట్రం పేరు
- అమరావతి, పోలవరానికి కేంద్రం భరోసా
- రాజధానికి ఇచ్చే 15వేల కోట్లు పూర్తి సహాయమే!?
- రాష్ట్ర వాటానూ గ్రాంటుగా భరించే అవకాశం
- పోలవరం పూర్తి చేసే బాధ్యత తీసుకున్న కేంద్రం
- వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ ప్యాకేజీ
- పారిశ్రామిక రాయితీలతో ప్రగతికి అవకాశం
- ఐదేళ్ల తర్వాత వినిపించిన తీపి కబుర్లు
- జగన్ హయాంలో ఏపీని పట్టించుకోని కేంద్రం
- ఆయన ఢిల్లీ యాత్రలన్నీ స్వప్రయోజనాలకే!?
- రాష్ట్ర ప్రయోజనాలు సాధించింది శూన్యం
- సీఎం అయ్యాక రెండుసార్లు ఢిల్లీకి బాబు
- రాష్ట్రానికి కావాల్సిన అంశాలపై చర్చలు
- తొలి బడ్జెట్‌లోనే కనిపించిన ఫలితం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్లుగా ఉండీ లేనట్లుగా ఉన్న రాష్ట్రం! ఆంధ్రప్రదేశ్ అనే రాష్ట్రం ఉన్నట్లు కేంద్రం దాదాపుగా మరచిపోయింది. ఇప్పుడు కాలం మారింది. ప్రభుత్వం మారింది. కారణం ఏదైనా... ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ఆపన్న హస్తం అందిస్తోంది. మంగళవారం పార్లమెంటులో బడ్జెట్ ప్రసంగం సందర్భంగా ఏపీ పేరు మార్మోగిపోయింది. రాష్ట్రం తీవ్ర ఆర్థిక కష్టాల్లో మునిగిన సమయంలో... కేంద్రం అందించే సహాయం కొండంత అండగా నిలవనుంది. అమరావతికి ఈ ఏడాది అందించే రూ.15వేల కోట్లు పూర్తిగా సహాయమేనని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పకనే చెప్పారు. అప్పుగా తెచ్చి ఇచ్చే ఈ మొత్తంలో... రాష్ట్ర వాటాను కూడా కేంద్రమే భరించే అవకాశముందని పరోక్షంగా తెలిపారు. ఈ దిశగా చంద్రబాబు ఇదివరకే కేంద్ర పెద్దలతో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది సమకూరే రూ.15వేల కోట్లతో అమరావతి నిర్మాణ పనులను పరుగులు తీయించే అవకాశముంది. ఇక... పోలవరం ప్రాజెక్టు ఖర్చు ఎంతైనా తమదేనని కూడా నిర్మల విస్పష్టంగా చెప్పడం గమనార్హం. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రెండుసార్లు ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. ఒకసారి ప్రధానిని, మరోసారి కేంద్ర హోం మంత్రిని కలిశారు. ఆ తర్వాత వచ్చిన కేంద్ర బడ్జెట్‌లో నిర్దిష్టమైన ఫలితాన్ని సాధించగలిగారు. రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్ల నిధులు ఇస్తామని కేంద్రం ప్రకటించింది. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యత తాము తీసుకుంటామని తెలిపింది. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు సాయంపై వివరాలను కేంద్రం ఇప్పుడు బయట పెట్టకపోయినా... బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ తరహాలో ఇది ఉంటుందని అంటున్నారు. ఈ ప్యాకేజీలో భాగంగా పరిశ్రమలు పెట్టిన వారికి కేంద్రం భారీగా రాయితీలు సమకూర్చింది. ఈ రాయితీల ద్వారా బుందేల్‌ఖండ్ ప్రాంతంలో ఝాన్సీ నగరం కేంద్రంగా రక్షణ ఉత్పత్తుల తయారీ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేల్లో కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలు ఉల్లాసాన్ని నింపాయి. 'మా సంఖ్యా బలం కేంద్రంలో ఎన్డీయే కూటమి మనుగడకు అవసరమైనప్పటికీ... మా విజ్ఞప్తులను కేంద్రం ఎంత వరకూ పట్టించుకొంటుందన్న దానిపై కొంత అస్పష్టత ఉండేది. కానీ చంద్రబాబు తన అనుభవాన్ని ఉపయోగించి, పెద్దరికాన్ని ప్రదర్శించి కొంత వరకూ ఫలితాలను రాబట్టగలిగారు. మాకు కేసులు, ఇతర అవసరాలు లేవు కాబట్టి ఏది అవసరమో అది తెచ్చుకొన్నాం" అని ఒక మంత్రి వ్యాఖ్యానించారు.

జగన్ హయాంలో ఇలా...

రాష్ట్ర అవసరాలు తెలిసి, రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించే నేత తనకు అవకాశం వస్తే, పరిస్థితులు అనుకూలిస్తే ఏం చేయగలరో చంద్రబాబు చేసి చూపించారని విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు. జగన్ హయాం నాటి పరిస్థితులను గుర్తు చేసుకుంటున్నారు. అంతే ఎంపీల సంఖ్య ఉన్నప్పటికీ జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల కాలం వృథాగా గడిపేశారు. చంద్రబాబు మొదటి రెండు నెలల్లోనే కేంద్రం నుంచి సానుకూల ఫలితాలు రాబట్టారు. 2019-24 మధ్య లోక్‌సభలో ఎన్డీయే ప్రభుత్వానికి జగన్ అవసరం లేకపోవడం నిజమే! కానీ... రాజ్యసభలో మాత్రం కచ్చితంగా ఉంది. దీనిని రాష్ట్ర ప్రయోజనాలను సాధించుకునేందుకు జగన్ ఏనాడూ ప్రయత్నించలేదు. ప్రతిసారీ, అన్ని అంశాల్లో ఎన్డీయేకు బేషరతుగా మద్దతు ఇచ్చారు. ఎడాపెడా అప్పులు తెచ్చుకోవడానికి మాత్రమే తన 'పరపతి'ని ఉపయోగించుకున్నారు. విభజన చట్టం కింద రాష్ట్రానికి రావాల్సిన వాటిలో దేనినీ జగన్ రాబట్టలేకపోయారు. మూడు రాజధానుల పేరుతో అయోమయం సృష్టించి... ఏ రాజధానికి సాయం కావాలో అడగలేక ఆ విషయంలో మౌనం వహించారు. పోలవరం ప్రాజెక్టుతో వికట ప్రయోగాలు చేశారు. కేంద్రం వద్దన్నా రివర్స్ టెండరింగ్‌కు వెళ్లారు. నిధులు సాధించలేకపోయారు. తన కేసుల కోసం, తమ్ముడు అవినాశ్ రెడ్డి అరెస్టు కాకుండా ఉండడం కోసం మాత్రమే ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేశారనే ఆరోపణలున్నాయి. ప్రధాని మోదీతో, హోం మంత్రి అమిత్ షాతో భేటీ తర్వాత జగన్ ఎప్పుడూ మీడియా ముందుకురాలేదు. రాష్ట్రాభివృద్ధి కోసం ఏం అడిగారు, కేంద్రం ఎలా స్పందించిందనే వివరాలు చెప్పిందే లేదు. పైగా.. ఐదేళ్లూ అక్షరం పొల్లుపోకుండా అదే వినతిపత్రమే అందించినట్లుగా చెబుతూ వచ్చారు. మోదీ, అమిత్ షా అపాయింట్‌మెంట్ దొరక్కపోతే రోజుల తరబడి ఢిల్లీలో నిరీక్షించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అర్ధ రాత్రి వరకు ఢిల్లీలో పడిగాపులు పడ్డ ఉదంతాలూ ఉన్నాయి. తన వ్యక్తిగత అవసరాల కోసం తప్ప కనీసం రాష్ట్రం పేరును కూడా ఢిల్లీ పెద్దల వద్ద జగన్ ప్రస్తావించలేదని అర్థమవుతోంది.



మాదే బాధ్యత!

(మొదటి పేజీ తరువాయి)

సమాధానమిచ్చారు. "అమరావతిలో రాజధాని నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు, ఏడీబీ వంటి ఆర్థిక సంస్థల నుంచి రుణం తీసుకుంటాం. రాజధాని నిర్మాణానికి కేంద్రం సహాయం చేయాలని ఏపీ విభజన చట్టంలో స్పష్టంగా చెప్పారు. రాజధాని నిర్మాణానికి ఈ ఏడాదే ప్రపంచ బ్యాంకు నుంచి రూ.15వేల కోట్ల రుణం తీసుకుంటాం. ఇందులో... రాష్ట్రం తన వాటాను కూడా భరించాలి. అయితే... ఇప్పుడున్న పరిస్థితుల్లో రాష్ట్రం తన వాటాను చెల్లించగలదా లేదా కేంద్రమే గ్రాంట్ ఇస్తుందా అన్న విషయాలను రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ఒక నిర్ణయానికి వస్తాం" అని నిర్మల తెలిపారు. విభజన జరిగి పదేళ్లయినా... ఆంధ్రప్రదేశ్ రాజధానిలేని రాష్ట్రంగానే ఉందని... భారత దేశంలో ఒక రాష్ట్రం ఉన్నప్పుడు దానికి రాజధాని లేకుండా ఎలా ఉంటుందని ప్రశ్నించారు. చట్టం ప్రకారం ఈ పాటికి ఆంధ్రలో రాజధాని ఏర్పడాల్సి ఉందని, అలా లేకపోవడానికి కారణమెవరనే చర్చలోకి తాను పోవడం లేదని చెప్పారు. రాజధాని నిర్మాణానికి కేంద్రం పూర్తిగా కట్టుబడి ఉన్నదని తెలిపారు.



పోలవరానికి పూర్తి సహాయం

పోలవరం జాతీయ ప్రాజెక్టని, దాని నిర్మించడం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని నిర్మలా సీతారామన్ చెప్పారు. ఆ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ఎంత ఖర్చయినా కేంద్రమే భరిస్తుందని స్పష్టం చేశారు. "పోలవరం జాతీయ ప్రాజెక్టు. అందువల్ల ఖర్చు కేంద్రానిదే. గ్రాంట్‌గా నిధులు ఇస్తారా, రుణాలు తీసుకుంటారా అన్న విషయం కేంద్రానికి సంబంధించింది. ఎంత ఎత్తుకు ఒప్పుకున్నారో అంతవరకు వచ్చే ఖర్చును కూడా పూర్తిగా మేం భరిస్తాం" అని విస్పష్టంగా చెప్పారు. నిర్వాసితులకు పునరావాసం, సహాయ కార్యక్రమాలకు 2013 చట్టం ప్రకారం ఎంత మేరకు సహాయం చేయాలనేదానిపైనా ఒక అంగీకారానికి వచ్చాక కేబినెట్‌లో ఆమోదం తీసుకున్నాం. ఇప్పటి వరకు ఒప్పుకొన్న అన్ని షరతులకు లోబడి పోలవరం ప్రాజెక్టుకు ఎంత మేరకు నిధులు ఇవ్వాలో అంత ఇస్తాం. మొదటిసారి కేబినెట్ ఆమోదించిన మొత్తం దాదాపు ఇచ్చేశాం" అని నిర్మల వివరించారు. నిర్వాసితుల తరలింపు తర్వాత కూడా నిర్మాణంలో కొత్త సమస్యలు తలెత్తాయని, వాటి వివరాల్లోకి పోదలుచుకోలేదని అన్నారు.



తగలబడ్డ మదనపల్లె సబ్‌కలెక్టరేట్ కార్యాలయం

2,440 ఫైళ్లు మసి!

- రికవరీ యత్నాల్లో రెవెన్యూ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో జరిగింది పక్కా కుట్రపూరిత ఫైళ్ల దహనమేనని రెవెన్యూశాఖ నిర్ధారణకు వచ్చింది. ఈ ఘటనలో 2,440 ఫైళ్లు మాడి మసైపోయినట్టు అధికారులు గుర్తించారు. 22(ఏ), ఈనాం, ఎస్టేట్, అసైన్డ్, చుక్కల భూములు, అటవీ శాఖలో వివాదాస్పద భూముల రికార్డులు.. ఇలా అన్నీ కలిపి 2,440 ఫైళ్లు కాలిపోయినట్లు నిర్ధారించారు. వీటిలో అన్నీ అత్యంత కీలకమైన ఫైళ్లేనని ఒక నిర్ణయానికి వచ్చారు. భూముల సర్వే సందర్భంగా సిద్ధం చేసిన రికార్డులు కూడా అందులోనే ఉన్నాయని గుర్తించారు. 22(ఏ) కేసులకు సంబంధించినవి 120 ఫైళ్లు గల్లంతయినట్లు తెలిసింది. వీటిలోనూ పుంగనూరు మండలం రాగానిపల్లె గ్రామానికి చెందిన 982 ఎకరాల ఎస్టేట్ భూమికి సంబంధించిన ఫిజికల్ ఫైల్స్ కొన్ని ఉన్నట్లు గుర్తించారని సమాచారం. ఇంకా ఏయే ఫైళ్లు కనిపించడం లేదో గుర్తించాక వాటి ప్రాధాన్యం ఆధారంగా రికవరీ చేపట్టాలని భావిస్తున్నారు. కొన్ని కంప్యూటర్ల సీపీయూలు కూడా ధ్వంసమయ్యాయని గుర్తించారు. వాటిలోని డేటా.. ప్రభుత్వ డేటా ఉండే సర్వర్లలో ఉందా? లేదా రికవరీ సాధ్యం అవుతుందా? లేదా అన్న అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. బుధవారం నుంచే పలు ఫైళ్ల రికవరీ ప్రక్రియ ప్రారంభించాలని నిర్ణయించినట్టు తెలిసింది.

పోలీసుల అదుపులో పెద్దిరెడ్డి అనుచరుడు

- మాధవరెడ్డిని విచారిస్తున్న అధికారులు
- మదనపల్లె సబ్ కలెక్టర్ ఆఫీస్ 'అగ్గి' ఘటనలో కీలక పరిణామం
- 2 బస్తాల డాక్యుమెంట్లు స్వాధీనం
- పదకొండు మండలాల రికార్డులు సీజ్
- విచారణ ముమ్మరం.. తేలుస్తాం: సిసోడియా

రాయచోటి, జూలై 23(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డుల దహనం ఘటనకు సంబంధించిన విచారణ ముమ్మరంగా సాగుతోంది. ఈ క్రమంలో వైసీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించి.. రెండు బస్తాల డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నుంచి పోలీసుల అదుపులో ఉన్న సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు.. పోలీసులు మాధవరెడ్డిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. మంగళవారం ఉదయం నుంచి పోలీసులు సబ్‌కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులను విడివిడిగా విచారిస్తున్నారు. అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ ఆధ్వర్యంలో పది పోలీసు బృందాలు, జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఐదు రెవెన్యూ బృందాలు విచారణ కొనసాగిస్తున్నాయి. సోమవారం రాత్రి నుంచి ఆర్డీవో స్థాయి అధికారుల పర్యవేక్షణలో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని 10 మండలాలు, పీలేరు నియోజకవర్గం కలికిరి మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను అధికారులు సీజ్ చేసి జిల్లా కేంద్రమైన రాయచోటికి తరలించారు. మంగళవారం ఉదయం నుంచి ఐదుగురు ఐఏఎస్‌లు, ఇద్దరు ఐపీఎస్‌లు ఈ విచారణను పర్యవేక్షిస్తున్నారు.

మాధవరెడ్డి మహా ముదురు!

పెద్దిరెడ్డి అనుచరుడు మాధవరెడ్డి మహా ముదురని పోలీసులు భావిస్తున్నారు. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో పెద్దిరెడ్డి కుటుంబానికి చెందిన భూవ్యవహారాలు ఆయనే చూసేవారని సమాచారం. పెద్దిరెడ్డి తరఫున 22ఏ ఫైళ్లు చూడడంతో పాటు, వివాదాస్పద భూముల్లో పెద్దిరెడ్డి పేరుతో జోక్యం చేసుకుని సెటిల్‌మెంట్లు చేసేవారని తెలుస్తోంది. మదనపల్లె పట్టణం చుట్టూ.. రూ.వందల కోట్ల విలువ చేసే భూవ్యవహారాల్లో మాధవరెడ్డి పాత్ర ఉన్నట్టు సమాచారం. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని తగలబెట్టక ముందు వారం రోజుల నుంచి ఆయన ప్రతిరోజూ అక్కడకు వెళ్లి అక్కడి ఉద్యోగులతో మాట్లాడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదిలావుంటే, మంగళవారం ఉదయం నుంచి కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మదనపల్లెలో మకాం వేశారు. అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ ఆధ్వర్యంలో ఇప్పటికే పోలీసుల అదుపులో ఉన్న సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్, వాచ్‌మెన్ రమణయ్యతో పాటు మరికొందరితో కలిపి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసినట్లు సమాచారం. ఘటన ఏ విధంగా జరిగింది? ఎవరు అగ్గి పెట్టారు? వంటివి పోలీసులు నిర్ధారించుకున్నట్లు తెలిసింది. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సెక్షన్ల వారీగా ఉద్యోగులను విడివిడిగా పోలీసులు విచారిస్తున్నారు. గతంలో ఏయే ఫైళ్లు చేశారు? ఎవరెవరు వచ్చేవాళ్లు? అక్రమ వ్యవహారాలు ఎవరు నడిపారు? సూత్రధారులు ఎవరు? అనే కోణాల్లో ఆరా తీసినట్లు తెలిసింది. ఈ ఘటనపై అటు రెవెన్యూ ఇటు పోలీసు బృందాలు విడివిడిగా విచారణ సాగిస్తున్నాయి. కాలిపోయిన ఫైళ్ల బూడిదను ఫోరెన్సిక్ బృందం సీజ్ చేసి తీసుకెళ్లినట్లు తెలిసింది.

11 మండలాల రికార్డులు సీజ్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని దహనం చేసిన ఘటనతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. పెద్దిరెడ్డి కుటుంబం పలు భూఆక్రమాలకు పాల్పడిందనే ఆరోపణల నేపథ్యంలో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలు, పీలేరు నియోజకవర్గంలోని తహసీల్దార్ కార్యాలయాల్లోని రెవెన్యూ రికార్డులను ఆర్డీవో స్థాయి అధికారితో పరిశీలించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కాలిపోయిన 22ఏ ఫైళ్లలో ఇక్కడి నుంచి ఏ రికార్డులు ఉన్నాయి? ఎన్ని ఉన్నాయి? ఎవరికి సంబంధించినవని ఆరా తీశారు. వాటిని మంగళవారం కలెక్టర్ కార్యాలయానికి తరలించారు.

పూర్తిస్థాయి విచారణ: సిసోడియా

'మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌కు అగ్గి' ఘటనపై పూర్తిస్థాయిలో విచారిస్తున్నట్టు రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా తెలిపారు. మంగళవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌లతో కలసి సబ్‌కలెక్టర్ భవనంతో పాటు, ఆవరణలోని అన్ని ప్రాంతాలను తనిఖీ చేశారు. ఏ గది నుంచి మంటలు వ్యాపించాయి, ఆర్డీవో చాంబర్‌కు ఎందుకు మంటలు రాలేదు.. తదితర వివరాలను సేకరించారు. 22ఏ విభాగంలో కాలిపోయి మిగిలిన ఫైళ్ల ముక్కలను పరిశీలించారు. అగ్గి ఘటనకి గల కారణాలను త్వరగా గుర్తించి చర్యలు తీసుకుంటామని సిసోడియా తెలిపారు.





తగలబడ్డ మదనపల్లె సబ్‌కలెక్టరేట్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా

బీరువాలో 7 లీటర్ల ఇంజన్ ఆయిల్

- ముందే తెచ్చి పెట్టిన సీనియర్ అసిస్టెంట్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గౌతమ్‌తేజ్ పక్కా పథకం ప్రకారమే వ్యవహరించినట్టు సమాచారం. అగ్గి ఘటన జరగడానికి ముందుగానే సుమారు 7 లీటర్లు ఇంజన్ ఆయిల్ తెచ్చి తన బీరువాలో ఉంచినట్లు తెలిసింది. కార్యాలయానికి నిప్పు పెట్టినరోజు ఈ ఇంజన్ ఆయిల్‌ని ఉపయోగించినట్లు సమాచారం. ఈ విషయాన్ని నిందితుడు పోలీసుల ముందు అంగీకరించినట్లు విశ్వసనీయ సమాచారం.

ఎవరీ మాధవరెడ్డి?

వి. మాధవరెడ్డి అలియాస్ రైస్‌మిల్లు మాధవరెడ్డి చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలానికి చెందినవారు. తొలుత భవన నిర్మాణ రంగంలో ఉన్నాక రైస్‌మిల్లు వ్యాపారంలోకి అడుగు పెట్టారు. కాంగ్రెస్ హయాంలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో సన్నిహితంగా ఉండి తర్వాత అనుచరుడిగా మారారు. అప్పట్లో వెలుగు చూసిన ధాన్యం కుంభకోణంలో మాధవరెడ్డి పాత్ర ఉంది. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో మళ్లీ అక్రమాలకు తెరలేపారు. పలు మండలాల్లో 22ఏ కింద నిషేధిత భూముల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని బెదిరించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇలా కొన్న భూములను పెద్దిరెడ్డి సతీమణి స్వర్ణలత, మాధవరెడ్డి, ఆయన కుమారుడు మౌనిష్‌రెడ్డి పేర్ల మీద రిజిస్ట్రేషన్లు చేయించారు. ఒక్క కురబలకోట మండలంలోనే 500 ఎకరాలు, తంబళ్లపల్లెలో 200 ఎకరాలు, మదనపల్లెలో 100 ఎకరాలు, బి.కొత్తకోటలో 50 ఎకరాలకుపైగా బినామీ పేర్లతో మాధవరెడ్డి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలుస్తోంది.

రాత్రి 11.30 గంటలకు ఫైళ్లకు అగ్గి

- అరగంట తర్వాత విద్యుత్ వైర్లకు నిప్పు.. మదనపల్లె ఘటన ప్రమాదం కాదు: అధికారులు

విద్యుత్తు ప్రమాదాలకు ఒక లెక్క ఉంటుందని ఇంధన శాఖ వర్గాలు వెల్లడించాయి. ప్రమాదవశాత్తు షార్టు సర్క్యూట్ జరిగితే విద్యుత్తు వైర్లు కాలిపోతాయని, మల్టీ కేబుల్ బోర్డు(ఎంసీబీ) ట్రిప్ అవుతుందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అప్పుడు కరెంటు సరఫరా నిలిచిపోతుందన్నారు. షార్టు సర్క్యూట్ జరిగిన సమయం.. విద్యుత్తు సరఫరా నిలిచిపోయిన సమయం ఒకటే అయితే.. దానిని విద్యుత్తు ప్రమాదంగా భావిస్తామని తేల్చిచెబుతున్నారు. మదనపల్లెలో జరిగిన 'అగ్గి' ఘటనలో షార్టు సర్క్యూట్‌కు అవకాశం లేదని తెలిపారు. మదనపల్లె ఘటనను ఇంధన శాఖ అధికారుల బృందం అన్ని కోణాల్లోనూ పరిశీలించింది. రాత్రి 11.30 గంటలకు ప్రమాదం జరిగితే దాదాపు అర గంట తర్వాత 12 గంటలకు వైర్లు కాలినట్లుగా గుర్తించారు. విద్యుత్తు వైర్లు కాలకముందు వరకూ ఒక యాంప్ విద్యుత్తు ప్రవాహం ఉన్నట్లు గుర్తించారు. దీంతో.. ఇది విద్యుత్తు ప్రమాదం కాదని, ప్రణాళిక ప్రకారమే రికార్డులను కాల్చేశాక.. విద్యుత్తు వైర్లను కాల్చినట్లు నిర్ధారణకు వచ్చారు. బుధవారం ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నారు.

కొప్పర్తికి మహర్దశ

- కడప జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సానుకూలత

కడప, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కడప జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు పెద్దపీట వేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా కొప్పర్తి పారిశ్రామికవాడను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. దీంతో జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది. కడప జిల్లా పరిశ్రమలకు అనువైనది. దగ్గరలోనే బెంగళూరు, చెన్నై మెట్రో నగరాలున్నాయి. జాతీయ రహదారులతో పాటు కడప నుంచి రైలు, విమాన సదుపాయాలు ఉన్నాయి. కృష్ణపట్నం, చెన్నై పోర్టులున్నాయి. ఏపీఐఐసీకి కడప శివారు పరిధిలో 9వేల ఎకరాల పైచిలుకు భూమి ఉంది. కొప్పర్తి పారిశ్రామికవాడ 6,914 ఎకరాల్లో ఉంది. ఇక్కడ ప్రస్తుతం 3,900 ఎకరాలు అభివృద్ధి చేశారు. ఇప్పటికే ఇక్కడ డిక్సన్ కంపెనీ ఉత్పత్తులను కొనసాగిస్తోంది. 2,300 మందికి ఉపాధి కల్పిస్తోంది. మరికొన్ని రోజుల్లో గార్మెంట్, టీవీల తయారీ పరిశ్రమ మొదలు కానుంది. అయితే కొప్పర్తిలో గత ఐదేళ్లలో జగన్ సర్కారు మౌలిక వసతుల కల్పనలో వెనుకబడింది. పరిశ్రమలకు కీలకమైన నీటి సౌకర్యం కొప్పర్తిలో లేదు. గత ప్రభుత్వం తన వాటా నిధులు చెల్లించకపోవడంతో కేంద్రం ఇచ్చిన నిధులు కూడా వెళ్లిపోయాయి. బ్రహ్మంసాగర్ నుంచి కొప్పర్తికి నీరందించేందుకు ప్రాజెక్టును చేపడితే బిల్లులు రాక పనులు నిలిచిపోయాయి. కొప్పర్తి పారిశ్రామికవాడలో సౌత్‌జోన్‌లో 2,595 ఎకరాల భూములున్నాయి. వీటిని వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా అభివృద్ధి చేయనున్నారు. ఈ కారిడార్‌లో అవసరమైన రోడ్లు, నీరు, విద్యుత్, పరిశ్రమల వ్యర్థాల కోసం ప్రత్యేక ప్లాంటు, ఇతర వసతులు కల్పిస్తారు. ప్రస్తుతం వీసీఐసీ కారిడార్‌లో భాగంగా కొప్పర్తిలో అభివృద్ధి చేయనున్న భూములను కొట్టేసేందుకు గతంలో కడప ఆర్డీవోగా పనిచేసిన ఓ అధికారి సలహాదారు, అప్పటి ప్రభుత్వంలోని ముఖ్య అధికారి స్కెచ్ వేశారు. ఏపీఐఐసీకి తెలియకుండానే ఈ భూములను రైతుల పేరిట కాజేసే యత్నం చేశారు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు వచ్చాయి. జగన్ సర్కారు పోయి చంద్రబాబు ప్రభుత్వం రావడంతో భూదందాకు బ్రేక్ పడింది.

ఓర్వకల్లుకు ఊపిరి

- హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌లో మౌలిక వసతులు

కర్నూలు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) :కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు ఊపిరి పోసింది. హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా ఓర్వకల్లు హబ్‌లో నీరు, విద్యుత్తు, రైల్వే, రోడ్లు వంటి మౌలిక వసతులకు నిధులు ఇస్తామన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు రాక్ గార్డెన్ (రాతి వనం)గా ప్రసిద్ధి. కర్నూలు-చిత్తూరు వయా నంద్యాల జాతీయ రహదారిలో కర్నూలు నగరానికి 20 కిలో మీటర్ల దూరంలో ఓర్వకల్లు ఉంది. రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు 33 వేల ఎకరాల్లో ఓర్వకల్లు హబ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పారిశ్రామికవేత్తలు వచ్చేందుకు కొండలు, గుట్టలు చదును చేసి 1,010 ఎకరాల్లో రూ.110 కోట్ల వ్యయంతో ఏడాదిన్నర కాలంలో విమానాశ్రయం ఏర్పాటు చేసి చరిత్ర సృష్టించారు. వెయ్యి మెగావాట్ల యూనిట్లతో ఆసియాలోనే అతి పెద్ద సోలార్ పార్క్ ఏర్పాటు చేశారు. ప్రపంచంలోనే తొలి పంప్డ్ స్టోరేజ్ పవర్ యూనిట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.3 వేల కోట్ల పెట్టుబడితో 5 వేలమంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి, ఉద్యోగాలు కల్పించేలా జైరాజ్ ఇస్పాత్ లిమిటెడ్ స్టీల్ పరిశ్రమకు భూమి పూజ చేశారు. సుమారు 80 వేలమంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా రూ.88 వేల కోట్ల పెట్టుబడులతో కొత్త పరిశ్రమలు తీసుకొచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. పారిశ్రామికవేత్తలతో ఒప్పందం కూడా చేసుకున్నారు. ఓర్వకల్లు సమీపంలో 4 టీఎంసీల సామర్థ్యంతో జలాశయం నిర్మించి.. శ్రీశైలం ప్రాజెక్టు ఎగువన ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కృష్ణా జలాలు ఎత్తిపోసేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే కర్నూలు మండలం దూపాడు రైల్వే స్టేషన్ నుంచి ఓర్వకల్లు పారిశ్రామికవాడ వరకు గూడ్స్ రైళ్ల రాకపోకలకు రైల్వే లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేశారు. అయితే 2019లో జగన్ ప్రభుత్వం రావడం శాపంగా మారింది. ఒక్క పరిశ్రమా రాకపోగా ఇండస్ట్రియల్ హబ్ మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. తాజాగా కేంద్ర బడ్జెట్‌లో ఓర్వకల్లు హబ్‌లో మౌలిక వసతులకు నిధులిస్తామని ప్రకటించడంతో మళ్లీ పారిశ్రామిక వైభవం రానుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐఐ రాష్ట్ర చైర్మన్ మురళి

బడ్జెట్ భేష్


జల సంఘం చైర్మన్‌తో సమావేశమైన మంత్రి నిమ్మల, అధికారులు

● కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ రాష్ట్ర చైర్మన్ మురళి

వన్‌టౌన్, జూలై 23: గత ఏడాది బడ్జెట్ కన్నా ఈ ఏడాది బడ్జెట్ ఎంతో ఉపయోగకరంగా ఉందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఏపీ చైర్మన్ మురళి అన్నారు మంగళవారం సీఐఐ కార్యాలయంలో కేంద్ర బడ్జెట్‌పై ప్రతినిధులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సారి బడ్జెట్‌లో విభజనకు సంబంధించిన అంశాల్లో కేటాయింపులు ఎలా ఉంటాయోనని ఎదురు చూశామని, అయితే కేటాయింపుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో చర్చలు జరిగినట్టు కనిపిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపినట్టు స్పష్టమవుతోందన్నారు. ప్రకటించిన బడ్జెట్ రాష్ట్రానికి మేలు చేస్తుందన్నారు. ప్రత్యేక హోదా లేకపోయినా ప్రత్యేక ప్యాకేజీని కేంద్రం ఇస్తోందన్నారు. రాజధాని అమరావతికి రూ.15వేల కోట్లు కేటాయింపు హర్షణీయమన్నారు. అలాగే వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి సహకరిస్తామని కేంద్రం చెప్పిందన్నారు. పారిశ్రామిక కారిడార్‌ను వెంటనే అభివృద్ధి చేసినట్టయితే కంపెనీలు, ఉద్యోగాలు వస్తాయన్నారు. ఆక్వారంగానికి పన్ను రాయితీలతో మత్స్య పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. దేశవ్యాప్తంగా నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగవకాశాలు వంటి వాటిపై బడ్జెట్‌లో ప్రస్తావించారన్నారు. సీఐఐ సభ్యులు కొందరు మాట్లాడుతూ 500 పరిశ్రమలతో కోట్లమందికి ఉపాధి అవకాశాలు వస్తాయని బడ్జెట్‌లో ప్రస్తావించారన్నారు. 5కోట్ల మంది యువతకు అదనంగా నైపుణ్యం కోసం శిక్షణ ఇవ్వనున్నారన్నారు. క్రెడిట్ గ్యారంటీ స్కీమ్ ప్రస్తావించారన్నారు. రాష్ట్ర సీఎం కూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టారన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమలు రావడంతో ఉద్యోగాలొస్తాయని ఎంఎస్‌ఎంఈ చాలా సవాళ్లను ఎదుర్కొంటున్నదన్నారు. ఎగుమతులు చేసే ఉత్పత్తుల్లో నాణ్యత ఉండాలన్నారు. 2, 3 కోట్ల మందికి ఉద్యోగాలంటే పెద్ద సవాలేనన్నారు. ఇందుకు వనరులు సమకూర్చుకోవడం తో పాటు పరిశ్రమలను విరివిగా ప్రోత్సహించాలన్నారు. రూరల్ ఏరియాలో శిక్షణ పొందేవారికి షెల్టరు ఇవ్వాలన్నారు. చిన్న తరహా పరిశ్రమలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలన్నారు. సభ్యురాలు నాగలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు ఉపాధి చూపించి ఆర్థికంగా ఎదుగుదలకు సహకరిస్తామని బడ్జెట్‌లో ప్రకటించారన్నారు. వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లకు స్టాంపు డ్యూటీ మినహాయింపు, పన్నుల్లో కొంత రాయితీ ఇచ్చారు కానీ ఇంకా సదుపాయాలు కల్పించాలన్నారు. క్యాపిటల్ గెయిన్స్‌పై కొద్దిగా పన్ను పెంచారని, ఇది స్టాక్ మార్కెట్‌పై ప్రభావం చూపుతుందన్నారు. రైతులు, మహిళలు, యువత, మధ్యతరగతి లక్ష్యంగా బడ్జెట్ ఉందని, ఏకంగా అందరికీ మేలుచేసే బడ్జెట్ అని పేర్కొన్నారు.

ఉద్యోగులకు ఊరట: లింగమూర్తి

కేంద్రం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగులకు ఊరటనిచ్చే అంశాలున్నాయని ఆడిటర్ లింగమూర్తి అన్నారు. కేబీఎన్ కళాశాల కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం బడ్జెట్‌పై ప్రత్యేక ప్రసంగం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడ్జెట్‌లో ఉద్యోగులకు ఆదాయపు పన్ను అంశాల్లో కొంత వెసులుబాట్లు, మినహాయింపులు ఇచ్చారన్నారు. విద్యా, వైద్యరంగాలకు కేటాయింపులు పరవాలేదన్నారు. ముద్ర రుణాలను రూ.20 లక్షలకు పెంచడంతో కుటీర పరిశ్రమలు అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. కళాశాల పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేష్, అధ్యాపకుడు రవికిరణ్ పాల్గొన్నారు.

ఏపీకి కేటాయింపులు సంతోషం: విద్యాసాగర్



కొన్నేళ్ల తరువాత కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులు వేసి ఉపశమనం కల్పించడం హర్షదాయకమని ఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఏ విద్యాసాగర్ అన్నారు. అమరావతికి రూ.15 వేల కోట్ల సాయం ప్రకటించారని, అయితే సాయాన్ని తిరిగి చెల్లించే విషయంలో స్పష్టత రావాల్సి ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టను పూర్తి చేయడానికి అవసరమైన నిధులు అందిస్తామని ప్రకటించడం మంచి పరిణామమన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక వాడలకు అవసరమైన నిధులు కేటాయించడం, రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఉద్యోగులకు స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 నుంచి రూ.75వేలకు పెంచడం, రూ.3లక్షల వరకు పన్నులేకుండా చేయడంఫ్యావిఎలీ పెన్షన్‌పై ఆధారపడిన వారికి రూ.15 నుంచి రూ.25వేలకు మినహాయింపు వేయడం వంటివి వేతన జీవులకు ఆశించినంత కాకపోయినా ఉపశమనం కలిగించే అంశాలని అన్నారు.

స్థిరనివాస నగరంగా అమరావతి: శ్రీనాథ్‌రెడ్డి



దేశంలో ఒక స్థిర నివాస యోగ్య నగరంగా అమరావతి మారనుందని రామ్ ఇన్ఫో లిమిటెడ్ ఎండీ ఎల్ శ్రీనాథ రెడ్డి అన్నారు. సుస్థిత అభివృద్ధి, స్థిర భవిష్యత్తు నగరంగా భాసిల్లనుందన్నారు. అమరావతి విజన్‌లో ఎన్నో అంశాలు మిళితమై ఉన్నాయని, బడ్జెట్‌లో కేటాయింపులు అమరావతి నిర్మాణ పునరుద్ధరణకు దోహదం చేస్తాయన్నారు. పర్యావరణం, సుస్థిరత, పునరుత్పాదకత, స్మార్ట్‌సిటీ, విద్యాసంస్థలు, అత్యున్నత స్థాయి ఆసుపత్రులు ఇలా ఎన్నింటికో ఒక విజన్‌తో ప్రణాళికను అమరావతిలో అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. దాదాపు 40శాతం శ్రామిక శక్తికి ఉపాధి కల్పిస్తున్న నిర్మాణరంగ పునరుద్ధరణ, ఆర్థికాభివృద్ధికి ఊతమివ్వడంతో పాటు పన్నుల రాబడిని పెంచుతుందన్నారు. మరిన్ని వ్యాపారాలను ఆకర్షించి జీడీపీని పెంచుతుందన్నారు.

ఆశాజనకంగా బడ్జెట్: వక్కలగడ్డ

ధర్నాచౌక్: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు స్వాగతించారు. బడ్జెట్ ఆశాజనకంగా ఉందని ఒక ప్రకటనలో తెలిపారు. వేతన ప్రజలకు ఊరటనిస్తూ ఆదాయపు పన్ను పరిమితిని స్వల్పంగా పెంచడం, స్టాండర్డ్ డిడక్షన్ పరిమితి పెంచడం హర్షించదగ్గ పరిణామమన్నారు. రాజధానికి రూ.15వేల కోట్ల నిధులు, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు సహాయం, పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక రాయితీలు, విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధికి నిధులు, ఉపాధి కల్పన, నైపుణ్య శిక్షణ, ఎంఎస్‌ఎంఈ రంగాలపై ప్రత్యేక దృష్టి, రూ.2లక్షల కోట్ల వ్యయంతో 4.1 కోట్ల మంది యువతకు ఉపాధి కల్పిస్తామని ప్రకటించడం రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆతిథ్యరంగానికి ఊతం: ఆర్వీ స్వామి

విజయవాడ: రాజధాని అమరావతికి నిధుల కేటాయింపు శుభపరిణామమని ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి అన్నారు. స్థానిక తయారీ, ఉపాధిని ప్రోత్సహించడానికి కస్టమ్ డ్యూటీతోపాటు జీఎస్‌టీ, టీడీఎస్ వంటి అనేక అంశాలను మరింత సులభతరం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. దేశంలోకి పెట్టుబడులను ఆకర్షించేలా కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. ఇటువంటి చర్యలతో దేశంలోను, రాష్ట్రంలోను హోటల్, ఆతిథ్య రంగాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

కేంద్రం ఇచ్చింది నిధులా? రుణమా?: గిడుగు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయించిన రూ.15వేల కోట్లు నిధులా, రుణమా అన్న విషయాన్ని స్పష్టం చేయాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2014లో అమలు చేయాల్సిన రాష్ట్ర పునర్‌వ్యవస్థీకరణ చట్టాన్ని ఇప్పుడు అమలు చేయడం మోదీ కుంభకర్ణుడి నిద్రను గుర్తు చేస్తుందన్నారు. మోదీ కుర్చీని కాపాడుకోవడానికి మిత్రపక్షాల డిమాండ్లకు తలొగ్గుతున్నట్టు కనిపిస్తోందన్నారు. విభజన చట్టాన్ని గౌరవించాలన్న చిత్తశుద్ధి మోదీకి లేదన్నారు.

చంద్రబాబుకెవరూ సరిరారు: లుక్కా



విద్యాధరపురం: రాష్ట్రాభివృద్ధిలో సీఎం చంద్రబాబు నాయుడుకెవరూ సరిరారని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్లు మంజూరు చేయడం విభజన హామీలను నెరవేర్చే క్రమంలో పోలవరం ప్రాజెక్టు, తదితర అంశాలపై కేంద్రం సానుకూలంగా హామీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధిలో చంద్రబాబుకున్న చిత్తశుద్ధి మరెవరికీ లేదని, ఆయనకెవరూ సరిరారన్నారు. కేంద్రం బడ్జెట్‌లో అమరావతి అభివృద్ధికి నిధులు కేటాయించడం, ఇంకా అనేక అంశాల్లో కేంద్రాన్ని ఒప్పించడంతో ఆయన కృషిని ఎంతైనా అభినందించవచ్చునన్నారు. గత ఐదేళ్లలో జగన్‌రెడ్డి చేసిన వికృత చేష్టలకు అభివృద్ధిలో రాష్ట్రం 20ఏళ్ల వెనక్కి వెళ్లిపోయిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చేసుకుని పరిపాలన సాగించే చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే కేంద్రాన్ని ఒప్పించి నిధులు రాబట్టడం విశేషమన్నారు. రాష్ట్రం అభివృద్ధి బాటలో నడుస్తుందన్న నమ్మకం ప్రజలలో ఏర్పడిందన్నారు. రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు తీసుకునే నిర్ణయాలకు తన మద్దతు ఉంటుందని ప్రకటించిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక అభినందనలు చెబుతున్నామన్నారు.

ఆంధ్రకు అగ్రతాంబూలం: దేరంగుల



కృష్ణలంక: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అగ్రతాంబూలం దక్కిందని, రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందనడానికి ఇదే నిదర్శనమని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు దేరంగుల ఉదయ్ కిరణ్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ పునర్‌వ్యవస్థీకరణ చట్టానికి కట్టుబడి ఉన్నామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారని, విభజన హామీలను నెరవేరుస్తామంటూనే ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్లు కేటాయించడం ముదావహమన్నారు. ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంపూర్ణ సహకారం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కింద రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక నిధులు ఇవ్వనున్నట్లు ప్రకటించడం హర్షదాయకమన్నారు. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణానికి సాయం చేస్తామని, ఏపీ గ్రామీణాభివృద్ధి పథకాలకు రూ.2.66 లక్షల కోట్లు కేటాయించడం సంతోషించదగ్గ పరిణామమని ఉదయ్‌కిరణ్ తెలిపారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాల నిర్మాణానికి ప్రత్యేక సహకారం అందిస్తామని నిర్మలా చెప్పారన్నారు. వైఎస్ జగన్మోహనరెడ్డి పుణ్యమా అని ఐదేళ్ల నుంచి రాష్ట్రం రూ.లక్షల కోట్లు అప్పుల్లో కూరుకుపోయిందని, జగన్ తుగ్లక్ నిర్ణయాలతో రాష్ట్రం దివాలా తీసిందని, దాన్నుంచి ఇప్పుడిప్పుడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో బయటపడే అవకాశం ఉందని దేరంగుల ఆశాభావం వ్యక్తం చేశారు.



చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం: ఏపీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్

ఆటోనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అనుకూలంగా ఉందని ఏపీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డీ దుర్గాప్రసాద్, గౌరవాధ్యక్షుడు బాయన వెంకట్రావు హర్షం వ్యక్తం చేశారు. ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటు, ఎంఎస్ఎంఈ అభివృద్ధికి చట్టంలో మార్పులు, విశాఖ చెన్నై పారిశ్రామికవాడలో కొప్పర్తికి, బెంగళూరు పారిశ్రామిక క్యారిడార్లలోని ఓర్వకల్లు కేంద్రాలకు ప్రత్యేక సహకారం అందించడం లాంటి అనేక పథకాలను ప్రకటించడం, కొత్తగా 12 పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.11 లక్షల కోట్లు ప్రకటించడం లాంటివన్నీ ఆహ్వానించదగ్గవేనన్నారు. చిన్న పరిశ్రమలకు, తద్వారా రాష్ట్ర అభివృద్ధికి కేంద్రప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాలకు తమ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యదర్శి రామచంద్రరావు, ట్రెజరర్ జీవీఎస్ఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు.

పోలవరం డిజైన్లకు త్వరగా అనుమతులివ్వండి

» ఢిల్లీలో జలసంఘం చైర్మన్‌కు నిమ్మల వినతి

అమరావతి/న్యూఢిల్లీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు భద్రతపై రాజీపడకుండా వివిధ నిర్మాణాల డిజైన్లకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు కేంద్ర జల సంఘాన్ని కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మంగళవారమిక్కడ జలసంఘం చైర్మన్ కుశ్విందర్ వోహ్రాతో సమావేశమయ్యారు. ఆయన అభ్యర్థనకు వోహ్రా సానుకూలంగా స్పందించారు. జాప్యం లేకుండా అనుమతులిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం ఎన్డీయే సర్కారు తొలి ప్రాధాన్యమని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యమయ్యే కొద్దీ ఏటా పంటనష్టం 3 వేల కోట్ల వరకు ఉంటుందని.. జలవిద్యుత్కేంద్రం సకాలంలో అందుబాటులోకి రాకపోవడం వల్ల మరో రూ.3 వేల కోట్లు.. అంచనాలు పెరగడం వల్ల ఇంకో 2 వేల కోట్లు.. వెరసి ఏటా రూ.10 వేల కోట్ల నష్టం వాటిల్లుతుందని నిమ్మల ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సలహాదారు వెంకటేశ్వరరావు ఉన్నారు.

చంద్రబాబు కృషి ఫలించింది..

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యం ఇవ్వడంతో సీఎం చంద్రబాబు కృషి ఫలించిందని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నెల రోజుల్లోపే రెండుసార్లు ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులను కలిసిన ఫలితంగా రాష్ట్రానికి పెద్దపీట వేశారని మీడియాతో అన్నారు.

జగన్ రాష్ట్రపతి పాలన కోరడం విడ్డూరం

» రాజధానికి నిధుల కేటాయింపును స్వాగతిస్తున్నాం: సీపీఐ రామకృష్ణ

కర్నూలు(న్యూసిటీ), జూలై 23: రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయంటూ రాష్ట్రపతి పాలన పెట్టాలని మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి కేంద్రాన్ని కోరడం విడ్డూరంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మంగళవారం కర్నూలులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగంపై నమ్మకం ఉన్న ఏ పార్టీ కూడా రాష్ట్రపతి పాలన కోరదన్నారు. మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో కుట్ర దాగి ఉందని, వెంటనే నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. అమరావతి రాజధాని నిర్మాణానికి కేంద్రం రూ.15 వేల కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామంటే సరిపోదని నిర్వాసితులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. వెనుకబడిన రాయలసీమ-ఉత్తరాంధ్రలకు బుందేల్‌ఖండ్ తరహాలో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

అల్లా ఆదేశించాడని రైలు కింద చేయి పెట్టాడు!

» తీవ్ర గాయాలపాలైన యువకుడు.. కర్నూలు జిల్లా ఆదోనిలో ఘటన


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇంతియాజ్ అలీ

ఆదోని, జూలై 23: అల్లా చెప్పాడని ఓ యువకుడు వేగంగా వెళుతున్న రైలు కింద చేయి పెట్టాడు. కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలోని అరుణ్ జ్యోతి నగర్‌కు చెందిన ఇంతియాజ్ అలీ (26) అనే యువకుడు మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన కుడి చేయిని పట్టాలపై ఉంచాడు. వేగంగా వచ్చిన రైలు వెళ్లడంతో చేయి తెగిపడింది. స్థానికులు గమనించి హుటాహుటిన ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మరింత మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు తీసుకెళ్లాలని సూచించారు. కలలో అల్లా ప్రత్యక్షమై చెయ్యి రైలు కింద పెట్టాలని ఆదేశించాడని ఇంతియాజ్ పోలీసులకు చెప్పాడు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వైసీపీ మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి ముందస్తు బెయిల్

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): మైదుకూరు వైసీపీ మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డికి హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవలో కడప జిల్లా చాపాడు పోలీసులు తనపై హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టంతోపాటు ఐపీసీలోని పలు సెక్షన్ల కింద నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆయనను అరెస్ట్ చేసిన పక్షంలో వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేయాలని పోలీసులను మంగళవారం హైకోర్టు ఆదేశించింది. రూ.30వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేశారని, కస్టోడియల్ విచారణ అవసరంలేదని న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ పేర్కొన్నారు.

ముగ్గురిని బలి తీసుకున్న విద్యుత్ తీగ

» హెచ్‌టీ వైరు తెగిపడి ముగ్గురు విద్యార్థుల సజీవ దహనం


విద్యుత్ వైరు తెగి పడటంతో దగ్ధమైన స్కూటీ
మృతులు బాలాజీ, గౌతమ్, నజీర్

కనిగిరి, జూలై 23: బైక్‌పై వెళ్తుండగా విద్యుత్ హైటెన్షన్ వైరు తెగిపడటంతో ముగ్గురు విద్యార్థులు సజీవ దహనమయ్యారు. ఈ దుర్ఘటన మంగళవారం ప్రకాశం జిల్లా కనిగిరి మండలం పునుగోడు గ్రామం ఎస్టీ కాలనీలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కనిగిరి పట్టణంలోని ఇందిరా కాలనీకి చెందిన కామినేని బాలాజీ(15), దేశపోగు నజీర్ (13), పొదిలి రోడ్డులోని కాశిరెడ్డి కాలనీకి చెందిన వీరమాచనేని గౌతమ్(15) స్నేహితులు. వీరు ముగ్గురూ పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. ఈ క్రమంలో స్కూటీపై ఎస్టీ కాలనీలో వెళ్తుండగా హెచ్‌టీ లైను గాలికి తెగి వారిపై పడింది. దీంతో మంటలురేగి బైకు దగ్ధమై ముగ్గురూ అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. స్థానికులు విద్యార్థులను రక్షించేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. సమాచారం అందుకున్న డీఎస్పీ రామరాజు, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ త్యాగరాజు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మృతులకు ఐదేసి లక్షలు పరిహారం: మంత్రి గొట్టిపాటి

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కనిగిరి మండలం పునుగోడులో విద్యుత్ షాక్‌తో ముగ్గురు యువకులు మృతి చెందడంపై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్కరికీ రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని ప్రకటించారు. ఘటన తనను కలచివేసిందని విచారం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పుట్రేల పెట్రోల్ బంకులో తనిఖీలు

విస్సన్నపేట, జూలై 23: పుట్రేల శ్రీవెంకటేశ్వర ఫిల్లింగ్ సెంటర్ (పెట్రోల్ బంకు)లో మంగళవారం పీడీఎస్ అధికా రులు, హెచ్‌పీసీఎల్ సిబ్బంది తనిఖీలు చేశారు. డీజిల్‌లో నీరు కలిసినట్లు వచ్చిన ఆరోపణలపై అధికారులు శ్యాంపిల్స్ తీసి పరీక్షించారు. డీజిల్‌లో ఎలాంటి నీరు కలువలేదని నిర్ధారించారు. వినియోగదారునికి నిర్లక్ష్య సమాధానం చెప్పిన సిబ్బందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. పీడీఎస్ డీటీ నాగరాజు, సేల్స్ ఆఫీసర్ కెవిన్, వీఆర్వో సునంద, సిబ్బంది పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాలు

ఎగ్గొట్టేందుకే జగన్ ఢిల్లీ డ్రామా

టీడీపీ క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె

విద్యాధరపురం: అసెంబ్లీ సమావేశాలకు రాకుండా ఉండేందుకు మాజీ సీఎం జగన్ బుధవారం ఢిల్లీలో ధర్నా డ్రామా పెట్టాడని టీడీపీ క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్ విమర్శించారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల పాటు రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం జగన్ ఎన్నిసార్లు ఢిల్లీలో ధర్నా చేశాడో చెప్పాలన్నారు. కేవలం 11మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో పాల్గొని చర్చల్లో పాల్గొనకూడదనే జగన్ ఢిల్లీలో ధర్నా డ్రామా ఆడేందుకు వెళ్లాడన్నారు. వినుకొండలో వ్యక్తిగత కారణాలతో హత్య జరిగిందని పోలీసుల దర్యాప్తులోనే తేలితే దాన్ని టీడీపీ హత్య గా అబద్ధపు ప్రచారం చేస్తున్నాడన్నారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సంజయ్, నెల్లూరు జిల్లా క్రిష్టియన్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ ఓబులాపురం దేవప్రసన్న పాల్గొన్నారు.

శవ రాజకీయాలు జగన్‌కు అలవాటే

శవరాజకీయాలు జగన్‌కు అలవాటేనని టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి కొట్టేటి హనుమంతరావు విమర్శించారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలోకి నల్ల కండువాలు, ప్లకార్డులతో వెళ్లకూడదన్న విషయం మాజీ సీఎం జగన్‌కు తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ విషయం చెప్పిన పోలీసు అధికారిని జగన్ బెదిరించాడన్నారు. అభివృద్ధి కారకుడు చంద్రబాబుపై బురద జల్లటం మానుకోవాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మాజీమంత్రుల అవినీతి కుంభకోణాలు ఎక్కడ బయట పడతాయోనని కొందరు అధికారులతో కుమ్మక్కై ఫైళ్లను తగులబెట్టిస్తున్నారన్నా రు. మైనార్టీ సెల్ అర్బన్ మాజీ అధ్యక్షుడు ఎండీ ఇ ర్ఫాన్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రవికుమార్ పాల్గొన్నారు.

డోలా శంకర్ నియామకంపై ఏపీ ఫిషర్‌మెన్ జేఏసీ హర్షం

ధర్నాచౌక్: మత్స్యశాఖ కమిషనర్‌గా సంప్రదాయ మత్స్యకార (అగ్నికుల క్షత్రియ) కులానికి చెందిన తమ్ము డోలా శంకర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించడంపై ఏపీ ఫిషర్‌మెన్ జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ప్రెస్‌మీట్‌లో జేఏసీ చైర్మన్ సైకం రాజశేఖర్ మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, మత్స్యకార ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారుల సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న వ్యక్తి డోలా శంకర్ అన్నారు. " ఇండియన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీస్ సర్వీసెస్ " పలు విభాగాల్లో, మెరైన్ ప్రొడక్ట్ ఎక్స్‌పోర్ట్ డవలప్‌మెంట్ " డైరెక్టర్‌గా ఆయన విశేష గుర్తింపు పొందారన్నారు. పలువురు జేఏసీ నేతలు పాల్గొన్నారు.


పూజలందుకుంటున్న దుర్గమ్మ ఉత్సవ మూర్తి, సారె సమర్పించిన మహిళలు

కొనసాగుతున్న సారె సమర్పణలు

వన్‌టౌన్, జూలై 23: ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు సారె సమర్పణలు కొనసాగుతున్నాయి. ఆషాఢమాసంలో 19రోజులుగా వివిధ ప్రాంతాల నుంచి మహిళలు పెద్దసంఖ్యలో వచ్చి సారె సమర్పిస్తున్నారు. మంగళవారం పటమటలోని కోదండరామాలయం నుంచి 100 మంది, గుడివాడ నుంచి పాలడుగు శ్రీనివాసరావు బృందం 150 మంది, వి కృష్ణకుమారి బృందం 60 మంది, నవ దుర్గాదీక్షా పీఠం నుంచి 80 మంది, వీరితో పాటు వివిధ ప్రాంతాల నుంచి 11 బృందాలకు చెందిన 600 మంది అమ్మవారికి సారె సమర్పించారు ఆరో అంతస్తులో అమ్మవారి ఉత్సవ మూర్తి వద్ద సారె సమర్పించి పూజలో పాల్గొన్నారు. అనంతరం దుర్గమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అర్చలు వారికి ప్రసాదాలు, ఆశీస్సులు ఇచ్చారు.

నిత్యాన్నదానానికి విరాళం

స్థానిక మాచవరం వెంకటస్వామి వీధికి చెందిన ఎం శ్రేయస్ తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఇంద్రకీలాద్రికి విచ్చేసి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి రూ 1,00,116 విరాళాన్ని చెక్కురూపంలో అందచేశారు. అనంతరం అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. అధికారులు వీరికి ప్రసాదం, చిత్రపటం, ఆశీస్సులు, శేష వస్త్రం అందజేశారు.

నగరంలో 'అలనాటి రామచంద్రుడు' చిత్ర యూనిట్ సందడి



లబ్బీపేట, జూలై 23: నగరంలో అలనాటి రామచంద్రుడు చిత్ర యూనిట్ సందడి చేసింది. బందర్ రోడ్డులోని ఒక హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్ర హీరో కృష్ణవంశీ మాట్లాడుతూ తెలుగులో తాను ఈ చిత్రం ద్వారా హీరోగా పరిచయమవుతున్నట్టు తెలిపారు. దర్శకుడు ఆకాష్ ఈ చిత్రాన్ని ఒక అద్భుతమైన ప్రేమ కావ్యంగా మలిచారని, ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు ఆకట్టుకునేలా ఉంటుందన్నారు. ఈ చిత్రంలో సీనియర్ నటులు ఉన్నారని ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్‌కు విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందని, అగష్టు 2న తెలుగు రాష్ట్రాల్లో సినిమా విడుదల కానుందన్నారు. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు తమ చిత్రాన్ని రిలీజ్ చేయడం సంతోషంగా ఉందని, ప్రేక్షకులు చిత్రాన్ని ఆదరించి వర్ధమాన నటులను ప్రోత్సహించాలని కోరారు. సినిమా హీరోయిన్ మోక్ష మాట్లాడుతూ లక్కీ లక్ష్మణ్ చిత్రం ద్వారా తెలుగులో అడుగు పెట్టానని, ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించే అవకాశం దర్శకుడు ఆకాష్ కల్పించారన్నారు. సీత ప్రేమను దక్కించుకునే రాముడు పడిన కష్టాలను అలనాటి రామచంద్రుడు చిత్రంలో దర్శకుడు ప్రేక్షకులకు సరికొత్త రీతిలో చూపించారన్నారు. దర్శకుడు ఆకాష్, నటులు దివ్యశ్రీ, స్నేహ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ పేరుకు అసెంబ్లీ ఆమోదం హర్షణీయం

ప్రభుత్వాసుపత్రి: ఎన్టీఆర్ విజ్ఞాన విశ్వ విద్యాలయం పేరును తొలి క్యాబినెట్‌లో ఆమోదించడమే కాక మంగళవారం జరిగిన అసెంబ్లీలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రవేశ పెట్టిన తీర్మానానికి సభ్యులంతా ఆమోదం తెలపడం హర్షణీయమని ఏపీఎన్‌జీజీవోస్ పశ్చిమ కృష్ణ (ఎన్టీఆర్ జిల్లా) జేఏసీ జాయింట్ సెక్రటరీ మంచిరాజు అక్కిరాజు అన్నారు. ఈ నిర్ణయం ప్రపంచ తెలుగు ప్రజలతో పాటు వర్సిటీ ఉద్యోగులకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఇతర శాసన సభ్యులందరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు.

రేపు మినీ జాబ్ మేళా

వన్‌టౌన్: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 25న గురువారం మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి కల్పనశాఖ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళా జరుగుతుందన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెడిప్లస్, టైమ్స్ ప్రో, జీ వీయస్, ధృవంత సొల్యూషన్స్, మెక్వెల్, ఓజోన్ సెక్యూరిటీ వంటి సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. టెన్త్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ పూర్తిచేసిన 18 నుంచి 30 ఏళ్ల వయస్సు కలిగిన నిరుద్యోగులు పూర్తి బయోడేటాతో రావాలని కోరారు. ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు, ఆధార్‌కార్డుతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చునన్నారు. ఎంపికైన అభ్యర్థులకు సుమారుగా రూ.12 నుంచి రూ.20 వేల వేతనం వరకు లభిస్తుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఎన్‌సీఎస్ వెబ్‌సైట్ లో నమోదు చేసుకోవాలన్నారు వివరాలకు 814241 6211 నెంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునన్నారు.

26 నుంచి ఉమ్మడి కృష్ణా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

విజయవాడ స్పోర్ట్సు: నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఈనెల 26 నుం చి 28వరకు ఉమ్మడి కృష్ణా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేసినట్టు కేడీబీఏ జనరల్ సెక్రటరీ పర్సా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మినీ అండర్-11, సబ్ జూనియర్స్-13, 15, జూనియర్స్ అండర్-17, 19 బాలబాలికలకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహి స్తామన్నారు. ఏపీ బీఏ నిబంధనల ప్రకారం టోర్నీ ని ర్వహిస్తామని, పాల్గొనే వారికి పార్టిసిపేట్ సర్టిఫికెట్ల ను ప్రదానం చేస్తామని శ్రీనివాసరావు వివరించారు. ఈ టోర్నీలో సత్తా చాటిన క్రీడాకారులను ఆగస్టు, సెప్టెంబర్‌లో వివిధ కేటగిరీల్లో జరిగే రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీల్లో ఉమ్మడి కృష్ణా జట్టు బరిలో దిగుతాయన్నారు. ఈ టోర్నీలో జిల్లా క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బిల్డింగ్ వర్కర్స్‌కు ఇచ్చిన హామీ నెరవేర్చాలి

గవర్నర్‌పేట: ఎన్నికల ముందు టీడీపీ, జనసేన పార్టీలు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎన్ రమణరావు డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లు హామీ ఇచ్చారని, ఆ హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం హయాంలో కార్మికులు అనేక ఇబ్బందులు పడ్డారని, వారి సమస్యలకు ఈ ప్రభుత్వంలోనైనా పరిష్కారం లభిస్తుందన్న ఆశతో కార్మికులు ఉన్నారని తెలిపారు.

ఎన్డీయే సర్కారుకు కృతజ్ఞతలు: మంత్రి లోకేశ్

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): అమరావతి, పోలవరం ప్రాజెక్టు పూర్తి కోసం సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి మంత్రి నారా లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. బడ్జెట్‌లో రూ.15వేల కోట్లు కేటాయించిన ఎన్డీయే ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజల తరఫున మంగళవారం 'ఎక్స్' వేదికగా ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

పవన్ ఆశించిన రీతిలో కేంద్ర బడ్జెట్: నాదెండ్ల

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సముచిత కేటాయింపులు కల్పించడం హర్షణీయమని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నా రు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ 'డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆశించిన రీతిలో బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. భవిష్యత్‌లో మరిన్ని కేంద్ర నిధులు తెచ్చేందుకు కృషి జరుగుతుందని చెప్పారు.

బడ్జెట్ రాష్ట్రానికి ఊరటనిచ్చింది: కొలుసు

గత ఐదేళ్లలో అన్ని రంగాల్లో వెనుకబడిన ఏపీకి కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపులతో రాష్ట్రానికి ఊరటనిచ్చి, మళ్లీ ఆశలు రేకెత్తించిందని సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. 'అమరావతి, పోలవరాన్ని వైసీపీ ప్రభుత్వం నాశనం చేసింది. సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా అమరావతికి కేంద్రం రూ.15వేల కోట్లు కేటాయించి, పోలవరానికి అన్ని విధా లా చేయూతనిస్తామని ప్రకటించింది' అని అన్నారు.

రాష్ట్రానికి మేలు: అచ్చెన్న

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ విధ్వంస పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు కేంద్ర బడ్జెట్ కేటాయింపులు ఉపయోగపడతాయని మంత్రి అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. 'పోలవరానికి ఆర్థిక తోడ్పాటు అందిస్తామని ప్రకటించడం శుభపరిణామం' అని పేర్కొన్నారు. అమరావతికి పట్టిన గ్రహణం వీడిపోయిందని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వ్యాఖ్యానించారు.

డ్యాం కోసం బాబు : సోమిరెడ్డి

పోలవరం డ్యాం పూర్తి చేయడానికి నిధుల కోసం సీఎం చంద్రబాబు 50 రోజుల్లో రెండుసార్లు ఢిల్లీ వెళ్తే.. పోలవరాన్ని డ్యామేజ్ చేయడానికే జగన్ ఐదేళ్లలో 20సార్లు ఢిల్లీ వెళ్లాడని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. అమరావతి, పోలవరం, పారిశ్రామిక కారిడార్లు, వెనుకబడిన జిల్లాలకు కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు.

మోదీకి మంత్రి సత్యకుమార్ ధన్యవాదాలు

అమరావతి, ధర్మవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): అమరావతి నిర్మాణానికి 15వేల కోట్ల నిధులు కేటాయించిన ప్రధాని మోదీకి రాసిన లేఖలో మంత్రి సత్య కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రానికి ఎప్పుడూ లేనన్ని నిధులు కేంద్రం ఇవ్వడం సంతోషకరమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయం వద్ద మోదీ చిత్రపటానికి పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. బాణసంచా పేల్చి హోరెత్తించారు.

5 కోట్ల ఆంధ్రులు ఊపిరి పీల్చుకునేలా..

- ఏపీకి బడ్జెట్ కేటాయింపులపై కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
- చంద్రబాబు కృషితోనే నిధులు: ఎంపీ లావు
- రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఊతం: కేశినేని చిన్ని

న్యూఢిల్లీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు ఎన్డీయే కూటమిపై నమ్మకంతో భారీ మెజారిటీ ఇచ్చారని.. ఆ నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని కేంద్ర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. 5 కోట్ల ఆంధ్ర ప్రజలకు ఊపిరి పీల్చుకునేలా, ఆనందాన్ని కలిగించేలా బడ్జెట్ ఉందని తెలిపారు. మంగళవారం ఆయన ఇక్కడ పార్టీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, శ్రీభరత్, అప్పలనాయుడుతో కలిసి మీడియాతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టుకు సహకరిస్తామని కేంద్రమంత్రి నిర్మల చెప్పారన్నారు. సీఎం చంద్రబాబు.. ప్రధాని మోదీ కృషి వల్లే ఈ నిధులొచ్చాయని టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేసేలా కేంద్రబడ్జెట్ ఉందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కేంద్ర పథకాలు ఊతమిస్తాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు 'ఎక్స్' ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. బడ్జెట్‌లో ఏపీకి నిధులు కేటాయించినందుకు లోక్‌సభలో ఎంపీ కలిశెట్టి ప్రధాని మోదీ దగ్గరకెళ్లి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ ఎంపీలందరూ కలిసి ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాబు, పవన్‌ల సంయుక్త విజయం: బాలశౌరి

ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేలకోట్లు ప్రకటించడంపై జనసేన పార్లమెంటరీ పార్టీ నేత వల్లభనేని బాలశౌరి హర్షం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఇది చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల సంయుక్త విజయమని కొనియాడారు.

పీఆర్సీపై చర్యలు తీసుకోవాలి: పీడీఎఫ్

అమరావతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు, ఉద్యోగులకు డీఏ బకాయిల చెల్లింపు, పీఆర్సీ, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంటూ గత ప్రభుత్వం కాలయాపన చేసిన వాటి పరిష్కారానికి ఈ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం లాగేసుకున్న పంచాయతీలకు చెందిన 11, 12వ ఆర్థిక సంఘ నిధులు తిరిగి మంజూరు చేయాలన్నారు.

పదేళ్లకు రాష్ట్రానికి కేటాయింపులు: ఏపీ చాంబర్స్

విజయవాడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌ను స్వాగతిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్(ఏపీ చాంబర్స్) తెలిపింది. రాష్ట్ర విభజన తర్వాత పదేళ్లకు రాష్ట్రానికి కేటాయింపులు చేశారని శనివారం విజయవాడలోని ఏపీ చాంబర్స్ హాల్‌లో చాంబర్స్ అనుబంధ రంగాల నిపుణులు బడ్జెట్‌పై సమీక్ష నిర్వహించి పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, కోశాధికారి అక్కయ్యనాయుడు, ఏపీ చాంబర్స్ టాక్సేషన్ కమిటీ చైర్మన్ నిట్టా రవి కిషోర్, ఏపీ చాంబర్స్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తదితరులు మాట్లాడారు.

ఉద్యోగులను నిరాశపరిచిన బడ్జెట్: ఏపీసీపీఎస్ఈఏ

విజయవాడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేంద్రం బడ్జెట్ ఉద్యోగులకు ఏమాత్రం ఆశాజనకంగా లేదని ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం(ఏపీసీపీఎస్ ఈఏ-ఏపీజీఈఏ అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర బడ్జెట్ సీపీఎస్ ఉద్యోగులను తీవ్రంగా నిరాశపరిచిందన్నారు. ఆదాయపన్ను స్లాబులను కూడా కొద్దిపాటి మార్పులతో ప్రకటించడం తీవ్ర నిరాశ మిగిల్చిందన్నారు.

పెన్షనర్లకు అన్యాయం: సీబీఐసీ పెన్షనర్ల సంఘం

విజయవాడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో పెన్షనర్లకు ఎలాంటి మేలూ లేదని, అన్యాయం చేశారని సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ) పెన్షనర్ల సంఘం రాష్ట్ర నాయకులు జి.తిలక్, టి.వివేకానంద ఒక ప్రకటనలో విమర్శించారు. పెన్షనర్లకు బడ్జెట్‌లో ఆదాయపన్నును రద్దు చేయలేదని, వారికి ఎలాంటి రాయితీలూ ఇవ్వలేదని వాపోయారు.

వేతన జీవులకు నిరాశ: ఉపాధ్యాయ సంఘాలు

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ వేతన జీవులకు నిరాశ కలిగించిందని వివిధ ఉపాధ్యాయ సంఘాలు పేర్కొన్నాయి. యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్, ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, ఎం.రఘునాథరెడ్డి, ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి, నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

టీడీపీపై ఆధారపడినందునే ఏపీకి నిధులు: జైరాం

న్యూఢిల్లీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ప్రభుత్వ మనుగడ కోసం టీడీపీ ఎంపీలపై ఆధారపడినందునే మోదీ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి నిధులు కేటాయించిందని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో అమరావతి రాజధానికి నిధులు కేటాయించడంపై ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు.

అమరావతికి మంచిరోజులు

పదేళ్ల నిరీక్షణకు తెర

- రాజధాని నిర్మాణానికి భారీగా కేంద్రం నిధులు
- బడ్జెట్లో రూ.15 వేల కోట్ల ప్రకటనతో పరుగులు పెట్టనున్న పనులు
- మహోన్నత నగరంగా రూపుదిద్దుకునే చాన్సు
- రైతుల కళ్లలో చెప్పలేని ఆనందం
- ఐదేళ్లుగా వారు పడిన కష్టాలెన్నో!
- మూడు రాజధానులతో జగన్నాటకం
- వారి రాజధాని ఉద్యమంపై ఉక్కుపాదం
- రైతులు, మహిళలపై దాడులు, కేసులు
- చివరకు కౌలు కూడా ఇవ్వకుండా వేధింపులు
- కూటమి గెలుపు, కేంద్రం దన్నుతో తీరనున్న రాజధానివాసుల కష్టాలు

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతికి మహర్దశ పడుతోంది. గత ఐదేళ్లలో జగన్ నిర్వాకానికి బలై అరణ్యాన్ని తలపించిన నవనగరం ఇప్పుడు క్రమంగా జీవ కళ సంతరించుకుంటోంది. చంద్రబాబు ప్రభుత్వ చొరవ, తాజాగా కేంద్రం తోడ్పాటుతో జవసత్వాలు పొంది.. మహోన్నత నగరంగా రూపుదిద్దుకుంటుందన్న ఆశలు మొలకెత్తుతున్నాయి. అమరావతి నిర్మాణానికి కేంద్రం భరోసా ఇవ్వడమే కాకుండా.. బడ్జెట్లో భారీగా రూ.15 వేల కోట్లు ప్రకటించింది. రాబోయే కాలంలో మరిన్ని నిధులిస్తామని కూడా పార్లమెంటు వేదికగా భరోసా ఇచ్చింది. దీంతో గడిచిన ఐదేళ్ల పాలనలో చీకట్లు తప్ప వెలుగులు చూడని అమరావతిపై కాంతి రేఖలు ప్రసరిస్తున్నాయి. కష్టాలు, కన్నీళ్లు, ఆవేదనతో అల్లాడిన రాజధాని రైతులు కేంద్రం ప్రకటనతో ఆనందోత్సాహాలు వ్యక్తంచేస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించగానే అమరావతిపై ఆశలు పెరిగాయి. అనుకున్నట్లుగానే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందే రాజధాని నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. జగన్ పాలనతో అప్పుల కుప్పగా మారిన రాష్ట్రంలో, ఒక్క రూపాయి కూడా నిధులు లేని పరిస్థితిలో అమరావతి పునర్నిర్మాణాన్ని సవాల్‌గా తీసుకున్న చంద్రబాబు.. అందుకోసం పకడ్బందీగా అడుగులు వేశారు. రాజధాని నిర్మాణ పనులు కొనసాగిస్తూనే, అందుకు కావలసిన నిధులను కేంద్రం నుంచి కూడా రాబట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేశారు. రెండు సార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర పెద్దలను కలిసి నిధులు సాధించేందుకు కృషిచేశారు. ఆయన ప్రయత్నాలు ఫలించి కేంద్రం తాజాగా రూ.15 వేల కోట్ల సాయం ప్రకటించింది.

ఇక శరవేగంగా..!

రాజధాని అమరావతి శంకుస్థాపనకు వచ్చిన సమయంలో ప్రధాని మోదీ రాజధాని నిర్మాణానికి రూ.10 వేల కోట్లు ఇస్తామన్నారు. కానీ రూ.1,500 కోట్లే ఇచ్చారు. అది అమరావతి నిర్మాణంపై తీవ్ర ప్రభావం చూపింది. రాష్ట్రప్రభుత్వంపై మోయలేని భారం పడింది. అయినప్పటికీ నాడు సీఎంగా ఉన్న చంద్రబాబు.. ప్రభుత్వ కార్యాలయ, సిబ్బంది భవన సముదాయాల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. కానీ 2019లో జగన్ సీఎం కావడంతో రాజధాని పనులకు గ్రహణం పట్టింది. మూడు రాజధానుల ముచ్చటతో అమరావతిని పాడుపెట్టాలని చూశారు. ఏకైక రాజధానిగా అమరావతే ఉండాలని ఉద్యమానికి దిగిన రైతులు, మహిళలపై లెక్కలేనన్ని కేసులు పెట్టారు. వారిపై పోలీసులు, వైసీపీ శ్రేణులతో దాడులు చేయించారు. చివరకు చట్టబద్ధంగా వారికి రావలసిన కౌలు ఇవ్వకుండా ఎగనామం పెట్టారు. ఈ దశలో సార్వత్రిక ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన టీడీపీ కూటమి గద్దెనెక్కింది. రాజధాని నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు కేంద్ర సాయంతో.. ఐదేళ్ల క్రితం ఆగిపోయిన ప్రభుత్వ భవన సముదాయాల నిర్మాణాలకు నిధుల సమస్య లేకుండా పోయింది. శాసనసభ, సచివాలయ భవన సముదాయం, ఐకానిక్ టవర్స్ వంటి అతి కీలక భవనాల నిర్మాణానికి కూడా మార్గం సుగమమైంది. రైతులను వెంటాడుతున్న కౌలు సమస్యలూ పరిష్కారం కాబోతున్నాయి. జగన్ పార్టీ నేతలు ధ్వంసం చేసిన రోడ్ల పునర్నిర్మాణానికి అవకాశం లభించింది. తాగు నీరు, డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాల కల్పన సహా అనేక పనులు నిరాటంకంగా సాగుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

బాబు చొరవతో మహర్దశ



బడ్జెట్‌లో కేంద్రం అమరావతికి రూ.15 వేల కోట్లు ప్రకటించడం ఎంతో ఆనందంగా వుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పుడే అమరావతిపై ఆశలు చిగురించాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో వచ్చే ఐదేళ్లలో రాజధానికి మహర్దశ పడుతుంది.

– పువ్వాడ సుధాకర్, కన్వీనర్, అమరావతి జేఏసీ

కుట్రలు వీగిపోతాయి..



ఐదేళ్లు కష్టాలు పడ్డ రైతుల కళ్లలో ఈరోజు ఆనందం కనిపిస్తోంది. రాజధానికి భూములిచ్చి తప్పు చేశామని బాధపడేలా గత ప్రభుత్వం వారిని వేధించింది. ఇప్పుడు రాజధానికి కేంద్రం సాయంతో రైతుల కష్టాలన్నీ తీరిపోతాయి. కేంద్రం చొరవతో అమరావతిపై కుట్రలన్నీ వీగిపోతాయి.

– పులి చిన్నా, దళిత జేఏసీ నేత

మా కష్టాలు తీరిపోయినట్లే...



గత ప్రభుత్వంలో మేం ఎన్నో కష్టాలు పడ్డాం. కౌలు కూడా ఇవ్వకుండా వేధించింది. మా భూములు మాకు కాకుండా చేయాలని చూసింది. ఇప్పుడు కేంద్రమే అమరావతిని గుర్తించి సాయం ప్రకటించింది. ఇక మా కష్టాలు తీరిపోయినట్లే!

– కొల్లి అరుంధతి, మహిళా జేఏసీ నేత



ఏపీ పర్యటనకు వచ్చిన తానా అధ్యక్షుడు నిరంజన్, మాజీ అధ్యక్షుడు జయ్ ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన దృశ్యం

శారదా పీఠాధిపతికి భద్రత కుదింపు

పెందుర్తి, జూలై 23: విశాఖ శారదా పీఠానికి రాష్ట్ర ప్రభుత్వం షాకిచ్చింది. పీఠం భద్రత కోసం గత వైసీపీ ప్రభుత్వం నియమించిన పోలీసు సిబ్బందిని ఈ ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. అలాగే పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతికి జగన్ ఇద్దరేసి గన్‌మెన్‌ను కేటాయించగా... వారిని కూడా తొలగించింది. ఆ స్థానంలో పీఠాధిపతి కోసం మాత్రం ఒక ఏఆర్ కానిస్టేబుల్‌ను కేటాయించింది. వైసీపీ ప్రభుత్వం స్వరూపానందేంద్ర సరస్వతికి హై సెక్యూరిటీ కల్పించింది. పీఠం వద్ద 24 గంటలూ ఒక ఏఎస్ఐ, నలుగురు కానిస్టేబుళ్లను విధుల్లో ఉంచింది. అలాగే స్వరూపానందేంద్రకు ఇద్దరు గన్‌మెన్, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్రకు ఇద్దరు గన్‌మెన్‌ను నియమించింది. బుగ్గ కారు సౌకర్యం కల్పించింది. పీఠాధిపతుల సెక్యూరిటీ కోసం ప్రభుత్వ ధనాన్ని వ్యయం చేయడంతో.. దీనిపై అనేక విమర్శలు వచ్చాయి.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిన జగన్

- పురపాలక శాఖ మంత్రి నారాయణ



వెంకటపాలెంలో నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం వివరాలు తెలుసుకుంటున్న మంత్రి నారాయణ

తుళ్లూరు, జూలై 23: వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను జగన్మోహన్‌రెడ్డి నాశనం చేసి వెళ్లారని, ఒక్క డిపార్ట్‌మెంట్‌లో కూడా పైసా లేకుండా ఖజానాను ఖాళీ చేశారని పురపాలక శాఖ మంత్రి పి నారాయణ అన్నారు. మంగళవారం రాజధాని గ్రామాలు వెంకటపాలెం, మందడంలో సిటీస్ చాలెంజ్ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. రాష్ట్రంలో వంద రోజుల్లో వంద అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

జేఎన్‌టీయూ-కే రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేయాలని సీఐడీకి హైకోర్టు ఆదేశం

- అర్హతలేని 48 కాలేజీలకు అటానమస్ హోదా కల్పించడంపై విచారణ

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌కు హైకోర్టు షాక్ ఇచ్చింది. అర్హతలేని 48 కాలేజీలకు అటానమస్ హోదా కల్పించారనే ఆరోపణల విషయంలో ఆమెపై కేసు నమోదు చేయాలని సీఐడీని ఆదేశించింది. ఎఫ్ఐఆర్‌కు సంబంధించిన వివరాలను ఈ నెల 26న కోర్టు ముందు ఉంచాలని, కేసు దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నోటీసులు అందుకున్నప్పటికీ వ్యక్తిగతంగా రిజిస్ట్రార్‌కానీ, ఆమె తరఫున న్యాయవాది కానీ హాజరుకాకపోవడంపై న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పిటిషన్‌ను అడ్మిట్ చేస్తూ రిజిస్ట్రార్‌పై కేసు నమోదుకు ఆదేశించారు.

శ్రీవారి ఆర్జిత సేవలకు నకిలీ ఆధార్‌లతో 400 రిజిస్ట్రేషన్లు

- ఇద్దరిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించిన విజిలెన్స్ అధికారులు

తిరుమల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు పొందేందుకు 400సార్లు రిజిస్ట్రేషను చేసిన ఇద్దరు వ్యక్తులను టీటీడీ విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గుంటూరు జిల్లా చుండూరుకు చెందిన సాయిసునీల్, ఏవీఎస్ గుప్తా సోదరులు పేరు, చిరునామాలను అలానే ఉంచి ఆధార్ నంబర్లను మారుస్తూ 400కు పైగానే రిజిస్ట్రేషన్లు చేసినట్టు విజిలెన్స్ అధికారుల విచారణలో తేలింది. ఇలా పొందిన సుప్రభాతసేవలో పాల్గొనేందుకు మంగళవారం వేకువజామున వారు తిరుమలకు రాగా విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకుని విచారించారు. అసలు ఆధార్ కార్డును పరిశీలించడంతో వీరి బండారం బయటపడింది. మొదటి సేవలో పాల్గొనేందుకు వచ్చిన వీరిని తిరుమల టూటౌన్ పోలీసులకు అప్పగించారు. ఒకే నంబరు, మెయిళ్ల ద్వారా బల్క్ రిజిస్ట్రేషన్లు చేస్తున్న వారిపై టీటీడీ నిఘా పెట్టిన క్రమంలో వీరిద్దరూ పట్టుబడ్డారు.

ఐటీపై టీటీడీ ప్రత్యేక దృష్టి

- అక్రమార్కులకు చెక్‌పెట్టేందుకు చర్యలు
- రాండమ్ బుకింగ్స్ అడ్డుకునేందుకు ప్రణాళిక
- ఫేక్ ఆధార్‌పై కసరత్తు



తిరుమల, జూలై22(ఆంధ్రజ్యోతి): ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) విభాగ అభివృద్ధిపై టీటీడీ ప్రత్యేక దృష్టి సారించింది. ఐటీ సేవలను మరింత అభివృద్ధిపరిచి అక్రమార్కులకు చెక్ పెట్టడంతో పాటు టీటీడీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచే సేవలను సామాన్య భక్తులే పొందేలా చర్యలు తీసుకుంటోంది. భక్తుల సౌకర్యార్థం టీటీడీ ప్రతినెలా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, ఆర్జితసేవలు, గదుల కోటాను ఆన్‌లైన్ ద్వారా విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతమున్న ఐటీ వ్యవస్థలోని లోపాలను అవకాశంగా తీసుకున్న కొంతమంది ఆ సేవలేవీ సామాన్యులకు అందకుండా చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల టీటీడీ ఈవోగా బాధ్యతలు చేపట్టిన శ్యామలరావు వివిధ విభాగాలతో పాటు ఐటీ విభాగంపై కూడా దృష్టిసారించారు. ఇందులో భాగంగా ఐటీ విభాగంలో అనేక లోపాలు ఉన్నట్టు గుర్తించారు.

ఒకే నంబరు, మెయిల్ ద్వారా వందల రిజిస్ట్రేషన్లు

సామాన్య భక్తులకు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో టీటీడీ కొన్ని ఆర్జితసేవలను రెండుగా విభజించింది. అందులో ఒకటి మొదట వచ్చిన వారికి మొదట ప్రాతిపదికన కొన్ని సేవా టికెట్లు ఆన్‌లైన్‌లో కేటాయిస్తున్నారు. మరికొన్ని ఆర్జిత సేవలను ఆన్‌లైన్ లక్కీడిప్ ద్వారా కేటాయిస్తున్నారు. లక్కీడిప్ రిజిస్ట్రేషన్‌కు రెండురోజుల వ్యవధి ఇస్తారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న జాబితాలో కొన్నింటిని రాండమ్‌గా ఎంపిక చేసి భక్తులకు సమాచారాన్ని అందజేసి నగదు చెల్లింపునకు మరో రెండురోజుల సమయం ఇస్తారు. అయితే కొంతమంది దళారీలు, టెక్నాలజీపై కాస్త పట్టు ఉన్న వ్యక్తులు ఐటీలోని లోపాలు గమనించి ప్రతి నెలా కొన్ని ఆర్జితసేవా టికెట్లను పొందుతున్నారు. ఎన్నిసార్లు ప్రయత్నించినా తమకు ఆర్జితసేవలు అందడం లేదని తరచూ పలు ప్రాంతాల నుంచి భక్తులు టీటీడీకి ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. ఈనేపథ్యంలో టీటీడీ ఉన్నతాధికారుల పరిశీలనలో నివ్వెరపోయే విషయాలు వెలుగుచూశాయి. ఇందులో ప్రధానంగా ఒకే సెల్ నెంబరు, ఒకే మెయిల్ ద్వారా వందల రిజిస్ట్రేషన్లు జరిగినట్టు గుర్తించారు. ఒకే వ్యక్తి 1,800 సార్లు రిజిస్ట్రేషన్ చేసి 60 సార్లు డిప్ ద్వారా సేవా టికెట్లు పొందడం ఐటీ విభాగ వైఫల్యమేనని అధికారులు గుర్తించారు. అధిక మొత్తంలో రిజిస్ట్రేషన్లు చేసుకుంటే ఏదో ఒక ఆర్జితసేవ డిప్ ద్వారా రావడం ఖాయమని భావించిన కొందరు వ్యక్తులు ఇతరులెవరికీ సేవలందకుండా చేస్తున్న క్రమంలో టీటీడీ ఒకే నెంబరు, మెయిల్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకున్న జాబితాను ఇటీవల తయారు చేసింది. ఈ తరహాలో పొందిన బుకింగ్స్‌ను రద్దు చేయడంతో పాటు ఆయా నెంబర్లు, మెయిల్స్ బ్లాక్ చేశారు. ఇదే తరహాలో గదులు, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు పొందిన వారి బుకింగ్స్‌ను కూడా రద్దు చేశారు. ఇకపై తరచూ వచ్చే నెంబర్లు, మెయిల్స్‌పై దృష్టి పెట్టాలని విజిలెన్స్ అధికారులు సూచించడంతో పాటు ఒకసారి బుకింగ్‌కు వినియోగించిన నెంబరు, మెయిల్ మళ్లీ 90 రోజుల పాటు బుకింగ్‌కు ప్రవేశం లేకుండా సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు.

ఇకపై ఫేక్ ఆధార్లకు నో ఎంట్రీ

భక్తులు ఇస్తున్న ఆధార్ నిజమైనదా కాదా అని నిర్ధారించుకునే వ్యవస్థ టీటీడీలో లేకపోవడం దళారీల పాలిట వరంలా మారింది. దీంతో ఫేక్ ఆధార్ కార్డులతో చాలా మంది ఇష్టానుసారం దర్శనం, ఆర్జితసేవలు, గదులు పొందుతున్నారు. ఇటీవల అనంతపురానికి చెందిన వ్యక్తి ఇతర భక్తుల ఆధార్‌లో ఫొటోను, నెంబర్లను మార్చి ఒకే నెలలో 28 గదులు పొందాడు. ఇలా దాదాపు 25 మంది దళారీలు ఫేక్ ఆధార్లతో గదులు పొంది భక్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు 20 రోజుల క్రితం వెలుగు చూసింది. ఈ క్రమంలో ఫేక్ ఆధార్లను అరికట్టేందుకు టీటీడీ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇందులోభాగంగా గతనెల 29వ తేదీన టీటీడీ ఈవో యూఐడీఏఐ(ఆధార్ సంస్థ) అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు టీటీడీ అందిస్తున్న సేవలకు ఆధార్‌ను లింక్ చేయడం ద్వారా పాదర్శకతతో పాటు దళారీలను అరికట్టవచ్చని అభిప్రాయంతో యూఐడీఏఐ అధికారుల సహకారం కోరారు. దీనికోసం ప్రత్యేకంగా ఓ అప్లికేషన్‌ను రూపొందించి ఆధార్ సంస్థ సర్వీసును పొందాలని భావిస్తున్నారు. దీనికి ఆధార్ సంస్థ కూడా సానుకూలంగా స్పందించింది. తద్వారా భక్తులు అందజేసే ఆధార్ నిజమైనదా కాదా అనే విషయాన్ని సులభంగా గుర్తించవచ్చు. గతంలో ఐటీ విభాగంలో సూపరింటెండెంట్ ర్యాంక్‌లో జీఎం పోస్టును క్రియేట్ చేసి ఓ వ్యక్తిని నియమించినప్పటికీ ఆయనకు ఉండాల్సిన అర్హతలు లేవని ఈవో అభిప్రాయపడ్డారు. ఆ పోస్టులో అనుభవం ఉన్న వ్యక్తిని నియమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు సర్వీసు ఇస్తున్న జియో, టీసీఎస్ సంస్థలకు నూతన టార్గెట్లు ఇచ్చే దిశగా కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

కేంద్ర మంత్రితో ఎంపీ వేమిరెడ్డి భేటీ

న్యూఢిల్లీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో మంగళవారం కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ... కార్మికులకు సంబంధించి వివిధ అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నెల్లూరు జిల్లా పరిధిలో అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం, వారికి సంబంధించి పథకాలపై కేంద్రమంత్రితో చర్చించారు.



కేంద్ర మంత్రి మాండవీయతో వేమిరెడ్డి

అంబటి రాంబాబుకు ప్రాణహాని లేదు

- భద్రత అవసరంలేదని ఎస్పీ నిర్ణయం..సవివరంగా ఉత్తర్వులు
- హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వ న్యాయవాది.. విచారణ 30కి వాయిదా

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): తనకు 4ప్లస్4 భద్రతను పునరుద్ధరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మాజీ మంత్రి అంబటి రాంబాబు దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ... భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ పిటిషనర్ సమర్పించిన వినతిని గుంటూరు జిల్లా ఎస్పీ పరిగణనలోకి తీసుకున్నారని, అన్ని వివరాలూ పరిశీలించి ఎలాంటి ప్రాణహానీ లేదని నిర్ణయానికి వచ్చారని తెలిపారు. సవివరంగా ఉత్తర్వులూ జారీ చేశారని వివరించారు. ఎస్పీ ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే ప్రస్తుత వ్యాజ్యాన్ని ఉపసంహరించుకొని ఎస్పీ ఆదేశాలను సవాల్ చేస్తూ తాజాగా వ్యాజ్యం దాఖలు చేసుకోవడమో, లేక ఉన్నతాధికారులను ఆశ్రయించడమో చేయాలని అంబటి రాంబాబుకు హైకోర్టు సూచించింది. దీని పై ఏ విషయం చెప్పాలంటూ విచారణను ఈ నెల 30వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు.

న్యాయవాదుల సంక్షేమ నిధిలో చేరే వెసులుబాటు

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): 'న్యాయవాదుల సంక్షేమ నిధి'లో సభ్యత్వం లేని న్యాయవాదులు సభ్యులుగా చేరేందుకు అవకాశం కల్పించాలని బార్ కౌన్సిల్ తీర్మానించింది. బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ద్వారకానాథ్‌రెడ్డి నేతృత్వంలో ఈ నెల 21న సమావేశమైన కౌన్సిల్ కార్యవర్గం 36 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు ఉన్న న్యాయవాదులను సంక్షేమనిధిలో సభ్యులుగా చేరేందుకు ఒక్కసారి అవకాశం కల్పించాలని తీర్మానం చేసింది. న్యాయవాదుల వయసు ఆధారంగా జీవితకాల సభ్యత్వం ఫీజు నిర్ణయించారు. సభ్యత్వం కోసం ఆగస్టు 16వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. నవంబరు 1వ తేదీ నుంచి సభ్యత్వం అమల్లోకి వస్తుంది. దరఖాస్తుతో పాటు ఫీజు పూర్తి వివరాలను బార్ కౌన్సిల్ అధికారిక వెబ్‌సైట్‌లో పొందవచ్చని బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

టీటీడీపై శ్వేతపత్రం విడుదల చేయాలి: బీజేపీ

తిరుమల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో టీటీడీ ధర్మకర్తల మండలి తిరుమల ధార్మిక క్షేత్రాన్ని ధనార్జన క్షేత్రంగా మార్చుకుందని బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డి ఆరోపించారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్లుగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర రెడ్డి తీసుకున్న నిర్ణయాలను టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టనప్పుడే భక్తుల్లో అనేక అనుమానాలు వచ్చాయన్నారు. స్వామిసేవకు అని వచ్చిన వీరు సొంతసేవలు చేసుకున్నారన్నారు. ఇందుకు ఉదాహరణ తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో రెండు మెడికల్ షాపులను కేటాయిస్తూ తీర్మానాలు చేయడమేనన్నారు. టెండరు పిలిస్తే నెలకు రూ.30 లక్షల వరకు ఆదాయం వచ్చేదని, కానీ ఎలాంటి టెండరు లేకుండా సాయికుమారి పేరుతో షాపును కేటాయించారన్నారు. షాపుల విషయంలో రూ.కోట్లు చేతులు మారాయని ఆరోపించారు. టీటీడీ ఈవో స్పందించి వెంటనే ఆ రెండు షాపులను రద్దు చేయాలన్నారు. టెండర్లు పిలిచి స్వామి ఆదాయాన్ని పెంచేలా ప్రయత్నం చేయాలని కోరారు. అలాగే గత ఐదేళ్లలో బోర్డు తీసుకున్న నిర్ణయాలను ఎస్వీబీసీ ద్వారా భక్తులకు తెలియజేయడంతో పాటు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా క్రిమినల్ కేసులు పెట్టాలని సూచించారు.

టీడీపీ నాయకుడిపై తుపాకులతో హత్యాయత్నం

- మంకీ క్యాప్, చేతులకు గ్లౌవ్స్‌తో ఇంట్లోకి చొరబడిన దుండగులు
- అన్నమయ్య జిల్లా ఒంటిల్లు గ్రామంలో ఘటన



టీడీపీ నాయకుడు గిరినాయుడు



దుండగుల చేతి నుంచి జారిపడిన తుపాకీ

పీలేరు, జూలై 23: టీడీపీ నాయకుడి ఇంట్లోకి చొరబడిన దుండగులు తుపాకులతో ఆయన హత్యాయత్నం చేశారు. అన్నమయ్య జిల్లా పీలేరు మండలం కావలిపల్లె పంచాయతీ ఒంటిల్లు గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిందీ ఘటన. గ్రామానికి చెందిన గిరినాయుడు కావలిపల్లె టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి. ఆయన కుమారుడి పుట్టినరోజు కావడంతో కేక్ కోసేందుకు సన్నాహాలు చేస్తుండగా రాత్రి 8.30 గంటలకు ముఖాలకు మంకీక్యాప్, చేతులు నల్లని గ్లౌవ్స్ ధరించిన నలుగురు ఆగంతకులు ఆయన ఇంట్లోకి చొరబడ్డారు. వారిలో ఒకరు గిరినాయుడు తలపై తుపాకీ పెట్టి ట్రిగ్గర్ నొక్కగా, అదృష్టవశాత్తు అది పనిచేయలేదు. వెంటనే తేరుకున్న గిరినాయుడు అతడిపై తిరగబడ్డారు. బెడ్రూంలో గిరినాయుడి భార్య జ్యోత్స్న, కుమారుడు రోహిత్‌పై మరో దుండగుడు తుపాకీ ఎక్కు పెట్టగా అతడిపై కూడా గిరినాయుడు తిరగబడ్డారు. పెనుగులాటలో తుపాకీ కిందపడిపోయింది. ఇంతలో హాలులో ఉన్న మరో ఇద్దరు దుండగులు గిరినాయుడిని పట్టుకోగా తనను ఏమైనా చేసుకోండని, కుటుంబ సభ్యులను వదిలేయాలని ఆయన ప్రాథేయపడ్డారు. గట్టిగా అరుపులు వినపడటంతో ఇంటిపక్కనే ఉన్న గిరినాయుడి తండ్రి నారాయణ వచ్చి తన బిడ్డను ఏమీ చేయవద్దని ప్రాథేయపడ్డారు. తండ్రి రాకతో ధైర్యం తెచ్చుకున్న గిరినాయుడు మళ్లీ తిరగబడటంతో దుండగులు పారిపోయారు. గిరినాయుడు వారిని రోడ్డు వరకు వెంబడించగా అక్కడ సిద్ధం చేసుకున్న బైక్‌లపై దాదాపు పదిమంది పారిపోయారని గిరినాయుడు తెలిపారు. పోలీసులు వచ్చి దర్యాప్తు ప్రారంభించారు. దుండగులు ఎవరు? ఎందుకు హత్యాయత్నానికి పాల్పడ్డారనేది పోలీసు విచారణలో తేలాల్సి ఉంది.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

విజయవాడ ● బుధవారం 24 జూలై 2024

diksuchi@andhrajyothy.com

ఉస్మానియా వర్సిటీలో బీటెక్ లేటరల్ ఎంట్రీ



హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ(ఓయూసీటీ)- బీటెక్ ప్రోగ్రామ్‌లో లేటరల్ ఎంట్రీ కింద రెండో ఏడాదిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌ను వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. కెమికల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ స్పెషలైజేషన్లు ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు 30 చొప్పున మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు ఉంటాయి. వారాంతాలు, సెలవు రోజుల్లో కూడా అందరి సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని క్లాసెస్ నిర్వహిస్తారు.

అర్హత: అభ్యర్థులు ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డిప్లొమా పూర్తి చేసి ఉండాలి. వర్సిటీకి 50 కి.మీ.ల పరిధిలో ఉన్న కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు, ఎంఎస్ఎంఈ పరిశ్రమలు/సంస్థల్లో పనిచేస్తూ ఉండాలి. కనీసం ఏడాది అనుభవం తప్పనిసరి. పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, సర్వీస్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన సిలబస్ నుంచి 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **ట్యూషన్ ఫీజు:** ఏడాదికి రూ.70,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 12
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 18
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in, https://ouct.ac.in

ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీలో బీఎఫ్ఎస్సీ

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ(ఏపీఎఫ్‌యూ)- 'బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్(బీఎఫ్ఎస్సీ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్, వెబ్ కౌన్సెలింగ్ ఆధారంగా వర్సిటీకి చెందిన ఫిషరీ సైన్స్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఆక్వాకల్చర్, ఆక్వాటిక్ యానిమల్ హెల్త్ మేనేజ్‌మెంట్, ఫిషరీస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆక్వాటిక్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్, ఫిష్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఫిషరీస్ ఇంజనీరింగ్, ఫిషరీస్ ఎక్స్‌టెన్షన్, ఫిషరీస్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ అంశాలు బోధిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. మొదటి ఆరు సెమిస్టర్లలో క్లాస్ రూం టీచింగ్, ప్రాక్టికల్ క్లాసెస్, ల్యాబొరేటరీ ఎక్స్‌పరిమెంట్స్, ఫీల్డ్ విజిట్స్ ఉంటాయి. చివరి రెండు సెమిస్టర్లలో రూరల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్ డెవలప్‌మెంట్ యోజన కింద ఫిషరీస్ వర్క్ ఎక్స్‌పీరియెన్స్ ప్రోగ్రామ్, ఫిషరీస్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ఓరియంటెడ్ ప్రోగ్రామ్ ఉంటాయి.



ఏపీఎఫ్‌యూ కళాశాలలు-సీట్లు:

- ముత్తుకూరులోని కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్స్‌లో 40 సీట్లు, నరసాపురంలోని కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్స్‌లో 60 సీట్లు చొప్పున మొత్తం 100 సీట్లు ఉన్నాయి. అదనంగా పది శాతం సూపర్‌న్యూమరరీ సీట్లను ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ప్రత్యేకించారు.
- 25 శాతం సీట్లను గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన పిల్లలకు నిర్దేశించారు. ఈ సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే అభ్యర్థులు కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివి ఉండాలి. తల్లిదండ్రులు/అభ్యర్థి పేరుమీద కనీసం ఎకరం భూమి ఉండాలి.
- మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు. మిగిలిన 15 శాతం సీట్లకు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు పోటీపడవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్/నేచురల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య, దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. ఏపీ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 7
- **ఎడిట్ ఆప్షన్ ఓపెన్:** ఆగస్టు 12 నుంచి 13 వరకు
- **వెబ్ ఆప్షన్స్ తేదీ:** ఆగస్టు 23
- **వెబ్‌సైట్:** www.apfu.ap.gov.in

నిమ్స్‌లో సర్టిఫికెట్ కోర్సు

హైదరాబాద్-పంజాగుట్టలోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)- నెఫ్రాలజీ విభాగంలో నిర్వహిస్తున్న 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్ ప్రోగ్రామ్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఫుల్ టైం ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఎస్సీ(నర్సింగ్/సైకాలజీ/లైఫ్ సైన్సెస్/డయాలసిస్ టెక్నాలజీ)/ఎంబీబీఎస్/ఎండీ-హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 20 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్ల వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

ఎంట్రెన్స్ టెస్ట్: పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో బేసిక్ కాన్సెప్ట్స్, అడ్వాన్స్‌డ్ మిసిలేనియస్ టాపిక్స్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్, లివర్ ట్రాన్స్‌ప్లాంట్, హార్ట్ అండ్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ అంశాల నుంచి ఒక్కోదానిలో పది మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 50. పరీక్ష సమయం గంట. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 10
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 13
- **అభ్యర్థుల ఈ మెయిల్‌కు హాల్ టికెట్స్ పంపు తేదీ:** ఆగస్టు 19
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** ఆగస్టు 24
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 27
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 4 నుంచి
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హైదరాబాద్- 500082
- **వెబ్‌సైట్:** www.nims.edu.in



ఆర్ఐఎంసీలో ప్రవేశాలు

డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజీ(ఆర్ఐఎంసీ)లో ఎనిమిదో తరగతి(2025 జూలై టర్మ్) ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) వెబ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. స్థానిక బాలురు, బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, వైవా, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2025 జూలై 1 నాటికి ఏడోతరగతి ఉత్తీర్ణులు/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల వయసు 2025 జూలై 1 నాటికి పదకొండున్నరేళ్ల నుంచి పదమూడేళ్ల మధ్య ఉండాలి.

రాత పరీక్ష వివరాలు: మొత్తం మార్కులు 400. ఇంగ్లీష్ నుంచి 125, మేథమెటిక్స్ నుంచి 200 జనరల్ నాలెడ్జ్ నుంచి 75 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. విద్యార్థులు సమాధానాలను హిందీ లేదా ఆంగ్ల మాధ్యమంలో రాయవచ్చు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారికి వైవా వోస్ నిర్వహిస్తారు. దీనికి 50 మార్కులు ఉంటాయి. ఇందులో ఇంటెలిజెన్స్, పర్సనాలిటీ, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాలు పరీక్షిస్తారు. ఇందులో కూడా అర్హత సాధించినవారికి మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు.



దరఖాస్తు విధానం: విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫీజు చెల్లించగానే ఆర్ఐఎంసీ దరఖాస్తు ఫారం, ప్రాస్పెక్టస్, పాత ప్రశ్నపత్రాలను స్పీడ్ పోస్ట్ ద్వారా పంపుతుంది. విద్యార్థులు దరఖాస్తు ఫారాన్ని నింపి అవసరమైన ధ్రువపత్రాలు జతచేసి ఏపీపీఎస్సీ చిరునామాకు పంపించాలి. దరఖాస్తు ఫీజును డీడీ ద్వారా కూడా ఆర్ఐఎంసీకి పంపవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.555
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** మున్సిపల్ కార్పొరేషన్/గ్రామ పంచాయతీ జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్, నివాసం, కులం ధ్రువీకరణ పత్రాలు; బోనఫైడ్ సర్టిఫికెట్; ఆధార్ కార్డ్; విద్యార్థి ఫొటోలు 2
- **చిరునామా:** అసిస్టెంట్ సెక్రటరీ(ఎగ్జామ్స్), ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్, న్యూ హెడ్స్ ఆఫ్ డిపార్ట్‌మెంట్స్ బిల్డింగ్, రెండో అంతస్తు, ఆర్‌టీఏ ఆఫీస్ దగ్గర, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, ఎంజీ రోడ్, విజయవాడ- 520010, ఆంధ్రప్రదేశ్
- **ఆర్ఐఎంసీ చిరునామా:** రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్, గర్హి కంటోన్మెంట్, డెహ్రాడూన్, ఉత్తరాఖండ్-248003
- **పరీక్ష తేదీ:** డిసెంబరు 1
- **పరీక్ష కేంద్రం:** విజయవాడ
- **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in/

Legrand Empowering Scholarship Program 2024-25

Description: Legrand invites applications from meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans pursuing B.Tech., B.E., B.Arch., or other undergraduate degrees in Finance or Science (such as B.Sc., B.Com., B.B.A., etc.) across India. The scholarship is meant to support meritorious students to pursue a career in Engineering, Architecture, Finance and Sciences.

Eligibility: The scholarship is open to meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans across India.

- Applicants must have secured admission in B.Tech., B.E., B.Arch., B.B.A., B.Com., or B.Sc. degrees in India.
- Applicants must have passed Class 12 in the year 2023–24.
- Girl students must have secured a minimum of 70% and above marks in Classes 10 and 12 examinations.
- Special category* students must have secured 60% marks in Classes 10 and 12 examinations. Exceptions may be considered on a case-by-case basis.
- The annual family income of the applicant from all sources must be less than INR 5,00,000.
- Preference will be given to special category* students.

**Special category:* Differently-abled girl students, LGBTQ+ students, Covid-affected students, and students with single parents or orphans.

Prizes & Rewards: Girl students are awarded 60% course fees up to INR 60,000 per year till the completion of course based on academic performance. Students in the special category* will be awarded 80% fees up to INR 1,00,000 per year till the completion of the course based on academic performance.

**Special category:* Differently-abled girl students, LGBTQ+ students, Covid-affected students, and students with single parents or orphans.

Last Date to Apply: 10-08-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/LFLS9

SCHOLARSHIP ALERT

Description: Schaeffler India is inviting applications from individuals between 18 and 35 years of age to recognize and reward those individuals who are developing unique sustainable solutions that have the potential to positively impact the society in India.

Schaeffler India Social Innovator Fellowship Program

Eligibility: Applicants should belong to the age group of 18 to 35 years (as on 1st July 2024). They should be residents of India. Early-stage start-ups or NGOs with functioning prototypes can participate.

Prizes & Rewards: Inspirational Fellowship grant coupled with personalized mentorship at IIMA Ventures and access to extensive networking opportunities.

Last Date to Apply: 15-08-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/SIA3

Raman Kant Munjal Scholarships

Description: The Raman Kant Munjal Scholarships 2024-25 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.

Eligibility: Students enrolled in the first year of BBA, BFIA, B.Com. (H, E), BMS, IPM, B.A. (Economics), BBS, BBI, BAF, B.Sc. (Statistics), or any other finance-related degree courses are eligible.

- Applicants must have secured at least 80% marks in Classes 10 and 12.
- The annual family income of the applicants should be less than INR 4 lakh.
- Open for Indian nationals only.

Prizes & Rewards: Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years

Last Date to Apply: 02-08-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/RMKSP4




buddy4study.com



మీకు తెలుసా?

- చిన్న ఎలుకలా ఉండే ఈ జీవిని యూరోపియన్ హెడ్జ్‌హాగ్, కామన్ హెడ్జ్‌హాగ్ అని పిలుస్తారు.
- 15 సెం.మీ నుంచి 30 సెం.మీ పొడవు మాత్రమే ఉంటుంది. రెండు కేజీల వరకూ బరువు ఉంటుంది.
- నల్లటి ముక్కు, గోధుమరంగు ముఖం ఉండే ఈ జంతువు మీద వేలకొద్దీ స్పైన్స్ ఉంటాయి. 160 మిలీమీటర్లు మాత్రమే ఈ పదునైన స్పైన్స్ ఉంటాయి. ఇవి పెద్దయ్యాక 260 మి.మీటర్లు పెరుగుతాయి. ప్రతి ఒక్కటి రాలిపోయి మళ్లీ వస్తాయి. ఇదో బంతిలా చుట్టుకుంటుంది. గంటకు పంతొమ్మిది కిలోమీటర్ల వేగంతో పరిగెత్తుతుంది.


- ఈ జీవులు అధికంగా యూరప్ దేశాలయిన ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో కనిపిస్తాయి.
- ఇవి చిన్న గూళ్లలాంటివి చెట్లమీద, తొర్రల్లో కట్టుకుంటాయి. రాత్రితో పాటు పగలు కూడా చెట్ల ఆకుల్లో నిద్రపోతాయి.
- వీటి చూపు తక్కువ. దీంతో ఆహారాన్ని వాసనపట్టి మాత్రమే వెంటాడతాయి. చిన్న పురుగులు, మిడతలను తింటాయివి.
- ఇవి పుట్టిన 32 రోజుల వరకూ చూడలేవు. కళ్లు కనపడవని చెప్పవచ్చు. స్పైన్స్‌కూడా మెత్తగా ఉంటాయి.
- వీటిలో 15 రకాల జాతులున్నాయి.
- హెడ్జ్‌హాగ్‌ల జీవనకాలం కేవలం రెండేళ్లు.



5 తేడాలు గుర్తించండి?







సరైన నీడ ఏది?

8		1					9	2
6	7	4	9					8
5			1	8		3		
1	6			4	8	7		9
7		2	5	6			1	3
		3		5	7			1
4					3	5	8	7
9	5					2		4

డైలీ సుడోకు - 366

సుడోకు - 365 సమాధానం

2	1	3	4
3	4	2	1
4	3	1	2
1	2	4	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.